# విముక్తి - విద్య

పాలో ఫ్రెయిరె



ప్రజాశక్తి బుక్‌హౌస్

# విముక్తి - విద్య

పాలో ఫ్రెయిరె

# విముక్తి-విద్య

పాలో ఫ్రెయిరె

ప్రజాశక్తి బుక్‌హౌస్

ఎమ్‌హెచ్ భవన్, ప్లాట్ నెం. 21/1, అజామాబాద్, ఆర్‌టిసి కళ్యాణమండపం దగ్గర
హైదరాబాద్-20. ఫోన్ : 040 - 27660013

English Title : **Pedogogy of the Oppressed**

Author : **Paulo Frairy**

94159

అనువాదం : ఆర్. వెంకటేశ్వరరావు (ఆర్వీఆర్)

ప్రచురణ సంఖ్య : 737

ముద్రణ : డిసెంబర్, 2013

వెల : ₹ 80/-

ప్రతులకు

**ప్రజాశక్తి బుక్‌హౌస్**

1-1-187/1/2, చిక్కడపల్లి, హైదరాబాద్-20. ఫోన్ : 040- 27608107

బ్రాంచీలు

హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, ఖమ్మం,

హన్మకొండ, నల్గొండ, గుంటూరు, ఒంగోలు

ముద్రణ

ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, హైదరాబాద్

website : www.psbh.in

# విషయసూచిక

ఒక దిక్సూచి ........ 6

పరిచయం ........ 11

అధ్యాయం 1 ........ 19

పీడితులకు బోధనాశాస్త్రం ఆవశ్యకత – సమర్థన – పీడకులకీ పీడితులకీ మధ్య వైరుధ్యం, దాన్ని అధిగమించడం ఎలా పీడన, పీడకులు; పీడన, పీడితులు; విమోచన; కానుక కాదు, స్వయం సాధనా కాదు, ఒక పరస్పర క్రమం.

అధ్యాయం 2 ........ 49

పీడనకు పరికరంగా విద్యగురించి "నిధి" భావనా – దాని పూర్వావసరాలు – ఒక విమర్శ, విమోచనా పరికరంగా విద్యగురించిన సమస్య – ప్రతిపాదన భావన – దాని పూర్వావసరాలు – 'నిధి' భావన, ఉపాధ్యాయునికీ విద్యార్థికీ మధ్య వైరుధ్యం – విద్య : ఒక పరస్పర క్రమం, ప్రపంచం మాధ్యమంగా – అసంపూర్ణ జీవులుగా మనుషులు – తమ అసంపూర్ణత్వం గురించిన ఎరుక, మరింత నిండైన మానవులుగా వుండాలన్న ప్రయత్నం.

అధ్యాయం 3 ........ 67

సంభాషణలు – స్వాతంత్ర్య అభ్యాసంగా విద్య మూలతత్వం – సంభాషణలు, సంభాషణ; సంభాషణ కార్యక్రమ విషయ అన్వేషణ – మానవ – ప్రపంచ సంబంధం – ఉత్పాదక విషయాంశాలు, స్వాతంత్ర సాధనగా విద్యకార్యక్రమ విషయం; ఉత్పాదక విషయాల శోధన, దాని విధానం; విమర్శనాత్మక చైతన్యం జాగృతం కావడం, "ఉత్పాదక విషయాంశాల" ద్వారా పరిశోధించడం, యీ పరిశోధనలోని అనేక దశలు.

అధ్యాయం 4 ........ 109

సాంస్కృతిక కార్యాచరణకు ప్రతిస్పర్థించే సిద్ధాంతాల సూచీలుగా సంభాషణ వ్యతిరేకతలు, సంభాషణలు; మొదటిది పీడనకు సాధనం, రెండవది విమోచనకు సాధనం; సంభాషణ వ్యతిరేక కార్యాచరణ సిద్ధాంతం, దాని విశిష్ట అంశాలు; లోబరుచుకోవడం, విభజించిపాలించడం, టక్కుటమార విద్యలు, సాంస్కృతిక దురాక్రమణ, సంభాషణాత్మక సిద్ధాంతం, దాని విశిష్ట లక్షణాలు; సహకారం, ఐక్యం, నిర్మాణం, సాంస్కృతిక సంయోజన.

# ఒక దిక్సూచి

బ్రెజిల్ దేశపు విద్యావేత్త, పీడిత ప్రజా యోధుడు ఫాలో ఫ్రెయిరె రాసిన“ పెడగాజీ ఆఫ్ ద అప్రెస్డ్” అనే ఈ పుస్తకం ప్రపంచాన్ని ఆకర్షించిన అరుదైన గ్రంధాలలో ఒకటి. వామపక్ష మేధావులు, సామాజిక కార్యకర్తలు, జనహితుషులైన విద్యావేత్తలు దీన్ని తమ అవగాహనకు కరదీపికగా పరిగణిస్తున్నారు. 1970-93 మధ్య అమెరికాలో ఈ పుస్తకం 20 సార్లు అచ్చయింది. ప్రధానంగా వర్ధమాన దేశాలను దృష్టిలో పెట్టుకుని రూపొందినా వర్గ సమాజాలలో ప్రజా విముక్తి కోసం పోరాడే వారందరూ అవశ్యంగా అర్థం చేసుకోవలసిన అమూల్యాంశాలు ప్రెయిరె అనితర సాధ్యమైన స్పష్టతతో, ఆచరణాత్మక అనుభవంతో వివరించడం ఇందుకు ప్రధాన కారణం. కేవలం విద్యా బోధనకు సంబంధించిన పుస్తకమని ఎవరైనా అనుకుంటే పొరబాటే. అంతకు మించి ఇది విప్లవ పోరాటాలలో, విముక్తి ఉద్యమాలలో నిమగ్నమైన ప్రతి ఒక్కరికి శిరోధార్యమనదగిన ప్రాధమిక ప్రామాణిక సూత్రాలను ఎరుకపరుస్తుంది. ఒక విధంగా చెప్పాలంటే రాజకీయ, సామాజిక, మనస్తత్వ, విద్యా సంబంధమైన సమస్యలను ఏకసూత్రంతో విశ్లేషిస్తుంది. వర్గ సమాజంలో మనుషులు తమ సహజ స్వభావాన్ని కోల్పోయే విషాద క్రమం ఎలా జరుగుతుందో అద్భుతంగా వివరిస్తుంది. ఓపిగ్గా పుస్తకంలోకి వెళ్లగలిగిన వారెవరైనా ఈ వాస్తవాన్ని అంగీకరిస్తారు.

ఇందుకు కారణమేమంటే అటు సిద్ధాంతంతోనూ ఇటు ఆచరణతోనూ కూడా ఫాలో ప్రెయిరెకు ప్రగాఢ ప్రత్యక్ష సంబంధం వుండటమే.ఆయన 1921లో రిసైఫ్ అనే చోట ఒక పేద కుటుంబంలో పుట్టాడు. ఆ విధంగా బాల్యంలోనే దుర్భర జీవితానుభవాలు చవిచూశాడు. 1929లో అమెరికాలో వచ్చిన భయానక ఆర్థిక సంక్షోభం ఫ్రెయిరె పుట్టిన బ్రెజిల్ దేశాన్నీ తాకింది.ఆయన కుటుంబం కుప్పకూలి పోయింది. ఆకలి మంటలు

మాడ్చేశాయి. తత్ఫలితంగా చదువులోనూ వెనకబడిపోయాడు. ఆ బాధలు ఆయనను పిరికి వాడిగా గాక యోధుడుగా చేశాయి. తన జీవితాన్ని ఆకలిపై పోరాటానికి ధారపోయాలని ఆనాడే నిర్ణయించుకున్నాడు. స్వతహాగా దారిద్ర్యం కోరల్లో చిక్కిన ఫ్రెయిరె సమాజంలో అణగారిన వర్గాల జీవితాలూ, ఆలోచనలూ ఎలా వుండేది ప్రత్యక్షంగా చూశాడు. అసమానతలు నిండిన దోపిడీ సమాజం ఈ పేద మధ్య తరగతి ప్రజలను ఎలా మానసికంగా కుంగదీసేది తెలుసుకున్నాడు. ఆర్థిక పెత్తనానికి తోడు కనిపించని సాంస్కృతిక ప్రాబల్యం ఆ అభాగ్య జన సందోహాన్ని మూగ సంస్కృతికి ఎలా గురి చేసేది చూశాడు. అమలులో వున్న భావాలు, నియమ నిబంధనలు అన్ని ఆధిపత్య వర్గాల ప్రాబల్యాన్ని పరిరక్షించడంతోపాటు విద్యా వ్యవస్థ ఈ విషయంలో ప్రత్యేకంగా సేవ చేస్తున్న తీరును ఫ్రెయిరె కనుగొన్నాడు. ప్రత్యక్ష పరిశీలనతో పాటు అధ్యయనం కూడా విపరీతంగా సాగించాడు. తాను జీన్‌పాల్ సార్త్రే, మూనియెర్,ఎరిక్ ఫ్రామ్, బాయీ అల్థూసర్, ఒర్టెగా వెగాసైట్, మావో, మార్టిన్ లూథర్ కింగ్, షెనవేరా, ఉనామనో,మార్క్యూజ్ తదితరుల సరసన చేరానని ఆయనే అన్నారు. ఈ మహా వ్యక్తుల భావాలను వాడుకుంటూనే తన అనుభవాన్ని అధ్యయనాన్ని జోడించి నూతన దృక్పథాన్ని నిర్దిష్టరూపంలో అందించాడు. అదే ఆయన విశిష్టత.

ఆయన విద్యాబోధనాతత్వ చింతన మొదట 1959లో రెసిఫ్ విశ్వవిద్యాలయానికి ఆయన సమర్పించిన డాక్టరేట్ సిద్ధాంత వ్యాసంలో వెల్లడైంది. ఆ తర్వాత అదే యూనివర్శిటీలో హిస్టరీ, ఎడ్యుకేషన్ ఫిలాసఫీ ప్రొఫెసర్‌గా పని చేసినప్పుడు తెలిసింది.ఆయన రూపొందించిన విధానాల్ని కాథలిక్కులు, ఈశాన్య బ్రెజిల్ అంతటా వున్న అక్షరదీక్షా కార్యక్రమాల వాళ్ళు విస్తారంగా వాడుకున్నారు. పాత వ్యవస్థకు ఆ పద్ధతి పక్కలో బల్లెంలా కనిపించింది. 1964 సైనిక తిరుగుబాటు వెనువెంటనే ఫ్రెయిరెని క్షణాల మీద జైలో పెట్టారు. దరిమిలా 70 రోజులకు విడుదల చేసి, దేశం వదిలి వెళ్లిపోయేట్టు చేశారు. ఫ్రెయిరె చిలీ వెళ్ళాడు. అక్కడ ఆయన వయోజన విద్యాకార్యక్రమాలలో యునెస్కో (UNESCO) సంస్థలోనూ, చిలియన్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ అగ్రేరియన్ రిఫార్మ్‌లోనూ అయిదేళ్లు పని చేశాడు. ఆ తర్వాత హార్వర్డ్ యూనివర్శిటీ స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్‌కి సలహాదారుగా పని చేశాడు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అనేక సంస్థలు నూతన విద్యాబోధనా ప్రయోగాలలో నిమగ్నమై వుండేవి. ఆయన వాటితో కలిసిమెలిసి పని చేశాడు. ఆయన ప్రస్తుతం వరల్డ్ కౌన్సిల్ ఆఫ్ చర్చిల విద్యావిభాగానికి ప్రత్యేక సలహాదారుగా జెనీవాలో వున్నాడు.

ఫ్రెయిరె పోర్చుగీస్‌లో, స్పానిష్‌లో అనేక వ్యాసాలు రాశాడు. ఆయన తొలి గ్రంథం 1967లో బ్రెజిల్‌లో ప్రచురితమైంది. ఆయన తొలి పరిపూర్ణ రచన మాత్రం ఇదే. ఇది దాదాపు 20 భాషల్లో అనువాదమైంది. ఫ్రెయిరె 1997లో తన 75వ ఏట మరణించారు.

ఫ్రెయిరె రాసిన ఈ పుస్తకం తెలుగునాట ఆలోచనా పరులను చాలా కాలం నుంచీ ఉత్తేజపరుస్తోంది. ఆ భావాలను వారు తమ అవగాహన కోసం వినియోగించు కుంటున్నారు. కాని అనేక కారణాల రీత్యా దాని అనువాదం పూర్తిగా జరగలేదు. కె.వి.రమణారెడ్డి చాలా కాలం క్రితం దీనిలోని కొన్ని భాగాలు అనువదించి ప్రచురించారు. అనేక మంది ఔత్సాహిక రచయితలు, అనువాదకులు కూడా ఇందుకు చేసిన ప్రయత్నాలు వివిధ దశలలో ఆగిపోయాయి. ఇక ఖమ్మంకు చెందిన పొట్లూరి వెంకటేశ్వరరావు సంక్షిప్త రూపంలో " పేదల చదువు" పేరిట దీని అనువాదాన్ని తీసుకువచ్చారు. ఇవన్నీ అభినందనీయమైన ప్రయత్నాలే. ఫాలో ఫ్రెయిరెను పరిచయం చేయడానికి దోహదపడినవే.

అయితే ఫాలో ఫ్రెయిరె బోధనల ప్రాధాన్యతను, ప్రామాణికతలను ప్రపంచం గౌరవిస్తున్న స్థాయితోనూ అంతకు మించి వాటి అవసరంతోనూ పోలిస్తే తెలుగు పాఠకుడికి అయనను అందించవలసిన అవసరం ఇంకా చాలా వుందనిపించింది. చాలామంది తమ మొదటి సూచనగా ఆ పుస్తకాన్ని అనువదించమని చెబుతూ వచ్చారు. ప్రత్యేకంగా ఇప్పుడు విద్యా రంగం గురించిన విశ్లేషణలు పెరుగుతున్నాయి. ప్రపంచీకరణ నేపథ్యంలో వర్ధమానదేశాలను కొల్లగొట్టడం మరింత దారుణంగా సాగుతున్నది. ఈ క్రమంలో దేశదేశాల ప్రజలు తమ స్వీయ సంస్కృతిని అస్తిత్వాన్ని కోల్పోతున్నారు. పరాయీకరణ, వస్త్వీకరణ శరవేగంతో జరిగిపోతున్నాయి. మానవసంబంధాలు నానాట లుప్తమవుతున్నాయి. ఇలాటి పరిస్థితిలో ఫ్రెయిరెను స్మరించుకోవడం మరింత అవసరమవుతున్నది.

పరిస్థితి నానాట దిగజారుతున్నా జనం ఎందుకు సహిస్తారు? మనం ఆశించిన కదలిక ఎందుకు రాదు? జన బాహుళ్యంలో పరస్పర అవిశ్వాసాలు, అపనమ్మకాలు ఎందుకుంటాయి? విప్లవకారులమంటూ బయిలు దేరిన వారు ఎందుకు విఫలమై పోతారు? మరికొందరు ఎందుకు దిగజారతారు? విప్లవాలు విజయవంతమైన వ్యవస్థలు కూడా ఎందుకని కుప్పకూలిపోయాయి? మళ్లీ అలాటి ప్రమాదం రాకుండా భద్రత ఏమిటి? ఇలాటి సవాలక్ష ప్రశ్నలు నిత్యజీవితంలోనూ పోరాటరంగంలోనూ

ప్రతివారికి ఎదురవుతుంటాయి. తమ సహచరులను, ఇరుగుపొరుగును అర్థం చేసుకోవడంలో తికమక కలిగిస్తుంటాయి. ఊహాతీతమైన ఊగిసలాటలు, దిగ్భ్రాంతికరమైన తిరోగమనాలు, ఆత్మహత్యా సదృశమైన అహంకారధోరణులూ వ్యక్తులను ఉద్రిక్తం చేస్తాయి. ఇన్ని పరిణామాల మధ్యనా స్వీయ కర్తవ్య నిర్వహణను గందరగోళ పరుస్తాయి. సరిగ్గా ఇలాటి సవాళ్లకు, సమస్యలకూ ఈ పుస్తకంలో సమాధానం లభిస్తుంది.

మార్క్స్ వర్గ పోరాట సిద్ధాంతం ప్రాతిపదికగా సమాజాన్ని విశ్లేషించిన ఫ్రెయిరె పీడన అనేది ప్రతి అంశాన్నీ ఎలా భ్రష్టుపట్టించేదీ చెబుతారు. పీడకుడి ప్రాబల్యం వల్ల ఆ భావాలనే పీడితులూ తమలో ప్రతిష్ఠించుకొని ఆ ప్రభావంతో వ్యవహరిస్తుంటారు. విముక్తి పట్ల వారి భావనే లోపభూయిష్టంగా వుంటుంది. తామూ పీడకుల హోదాకు చేరడమే విముక్తి పరమార్థమని చాలామంది పొరబడతారు. తరచూ వారిలో అదృశ్యపీడకుడు పని చేస్తుంటాడు. ఇదో నమ్మశక్యం గాని నిజం. ఈ విధంగా దోపిడీ వల్ల పీడన వల్ల మనుషులు తమను తాము కోల్పోయిన స్థితిలో మానవసంబంధాలన్ని వక్రీకరణకు గురవడం అనివార్యం. ఇందుకు విరుగుడు ప్రజల నుంచే రావాలి తప్ప ఎక్కడ నుంచో రాదనేది ఫ్రెయిరె ప్రధాన బోధన.

అయితే– ప్రజల విమోచన కోసం పోరాడాలనుకునే వారు ఆ పనికి ప్రజలను సన్నద్ధం చేయాలి. ప్రజల నుంచి నేర్చుకోవాలి. దాన్ని తిరిగి ప్రజల వద్దకు తీసుకెళ్లాలి. అలా ప్రజల నుంచి ప్రజల వద్దకు ప్రజల ద్వారా జరగాల్సిన విముక్తి ప్రక్రియను ఎవరో కొంత మంది నిర్దేశించిన విధంగా నడిపిస్తామంటే కుదరదు. అది వాస్తవికంగానూ వుండదు. పీడితుల పట్ల కృత్రిమ ఔదార్యంగాని పై నుంచి ఎవరో వారి విముక్తిని కానుకగా ఇస్తారనే ధోరణి గాని సరైనవి కావు. ప్రజల నుంచే నేర్చుకోవడమంటే వారి పట్ల గౌరవముండాలి. వారితో ముఖాముఖి మాట్లాడాలి. వారి అభిప్రాయాలు ఓపికగా విలువనిచ్చి వినాలి. దాన్నే ఫ్రెయిరె "సంభాషణా సంస్కృతి" అన్నాడు. ఆయన సూత్రాలలోకెల్లా అతి ప్రధానమైంది ఇది. ప్రపంచం ఎప్పుడూ మారిపోతూనే వుంటుంది. ఆ మార్పును పసిగట్టాలంటే జనంతో ప్రత్యక్ష సంబంధం సంభాషణ వుండి తీరాలి. పీడిత ప్రజలతో సంభాషణ జరపకుండా ఎవరూ వారికి విముక్తి ప్రసాదించలేరు. వాళ్ల జీవిత వాస్తవాన్ని వాళ్ల అనుభవం ద్వారానే తెలియజేసినపుడు కదలిక ప్రారంభమవుతుంది. ఎందుకంటే ప్రజలు తమ పరిస్థితిని తామే గుర్తించలేనంతగా వర్తమానంలో కూరుకుపోయివుంటారు. పీడక వర్గం కల్పించిన అనేక వక్రీకరణలు వారిపై ప్రభావం చూపుతుంటాయి. సంభాషణ ద్వారా దాని నుంచి బయటకు లాగాలి. అధ్యయనం ఆచరణల సమ్మేళనంతో వారిని కర్తవ్యోన్ముఖులను చేయాలి. ఇది ఫ్రెయిరె అభిప్రాయం.

పీడిత పీడక విభజన అనేది అన్ని రంగాల్లోనూ విస్తరించి వుంటుంది. ఆఖరుకు పాఠశాలలో సంప్రదాయిక విద్యార్థి- ఉపాధ్యాయ సంబంధాలు కూడా చెప్పేవారు వినేవారు అన్నట్టే నడుస్తుంటాయి. ఇది మారాలని అయన చెబుతారు.

సామాజిక రాజకీయ కోణాల నుంచి ఫ్రెయిరే బోధనల ప్రాధాన్యతను ఇప్పుడు పాఠకుడు తేలిగ్గానే అర్థం చేసుకోవచ్చు. అవి ప్రపంచానుభవానికి, తమ వ్యక్తిగతానుభవానికి కూడా అనుగుణంగా వున్న తీరు గ్రహించవచ్చు. లాటిన్ అమెరికా దేశాలలో ఆయన బోధనలు ఎంతో ప్రభావం చూపించాయి. ఇప్పటికీ అటు విద్యాపరంగానూ ఇటు విప్లవాశయాల లోనూ ఫ్రెయిరె మార్గం అనుసరణీయంగా వుంది.

విషయాన్ని బట్టి, ఈ పుస్తకం కొన్ని చోట్ల గొట్టుగా అనిపించవచ్చు. కాని వాస్తవానికి చాలా సరళమైంది. నిత్య జీవితానుభవమంత సూటిగా నడుస్తుంది. మొదట కొన్ని పుటలు పాఠకుడు ఓపిగ్గా పూర్తి చేస్తే తర్వాత ముందుకు సాగేకొద్దీ పక్కనపెట్టలేనంత పట్టుగా చదివేస్తాడు. నిత్య జీవితంలో ఎదురయ్యే అనుభవాలు, వ్యక్తులు కళ్లముందు సాక్షాత్కరించినట్టవుతుంది. విప్లవ కారుల ప్రత్యేక కర్తవ్యాలు అవగతమవుతాయి.

ప్రామాణికమైన ఈ గ్రంథం తెలుగులో సంపూర్ణంగా అందుబాటులో వుండాలనే ప్రగాఢాకాంక్ష ఈ ప్రచురణకు ప్రేరణ. ఇటీవల కాలంలో వరుసగా వెలువరిస్తున్న మా విద్యా సంబంధ ప్రచురణలకు దీనితో కొంత సంపూర్ణత కలుగుతుందని మా విశ్వాసం. తెలుగులో ఈ పుస్తకానికి "విముక్తి-విద్య" అని నామకరణం చేశాము. సీనియర్ రచయిత, విమర్శకుడు ఆర్వీఆర్ చాలా శ్రమకోర్చి తక్కువ కాలంలోనే అనువాదం పూర్తి చేశారు. సరళతకోసం కొన్ని సవరణలు జరగకపోలేదు. ఆర్వీఆర్ వయసునూ ఇతర బాధ్యతలనూ దృష్టిలో వుంచుకున్నప్పుడు కోరిన వెంటనే అనువదించి ఇచ్చినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు చెప్పడం మా ధర్మం. లోటుపాట్లు దృష్టికి తెస్తే భవిష్యత్తులో సరిదిద్దుకోగలమనీ మనవి చేస్తున్నాం. ఈ పుస్తకాన్ని తెలుగు పాఠకులు - విద్యారంగంలో వారు ఆదరిస్తారని ఆశిస్తున్నాం.

**- తెలకపల్లి రవి**

# పరిచయం

"విముక్తి-విద్య" (Pedagogy of the oppressed) అనే గ్రంధానికి పరిచయంగా ఈ విషయాలు రాస్తున్నాను. ఆరు సంవత్సరాల నా రాజకీయ ప్రవాసంలో నేను చేసిన పరిశీలనల ఫలితం యిది. బ్రెజిల్‌లో నా బోధనాత్మక కార్యకలాపాల్లో అంతకు ముందే నాకు అనుభవంలోకి వచ్చిన అంశాలను యీ పరిశీలనలు సంపద్వంతం చేశాయి.

నేను శిక్షణా తరగతులు నిర్వహించాను. వీటిలో "కాన్‌షైంటిజచావో[1]" పాత్రని విశ్లేషించడం వుంది. అసలు విద్య విమోచనతత్వం గురించి ప్రయోగాలూ వున్నాయి. యీ రెండు సందర్భాల్లోనూ "స్వేచ్ఛాభీతి" అనే దాన్ని ఎదుర్కోవాల్సి వచ్చింది. ఈ అంశాన్నే యీ గ్రంథం మొదటి అధ్యాయంలో చర్చించాను. శిక్షణా తరగతుల్లో పాల్గొన్నవాళ్ళు ఒకటికి రెండుసార్లు "కాన్‌షైంటిజచావో ప్రమాదం" గురించి హెచ్చరించారు. స్వేచ్ఛ అంటే వుండే భీతిని వాళ్ళ మాటలు వ్యక్తం చేశాయి. విమర్శనాత్మక జ్ఞానం అరాచకం అని వాళ్ళన్నారు. విమర్శనాత్మక జ్ఞానం అస్తవ్యస్థ స్థితికి దారి తీస్తుందని యింకొందరు అన్నారు. కొందరైతే మనసులో మాట దాచకుండా చెప్పనే చెప్పారు. ఎందుకు కాదనడం? నాకూ స్వేచ్ఛ అంటే భయం. ఇప్పుడా భయం మాయమైంది.

ఈ చర్చల్లో ఓసారి ఒక బృందం మనుషుల "కాన్‌షైంటిజచావో" గురించి చర్చిస్తోంది. ఒక అన్యాయం జరిగిందనుకోండి. ఆ ప్రత్యేక సందర్భంలో యీ ఎరుక కలిగింది. అది 'వినాశకర మౌఢ్యాని'కి, లేదా "తమ ప్రపంచం మొత్తం

కుప్పకూలుతుందన్న గ్రహింపు”నకు దారితీయదా అన్నది ఆ చర్చ. ఈ చర్చ మధ్యలో ఒకతను మాట్లాడాడు. అంతకు ముందతను చాలా ఏళ్ళు ఫ్యాక్టరీ కార్మికుడిగా పని చేశాడు. “బహుశా నేనొక్కణ్ణే యిక్కడ కార్మిక వర్గానికి చెందినవాణ్ణి. యిప్పుడు మీరు చెప్పిందంతా నా బుర్రకెక్కిందని నేను అనను. కాని ఒక విషయం చెప్పగలను – యీ శిక్షణలో చేరకముందు నల్లనివన్నీ నీళ్లనీ, తెల్లనివన్నీ పాలనీ అనుకునే స్థితిలో వుండేవాణ్ణి. ఇప్పుడు ఆ స్థితి నుంచి ఎదిగాక, నేను వివేకంగా మంచీచెడ్డా తెలుసుకుంటున్నాను. కాని యీ ఎరుకవల్ల నేను, చాందసున్ని అవలేదు, ఏదో కుప్పకూలిపోతుందనీ అనుకోవడం లేదు,” అన్నాడతను.

ఈ కాన్‌షైంటిజచావో ప్రభావం గురించిన సందేహాలు వున్నాయి. యివి సందేహ భావుకుడు సర్వదా వెల్లడి చేయని అనుమాన తర్కం మీద ఆధారపడి వుంటాయి. అన్యాయానికి గురైన బాధితులు తమ స్థితి అదీ అని గుర్తించకపోవడం వాళ్ళకి ఒకందుకు మేలు. నిజానికి, “కాన్‌షైంటిజచావో” మనుషుల్ని “వినాశకర మౌఢ్యానికి” నడిపించదు. అందుకు విరుద్ధంగా “కాన్‌షైంటిజచావో” బాధ్యతగల పౌరులుగా[2](కర్తలుగా) చారిత్రక క్రమంలో అడుగుపెట్టే వీలు కలిగిస్తుంది. వ్యక్తిత్వ చైతన్యం సంతరించుకునే శోధనలో వాళ్ళని చేర్చుకుంటుంది. ఆ రకంగా తీవ్రమైన మొండి విశ్వాసాలు లేకుండా చేస్తుంది.

“విమర్శనాత్మక చైతన్యం మేల్కొవడం సాంఘిక అసంతృప్తి వెల్లడవడానికి నడిపిస్తుంది. ఎందుకనీ అంటే యీ అసంతృప్తి పీడక పరిస్థితిలో వున్న నిజమైన అంశం”[3].

స్వేచ్ఛపట్ల భయం అది వున్నవాళ్ళకు తెలియదు. దానివల్ల ఆ వ్యక్తి లేనిపోని భయాలకు గురవుతాడు. అలాంటి వ్యక్తి నిజానికి భద్రత పొందడంకోసం చేసే ప్రయత్నంలో తల దాచుకుంటాడు. స్వేచ్ఛవల్ల ఏం ముంచుకువస్తుందోనని యీ భద్రతనే కోరుకుంటాడు. హెగెల్ చెప్పినట్టు:

“జీవితాన్ని పణం పెట్టడంవల్ల మాత్రమే స్వాతంత్ర్యం సిద్ధిస్తుంది... ఏ వ్యక్తి అయినా తన జీవితాన్ని ఒడ్డ లేనట్లయితే, ఆ వ్యక్తిని “వ్యక్తి”గానే చూడక్కర్లేదు. యిందులో అనుమానం లేదు. కాని అతనుగాని, ఆమెగాని ఇది ఒక స్వతంత్ర స్వీయచైతన్యం అన్న సత్యాన్ని గుర్తించలేదన్నమాట”.[4]

స్త్రీలు, పురుషులు తమకు స్వేచ్ఛ అంటే భయం అన్న విషయాన్ని నలుగురి ముందూ సామాన్యంగా ఒప్పుకోరు. కానైతే దాన్ని నమ్ముకోచూస్తారు– కొన్ని సందర్భాల్లో అలా చేస్తున్నామని తెలియకుండానే – తాము స్వాతంత్ర్య పరిరక్షకులమన్నట్టు నటిస్తూ, తమ అనుమానాలకీ, సందేహాలకీ ఏదో లోతైన నిగ్రహశక్తి కల్పించుకుంటారు– స్వాతంత్ర్యానికి తామే యోగ్యులైన రక్షకులైనట్టు. కాని వాళ్ళు యథాతథ స్థితిని కాపాడ్డం అనేదాంతో స్వాతంత్ర్యాన్ని గజిబిజి పరుస్తున్నారు. అంచేత "కాన్షైంటిజచావో" యథాతథ స్థితికి ఎసరుపెడితే, అసలు స్వాతంత్ర్యానికే ముప్పువాటిల్లినట్లు కనిపిస్తుంది వాళ్ళకి.

ఈ "పీడితుల విద్య" చింతనవల్లా, అధ్యయనంవల్లా మాత్రమే పుట్టుకు వచ్చిందికాదు. యిది ఒక నిర్దిష్ట పరిస్థితిలో కాలూనుకుని వుంది. కార్మికుల (రైతుగాని, పట్టణ కార్మికుడుగాని), మధ్యతరగతి వాళ్ళ ప్రతిస్పందనల్ని వివరిస్తుంది. వీళ్ళందర్నీ నేను నా బోధనాత్మక కృషిలో నేరుగానో, పరోక్షంగానో పరిశీలించాను. ఈ పరిచయాత్మక గ్రంథంలో నేను ప్రతిపాదించిన అంశాలు తర్వాత నేను సాగించే అధ్యయనాలు సవరించుకోవడానికో, సమర్థించుకోవడానికో నాకు అవకాశం కలిగించవచ్చు.

చాలా మంది పాఠకుల్లో యీ గ్రంథం ప్రతికూల ప్రతిస్పందనను కలిగించవచ్చు. మానవ విమోచన సమస్య వుంది, దీన్ని నా అభిప్రాయానికి ఎదురు బొదురుగా పెట్టి నాది శుద్ధ ఆదర్శవాదంగా చూడవచ్చు. అలాగే సత్తా శాస్త్ర అంతఃప్రేరణ చర్చని, ప్రేమని, సంభాషణని, ఆశను, వినయాన్ని, సానుభూతిని యిలాగే ముఖాముఖీగా నిలబెట్టి నా అభిప్రాయాల్ని తిరోగమనాత్మక "ఆడంబరంగా" చూడవచ్చు. పీడకుల్ని మురిపించే రాజ్యపీడనను నేను ఖండించడం కొందరు ఒప్పుకోకపోవచ్చు (లేదా ఒప్పుకోవడం యిష్టం లేకపోవచ్చు). ఆ రకంగా, ప్రయోగాత్మకంగా పరిగణించే యీ గ్రంథం తీవ్రవాదులది. క్రైస్తవులు, మార్క్సిస్టులు నా అభిప్రాయాల్లో కొన్నింటినిగాని, మొత్తంగాని అంగీకరించకపోవచ్చు, నాకు తెలుసు. అయినా దీన్ని కడకంటా చదువుతారని అనుకుంటున్నాను. కానైతే మూసుకుపోయిన, "అహేతుక" స్థానాల్లో మూర్ఖంగా కూరుకుపోయినవాళ్ళు యీ పుస్తకం ద్వారా నేను ఆశిస్తున్న చర్చని తోసిపారేస్తారు.

పాక్షికత్వం మూఢత్వంతో పుంజుకుని ఎప్పుడూ మనను నిర్వీర్యం చేస్తూనే వుంటుంది. అతివాదతత్వం విమర్శనా స్వేచ్ఛతో పుంజుకుంటుంది. ఇది సర్వదా సృజనాత్మకంగా వుంటుంది. పాక్షికత్వం మార్మికం చేస్తుంది, ఆ రకంగా పరాయీకరణ తెస్తుంది. అతివాదం విమర్శ చేస్తుంది. ఆ రకంగా విమోచన ప్రసాదిస్తుంది. ఆమూలాగ్రం మార్చుకోవాలన్న తత్వం ఒక వ్యక్తి ఎంచుకున్న దానికి మరింత బద్ధుడయ్యేట్టు నిమగ్నం చేస్తుంది. ఆ రకంగా నిర్దిష్టంగా, ఎదురుగుండా ఉన్న యదార్థ పరిస్థితిని మార్చే ప్రయత్నంలో మరింత శ్రద్ధగా వుండేటట్టు చేస్తుంది. ఇందుకు విరుద్ధంగా పాక్షికత్వం, మార్మికత్వం అహేతుకం కావడంవల్ల, వాస్తవ పరిస్థితిని బూటకంగా (అంచేత మార్పు చేయలేని) "యదార్థం"గా చేస్తుంది.

పాక్షికత్వం అనేది ఏ మూల వున్నప్పటికీ కూడా, మానవాళి విమోచనకు అవరోధంగానే వుంటుంది. అందువల్ల దురదృష్టవశాత్తూ మితవాద వైఖరి, దీని సహజ ప్రతి సిద్ధాంతాన్ని రాబట్టదు: విప్లవవాదిని తీవ్రం చేయదు. మితవాదుల పాక్షికత్వానికి ప్రతిస్పందించే క్రమంలో, విప్లవాదులు తామే పాక్షికత్వంలో పడిపోయి ప్రతీపశక్తులుగా తయారవడమూ కద్దు. ఈ అవకాశం ఉందిగనక, ఇలా జరగకుండా చేయాలనుకుని తీవ్రవాది కులీనుల చేతుల్లో నోరుమెదపని పావు కాకూడదు. విమోచనా ఉద్యమంలో నిమగ్నమైన స్త్రీగాని, పురుషుడుగాని పీడకుల హింసను మూగగా చూస్తూ కూర్చోలేరు.

మరోవైపున చూస్తే అతివాది ఎప్పటికీ స్వీయాత్మక దృష్టితో వుండడు. ఈ వ్యక్తి స్వీయధోరణి వస్తుగత అంశానికి సంబంధించే వుంటుంది. (నిర్దిష్టంగా వున్న యదార్థ పరిస్థితి, యిదే విశ్లేషణకు లక్ష్యభూతం). ఆ రకంగా స్వీయధోరణి, వస్తుగత దృష్టి ఒక గతి తార్కిక ఏకతతో వుంటాయి. కార్యాచరణతో కలిసి జ్ఞానాన్ని పెంపొందిస్తాయి, యిలా పరస్పరంగా వుంటుంది. (అంటే జ్ఞానం నుంచి ఆచరణ కూడా పెంపొందుతుంది అని.)

పాక్షిక తత్వంతో వున్న వ్యక్తి, ఏ అభిప్రాయాలకు చెందిన వ్యక్తి అయినప్పటికీ, వివేక శూన్యమై కళ్ళు మూసుకుపోయి, చలనశీల యదార్థాన్ని గ్రహించడు (లేదా గ్రహించలేడు)– లేదా వక్రంగా టీకాటిప్పణి చెప్తాడు. ఈ వ్యక్తి గతి తార్కికంగా

ఆలోచించినా, అది ఒక "మచ్చిక చేసుకున్న గతితర్కం"గానే వుంటుంది. మితవాద పాక్షికవాది (ఇంతకుముందే యిలాంటి వ్యక్తుల్ని "ఆజన్మ పాక్షికవాది" అని అన్నాను)[5] చారిత్రక క్రమాన్ని దిగలాగడానికి చూస్తాడు. కాలాన్ని "మచ్చిక" చేసుకోవాలని చూస్తాడు. ఆ రకంగా స్త్రీలను, పురుషుల్ని, ''మచ్చిక'' చేసుకోవాలని చూస్తాడు. ఇక "వామపక్ష–పాక్షికవాది" యదార్థ పరిస్థితిని గాని, చరిత్రనుగాని వ్యాఖ్యానించేప్పుడు మొత్తానికే పట్టాలు తప్పేసి, మూలమట్టంగా, యిదంతా ముందే తీర్మానం అయిపోయిందనే కర్మవాదంలోకి పడిపోతాడు.

మితతత్వ పాక్షిక వాదికీ ప్రతిద్వంద్వి అయిన వామపక్ష పాక్షిక వాదికీ తేడా వుంది. మొదటి రకంవాడు వర్తమానాన్ని మచ్చిక చేసుకోచూస్తాడు. ఆ రకంగా (ఆమెగాని అతనుగాని) భవిష్యత్తు యీ మచ్చిక చేసిన వర్తమానాన్నే పునస్సృష్టి చేస్తుందన్న ఆశాభావంతోనే అలా చూస్తారు. రెండవ రకంవాళ్లు, అంటే వామపక్ష ధోరణిగల పాక్షికవాదులు, భవిష్యత్తు ముందే నిర్ణయం అయిపోయిందని – అది తప్పించలేని విధి, అదృష్టం, కర్మ అని భావిస్తారు. మితవాద ధోరణి పాక్షిక వాదికి "నేడు" గతంతో సంధించుకుని, ఏదో ప్రసాదితమైందిగా, స్థిరమైందిగా కనిపిస్తుంది. ఇక వామపక్ష పాక్షికవాదికి "రేపు" అనేది ముందే శాసితం అయిపోయినట్టు, అనుల్లంఘనీయంగా రాసిపెట్టి వున్నట్టు కనిపిస్తుంది. ఇలా మితవాది, వామపక్ష వ్యక్తీ ఉభయులూ తిరోగమనవాదులే అవుతున్నారు. ఏమంటే, చరిత్ర గురించి వాళ్ళవాళ్ళ తప్పుడు అభిప్రాయాల నుంచి మొదలైనందువల్ల యిద్దరూ స్వేచ్ఛను నాస్తీకరించే కార్యాచరణ రూపాల్ని రూపొందించుకుంటున్నారు. ఒకళ్ళు "వేలుపెట్టడానికి" లేని వర్తమానాన్ని, రెండవ వాళ్ళు ముందే నిర్ణయమైపోయిన భవిష్యత్తునీ ఊహించుకుంటున్నారు అన్నది నిజమే అయినా, ఆ రకంగా వాళ్ళు చేతులు ముడుచుకుని ప్రేక్షకుల్లా వున్నారని అర్థం కాదు, (మొదటి రకంవాళ్ళు యీ వర్తమానం కొనసాగుతూ వుంటుందనీ, రెండవ రకంవాళ్ళు ముందే "తెలిసిన" భవిష్యత్తు వచ్చేస్తుంది కదా అని ఎదురుచూస్తూ యిలా వుండడం). ఇందుకు విరుద్ధంగా జరిగి తీరుతుందనుకునే వృత్తాల్లో'' వాళ్ళు బిగుసుకుపోతారు. దాన్నుంచి వాళ్ళు బయటపడలేరు. అలా బిగుసుకుపోయి, బయటపడలేక తమ సత్యాల్ని తామే సృష్టించుకుంటారు. అది భవిష్యత్తును నిర్మించుకునే

పోరాటం సాగించే స్త్రీ, పురుషుల సత్యం కాదు. ఈ నిర్మాణంలో భాగంగా వాళ్ళు యిందులో ఇమిడి వున్న ప్రమాదాల్ని ఎదిరించాల్సి వుంటుంది. ఇది యీ భవిష్యత్తును ఎలా నిర్మించాలా అని కలిసి నేర్చుకుంటూ, పక్కపక్కనే పోరాడుతూ వుండే స్త్రీల, పురుషుల సత్యమూ కాదు. ఆ భవిష్యత్తు ప్రదానం చేస్తే జనం అందుకునేది కాదు జనం తామే నిర్మించుకోవాల్సినటువంటిది. ఈ రెండు రకాల పాక్షిక వాదులూ, చరిత్రను తమ తమ అధీనంలో వున్నదిగా పరిగణిస్తూ , ఆఖరికి ప్రజల నుంచి ఎడమైపోతారు. ప్రజలకు వ్యతిరేకం కావడంలో యిది మరో పద్ధతి.

మితతత్వ పాక్షికవాది తన "సత్యం"లో తను గిరి గీసుకుపోతాడు. ఆ మనిషి తనకి సహజ సిద్ధంగా వున్న పాత్రను పోషించడం తప్ప మరేం సాధించలేడు. ఇదిలా వుంటే పాక్షికవాదీ, పిడివాదీ అయిన వామపక్షంవాడు తన స్వభావాన్నే నాస్తీకరించుకుంటున్నాడు. ఎవళ్ళమటుకు వాళ్ళు "తమ" సత్యం బరిలో గిరగిరా తిరుగుతూ, ఆ సత్యాన్ని ప్రశ్నిస్తే బెదిరిపోతారు. ఆ రకంగా "తమ" సత్యం కానిదాన్ని దేన్నైనా అసత్యంగానే పరిగణిస్తారు. పాత్రికేయుడు మార్షియో మొరీరా అల్వేస్ ఒకసారి నాతో అన్నట్టు సందేహ స్వభావాన్ని కోల్పోవడమే ఈ ఉభయుల బాధకు కారణం.

మౌలికపరివర్తన వాది (అతివాది/తీవ్రవాది) మానవ విమోచనకు బద్ధుడై వుంటాడు. "జరిగి తీరుతుందనే వృత్తం"లో బందీగా వుండడు. ఈ వృత్తంలోనే యదార్థ పరిస్థితి కూడా బందీ అయివుంటుంది. తద్విరుద్ధంగా ఒక వ్యక్తి ఎంత తీవ్రవాది అయితే అంతగా ఆమెగాని, అతనుగాని యదార్థ పరిస్థితిలోకి ప్రవేశిస్తారు. ఆ రకంగా దాన్ని గురించి మరింత బాగా బోధపరచుకుని, మరింత మెరుగ్గా పరివర్తన జరిపించాలని చూస్తారు. తమ ముందు ముసుగు తొలగి కనిపించే ప్రపంచాన్ని ఎదుర్కోవడానికి, వినడానికి, చూడ్డానికి ఆ వ్యక్తి భయపడడు.[6] ఆ వ్యక్తి, స్త్రీగాని, పురుషుడుగాని తాము చరిత్రపై హక్కు వున్నవాళ్ళనీ, లేదా ప్రజలందరికీ యజమానులనీ, లేదా పీడితుల విమోచకులను అనుకోరు. ఆమెగాని, అతనుగాని చరిత్రకు లోబడే వాళ్ళ పక్షంలో వుంటూ పోరాడ్డానికి నిబద్ధులవుతారు.

పీడితుల బోధనా శాస్త్రానికి సంబంధించిన పరిచయాత్మక స్థూల రేఖలు మాత్రమే యీ పుటల్లో కనిపిస్తాయి. ఇది అతివాదుల కోసం ఉద్దేశించిన కర్తవ్యం. దీన్ని పాక్షిక దృక్పథం వున్నవాళ్ళు అమలు చేయలేరు.

ఈ పుస్తకం బాగా తగినంత విమర్శనాత్మకంగా చదవాలని కోరుకుంటాను. పొరపాట్లనీ, అపార్థాలనీ సవరిస్తూ, నిర్ధారణలను మరింత పటుతరం చేస్తూ, నేను గమనించని అంశాలని యెత్తిచూపిస్తూ వుండే పాఠకులు నాకు సంతృప్తి కలిగిస్తారు. విప్లవ సాంస్కృతిక కార్యాచరణను చర్చించేందుకు నాకున్న యోగ్యతలేమిటని కొంత మంది వేలుపెట్టి చూపించే అవకాశం వుంది. అది నాకు ప్రత్యక్ష అనుభవంలో లేనివిషయంగా అనిపించవచ్చు. నేను నాకుగా నేరుగా విప్లవ కార్యాచరణలో పాల్గొనివుండకపోవచ్చున్న విషయం అలా వున్నా, ఆ అంశం గురించి నేను ఆలోచించకూడదని లేదు. అదీగాక, నేను ప్రజల బోధకుణ్ణి, సంభాషణాత్మక సమస్యల్ని లేవనెత్తే విద్యను ఉపయోగిస్తున్నాను. ఈ అనుభవంతో నేను ఓ మాదిరిగా విషయ పుష్కలత్వ ం(సంచయం) చేసుకున్నాను. దాంతో ఈ గ్రంథంలో యిలా సూత్రీకరించి నిర్ధారణలను చేసే సాహసానికి అది నన్ను పురిగొల్పింది.

ఈ గ్రంథంలో కనీసం ప్రజలపట్ల నాకున్న విశ్వాసం, స్త్రీలలోనూ పురుషులలోనూ నాకు వున్న నమ్మకం, ప్రేమించడం అనేది మరింత సునాయాసంగా వుండే ప్రపంచాన్ని సృష్టించడంలో విశ్వాసం అనే అంశాలేనా నిలిచి బట్టకడతాయని నేను భావిస్తున్నాను.

ఇప్పుడు నా అర్థాంగి ఎల్జాకు నా కృతజ్ఞతలు చెప్పుకోవాలి. ఆమె నా మొదటి "పాఠకురాలు." ఆమె నా కృషికి ఎంతో అవగాహనను, ప్రోత్సాహాన్ని అందించింది. ఈ రచన ఆమెది కూడా అని చెప్పొచ్చు. నా రాత ప్రతి చదివి వ్యాఖ్యలు చేసిన మిత్రుల బృందానికి కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను. కొందరి పేర్లను ప్రస్తావించలేకపోయే ప్రమాదం వుందని తెలిసీ, కొన్ని పేర్లని చెప్పకతప్పదు. జొవో ద వోల్నా కౌంటిన్హో, రిచర్డ్ షౌల్, జిమ్ లేంబ్, మైరా, జొవోలినో రామొస్, పాలో డిటార్సో, అల్మినో అఫాన్సో, ప్లినియో సంపాషియో, ఎర్నాని యేరియా ఫయోరి, మార్సెలా గజార్డో, జోస్ లూయిూ ఫయోరి, జొవొ జప్రియొటిలకు నా కృతజ్ఞతలు. అయితే, యీ గ్రంథంలో చేసిన సూత్రీకరణలకు మాత్రం నాదే బాధ్యత.

**- పాలో ఫ్రెయిరె**

# వివరణలు

1. "కాన్షెంటిజచావో" *(Conscientizacao)* అన్న మాట సామాజిక, రాజకీయ, ఆర్థిక వైరుధ్యాల గ్రహణని నేర్చుకోవడానికి వర్తిస్తుంది. యథార్థ పరిస్థితిలోని పీడక అంశాలకి వ్యతిరేకంగా చేసే కార్యాచరణకీ వర్తిస్తుంది. అధ్యాయం 3 చూడండి. (ఇంగ్లీషు అను. వివరణ)

2. ఇంగ్లీషులో సబ్జెక్ట్స్ అని వాడారు. దీనికి ఇంగ్లీసు అనువాదకుడి వివరణ :

   "కర్తలు అన్నమాట, కార్యాచరణకు నడుం కట్టేవాళ్ళు అన్న అర్థంలో వుంది. నిష్క్రియత, పెత్తనం చెలాయిస్తూ వుంటే భరించే "కర్మ"లు కాదు." యీ "కర్మ" అంటే అబ్జెక్టు అని.

3. ఈ మాటలు పాలో్ఫ్రెయిరె గ్రంథం *"Educacao como practica da Liberadade"* కి ఫ్రాన్సిస్కో వెఫర్ట్ రాసిన ముందుమాటలోనివి (రియోడిజనరో, 1967)

4. హెగెల్ *"The phenomenology of Mind"* (న్యూయార్క్, 1967) పే. 233.

5. *Educacao como pratica da Liberdade* అన్న గ్రంథంలో *(rote by English Translator).*

6. "సిద్ధాంతపరమైన జ్ఞానం పార్టీలో ఏ కొద్దిమంది "విద్వాంసుల" హక్కుగానో మిగిలిపోయినంతకాలం, పార్టీ పట్టాలు తప్పిపోయే ప్రమాదం వుంటుంది." రోజాలగ్జెంబర్గ్. *Reform or Revolution* అన్న గ్రంథం నుంచి *'The Marxists'* అన్న గ్రంథంలో సి. రైట్ మిల్స్ ఉల్లేఖన. (న్యూయార్క్, 1963.)

# అధ్యాయం

## 1

**మా**నవీకరణ అనేది సర్వదా మానవాళికి కేంద్ర సమస్యగానే వుంది. అయితే అది యిప్పుడు తప్పించుకోలేని అక్కర అయింది.[1] మానవీకరణ కోసం తాపత్రయం నేరుగా అమానవీకరణను గుర్తించే వైపు తీసుకెళ్తుంది. ఇది ఒక తాత్విక అవకాశంగానేగాక చారిత్రక వాస్తవంగానూ కనిపిస్తుంది. ఈ అమానవీకరణ పరిధిని గ్రహించిన మేరకు, ఆ స్త్రీగాని, పురుషుడుగాని మానవీకరణ అనేది లాయకీ అయిన అవకాశమేనా అని అడగవచ్చు. చరిత్రలోని ఆయా నిర్దిష్ట వాస్తవ పరిస్థితుల్లో తమ అసంపూర్ణత గురించి తెలుసుకున్న వ్యక్తులకు మానవీకరణ, అమానవీకరణ రెండూ రెండు అవకాశాలుగా నిలుస్తాయి.

మానవీకరణం, అమానవీకరణం అనే రెండూ పరస్పర ప్రత్యామ్నాయాలే అయినా, మొదటిదే నిజానికి ప్రజలకు వున్న అంతఃప్రేరణ. ఈ అంతఃప్రేరణ నిరంతరంగా అదృశ్యమైపోతూ వుంటుంది. అయితే, యీ అదృశ్యం కావడమే దాని ఉనికిని ధృవపరుస్తోంది. అన్యాయం, దోపిడీ, పీడన, పీడకుల హింస దానికి భంగం కలిగిస్తున్నాయి. పీడితులు స్వేచ్ఛకోసం, న్యాయం కోసం, తాము పోగొట్టుకున్న మానవత్వాన్ని తిరిగి పొందేందుకు చేసే పోరాటం, పడే ఆరాటం దాని ఉనికిని ధృవపరుస్తున్నాయి.

అమానవీకరణం, మానవత్వాన్ని పోగొట్టుకున్నవాళ్ళను ఎత్తి చూపించడమేకాదు, కాని (మరో విధంగానైనా) దాన్ని దోచుకున్నవాళ్ళలోనూ కనిపిస్తుంది. సంపూర్ణ మానవులు అవ్వాలనే ఆకాంక్షకు 'వక్రరూపం'యిది. యీ వక్రీకరణ చరిత్రలోనే జరుగుతుంది. కానైతే, అది చరిత్ర చేసిన పనికాదు. అమానవీకరణం కావడం అనేది చారిత్రక కర్తవ్యమేనని ఒప్పుకోవడం చేసేదేమీలేదు అన్న ధోరణికీ, పూర్తి నైరాశ్యానికీ

దారి తీస్తుంది. అప్పుడు స్త్రీ, పురుషులు తాము వ్యక్తులం అని ధృవపరచుకోవడానికి, మానవత్వ గుణాలు సాధించుకోవడానికి, శ్రామిక విమోచనకు, పరాయీకరణను అధిగమించడానికి చేసే పోరాటం అర్థం పర్థం లేకుండా పోతుంది. అమానవీకరణ అనేది ఒక చారిత్రక యదార్థం, అయినా, యిది ప్రాప్తించిన తలరాత 'కాదు', ఒక అన్యాయపూరిత వ్యవస్థ పుణ్యం యిది; యీ వ్యవస్థ పీడకులలో హింసను సృష్టింపచేస్తుందనీ, తద్వారా పీడితులలో మానవ లక్షణాల్ని అదృశ్యం చేస్తుందనీ, తెలుసుకున్నప్పుడు మాత్రమే యీ పోరాటం సాధ్యపడుతుంది.

మరింత సంపూర్ణ మానవులుగా తయారవకుండా జరిగే వక్రీకరణ యిది. యిలా కొరవడిన మానవత్వమే కాస్త త్వరగానో, ఆలస్యంగానో తాము అలా అవడానికి కారణమైన వాళ్ళ మీద పోరాటం సాగించేందుకు నడిపిస్తుంది. పీడితుల ఈ పోరాటానికి ఔన్నత్యం సిద్ధిస్తుంది. అంటే, పీడితులు తాము కోల్పోయిన మానవత్వాన్ని తిరిగి పొందడానికి యత్నించే క్రమంలో (యిది ఓ రకంగా మానవత్వాన్ని సృష్టించడం కూడా) ఆ పీడకులకు పీడకులు కాకూడదు. అందుకు భిన్నంగా ఉభయుల్లోనూ మానవత్వాన్ని ప్రతిష్టింపచేసే వాళ్లు కావాలి.

ఆ రకంగా యిది పీడితుల మహత్తర మానవతాపూరిత, చారిత్రక కర్తవ్యం : అదే తమని విముక్తం చేసుకోవడం, తమ పీడకుల్నీ విముక్తం చేయడం. పీడకులు తమకి వున్న అధికారం ఆసరాతో పీడిస్తారు, దోచుకుంటారు, చెరుస్తారు. కాని వాళ్ళు అధికారంలో పీడితుల్నిగాని, తమని తాముగాని విముక్తం చేసే, చేసుకునే శక్తిని చూడలేరు. పీడితుల బలహీనత నుంచి పుట్టుకొచ్చిన శక్తి మాత్రమే యిద్దర్నీ సరైన రీతిలో విముక్తం చేస్తుంది. పీడితుల బలహీనతను మన్నిస్తూ, పీడకుల అధికారాన్ని "మెత్త" బరిచే యే ప్రయత్నం అయినా దాదాపు ఎప్పుడూ కుహనా ఔదార్యంగానే వ్యక్తమవుతూ వుంటుంది. ఆ ప్రయత్నం యింతకు మించి ఒక్క అడుగు ముందుకు పోదు. తమ "ఔదార్యాన్ని" వెల్లడించేందుకు తగినరీతిలో అలా సాగే అవకాశం కలిగించుకుంటారు పీడకులు. అంటే, అన్యాయాన్ని అలాగే వాడిపోకుండా వుంచుతున్నారన్నమాట. యీ అన్యాయపూరిత సాంఘిక వ్యవస్థే యీ ఔదార్యం అనేదానికి శాశ్వత నిధి. మృత్యువు, నిరాశ, పేదరికం దీన్ని పెంచి పోషిస్తూ వుంటాయి. అందుకనే కుహనా ఔదార్య ప్రదాతలు, దాని మూల స్థానానికి ఏ మాత్రం ఎసరు వచ్చినా విలవిల్లాడిపోతారు.

అసలైన ఔదార్యం దొంగదాతృత్వ కారణాల్ని ధ్వంసం చేయడానికి సాగే పోరాటంలోనే నూటికి నూరుపాళ్ళు వుంటుంది. దొంగ దాతృత్వం అణగారినవాళ్ళనీ, పిరికివాళ్ళనీ, 'జీవిత తిరస్కృతులనీ' వాళ్ళు వణికే చేతులు చాచకుండా నొక్కిపడుతుంది. నిజమైన ఔదార్యం అలా కాదు. – వ్యక్తులవి కానీయండి, మొత్తం ప్రజానీకానివి కానివ్వండి – చేతులు చాచేటట్టు చేస్తుంది, కాని ఆ చాచడం 'చిత్తం దొరా' అనేటట్టు కాదు; ఆ చేతులు మరింత మానవత్వ పూరితం అయ్యేందుకు, ప్రపంచాన్ని పరివర్తన చేసేందుకు, అందుకోసం పని చేసేందుకు.

ఈ పాఠం, యీ శిక్షణ పీడితుల నుంచే రావాలి. వాళ్ళతో కలిసిమెలిసి పని చేసేవాళ్ళ నుంచే రావాలి. తమ మానవత్వ పునఃస్థాపన కోసం పోరాట్టం ద్వారా వ్యక్తులుగా లేదా ప్రజలుగా వాళ్ళు అసలైన ఔదార్య స్థాపన కోసం ప్రయత్నిస్తున్నారన్నమాట! పీడక సమాజం ఎలాంటిదో, ఎంత దారుణమైందో పీడితులకంటే బాగా అర్థం చేసుకోగల వాళ్లెవరు? పీడితులకంటే ఎక్కువగా పీడన అనర్థాలు భరించిన వాళ్ళెవరు? విమోచన అవసరాన్ని మరెవళ్ళు బాగా అర్థం చేసుకోగలరు? వాళ్ళు విమోచన పొందడం ఏదో అదృష్టవశాన జరిగేది కాదు. తమ అన్వేషణ, ఆచరణ ద్వారా విమోచన పొందుతారు. దానికోసం పోరాడవలసిన ఆవశ్యకతను గుర్తించడం ద్వారా పొందుతారు. ఈ పోరాటానికి పీడితులు ప్రయోజనం కలిగించారు. అందుచేత అది ప్రేమపూరితం అవుతుంది. ఆ ప్రేమ పీడకుల హింసగుండెలో వున్న ప్రేమరాహిత్యాన్ని ఎదిరిస్తుంది. కుహనా ఔదార్యం ముసుగేసుకున్న వున్నా అది ప్రేమరాహిత్యమే.

కాని దాదాపు సర్వదా, పోరాట సమయం తొలిదశలో, పీడితులు విమోచనకోసం పాటుపడకుండా, తామే పీడకులన్నట్టు తయారవుతారు. లేదా 'ఉపపీడకులు' అవుతారు. వాళ్ళ ఆలోచనా విధానమే వాళ్ళు తయారైన నిర్దిష్ట, జీవన పరిస్థితిలోని వైరుధ్యాలవల్ల రూపు తీసుకున్నటువంటిది. వాళ్ళ ఆదర్శం మానవులు కావడం, కాని మానవులు కావడం అంటే వాళ్ళ దృష్టిలో పీడకులవలె వుండడమే. ఇదీ మానవత్వ ఆదర్శం. యీ స్థితి ఎలా వస్తుంది? పీడితులు, తమ జీవన అనుభవంలో, ఒక దశలో, పీడకునిపట్ల "అంటిపెట్టుకు"నే దృష్టితో వుంటారు. ఈ పరిస్థితుల్లో వాళ్ళు తగినంత స్పష్టంగా అతన్ని అతనుగా "పరిగణించ"రు – తమకి "బాహ్యమైన" వ్యక్తిగా గ్రహించరు. అలా అని తాము అణగారినవాళ్ళు అన్న స్పృహ పీడితులకు ఉండదని కాదు. కాని, తాము పీడితులం అన్న స్పృహ పీడన అన్న యదార్థ పరిస్థితిలో మునిగిపోయినందువల్ల కొరవడిపోయింది. ఈ దశలో, పీడకులకు ప్రత్యర్థులైన వాళ్ళ గ్రహింపు యీ వైరుధ్యాన్ని[2]

అధిగమించే పోరాటంలో నిమగ్నమవడాన్ని సూచించదు. ఈ ధ్రువం విమోచనకోసం అర్రులు చాచదు. విజాతిధ్రువంతో మమేకం అవడాన్ని సూచిస్తుంది.

ఈ దశలో, యీ వైరుధ్య పరిష్కారం నుంచి "నూతన మానవుడు"పుట్టుకు రావలసిన అవసరాన్ని పీడితులు చూడరు, పీడన తొలగి విమోచనకు వ్యక్తిని చోటిస్తుందని గుర్తించరు. వాళ్ళకి సంబంధించినంతవరకు నూతన పురుషుడు గాని, స్త్రీగాని పీడకులే అవుతారు. నూతన మానవుడిపట్ల వాళ్ళ దృష్టి వ్యక్తిగతమైంది. పీడకులతో సారూప్యం భావించుకొన్ని వున్నందువల్ల తాము వ్యక్తులమనికాని, పీడితవర్గం మనుషులమనికాని వాళ్ళకే గుర్తింపు లేకుండాపోయింది. వాళ్ళకి భూసంస్కరణలు కావాల్సింది స్వతంత్రులవడానికికాదు, భూమి సంపాదించి ఆ రకంగా భూస్వాములు కావాలని, లేదా మరింత సూటిగా చెప్పాలంటే– మిగిలిన పనివాళ్ళ మీద కర్రపెత్తనం చెలాయించాలి అని! ఓ రైతు, పర్యవేక్షకుడి "పదోన్నతి" పొందాక, తన పూర్వ సహచరుల మీద, అసలు యజమానికంటే ఎక్కువ దాష్టీకం చెలాయించకుండా వుండడం అరుదు. ఇందుకు కారణం రైతుల పరిస్థితే. అంటే, పీడన మారకుండా అలానే వుంటుందన్నమాట! ఈ ఉదాహరణలో పర్యవేక్షకుడు, తన ఉద్యోగానికి ఒడిదుడుకులు లేకుండా చూసుకోవాలీ అంటే, యజమానిలానే అంత కర్కశంగానూ వుండాలి – ఆ మాటకొస్తే యింకా ఎక్కువగా. పోరాటం తొలిదశలో పీడితులు "మానవత్వం" నమూనాను పీడకునిలో చూస్తారని ఇందాక చెప్పుకున్న దానికి ఇది నిదర్శనం.

విమోచనా క్రమాన్ని స్థాపించడం ద్వారా, వున్న యదార్థ పీడన పరిస్థితిని మార్చివేసే విప్లవం కూడా యిలాంటి పరిణామాన్ని ఎదుర్కోవాల్సి వస్తుంది. ప్రత్యక్షంగానో, పరోక్షంగానో విప్లవంలో పాల్గొనే పీడితుల్లో చాలామంది – పాత వ్యవస్థ మాయలతో చుట్టుకుపోయి – దాన్ని తమ సొంత విప్లవం చేసుకునేందుకు మొగ్గుతారు. తమ పూర్వపు పీడకుడి నీడ యింకా వాళ్ళ మీద పరచుకునే వుంటుంది.

పీడితుల్ని[3] బాధించే "స్వేచ్ఛాభయం", పీడకుడి పాత్రకే వారిని బంధించేటట్టు చేసే భయం అనే అంశాన్ని పరిశీలించాలి. అది పీడితులుగానే వుండిపోయేట్లయినా చేస్తుంది. పీడకుడికీ, పీడితుడికీ మధ్య వున్న సంబంధంలో వున్న మౌలిక అంశాలలో ఒకటి 'రాత'. ప్రతి ఆజ్ఞ ఒక వ్యక్తి యిష్టానిష్టాల్ని మరొకళ్ళ మీద రుద్దడమే. అలా ఆజ్ఞకు బద్ధుడైన వ్యక్తి, దాన్ని విధించేవాడి ఎరుకకు అనుకూలంగా తనను మలచుకుంటాడు. ఆ రకంగా పీడితుడి ప్రవర్తన ఒక హద్దుల మధ్య ప్రవర్తన, పీడకుడు గీసిన గీట్లని దాటకుండా వుంటుంది.

పీడితులు పీడకుడి భావనలో ఇమిడి పోవడంతో, అతని గీతలు అనుసరిస్తూ వుండడంతో స్వేచ్ఛ అంటే భయపడతారు. స్వేచ్ఛకి కావాల్సింది పీడకుడి రూపాన్ని వెలివేయడం, దాని స్థానంలో స్వయం నిర్ణయాన్ని నిలబెట్టడం, బాధ్యతని వుంచడం. పోరాడి జయించడం ద్వారా స్వేచ్ఛని సాధించాలి, దానం ద్వారా కాదు. దాన్ని స్థిరంగా, బాధ్యతాయుతంగా సాధించాలి. స్వేచ్ఛ అనేది మనిషికి దూరంగా బయట ఎక్కడో వున్న ఆదర్శమూ కాదు, అభూతకల్పనలాంటి ఒట్టి భావమూ కాదు– మానవుడి పరిపూర్ణత్వం కోసం జరిపే అన్వేషణకు తప్పనిసరిగా వుండవలసిన నిబంధన.

పీడన వుండే పరిస్థితిని అధిగమించాలనుకోండి, అందుకు మొదటగా ప్రజలు హేతుబద్ధంగా దాని కారణాలని అన్వేషించాలి. అలా జరిగినపుడు, కార్యాచరణను మార్చుకోవడం ద్వారా వాళ్ళు నూతన పరిస్థితిని సృష్టించగలుగుతారు. ఆ పరిస్థితివల్ల పరిపూర్ణ మానవత్వం సాధించే ప్రయత్నానికి వీలు కలుగుతుంది. కాని, మరింత మానవత్వ పూరితం అయ్యేందుకు సాగించే సామాజిక పోరాటం యిప్పటికే మొదలైంది. పరిస్థితిని మార్చే పోరాటం యిది. పీడక పరిస్థితి కూడా అమానవీయం కావడం మొత్తంగా పీడకులు, పీడించబడే వాళ్ళు అనే రూపంలో వుంటుంది. కాని అది పీడకుల్ని, వాళ్ళు పీడించేవాళ్ళనీ బాధిస్తూ వుంటుంది. అంతా వాళ్ళ మానవత్వం హరించుకుపోయిన పీడకులే. యిద్దరి పరిపూర్ణ మానవత్వం కోసం పోరాటం సాగించాలి. ఇతరుల మానవత్వ లక్షణాన్ని హరించడం ద్వారా తానే మానవత్వం కోల్పోయిన పీడకుడు యీ పోరాటాన్ని సాగించలేడు.

అయితే ఒకటుంది. పీడితులు ఆధిపత్య నిర్మాణానికి అనువుగా మారిపోయారు. అందులో మునిగిపోయారు. ఇక ఇది యింతేనని సమాధానపడిపోయారు. వీళ్ళు, యీ పోరాటానికి అవసరమైన చిక్కులు కొని తెచ్చుకోలేమని భావిస్తూ వున్నంతకాలం యీ స్వేచ్ఛా పోరాటం సాగించడానికి జంకుతూనే వుంటారు. అదీగాక వాళ్ళ స్వేచ్ఛాపోరాటం పీడకుణ్ణేగాక, తమ తోటి పీడిత సోదరుల్నీ భయపెడుతుంది, వాళ్ళు మరింత పీడన నెత్తి మీద పడుతుందేమోనని భయపడుతూ వుంటారు. స్వేచ్ఛాయుతం కావాలన్న తపన తమలో వుందని వాళ్ళు గ్రహిస్తే యీ తపనను ఒక యదార్థంగా మార్చడం జరుగుతుందనీ, తోటివాళ్ళల్లో కూడా యిదే తపన పుట్టుకువచ్చినపుడు మాత్రమే యిది జరుగుతుందనీ గ్రహిస్తారు. అయితే "స్వేచ్ఛాభయం"లో చిక్కుకుపోయిన కారణంగా, యితరులకు అలాటి విజ్ఞప్తి చేయలేరు. లేదా యితరుల విజ్ఞప్తుల్ని వినదలచుకోరు. కనీసం తమ అంతరాత్మ ఘోషనైనా చెవిన పెట్టరు. ప్రామాణికమైన సాహచర్యానికి బదులు కలివిడి కులాసాతనం బాగుందనుకుంటారు. స్వేచ్ఛ ప్రసాదించే సృజనాత్మక సంభాషణ బదులు, అసలు

స్వేచ్ఛకోసం అన్వేషించడానికి బదులు తమ స్వేచ్ఛలేని పరిస్థితితో సరిపెట్టుకుంటా భద్రత చూసుకుంటారు.

పీడితులు వాళ్ళ అంతరంగాల్లో తిష్టవేసుకు కూర్చున్న యీ ద్వంద్వత్వంతో బాధపడుతూ వుంటారు. స్వేచ్ఛలేకుండా తాము ప్రామాణికంగా మనుగడ సాగించలేమని తెలుసు. అయినా, ప్రామాణిక మనుగడ కోరుకుంటూ వున్నా, అదంటే భయం. వాళ్ళు ఏకకాలంలో తాముగానూ వుంటారు, పీడకుడి మనస్తత్వంతోనూ వుంటారు. ఆ తత్వం తమలో నిబిడీకృతం చేసుకుని వుంటారు. సంఘర్షణ ఎక్కడ వుందంటే, తాము పూర్తిగా తాముగా వుండడానికీ, విభాగించుకుని వుండడానికీ మధ్య వుంది, తమలోపల వున్న పీడకుణ్ణి పారద్రోలడానికీ, అలా చేయకుండా వుండడానికీ మధ్య వుంది; మనుషుల మధ్య సంఘీభావానికీ, పరాయీకరణకీ మధ్య వుంది; ఆదేశిత విధికీ, తమ అభిష్టానికీ మధ్య వుంది; ప్రేక్షకులుగా వుండడానికీ, పాత్రధారులుగా వుండడానికీ మధ్య వుంది; కార్యాచరణ జరిపించడానికీ, పీడకుల కార్యాచరణ తమ ఆచరణను నడిపించడానికీ మధ్య వుంది; సృష్టి, పునసృష్టి చేయడానికీ, ప్రపంచాన్ని పరివర్తన చేయించే తమ శక్తిని పోగొట్టుకుని మౌనం వహించడానికి లేదా తమ వాణి వినిపించడానికి మధ్య వుంది. ఇదీ పీడితుల విషాద విచికిత్స. దీన్ని విద్య గమనించాల్సి వుంది.

ఈ రచయిత విముక్తి విద్య శాస్త్రం అని పిలుస్తూ వున్న యీ గ్రంథంలో, దానికి సంబంధించిన కొన్ని పార్శ్వాల పరిశీలన వుంది. ఈ విద్యా పద్ధతిని పీడితులతో (వ్యక్తులుగాని, ప్రజలుగాని) రూపొందించాలి కాని వాళ్ళకోసం కాదు. వాళ్ళు వాళ్ళ మానవత్వ విలువల్ని తిరిగి పొందడానికి చేసే నిరంతరాయ పోరాటంలో యిది యిలా రూపొందాలి. ఈ విద్యా పద్ధతిలో పీడితులు ఆలోచన చేసే అంశంగా పీడన, దాని పుట్టుపూర్వోత్తరాలు వుంటాయి. ఆ చింతన నుంచి విముక్తి పోరాటంలో వాళ్ళు తప్పనిసరిగా నిమగ్నమైతేనే ఆ పోరాటంలో యీ విద్యా పద్ధతీ నిర్మితమవుతుంది, పునర్నిర్మితమవుతుంది.

కీలక సమస్య యిదీ: ద్వైధీభావంతో, ప్రామాణికత లేని వ్యక్తులుగా వున్న పీడితులు, తమ విముక్తిబోధన శాస్త్రం అభివృద్ధి చెందడంలో ఎలా భాగస్వాములు కాగలుగుతారు? పీడకులకు "అతిథేయులు" తామేనన్న ఎరుక వచ్చినప్పుడు మాత్రమే వాళ్ళు తమ విమోచనా బోధనా శాస్త్ర మంత్రసానితనానికి దోహదపడగలరు. 'మనడం', 'మనడంలాగా' మధ్య, 'మనడంలాగా', 'పీడకులలాగా' మధ్య ద్వైధీభావంతో వున్న వాళ్ళు, యిలా దోహదపడడం అసంభవం. యీ పీడితుల బోధనా శాస్త్రం పేదలు తాము, తమ పీడకులు ఉభయులూ అమానవీకరణ వ్యక్తీకరణలే అన్న హేతుబద్ధ స్పృహకు ఒక సాధనం.

ఆ రకంగా విముక్తి అనేది శిశుజననం వంటిది, వేదనతో వుంటుంది. అలా ఆవిర్భవించిన స్త్రీగాని, పురుషుడుగాని ఒక నూతన వ్యక్తి అవుతున్నట్టు; సర్వమానవాళి మానవీకరణం చెంది, పీడిత–పీడక వైరుధ్యం సమసిపోయినప్పుడు మాత్రమే స్వతంత్ర జీవి ఏర్పడ్డం జరుగుతుంది. ఇదే విషయాన్ని మరోలా చెప్పుకోవాలీ అంటే, యీ నూతన వ్యక్తిని ప్రపంచంలోకి తీసుకువచ్చే శ్రమలోనుంచే యీ వైరుధ్య పరిష్కారం పుట్టుకొస్తుంది. ఇక పీడకుడూ వుండడు, పీడితుడూ వుండడు, స్వేచ్ఛాసముపార్జనా క్రమంలో మానవుడే వుంటాడు.

ఈ పరిష్కారం ఆదర్శ పదబంధాల ద్వారా సిద్ధించదు. పీడితులు తమ విమోచన కోసం ఆ పోరాటం చేసేందుకుగాను పీడన అనే యీ వాస్తవాన్ని దారులు మూసుకుపోయిన ప్రపంచ స్వరూపంగా భావించకూడదు, అలాంటి దాన్నుంచి బయటకొచ్చే మార్గం వుండదు. దీన్ని పరిమిత సన్నివేశంగా చూడాలి. దీన్ని తాము మార్చగలరు. ఈ అవగాహన అవసరమే, కాని విమోచనకు ఈ గ్రహింపే చాలదు. ఇది విముక్తి కార్యాచరణకు ప్రేరణ శక్తి అయి తీరాలి. అలాగని పీడితులు, తాము పీడకులతో గతి తార్కిక సంబంధంతో వున్నామనీ, వాళ్ళ ప్రతికూలురుగా వున్నామనీ (antithesis)– అంటే తాము లేకుండా పీడకుడు మనలేడు[4] అని – గుర్తించినంత మాత్రాన్నే అది విమోచన అవదు. తాము చిక్కుకుపోయిన యీ వైరుధ్యం నుంచి పీడితుడు ఎప్పుడు బయటపడతాడూ అంటే, యీ అవగాహనవల్ల, తమని స్వేచ్ఛాయుతుల్ని చేసే పోరాటంలో చేరినప్పుడు.

ఇదే విషయం విడిగా ఓ పీడకుడు వ్యక్తిగా వున్న సందర్భంలోనూ సత్యమవుతుంది. తాను పీడకుణ్ణి అని తెలుసుకోవడం క్షోభ కలిగిస్తుంది. కాని అది పీడితులతో సంఘీభావానికి దారి తీయాలని లేదు.. పీడితుల్ని సాదరంగా చూడ్డం ద్వారా తన దోషాన్ని హేతుబద్ధం చేసుకుంటాడు. ఎప్పుడూ వాళ్ళు తన మీద ఆధారపడి వుండేటట్టు చేసుకుంటాడు. ఇది సరిపోదు. సంఘీభావానికి కావాల్సింది, ఎవళ్ళతో సంఘీభావంతో వుండదలచుకున్నామో వాళ్ళ స్థానంలోకి వెళ్ళడం. ఇదొక తీవ్రమైన స్థితి. హెగెల్[5] చెప్పినట్టు, యజమాని చైతన్యానికి లొంగిపోయేట్టు వుండడమే పీడితుల ప్రత్యేక లక్షణం అయితే, పీడితులతో నిజమైన సంఘీభావం కలిగించుకోవడం అంటే వాళ్ళ పక్షాన వుండి, యీ యదార్థ పరిస్థితి మార్చే పోరాటం చెయ్యడం అవుతుంది. యీ యదార్థ పరిస్థితే కదా వాళ్ళని మరొకళ్ళ కోసం వుండే వాళ్ళుగా చేసింది? పీడకుడు పీడితులతో చూడ్డం మానినపుడు, అన్యాయమైపోయిన వ్యక్తిగా అతణ్ణి చూసినపుడు, వాళ్ళ వాక్కు అణగారి అయిపోయిందని, వాళ్ళ శ్రమశక్తి విక్రయంలో దగా పడిపోయారని

చూసినపుడు 'అయ్యోపాపం, ఎంత దయనీయంగా వుంది వీళ్ళపరిస్థితి' అని నంగనాచి, జాలికబుర్లు వ్యక్తిగతంగా చేయడం, దయ ప్రదర్శించే నటనలు మానినపుడు, ప్రేమపూరిత కార్యాలు చేయడానికి సాహసించినపుడు. ఈ సంఘీభావం అనేది ప్రేమపూరిత చర్యల సంపూర్ణత్వంలోనే కనిపిస్తుంది. దాని మనుగడలో కనిపిస్తుంది. దాని కార్యాచరణలో కనిపిస్తుంది. స్త్రీలు, పురుషులు వ్యక్తులు; వ్యక్తులు కాబట్టి స్వేచ్ఛాయుతులు కావాలి అని ధాటిగా అంటూ వున్నా, యీ మాటలకి కార్యరూపం యిచ్చి వాస్తవం అయేటట్టు చూసే ఏ పనినీ చేయకపోవడం దగా మాత్రమే.

ఇదొక యదార్థ పరిస్థితి. పీడక–పీడిత వైరుధ్యం స్థిరమైంది. ఈ వైరుధ్య పరిష్కారాన్ని వస్తుగతంగా నిజమని నిరూపించాలి. అంచేత, మౌలికమైన అవసరం ఏమిటంటే – స్త్రీగాని, పురుషుడుగాని పీడకులమనీ, పీడితులమనీ వ్యక్తులుగా తెలుసుకున్నప్పుడు– పీడనకు కారణమైన యీ యదార్థ పరిస్థితిని మార్చితీరాలి అన్న భావం కలగడం.

యదార్థాన్ని వస్తుగతంగా మార్చాలి అన్నది యీ తీవ్రమైన కోరిక. దీన్ని ముందు పెట్టడం అంటే, పీడన దానికదే అదృశ్యమయేదాకా ఓపిగ్గా ఎదురు చూస్తూ, పీడనను పక్కదారి పట్టించే వ్యక్తిగత అచేతనత్వాన్ని ఎదిరించి పోరాడ్డం అంటే, యీ నిర్మాణాల్ని మార్చే పోరాటంలో వ్యక్తిగతమైన పాత్ర లేదని చెప్పడంకాదు. స్వీయ మానసికవైఖరి లేకుండా వస్తుగతమైంది వుండదు. ఇందులో ఏదీ రెండవది లేకుండా వుండదు, వాటిని ద్వైధీ భావంతో చూడ్డమూ వుండదు. వస్తుగతతత్వాన్ని స్వీయ మానసిక దృష్టిని వేరు చేయడం, యదార్థ పరిస్థితిని విశ్లేషించడంలోగాని, దానికి సంబంధించి ఆచరించడంలోగాని స్వీయ మానసిక దృష్టిని తోసి రాజనడం వస్తుగత దృష్టి అవుతుంది. మరో పక్క విశ్లేషణలోగాని, ఆచరణలోగాని యీ వస్తుగత పరిశీలనను తోసిరాజని, స్వీయ మానసిక దృష్టిలో పడడం ఆత్మపదార్థం ఒక్కటే తెలుసుకోదగ్గది అన్న స్థితిలో పడేస్తుంది. యదార్థ పరిస్థితిని తిరస్కరించడం ద్వారా కార్యాచరణనే కాదుపొమ్మంటుంది. ఇక్కడ స్వీయ మానసిక ధోరణినిగాని, వస్తుగత పరిశీలనా దృష్టినిగాని యింకా చెప్పాలంటే విలువల్ని మనస్తత్వశాస్త్ర చూపుతో పరిశీలించే వైఖరినిగాని ప్రతిపాదించడంలేదు. స్వీయ మానసిక వైఖరీ, వస్తుగత దృష్టీ నిరంతరం గతితార్కిక సంబంధంతో వుంటాయని మాత్రమే యిక్కడ చేస్తున్న ప్రతిపాదన.

ప్రపంచాన్నీ, చరిత్రనీ మార్చేక్రమంలో స్వీయ మానసిక దృష్టికి ప్రాముఖ్యం లేదనడం అమాయకత్వం, భోళాతనం అనాలి. అసాధ్యమైనదాన్ని తెచ్చిపెట్టడం : ప్రజలు లేని ప్రపంచం. స్వీయ మానసిక వైఖరి ఎంత అమాయకమో వస్తుగతంగానే పరిశీలించాలి అన్న దృష్టీ అంతే. ఇక్కడ ప్రజలు వుంటారు, ప్రపంచం వుండదు అని చెప్పడం అవుతుంది. లోకమూ, లోకులూ విడి విడిగా వుండవు, నిరంతర ప్రతిచర్యలతో వుంటాయి. మార్క్స్ అలాంటి ద్వైధీ దృక్పథాన్ని ఆదరించలేదు, మరేయితర విమర్శనాత్మక వాస్తవిక చింతనాశీలీ అలా భావించలేదు. మార్క్స్ విమర్శించిందీ, శాస్త్రీయంగా పాతిపెట్టిందీ స్వీయ మానసిక దృష్టిని కాదు, స్వీయ మానసికతత్వాన్ని, మనస్తత్వ శాస్త్రరీత్యా విలువల పరిగణనని. వస్తుగత సామాజిక యదార్థం ఏదో యాదృచ్ఛికంగా వున్నది కాదు, మానవ కార్యకలాపాల ఫలితంగా వున్నటువంటిది. అంచేత యిది యాదృచ్ఛికంగా మారదు. మానవాళి సామాజిక యదార్థాన్ని సృష్టిస్తోంది. (యిది "విలోమ ఆచరణ" ద్వారా మానవాళివైపే తిరుగుతుంది, వాళ్ళని నియంత్రిస్తుంది.) అలా అయినప్పుడు యదార్థ పరిస్థితిని మార్చడం అనేది ఒక చారిత్రక కర్తవ్యం అవుతుంది, మానవాళి కర్తవ్యం అవుతుంది.

వాస్తవ పరిస్థితి, పీడకమైనదైతే మనుషుల్లో పీడకులు, పీడితులు అన్న వ్యత్యాసం పుట్టుకొస్తుంది. విముక్తి కోసం పోరాటం చేయవలసిన కర్తవ్యం పీడితులదే; సిసలైన సంఘీభావాన్ని ప్రదర్శించే వాళ్ళతో కలిసి ఆ పోరాటం సాగించాలి. అంచేత పీడితులు యీ పోరాట కార్యాచరణ ద్వారా పీడన గురించిన సవిమర్శక చైతన్యం పొందాల్సి వుంది. విముక్తి సాధనకు పెద్ద అవరోధం వుంది. అదేమిటంటే, పీడన యదార్థ పరిస్థితి తనలో వున్నవాళ్ళని మింగేసి, ఆ రకంగా మనుషుల చైతన్యాన్ని ముంచేస్తుంది.[6] కర్తవ్య నిర్వహణ రీత్యా పీడన అణగివుండేటట్టు చేస్తుంది. దానికి ఎంతమాత్రమూ బలిగాకుండా సాగాలీ అంటే దాన్నుంచి బయటపడాలి, దానికి ఎదురు తిరగాలి. ఈ పని కార్యాచరణ ద్వారానే సాధించగలం. ఆలోచన, ఆచరణ ప్రపంచాన్ని మార్చేక్రమం ప్రపంచంలో వుండాలి.

"అసలైన పీడనకు పీడన గురించిన గుర్తింపు జోడించి మరింత పీడకంగా" వుండేటట్టు చేయడం, స్వీయ, వస్తుగత దృక్పథాల మధ్యగల గతితార్కిక సంబంధానికి అనుగుణంగానే వుంటుంది. ఈ పరస్పరాధారంలోనే ప్రామాణికమైన కార్యాచరణ సాధ్యమవుతుంది. యిది లేకుండా పీడక-పీడిత వైరుధ్యాన్ని పరిష్కరించడం అసాధ్యం. ఈ లక్ష్యాన్ని సాధించాలి. పీడితులు యదార్థ పరిస్థితిని వివేచనాయుతంగా ఎదుర్కోవాలి. ఇదే సమయంలో వస్తుగత చైతన్యంతో ఆ యదార్థ పరిస్థితిలో ఆచరణ జరిపించాలి.

యదార్థాన్ని గుర్తించడం జరిగింది, వివేచనాయుత జోక్యం లేదు, అప్పుడేమవుతుంది? ఈ యదార్థ పరిస్థితిని మార్చడం జరగదు - ఎందుకనీ అంటే, అది నిజమైన గుర్తించడంకాదు కాబట్టి. వస్తుగత యదార్థానికి నీళ్ళు వదిలేసి, కుహనా ప్రత్యామ్నాయం ప్రవేశపెట్టినవాడి శుద్ధ స్వీయ మానసిక గ్రహింపునకు నిదర్శనం యిది.

వస్తుగత యదార్థ పరిస్థితిలో ఏదన్నా మార్పు జరిగి ఆ వ్యక్తికిగాని, బోధపరుచుకునే వాడి వర్గ ప్రయోజనాలకుగాని భంగం కలిగించేటట్టయితే ఆ సందర్భంలో కూడా కుహనాగ్రహింపు వుండొచ్చు. మొదటి సందర్భంలో యదార్థ పరిస్థితికి సంబంధించి వివేచనాయుత జోక్యం వుండదు, ఎందుకంటే ఆ యదార్థ పరిస్థితి ఊహా కల్పితం- రెండవ సందర్భానికి సంబంధించి ఏమీ వుండదు, ఎందుకంటే, జోక్యం చేసుకోవడంవల్ల గ్రహించేవాడి వర్గ ప్రయోజనాలు దెబ్బతింటాయి. రెండవ సందర్భానికి వస్తే గ్రహించేవాడి ధోరణి "తాటస్థ్యం"తో ప్రవర్తించడంగా వుంటుంది. వాస్తవం అయితే అదుగో వుంది: కాని ఆ వాస్తవం దాన్నుంచి వచ్చే ఫలితం ఆ వ్యక్తికి భంగకరంగా వుంటాయి. అంచేత వాస్తవాన్ని కచ్చితంగా కాదనలేని సన్నివేశం వస్తుంది. కాని "దాన్ని వేరే రకంగా చూసే" పరిస్థితి వస్తుంది. ఈ మాదిరి రక్షక వ్యూహాల్ని సమర్థించుకోవడం, కడకు స్వీయ మానసిక ధోరణి దగ్గరకే చేరుతుంది. యదార్థాన్ని కాదనలేదు, కాని దాని నిజాల్ని సమర్థించుకోవడంవల్ల దాని వస్తుగత పునాది లుప్తం అవుతుంది. అది యిక నిర్దిష్టంగా వుండదు, ఒక అభూత కల్పన అవుతుంది. గ్రహించేవాడి వర్గ ప్రయోజనకు రక్షకంగా తయారవుతుంది.

వాస్తవ పరిస్థితిలో వివేచనాయుతంగా ప్రజలు జోక్యం చేసుకోకుండా వెనక్కిలాగేందుకు ప్రయోగించిన నిషేధాలూ, అవరోధాలకు (మరింత వివరంగా అధ్యాయం 4లో చర్చించడం జరిగింది) కారణాలు యిక్కడ వున్నాయి. ప్రజల జోక్యం తన ప్రయోజనాలకు సరిపడదని పీడకుడికి క్షుణ్ణంగా తెలుసు. తన ప్రయోజనం ఏమిటీ అంటే ప్రజల్ని అలానే భ్రమల్లో ముంచి వుంచడం, పీడక యదార్థ పరిస్థితిలో ఏమి చేయలేని నిర్వీర్యులుగా వుంచడం. ఇక్కడ ల్యూకాన్స్ విప్లవ పార్టీకి చేసిన హెచ్చరికను చూడడం సముచితంగా వుంటుంది.

ఈ అవసరాన్ని నొక్కి చెపుతూ ల్యూకాస్ నిర్ద్వంద్వమైన రీతిలో వివేచనాయుత జోక్యం సమస్యను ముందు పెడుతున్నాడు. "ప్రజాబాహుళ్యానికి వాళ్ళ కార్యాచరణ వివరించి చెప్పడం" అంటే ఆ కార్యాచరణ గురించి స్పష్టంగా చెప్పడం, వివేకం కలిగించడం అనే అర్థం. ఆ కార్యాచరణకు ప్రాణవాయువును అందించిన వస్తుగత వాస్తవానికి

సంబంధించి, దాని ప్రయోజనాలకు సంబంధించి యీ రెండూ వుంటాయి. ఈ యదార్థ పరిస్థితి ఒక సవాల్ వంటిది. ఇదే పరివర్తనా కార్యాచరణ లక్ష్యం. ఎంతలా ప్రజలు దీన్ని ఆవిష్కరించుతూ వుంటారో అంతలా వాళ్ళు వివేచనాయుతంగా ఆ వాస్తవంలోకి ప్రవేశిస్తూ వుంటారు. ఈ రకంగా వాళ్ళు వాళ్ళ అనుభవాల తదనంతర అభివృద్ధిని చైతన్యయుతంగా క్రియాశీలం చేస్తారు." వస్తుగత యదార్థం లేకపోతే మానవ కార్యాచరణ అనేదే లేదు. వ్యక్తి "నేను కాదు" అనుకోవలసిన ప్రపంచమే లేదు. వాళ్ళని ఎదిరించడమూ లేదు. మానవాళి ఒక "పథకం" (ప్రాజెక్ట్) కానట్లయితే ఏలాంటి మానవ కార్యాచరణ లేదు. స్త్రీగాని, పురుషుడుగాని తమని తాము అధిగమించలేకపోతే కార్యాచరణ చేయలేరు. అలాగే యదార్థాన్ని అవగాహన చేసుకుని గ్రహించకపోతే దాన్ని మార్చడమూ వుండదు.

గతితార్కిక చింతనలో ఆలోచన, ప్రపంచం సన్నిహిత పరస్పరాధారంతో వున్నాయి. అయితే, కార్యాచరణ ఒట్టి పనిగాకాక, నిమగ్నత వున్నది కూడా అయినప్పుడే అది మానవతా పూరితమౌతుంది. అంటే, ఆలోచన నుంచి ద్వైధీభావం చెందనపుడు కార్యాచరణకు ఆలోచనమూలమే. – "ప్రజాబాహుళ్యానికి వాళ్ళ కార్యాచరణ గురించి వివరించడం." ఇది లూకాస్స్ చెప్పిన విదాయకాంశలో గర్భితమైవుంది ఈ వివరణకు ఆయన జోడించిన లక్ష్యంలో యిది గర్భితమై వున్నట్టు – "అనుభవం దరిమిలా వచ్చే పరిణామాన్ని ఉద్దేశపూర్వకంగా క్రియాశీలం చేయడం."

అయితే, మనకి కావాల్సింది ప్రజలకి వివరించడం అన్న దాంట్లోకాక, ప్రజల కార్యాచరణ గురించి వాళ్ళతో చర్చించడంలో వుంది. ఏది ఏమైనా, ఏ యదార్థమూ దానికిగా అది పరివర్తన చెందదు.[7] లూకాస్స్ విప్లవ పార్టీకి "ప్రజలకి తమ కార్యాచరణ గురించి వివరించాలి" అని విధించిన షరతు కార్యాచరణ ద్వారా యదార్థ పరిస్థితితో ప్రజలు వివేచనాయుతంగా జోక్యం చేసుకోవాల్సిన అవసరం వుందన్న మన నిర్ధారణతో తూగుతోంది. అణగారిన వాళ్ళ బోధనకు తమ విమోచన కోసం పోరాటంలో నిమగ్నమైనవాళ్ళ విద్యకు, వేళ్ళు యిక్కడనే వున్నాయి. తాము పీడితులము అని గుర్తించినవాళ్ళు గుర్తించనారంభించినవాళ్ళు యీ బోధనా శాస్త్రాన్ని పెంపొందించేవాళ్ళల్లో వుండితీరాలి. పీడితుల్ని ఏదో నిర్భాగ్యులుగా చూస్తూ పీడకుల నుంచి వీళ్ళు ఆశించవలసిన ఆదరసాయాల్ని ప్రదర్శిస్తూ వుండే ఏ విద్యా, నిజంగా విమోచనకే కట్టుబడే ఏ విద్యా, పీడితుల నుంచి దూరంగా వుండదు. తమ విమోచన కోసం జరిపే పోరాటంలో పీడితులు తమకు తామే ఆదర్శంగా వుండాలి.

పీడితుల బోధన, ప్రామాణిక, మానవ స్వభావ పూరిత (మానవసేవా పూరితం కాదు) ఔదార్యంతో జీవం పొంది, మానవాళి విద్యగా దర్శనమిస్తుంది. పీడకుల స్వార్థబుద్ధి ప్రయోజనాలతో (యీ స్వార్థబుద్ధి కుటిల ఔదార్యం వేషం ధరించినటువంటిది) మొదలైన విద్య, మానవసేవా కారుణ్యానికి పీడకుల్ని లక్ష్యంగా చేసుకుంటుంది. అలాంటి విద్య, పీడనను నిలువెల్లా పొదువుకుని వుంటుంది, పీడననే నిలబెడుతూ వుంటుంది. అమానవీకరణకు యిదొక సాధనం. అందుచేత మనం యిందాకే చెప్పుకున్నట్టు అణగారిన ఆర్తుల విద్యను పీడకులు అభివృద్ధి చేయలేరు. పీడకులు విమోచనా విద్యను బలపరచడం దాన్ని నిజంగా అమలు చేయడం అన్నది ఏ మాత్రం అతకని విషయం.

కానీ విమోచనా విద్య అమలుకు రాజకీయ అధికారం అవసరం అనుకోండి; పీడితులకు అలాంటిదేమీ లేదనుకోండి. అలాంటప్పుడు విప్లవానికి ముందు పేదల విద్యలాంటిదాన్ని నిర్వహించడం ఎలా సాధ్యం? ఇది చాలా విలువైన ప్రశ్న. దీనికి జవాబునే నాల్గవ అధ్యాయం స్థూలంగా ప్రస్తావిస్తుంది. ఈ జవాబులోని ఒక పార్శ్వం, క్రమరీతి విద్యకీ– పథకాల విద్యకీ మధ్య వున్న విభేదంలో కనిపిస్తుంది. విద్యను మార్చడానికి రాజకీయాధికారం అవసరం. ఈ రెండవదాన్ని ప్రయోగాత్మకంగా విమోచనాక్రమంలో పీడితులతో కలిసే నిర్వహించడం జరుగుతుంది.

మానవత్వపూరిత, విమోచనాత్మక విద్యగా పీడితుల విద్య, రెండు ప్రత్యేక దశలతో వుంది. మొదటి దశలో పీడితులు పీడక ప్రపంచపు ముసుగు తొలగిస్తారు. కార్యాచరణ ద్వారా పరివర్తనకు నడుం బిగిస్తారు. రెండవ దశలో, పీడక యదార్థ పరిస్థితి అప్పటికే మారిపోయి వుంటుంది. అప్పుడా విద్య పీడితులకి మాత్రమే అన్న పరిమితి పోతుంది. శాశ్వత విమోచన క్రమంలో యావన్మంది ప్రజల విద్య అవుతుంది. ఈ రెండు దశల్లోనూ కూడా గాఢమైన క్రియాశీలత ద్వారానే ఆధిపత్య సంస్కృతిని సాంస్కృతికంగా ఎదిరించడం వుంటుంది.[8] మొదటి దశలో యీ ప్రతిఘటన పీడితులు పీడక ప్రపంచాన్ని బోధపరచుకొనే రీతిలో మార్పు ద్వారా వుంటుంది, రెండవ దశలో పాత వ్యవస్థ పెంచిపోషించిన అభూత కల్పనలను తోసిపుచ్చడం ద్వారా వ్యక్తమవుతుంది. విప్లవ పరిణామం నుంచి ఆవిర్భవించే నూతన నిర్మాణాన్ని వెంటాడే భూతాల్లాగా ఆ అభూత కల్పనలు ఆవహించివుంటాయి.

మొదటి దశ విద్య పీడితుల చైతన్యం గురించి అలాగే పీడకుల చైతన్యం గురించి తలమునకలవుతుంది. అంటే అటు పీడకులుగా ఇటు పీడితులుగా స్త్రీపురుషులకు వుండే చైతన్యంపై అది పని చేయాలి. ఈ విద్య వాళ్ళవాళ్ళ ప్రవర్తన గురించి, వాళ్ళవాళ్ళ

ప్రపంచ దృక్పథం గురించి, వాళ్ళ నైతిక సూత్రాల గురించి పరిశీలించి తీరాలి. ప్రత్యేక సమస్య ఏమిటంటే– పీడితులు ద్వైధీభావంతో వైరుధ్య పూరితంగా వుంటారు; ద్వంద్వ వ్యక్తులుగా వుంటారు; పీడన, హింస అనే నిర్దిష్ట పరిస్థితి వాళ్ళు అలా కావడానికి కారణం. వాళ్ళు ఆ పరిస్థితిలోనే వుంటారు కదా!

మాటవరసకు ఏదో ఒక పరిస్థితి వుందనుకుందాం. ఇక్కడ 'ఎ' వస్తుగతంగా 'బి'ని దోచుకుంటున్నాడు. 'బి' అనే ఆ స్త్రీ లేదా పురుషుడి వ్యక్తిత్వ సాధనకు అడ్డం కొడుతున్నాడు. అలాంటి సందర్భంలో అతను పీడకుడు అవుతున్నాడు. అసలు అలాంటి పరిస్థితే హింసాత్మకమైంది. కుహనా ఔదార్యంతో పంచదార పూత పెట్టినా కూడా. ఆ లక్షణం మారదు. వ్యక్తి మరింత సంపూర్ణ మానవత్వంతో అలరాలవలసిన అస్తిత్వసారంలోనూ, చారిత్రక విధిలోనూ అది తల దూరుస్తుంది. ఎందుకంటే పీడక సంబంధం కారణంగా హింస మొదలు అయిందన్నమాట! చరిత్రలో ఎన్నడూ ఎక్కడా పీడితులు హింసను ప్రారంభించలేదు. ఎలా ప్రారంభిస్తారు? తామే హింస ఫలితంగా వచ్చినవాళ్ళైతే! తమని పీడితులుగా చేసినదానికి వాళ్ళే ఎలా ప్రోత్సహకులుగా వుండగలరు? తమను అణగదొక్కే హింసాత్మక పరిస్థితే గనక లేకపోతే అసలు పీడితులనే వాళ్ళే వుండరు కదా.

అణచిపెట్టి, దోపిడీ చేసి, ఇతరులు మనుషులేకానట్టుగా చేసేవాళ్ళు హింసను మొదలెడతారు– ద్వేషాన్ని ప్రారంభించేది పీడిత, తాడితులు, విస్మృతికి గురైనవాళ్ళు కాదు. ప్రేమకు నోచుకోనివాళ్ళు కాదు ప్రేమించలేనివాళ్ళు ప్రారంభిస్తారు. ఏమంటే, వాళ్ళు తమనే తాము ప్రేమించుకుంటూ వుంటారు. దౌర్జన్యానికి గురైన నిస్సహాయులుకాదు, దౌర్జన్యానికి తెరతీసేది, హింసించేవాళ్ళు, తమ అధికారమదంతో ఆ పరిస్థితిని – అంటే "జీవిత తిరస్కృతులు" పుట్టుకొచ్చే పరిస్థితిని సృష్టిస్తారు. దౌర్జన్యపీడితులైన వాళ్ళు కాదు నియంతృత్వాన్ని ప్రారంభించేది, నియంతలే దాన్ని ప్రారంభిస్తారు. మానవత్వానికి తిరస్కృతులైన వాళ్ళు కాదు మానవ లక్షణాల్ని రద్దుచేసేది. ఆ మానవత్వాన్ని లేకుండా చేసినవాళ్ళు (ఆ రకంగా తమ మానవత్వాన్ని కూడా లేకుండా చేసుకుంటారు.) బలప్రయోగం చేసేది బలవంతుల దౌర్జన్యాలకు బలైన దుర్బలులుకాదు, వాళ్ళని అలా నిర్వీర్యులుగా చేసిన బలవంతులు.

అయితే, పీడితులు, తమ హింసను ప్రతిఘటించినపుడల్లా పీడకులకు వారు "కఠినాత్ములు", "హింసావాదులు", "అనాగరికులు", "దుష్టులు" "భయంకరులు"గా కన్పిస్తుంటారు. (కాని పీడకులు వారిని పీడితులు అని ఎన్నడూ పిలవరు. వాళ్ళు తమ

తోడి దేశస్థులు అయినా కాకపోయినా – 'ఆ జనం', 'అంధ అసూయాగ్రస్తజన సమూహం', 'ఆటవికులు', 'స్థానికులు', 'విచ్ఛిన్నకులు' అని పిలుస్తారు).

అయినప్పటికీ – పరస్పర విరుద్ధంగా కనిపించినా పీడకుల హింసకు పీడితుల ప్రతిస్పందనలోనే ప్రేమ భావన గోచరమౌతుంది. సచేతనంగా, అచేతనంగా పీడితుల తిరుగుబాటు చర్య (యిలాంటి చర్య సర్వదా, లేదా దాదాపు అన్ని వేళలా పీడకుల ఆరంభహింస అంత తీవ్రంగా వుంటుంది) నుంచి ప్రేమ చిగురించవచ్చు. పీడకుల హింస పీడితులు సంపూర్ణ మానవత్వ లక్షణాలు సంతరించుకోకుండా అడ్డగిస్తుంది మరోవైపు పీడితులు యీ హింసకు ప్రతిస్పందించడం మానవులుగా మనగలిగే హక్కును సాధించడంలో వేళ్ళూనుకుని వుంటుంది. పీడకులు యితరుల్లో మానవత్వం లేకుండా చేస్తారు, వాళ్ళ హక్కుల్ని కాలరాస్తారు. అలా చేసస్తూ తామూ మానవత్వం కోల్పోయినవాళ్ళవుతారు. మానవత్వం సంతరించుకోవాలని పోరాడే పీడితులు, పెత్తనం చలాయించడం, అణగదొక్కడం వంటి శక్తిని పీడకుల నుంచి లాగేసుకుంటూనే, పీడన చేసే క్రమంలో పీడకులు పోగొట్టుకున్న మానవత్వాన్ని పునఃస్థాపిస్తారు.

పీడితులు మాత్రమే, తమని తాము విముక్తం చేసుకుంటూ, తమ పీడకుల్నీ విముక్తం చేస్తారు. ఈ పీడకులు, పీడకవర్గంగా, తమనీ విముక్తం చేసుకోలేరు, యితరుల్నీ విముక్తం చేయలేరు. అంచేత పీడితులు తాము యిరుక్కున్న వైరుధ్యాన్ని పరిష్కరించడానికి పోరాటం చేయడం అతి ముఖ్యం. ఈ వైరుధ్యం నూతన మానవుడి ఆవిర్భావంతో పరిష్కారం అవుతుంది. ఈ నూతన మానవుడు పీడకుడు కాదు, పీడితుడూ కాదు, విమోచనా క్రమంలో రూపొందిన మనిషి, పీడితుల లక్ష్యం సంపూర్ణ మానవులుగావడం అయితేగనక, యీ వైరుధ్యంలోని పదబంధాల్ని యిటుదటూ, అటుదిటూ మార్చడం ద్వారా మాత్రమే సాధ్యం. ధ్రువాల్ని ఒకదానిబదులు మరొకదాన్ని పెట్టడంద్వారా దాన్ని సాధించలేరు.

ఇది మరీ సాధారణీకరణగా కన్పించవచ్చు. కాని కాదు. పీడక పీడిత వైరుధ్య పరిష్కారంలో నిజంగానే పెత్తందారీ వర్గంగా పీడకులు అదృశ్యం కావడం అనేది వుంది. అయితే, మునుపటి పీడితులైనవాళ్ళు పీడకులమీద పరిమితులు విధిస్తారు. అలా అయితేనే పీడకులు మళ్ళీ తలెత్తకుండా పడివుంటారు. అలా అని ఆ పరిమితులు పీడన కిందికి రావు. ఏ చర్య అయినా, యితరులు పూర్ణమానవత్వం సంతరించుకోకుండా అడ్డగించినపుడే పీడక చర్య అవుతుంది. ఆ రకంగా చూస్తే అవసరార్థం విధించే యీ పరిమితులు వాటికిగా అవే, నిన్నటి పీడితులు యివాళ పీడకులు అయినట్టు చెయ్యవు. పీడక పాలన

మళ్ళీ ఒళ్ళు విదిలించుకుని లేవకుండా చేసే చర్యలు వుంటాయి. అలాంటి చర్యల్ని పీడక వ్యవస్థను సృష్టించి నిలబెట్టే చర్యలతో పోల్చలేం. అధిక శాతం మానవాళి మానవీకరణం చెందకుండా కొద్దిమంది స్త్రీలో, పురుషులో చేసే చర్యలతో వాటిని పోల్చలేం.

ఏమైనా, యీ నూతన వ్యవస్థ పెత్తందారీ "నిరంకుశాధికార వ్యవస్థ[9]"గా ఘనీభవించిందంటే మరుక్షణం పోరాటంలో వుండాల్సిన మానవత్వపూరిత పార్శ్వం అంతరిస్తుంది. యిక విమోచన గురించి మాట్లాడ్డం సాధ్యమే కాదు. అంచేతనే పీడక – పీడిత వైరుధ్యానికి ప్రామాణిక పరిష్కారం, అటూ యిటూ స్థానాల బదలాయింపు కాదని మనం నొక్కిచెప్తాము. ఒక ధ్రువం నుంచి మరో ధ్రువం వైపు కదలడంవల్లనే జరగదు. అది పూర్వపు పీడకుల స్థానంలో కొత్తవాళ్ళని నిలబెట్టడం ద్వారానూ జరగదు. వీళ్ళు పీడితుల్ని అణచిపెట్టే వుంచుతారు. మళ్ళీ అన్నీ విమోచన పేరుతోనే జరిపిస్తారు.

కాని నూతన పరిస్థితులవల్ల యీ వైరుధ్యం సర్వసంపూర్ణంగా పరిష్కారం అయినా, పూర్వపు పీడకులు తాము విమోచన చెందాము అని భావించరు. అందుకు విరుద్ధంగా తాము పీడితులమయ్యామని నిజంగానే అనుకుంటూ వుంటారు. ఇతరుల్ని పీడించివుంచడం వాళ్ళకి అలవాటు. దాంతో తాము పూర్వం వున్న స్థితికి భిన్నమైంది యేది కనిపించినా వాళ్ళకి పీడితులైపోయనట్లే లెక్క. పూర్వం అయితే వాళ్ళు శుభ్రంగా తినేవారు, షోకు చేసుకునేవారు, పాదరక్షలు వేసుకునేవారు, చదువుకొనే వారు, విహరించేవాళ్ళు, బెథోవిన్ సంగీతం వినేవాళ్ళు, అటుపక్క లక్షలాది జనసామాన్యం కడుపు మాడి ఏడుస్తూ వుండేవారు, ఒంటిమీద నూలుపోగు వుండేది కాదు, కాళ్ళకు చెప్పులు వుండేవి కాదు, చదువూ లేదు సంధ్యా లేదు, విహారం మాట సరేసరి, యిక సంగీతమా సాహిత్యమా – అన్నీ హుళక్కి – సమాజ హక్కుల పేరుతో యిలాంటి జీవన విధానం మీద ఏ పరిమితులు వచ్చిపడ్డా పూర్వపు పీడకులకు వ్యక్తిగత హక్కులు మొదలంటా నరుక్కుపోయాయేమోననే ఏడుపు. లక్షలాది జనం తిండికి మాడి, వ్యధ, ఆర్తి, బాధ, నిరాశ నిస్పృహలకు గురై, తనువులు చాలించవచ్చు. కానీ పీడకుల దృష్టిలో 'మానవాళి' అంటే తామేనని అర్థం, మిగతా జనం అంతా 'సరుకులు.' పీడకులకు ఒక్క హక్కు మాత్రమే ఉనికిలో వుంటుంది. తాము కడుపులో చల్లకదలకుండా బతకగల హక్కు. పీడితులకు సంబంధించి అసలు ఆ హక్కుల గుర్తింపే ఉండదు. వూరికే బతికితే చాలు. ఈ హక్కేనా ఎందుకు యిస్తారూ అంటే పీడితులు బతికి వుండడం తమ మనుగడకు ముఖ్యం.

ఈ తరహా ప్రవర్తన, యీ రకం ప్రాపంచిక దృక్పథం, ప్రజల గురించి ఇలాటి అవగాహన (ఇది పీడకులు కొత్తపాలన రాకుండా ప్రతిఘటించేటట్టు తప్పనిసరిగా చేస్తుంది) ఒక పెత్తందారీ వర్గంగా వాళ్ళ అనుభవంవల్ల తెలియవస్తుంది. హింస, పీడన పరిస్థితి ఒకసారంటూ స్థాపితమైతే, ఆ సుడిలో యిరుకున్నవాళ్ళందరికీ ఒక జీవిత విధానాన్ని, ప్రవర్తనను అది కల్పిస్తుంది– పీడకులూ పీడితులూ కూడా ఒక మాదిరిగానే యీ పరిస్థితిలో మునిగిపోతారు, ఉభయులపై పీడన గుర్తులు పడతాయి. పీడక జీవిత పరిస్థితుల్ని విశ్లేషిస్తేగనక, వాటి పుట్టుక హింసాయుత చర్యల్లో వుందని వెల్లడవుతుంది – అధికారం వున్నవాళ్లు దీనికి కొబ్బరికాయ కొడతారు. ఈ హింసను, పీడకులు ఒక తరం నుంచి యింకోతరానికి అలా అలా నీళ్లు పోసి పెంచుతూనే వుంటారు. వాళ్ళు దానికి వారసులవుతారు, వాళ్ళు  కలిగివుండాలనే వాతావరణంలో రూపొందుతారు. ఈ మనుషుల్ని, ప్రపంచాన్ని ప్రత్యక్ష నిర్దిష్ట, పాదార్థిక యాజమాన్యంగా కాకుండా మరొకలా పీడకుడి చైతన్యం అర్థం చేసుకోలేదు. అసలు మనుగడ సాగించలేదు. ఈ వాతావరణం పీడకునిలో బలమైన  ఆస్తి కాంక్షను కలిగిస్తుంది. ఈ ఆస్తి భావన ప్రపంచంలో ప్రతిదీ స్వంతం చేసుకోవాలనే స్వాధీన వాంఛగానే వుంటుంది. ఈ చైతన్యం గురించి ఎరిక్ ఫ్రామ్ ఒక మాట అన్నాడు. యీ ఆస్తిభావన లేకపోతే "ప్రపంచంతో అది తన సంబంధాన్ని పోగొట్టుకుంటుంది." పీడక దృక్పథం తన చుట్టూ వున్న ప్రతిదాన్ని తన ఆధిపత్యం కింద వుండాల్సిన వస్తువుగానే చూస్తుంది. ఈ భూమి, ఆస్తి, ఉత్పత్తి, ప్రజలు, సృష్టించిన సమస్తం, అసలు మొత్తంగా ప్రజలు కాలం– అన్నీ తమయిష్టారాజ్యంగా వాడుకోగల వస్తువు స్థాయికి కుదించుతుంది.

పీడకులకు అన్నీ తమ స్వాధీనం చేసుకోవాలని, అపరిమితమైన ఆత్రుత. ప్రతిదాన్ని తమ కొనుగోలుశక్తికి లక్ష్యాలుగా మార్చేసుకోవడం సాధ్యం అన్న నమ్మకం వాళ్ళు పెంచుకుంటారు. అంచేతనే వాళ్ళకి మనుగడ అంటే ఒక సరుకులానే కనిపిస్తుంది. డబ్బే అన్నింటికీ కొలమానం. లాభమే ప్రాథమిక గమ్యం. పీడకులకు, యోగ్యమైందల్లా ఏమిటంటే యింకా కూడబెట్టుకోవాలి అనేదే – ఎప్పటికీ యింకా యింకా–పీడితులకు తక్కువగా వున్నా, అసలు ఏమీ లేకపోయినా సరే, పీడకులు మనుగడ అంటే ఎక్కువ కలిగి వుండడం "అనే ఉన్నవాళ్ళ" వర్గంగా మనడమే.

పీడక పరిస్థితివల్ల లాభం పొందేది వాళ్లే. అంచేత, ప్రతిదీ కలిగి వుండడమే మనుగడకు నిబంధన అయినప్పుడు యీ నిబంధన యావన్మంది స్త్రీ పురుషులకూ వర్తించాలి కదా అన్న విషయాన్ని స్వీకరించలేదు. అందుకనే వాళ్ళ ఔదార్యం దగా.

మానవాళి ఒక "సరుకు." అంచేత వాళ్లు తమ హక్కుభుక్తంగా, వారసత్వంగా సంక్రమించిన ఆస్తిగా, దాన్ని కలిగి వుండాలి.

పీడక చైతన్యానికి "యితరుల్ని" ప్రజల్ని మానవీకరించడం సర్వమానవాళి కర్తవ్యంగా కనపడదు, వినాశకర చర్యగా కనిపిస్తుంది. మరింత కలిగి వుండడం తమ గుత్తహక్కుగా భావించే ధోరణి ఇతరులనూ, తమనూ కూడా అమానవీకరణకు గురి చేస్తోందనే విషయం పీడకులు గుర్తించరు. ఆస్తిపరవర్తంగా వుండాలనే అహంభావ పూరిత లక్ష్యంతో వారు తమకు వున్నదాంట్లో తమే ఉక్కిరిబిక్కిరి అయితారు. యిక ఎంత మాత్రమూ అస్తిత్వంలో లేమనీ వాళ్ళు చూడలేరు. వూరికే వాళ్ళకి "ఉంది", అంతే. వాళ్ళకి సంబంధించి మరింత కలిగి వుండడం రద్దు చేయలేని ఒక హక్కు. ఆ హక్కును వాళ్ళు తమ ప్రయత్నం ద్వారా సాధించుకున్నారు. "ఆపదల్ని ఎదిరించగల ధైర్యంతో" సాధించుకున్నారు. యితరులకు ఎందుకు ఎక్కువ లేదంటే వాళ్ళు అసమర్థులు, సోమరిపోతులు. పరమదరిద్రమైంది. యింకా ఏమిటంటే– పెత్తందారీవర్గం చూపించే ఔదార్యభరిత సంజ్ఞలపట్ల క్షంతవ్యంకాని కృతఘ్నత. పీడితులు 'కృతఘ్నులు", "అసూయాపరులు" కావడంవల్లన వాళ్ళని కొంపకు అగ్గిపెట్టే శత్రువులుగా చూడ్డం. అంచేత వాళ్ళని ఓ కంట కనిపెట్టి వుండాలి అనుకోవడం.

నిజమే, వారి దృష్టి యింతకంటే మరోలా వుండదు మరి. పీడితుల్ని మానవీకరించడం విధ్వంసక చర్యే అనుకున్నప్పుడు, వాళ్ళ స్వేచ్ఛా అంతే. అందుచేతనే రెప్ప కదల్చకుండా ఆంక్షలు పెట్టడం. పీడకులు పీడితుల్ని ఎంతలా గిరిగీసి బద్దీల్లో పెడితే, అంతలా నిర్జీవ "సరుకులు"గా మారుస్తున్నారన్నమాట! తనకి తటస్థపడిన ప్రతిదాన్ని, ప్రతిమనిషినీ జీవరహితం చేయాలన్న పీడకుల ధోరణి. అన్నిటినీ హక్కు భుక్తం చేసుకోవాలన్న ఆత్రుత నిస్సందేహంగా పరపీడనానందం అవుతుంది.

"పరపీడనానందంలో సారాంశం యితరులమీద (లేదా మరో సజీవమైన దానిమీద) పూర్తి ఆధిపత్యంతో సాధించే సంతోషమే. ఇదే భావాన్ని మరోరకంగా చెప్పాలీ అంటే పరపీడనానందపు గమ్యం మనిషిని సరుకుగా మార్చడం, సజీవంగా వున్నదాన్ని నిర్జీవం చేయడం. సంపూర్ణ నియంత్రణవల్ల జీవంతో తొణికిసలాడేది స్వేచ్ఛ ఒక ముఖ్యమైన జీవిత గుణాన్ని పోగొట్టుకుంటుంది–[10]" పరపీడనానందంలా ప్రేమ భష్టరూపం అది – మృత్యువుపట్ల ప్రేమ, జీవితం పట్ల కాదు. పీడకుల చైతన్యంలో వున్న ఒక విశిష్ట అంశం, వాళ్ళ మరణసదృశ ప్రపంచ దృక్పథం. ఆ రకంగా పరపీడనానందమే అవుతుంది. పీడక దృష్టి తన ఆధిపత్యం నిలబెట్టుకోవాలని చూస్తుంది. జీవిత శోధన ప్రేరణని,

అశాంతిని, సృజనాత్మకశక్తిని పక్కకు మళ్ళించే ప్రయత్నం చేస్తుంది. అది జీవితాన్నే చంపేస్తుంది. ఈ ప్రయోజనం కోసం శాస్త్ర సాంకేతిక జ్ఞానాల్ని పీడకులు నిస్సందేహంగా బలమైన ఆయుధాలుగా యింకా యింకా ఎక్కువ వాడుకుంటున్నారు. ఈ పీడక వ్యవస్థను కుయుక్తులతో, అణచివేతతో అలా నిలబెట్టి వుంచేందుకని[11]. పీడితులకు, "సరుకులు"గా వేరే ప్రయోజనాలు ఏమీ లేవు, పీడకులు శాసించి పెట్టినవి తప్ప.

ప్రస్తావించుకున్న యీ నేపథ్యంలో, ప్రాముఖ్యం వున్న మరో తిరుగులేని విషయం తలెత్తుతుంది; కొంతమంది పీడకవర్గీయులు విమోచనా పోరాటంలో పీడితుల పక్కన చేరడమే ఆ వాస్తవం. ఆ రకంగా వైరుధ్యంలోని ఒక ధ్రువం నుంచి మరో ధ్రువానికి కదలడం. వాళ్ళది మౌలికపాత్ర. ఈ పోరాటంలో చరిత్ర ప్రథమం నుంచీ అలాగే వుందది. అయితే వాళ్ళు దోపిడిదార్లుగా వుండడం అనేది పోవచ్చు. మౌన ప్రేక్షకులుగా వుండడం అనేది పోవచ్చు. ఒట్టినే దోపిడీ వారసులుగా వుండకుండా పీడితుల పక్షంలో వచ్చి చేరవచ్చు. కాని, వాళ్ళతోబాటు పుట్టుకతోవచ్చిన చిహ్నాల్ని తెచ్చుకుంటారు. అవి ఏమిటంటే– వాళ్ళ దురభిప్రాయాలు, వక్రీకృత భావాలు వీటిలో ప్రజల ఆలోచనా సామర్థ్యాలపట్ల విశ్వాసం లేకపోవడం, వాళ్ళు కోరుకున్న వాటిపట్ల, తెలుసుకోవాలనే కోరికపట్ల విశ్వాసం లేకపోవడం జరుగుతుంది. ఆ రకంగా ప్రజల వైపు వచ్చిన వీరిలో ఎప్పుడు కొన్ని జాడ్యాలు తలెత్తే ప్రమాదం వుంటూనే వుంటుంది. వాళ్లు ఒకరకం ఔదార్యానికి లోనయ్యే ప్రమాదం వుంది. అది పీడకుల ఔదార్యంలానే అంతగానూ హానికరమైంది. పీడకుల ఔదార్యం ఒక అన్యాయపూరిత వ్యవస్థ నుంచి పుట్టుకొచ్చింది. ఆ వ్యవస్థను ఆ ఔదార్య సమర్థన కోసమైనా నిలబెట్టి వుంచాలి. మన పరివర్తకులు అలాగాక నిజంగా యీ అన్యాయ పూరిత వ్యవస్థను మార్చాలనే అనుకుంటారు. కాని, వాళ్ళ నేపథ్యంవల్ల తామే యీ పరివర్తన నిర్వహించాల్సినవాళ్ళని అనుకుంటారు. ప్రజల గురించే మాట్లాడతారు. కాని వాళ్ళని నమ్మరు. మరి ప్రజల మీద విశ్వాసం వుంచడం అనేదే విప్లవాత్మక పరిణామానికి ముఖ్యమైంది. అసలైన మానవతావాది ప్రజలపట్ల విశ్వాసంతో వుంటాడు. విశ్వాసం లేకుండా సవాలక్ష పనులు చేసేదానికంటే ఈ విశ్వాసమే అతన్ని పోరాటంలో నిమగ్నం చేస్తుంది.

ప్రజలకే నిర్ద్వంద్వంగా అంకితం అయినవాళ్ళు ఒకటికి రెండుసార్లు తమని తాము పునఃపరిశీలించుకోవాలి. ఇలాంటి మార్పు ఎంత మౌలికంగా వుండాలంటే యిక అందులో యిక ఎంతమాత్రమూ అస్పష్టత తొంగిచూడదు. ఈ నిమగ్నతను ధృవపరుస్తూ వున్నప్పటికీ విప్లవాత్మక వివేకానికి తానే యజమాని అయినట్టు భావించడం అప్పుడు

దాన్ని ప్రజలకు అందించడంగా (లేదా రుద్దడం) అంటే పాతపద్ధతుల్ని నిలబెట్టి వుంచుకోవడం కిందే లెక్క. విమోచనకు అంకితం అవుతున్నాం అని చాటుకునే స్త్రీగాని, పురుషుడుగాని, ప్రజలతో మమేకమై మాట్లాడ లేకపోయినట్లయితే, వాళ్ళని యింకా అజ్ఞానులుగా పరిగణించేటట్టే వుంటే వాళ్ళు ఘోరంగా ఆత్మవంచన చేసుకుంటూ వున్నట్టే. ప్రజల పక్షానికి మారినవారెవరైనా వాళ్ళు వేసే అడుగడుక్కీ బెదిరిపోయేవాడు, వాళ్ళు వెల్లడి చేసే ప్రతి సందేహానికీ కంగారుపడిపోయేవాడు, వాళ్ళు చేసే ప్రతి సూచనకీ భీతిల్లేవాడు, తన "హోదా"ని రుద్దచూసేవాడు, తన మూలాలను పట్టుకు వ్రేల్లాడుతున్నటే.

ప్రజలకే అంకితం కావాలీ అంటే సమూలంగా పునర్జన్మమెత్తినట్టు వుండాలి. ఇలా పరివర్తన చెందినవాళ్ళు నూతన మనుగడ రూపం ధరిస్తారు. పూర్వం వున్నట్టుగా యిక వుండలేరు. యిలా పరివర్తన చెంది వచ్చినవాళ్ళు వాళ్ళ పీడితులతో హృదయస్థితమైన సాహచర్యంతో వున్నప్పుడే బతుకుల, ప్రవర్తన విశేష పద్ధతుల్ని తెలుసుకోగలుగుతారు, అవి విభిన్న క్షణాల్లో ఆధిపత్య నిర్మాణాన్ని ప్రతిబింబిస్తాయి. ఈ విశేష అంశాల్లో ఒకటి, యిదివరకే ముచ్చటించుకున్నట్లు పీడితుల జీవిత ద్వైధీభావం. వాళ్ళు తాముగానూ, తాము యిముడ్చుకున్న పీడకుడి ప్రతీకలాగానూ వుంటారు. ఆ రకంగా, వాళ్ళు తమ పీడకుణ్ణి నిర్దిష్టంగా, "చూసే" దాకా, యిక యిటు తమ సొంత చైతన్యాన్ని గుర్తించే దాకా, వాళ్ళు తమ పరిస్థితి గురించి కర్మ, విధి, అనివార్యంవంటి వైఖరుల్నే దాదాపు సర్వదా వెల్లడిచేస్తూ వుంటారు.

తను పరాధీనుణ్ణి అని గుర్తించినపుడు, ఆ పరాధీనతను జయించుకువచ్చే గుండెధైర్యాన్ని రైతు పొందడం ప్రారంభమవుతుంది. అప్పటిదాకా, అతను పెత్తందారుతోబాటే నడుస్తూ, "నేనేం చేయగలను? ఒట్టి రైతుని కదా!" అంటూ వుంటాడు.[12]

ఊరికే పైపైనే విశ్లేషిస్తేగనక, యీ కర్మసిద్ధాంతాన్ని ఒకోసారి మెతకదనంగా వ్యాఖ్యానించు కోవచ్చు. అది జాతీయ స్వభావలక్షణంగామారుతుంది. మెతకదనం ముసుగులో వున్న విధివాదం ఒక చారిత్రక, సామాజిక పరిస్థితి ఫలితంగా వచ్చినటువంటిది. అదేమీ ప్రజల ప్రవర్తనలో అవశ్యక లక్షణం కాదు. ఇది ఎప్పుడూ రాత, విధి, అదృష్టం అనే వాటి శక్తికి అనుసంధించుకునే వుంటుంది. తప్పించలేని శక్తులు యివి – లేదా భగవంతుడి గురించిన వక్రీకత దృక్పథానికి అనుసంధించుకుని వుంటుంది. మాయామర్మాల స్వైరవిహారం కింద వున్నప్పుడు పీడితుడు (ముఖ్యంగా రైతులు–వాళ్ళు దాదాపు ప్రకృతిలో మునిగిపోయి వుంటారు)[13] దోపిడీ ఫలితంగా వచ్చినవాళ్ళ వ్యధల్ని దేవుడి సంకల్పంగా భావిస్తారు, అక్కడికి దేవుడే యీ "వ్యవస్థిత అవ్యవస్థకు" సృష్టికర్త అయినట్టు.

వాస్తవ పరిస్థితిలో కూరుకుపోయి వుంటారు పీడితులు. అంచేత వాళ్ళు యీ "వ్యవస్థ"ను స్పష్టంగా దర్శించలేరు. ఇది పీడకుల ప్రయోజనాలకు వూడిగం చేస్తుంది. ఆ పీడకుడి మూర్తిని పీడితులు తమలో నింపుకున్నారు. ఈ వ్యవస్థ పరిమితులు పెడుతుంది, వాటి ఒరిపిడి కింద వాళ్ళు కీలకమైన సమాంతర హింసను ప్రదర్శిస్తారు. పరమ చిల్లర కారణాలకుగాను తమ తోటి సహచరుల మీద విరుచుకుపడతారు.

వలసపాలైన మనిషి మొదట యీ ఉగ్రత్వాన్ని తన తోడివాళ్ళ మీదే ప్రదర్శిస్తాడు. ఆ ఉగ్రత్వం అతని శల్యస్థమైపోయింది. నీగ్రోలు ఒకరినొకరు చావగొట్టుకునే దశ యిదే. ఉత్తర ఆఫ్రికాలో సంభమాశ్చర్యజనకమైన నేరాల పరంపర ఎదురైనప్పుడు ఎటువైపు ఎలా మొగ్గాలో పోలీసులకీ, మేజిస్ట్రేట్‌లకీ అర్థం కాలేదు... కొత్తగా వచ్చి స్థిరపడ్డవాడికీ లేదా పోలీసుకీ స్థానికుల్ని బాదడానికి హక్కు ఎంతకాలం వుంటుంది, అతన్ని అవమానించి, పాదక్రాంతుణ్ణి చేసుకునే హక్కు ఎంతకాలం వుంటుంది? అయితే, యీ స్థానికుడు మరో తోడివాడు ఏకాస్త గుర్రుగా చూసినా, ఏవగింపుగా చూసినా సర్రున కత్తి దూశేస్తాడు. ఏమంటే, స్థానికుడు చేయగలిగిన ఒకే ఒక్కపని తనతోడివాడి నుంచి తన వ్యక్తిత్వాన్ని కాపాడుకోవడం మాత్రమే.[14]

ఇలాంటి ప్రవర్తనలో వాళ్ళు మరోసారి తమ ద్వైధీభావాన్ని వెల్లడి చేసుకునే అవకాశం వుంది. అణగారిన సహచరుల్లో పీడకుడు వున్నాడుగా మరి? తోడివాళ్ళ మీద కాలు దువ్వుతున్నామూ అంటే పరోక్షంగా పీడకుడి మీదా కాలు దువ్వుతున్నట్టేకదా!

మరోవైపున తమ అస్తిత్వపు అనుభవంలో ఒకానొక దశలో పీడితులు పీడకులపట్లా వాళ్ళ జీవిత విధానంపట్లా నిగ్రహించుకోలేని ఆకర్షణ పొందుతారు. ఈ జీవన విధానంలో పాలు పంచుకోవాలన్న కాంక్ష వాళ్ళను ముంచెత్తేస్తుంది. పీడితులు పరాయీకరణ చెంది వుంటారు. దాంతో ఏదిఏమైనా పీడకులను పోలి వుండాలనుకుంటారు. వాళ్ళని అనుకరించాలనుకుంటారు. అనుసరించాలని అనుకుంటారు. ఈ బాపతు ధోరణి మరీ ఎక్కువగా మధ్యతరగతికి చెందిన పీడితుల్లో వుంటుంది. వాళ్ళు "ప్రముఖ" పైతరగతి స్త్రీ, పురుషులతో సమాన ఫాయీలో వుండాలని ఒకటే తపన పడుతూ వుంటారు. ఆల్బర్ట్ మెమ్మి వలసపోయిన మనస్తత్వం గురించి భేషైన విశ్లేషణ చేశాడు. వలస పోయినవాళ్ళపట్ల తన వ్యాఖ్యానాన్ని ప్రస్తావిస్తూ "తీవ్రమైన కాంక్షాపూరిత" ఆకర్షణ వాళ్ళపట్ల వుంటుందని అంటాడు.

వలసలో లొంగదీసుకున్న గుంపుల్ని తడవతడవకీ తుపాకీతో కాల్చగలిగే వలసదారు తన పనివాళ్ళని ఎలా చూడగలడు? వలసకు లొంగినవాడు తనని తాను అంత క్రూరంగా కాదనుకోగలుగుతున్నారు. అలాంటి విపరీతమైన కోరికల్ని ముందుపెట్టగలడు? వలసవాదుల్ని ఏవగించుకుంటూ అంత కాంక్షా పూరితంగా మెచ్చికోళ్ళు చూపించగలడు? (నాకు కూడా తెలియకుండానే యిలాంటి మెచ్చికోలు వుండేది).[15]

పీడితులకు వుండే మరో లక్షణం ఆత్మనింద – తన గురించి పీడకులు అనుకునేదాన్ని స్వీయగతం చేసుకోవడంవల్ల వచ్చినటువంటిది. తాము దమ్మిడీకి కొరగానివాళ్ళమని పదేపదే వాళ్ళు అంటూ వుండడం వింటారు. ఏమీ తెలీదనీ, దేన్నీ నేర్చుకోరనీ – మడ్డిమనుషులు, సోమరిపోతులు, దేనికీ పనికిరారు – అని అంటూ వుండడం పదేపదే వింటారు. దాంతో ఆఖరికి అది నిజమే నేమోనని తామూ అనుకుంటారు.

రైతు యజమానికి లోకువ. ఏమంటే, అన్నీ తెలిసినవాడు యజమానే, అతనే చక్రం తిప్పగలడు.[16]

తాము అజ్ఞానులమనీ, 'ప్రొఫెసర్'కే జ్ఞానం వుందనీ, అతను చెప్పింది తాము వినాలనీ అనుకుంటారు. జ్ఞాన ప్రమాణాలు ఏమిటో అనూచానంగా వీళ్ళ రుద్దినటువంటుదిదే. "ఎందుకని బొమ్మల్ని గురించి ముందు వివరించరు? అలా అయితే తక్కువ సమయం సరిపోతుంది, మాకు తలనొప్పి తప్పుతుంది" అని ఒక రైతు సాంస్కృతిక బృందంలో[17] పాల్గొంటూ అన్నాడు.

తమకు కూడా "విషయాలు తెలుసు', యితరులతో వ్యవహరించేటప్పుడు తాము తెలుసుకున్నాము అన్నదాన్ని వాళ్ళెన్నడు గుర్తించరు. ద్వైధీభావం వాళ్ళకి కలిగించిన పరిస్థితుల్లో, వాళ్ళు తమని తాము విశ్వసించలేకపోవడం సహజమే.

విద్యా పథకాల్లో రైతులు విజ్ఞానదాయక అంశాల్ని అనేకసార్లు మంచి సరదాగా చర్చించడం ప్రారంభిస్తారు, వున్నట్టుండి ఉపాధ్యాయునితో అంటారు, "అయ్యా, మన్నించండి మేము గమ్మునుండాలి, మీరు చెప్పాలి. మీరు తెలిసినవారు, మేం బడుద్ధాయిలం." తమకీ, పశువులకీ తేడా లేదని ఎన్నిసార్లో అంటూ వుంటారు. తేడా వుందని ఒప్పుకున్నా అది ఎక్కువగా జంతువులవైపే మొగ్గుతూ వుంటుంది. "అని మా కంటే స్వేచ్ఛకలవి." అన్నట్లు చెబుతారు.

పీడక పరిస్థితిలో తొలిమార్పులు రాగానే యీ ఆత్మనిందా మారుతుందన్నది గమనించాల్సిన అంశం. ఒక రైతు నాయకుడు ఒక అసెంటామిమెంటో'' (asentamiento)[18] సభలో అన్నాడు:" మేం సోమరిపోతులం, తాగుబోతులం కాబట్టి ఉత్పాదకత లేనివాళ్ళమని వాళ్ళు అంటూ వుండేవారు. ఇప్పుడు మమ్మల్ని మనుషులుగా గౌరవిస్తున్నారు కాబట్టి, మేం తాగుబోతులమూ కాదు, సోమరిపోతులమూ కాదని ప్రతి ఒక్కరికీ తెలియచెప్పాలనుకుంటున్నాం. మేము పీడితులం."

సందిగ్ధత వున్నంతకాలం, పీడితులు ప్రతిఘటించడానికి యిష్టపడరు, తమ మీద తమకే నమ్మకం కలగదు. పీడకుడి కవచం అభేద్యమనీ, అతని శక్తి అమోఘమనీ ఏదో యాంత్రిక నమ్మకంతో వుంటారు వాళ్ళు.[19] భూస్వామి అధికారానికి వున్న మహిమాన్విత శక్తికి గ్రామీణ ప్రాంతంలో మరీ పట్టు ఎక్కువ. మా మిత్రుడొకతను సామాజిక శాస్త్రవేత్త. ఆయన నాకు చెప్పిన విషయం యిది! కొందరు సాయుధ రైతులు ఒక లాటిన్ అమెరికా దేశంలో ఒక జమిందారీని స్వాధీనం చేసుకున్నారు. వాళ్ళు వ్యూహాత్మక కారణాల దృష్ట్యా భూస్వామిని బందీగా పెట్టుకోవాలనుకున్నారు. కాని, ఒక్క రైతుకు కూడా ఆ భూస్వామికి కాపలా కాసే ధైర్యం లేకపోయింది. అసలు అతని దగ్గర వుండటమే వణుకుపుట్టించేసింది. యజమానిని ప్రతిఘటించడమంటే ఏదో అపరాధం అనే భావాన్ని కలిగి వుండొచ్చు నిజం చెప్పాలంటే– ఆ యజమాని వాళ్ళ "లోపలే" వున్నాడు మరి!

పీడకుడిని దెబ్బతీయవచ్చుననే దానికి ఉదాహరణలు పీడితులు చూడాలి. అప్పుడే ఆ స్థానంలో అతన్ని దెబ్బ తీయాలంటే నమ్మకం అతనిలో మొగ్గ తొడుగుతుంది. ఇది జరగనంత కాలం వాళ్ళకి ధైర్యం చిక్కదు, భయకంపితులవుతూ వుంటారు. దెబ్బలు తింటూ వుంటారు[20] తమ పరిస్థితి అలా వుండడానికి కారణాలేమిటో తెలియనంతకాలం, వాళ్ళు ఆ దోపిడీని తలరాతగా "ఒప్పేసు"కుంటూ వుంటారు. అంతేకాదు, తమ స్వేచ్ఛకీ వ్యక్తిత్వ స్థాపనకీ పోరాటం చేయవలసిన అవసరం తటస్థపడినపుడు స్తబ్ధుగా, పరాయీకరణ బాట చేపడతారు. ఏమైన మెల్లమెల్లగా వాళ్ళు తిరుగుబాటు కార్యాచరణ రూపాలను విమోచన కోసం కృషి చేసే తరుణంలో వాళ్ళలోని యీ స్తబ్ధగుణాన్ని మరిచిపోకూడదు, జాగృత క్షణాన్ని విస్మరించకూడదు.

పీడితులకి తమ గురించీ, ప్రపంచం గురించీ అప్రామాణిక దృక్పథం వుంటుంది. అందులో భాగంగానే వాళ్ళు తామంతా పీడకుడి వస్తువులం అని అనుకుంటూ వుంటారు. ఇక పీడకుడికి మనడం అంటే కలిగి వుండడం. ఏమీలేని కటిక నిర్భాగ్యులని పణంగా

పెట్టి తను యిలా వుండడమే జరుగుతుంది. ఇక పీడితులకు సంబంధించి, తమ మనుగడలోని ఒక బిందువు దగ్గర మనడం అంటే పీడకునిలా వుండకపోవడం, కాని అతని కింద వుండడం, అతని మీద ఆధారపడడం. ఆ రకంగా పీడితులు మానసిక ఉద్విగ్నతదృష్ట్యా పరాధీనలుగా వుంటారు.

రైతు పరాధీనుడు. తనకేంకావాలో తనే చెప్పలేడు. తన పరాధీనతను గుర్తించే లోపలే వేదన పడతాడు. అక్కసంతా యింటి దగ్గర వెళ్ళగక్కుతాడు. పిల్లల మీద కేకలేస్తాడు, వాళ్ళని కొడతాడు, నిరాశపడతాడు. పెళ్ళాంమీద నిష్ఠురపడతాడు, అన్నీ భీతావహంగా వున్నాయనుకుంటాడు. అయితే యజమాని మీద ఆవేశపడడు, మరి యజమాని తనకంటే అధికుడు కదా! ఇక ఎన్నోసార్లు. తన దుఃఖాన్ని తాగుడు ద్వారా వెలిబుచ్చాలనుకుంటాడు.[21]

పీడితుడు యిలా మానసికంగా దాసోహంగా తయారవుతాడు. దీన్ని ఫ్రామ్ మృత ప్రాయమైన ప్రవర్తన అన్నాడు. ఆత్మవినాశం, తోటి పీడితులను నాశనం చేయడం దాని లక్షణం.

పీడితులు పీడకుల గుణం ఎరిగి, తమ విమోచన కోసం పోరాటంలో నిమగ్నం అయినపుడు మాత్రమే వాళ్ళు తమని తాము విశ్వసించడం మొదలుపెడతారు. ఈ తెలుసుకోవడం కేవలం మేధోవ్యాపారం కాదు, క్రియకు నడుం బిగించేటట్టు చేయాలి. అలా అని దాన్ని వట్టి క్రియాశీలతకే పరిమితం చేయకూడదు. లోతైన చింతనా యిందులో వుండాలి. అప్పుడు మాత్రమే అది కార్యాచరణ అవుతుంది.

కార్యాచరణకు ముందు సవిమర్శక, విమోచనాత్మక చర్చ వుండాలి. దాన్ని విమోచన పోరాటం ఏ దశలోనైనా పీడితులలో నిర్వహించాలి.[22] ఆయా నిర్దిష్ట చారిత్రక పరిస్థితుల్నిబట్టి, యదార్థాన్ని పీడితులు గుర్తించే స్థాయినిబట్టి ఆ చర్చ సారం మారగలదు, మారాలి కూడా. ఇలా కాకుండా ఏకపక్ష ఆలోచన, నినాదాలు, సంభాషణాత్మక చర్యలకు బదులుగా ప్రకటనలు తెచ్చిపెట్టడం అంటే అది మచ్చిక పద్ధతిలో పీడితుణ్ణి విముక్తి చేసే యత్నం అవుతుంది. విమోచనాక్రియలో పీడితుల చింతనాయుత భాగస్వామ్యం లేనట్లయితే అది వాళ్ళని వస్తువులుగా పరిగణించడమే అవుతుంది. ఇల్లు తగలబడి పోతూ వుంటే కాపాడాల్సిన వస్తువులుగా చూడ్డం అవుతుంది. ఇది వాళ్ళని జనాకర్షక గండంలోకి తోస్తుంది, చిత్తం వచ్చినట్టు ఆడించుకోగల ప్రజాసమూహంగా వాళ్ళని మారుస్తుంది.

విమోచనా పోరాటం అన్ని దశల్లోనూ, మరింత సంపూర్ణంగా మానవత్వ లక్షణాలను సంతరించుకుందుకు అస్తిత్వపూరిత, చారిత్రక కర్తవ్యంలో తాము నిమగ్నం

అయి వున్నాయని ఆ స్త్రీలు, పురుషులుతాముగా తెలుసుకోవాలి. మానవత్వ అంశాన్ని దాని చారిత్రక రూపాలనుంచి ద్వైదీకరణం కావించే తప్పుయత్నం చేయనంతకాలం చింతనా, కార్యాచరణా తప్పనిసరి అవుతాయి.

పీడితులు తాము వున్న నిర్దిష్ట పరిస్థితి గురించి ఆలోచన చేయాలి అని నొక్కి చెపుతున్నామంటే అర్థం పడకకుర్చీ విప్లవం అనికాదు. అందుకు పూర్తి భిన్నంగా ఆలోచన–అసలైన ఆలోచన కార్యాచరణకు నడిపిస్తుంది.

మరో పక్క, పరిస్థితి కార్యాచరణకు సన్నద్ధం కమ్మని చెపుతూ వున్నప్పుడు, ఆ కార్యాచరణ ఫలితాలు సహేతుక చింతనకు దారితీస్తేనే అది ప్రామాణిక ఆచరణయుత కార్యకలాపం అవుతుంది. ఈ అర్థంలో ఒట్టి సిద్ధాంతం కాని ఆచరణ పీడితులకు నూతన స్థితి హేతువు అవుతుంది. ఇక విప్లవం యీ హేతువు చారిత్రక క్షణానికి శ్రీకారం చుడుతుంది. అది ఆనుషంగికంగా వాళ్ళ చైతన్యయుత నిమగ్నత నుంచి విడిగా వుండలేదు. లేనట్లయితే కార్యాచరణ ఒట్టి క్రియాశీలతే అవుతుంది.

ఏమైనా ఈ కార్యాచరణను సాధించడానికి పీడితుల్ని, వాళ్ళ ప్రతిభసామర్థ్యాన్ని విశ్వసించి తీరాలి. ఈ విశ్వాసం కోల్పోయినవాళ్లు సంభాషణాత్మక చర్చను, చింతనను, వ్యక్తీకరణను ఆరంభించడంలో విఫలమవుతారు (లేదా పరిత్యజిస్తారు). అక్కడినుండి నినాదాలకు, విజ్ఞప్తులకు, స్వగతాలకు సూచనలకు దిగజారతారు. పైపైమొగ్గుతో విమోచనా లక్ష్యంవైపు వచ్చేవాళ్ళు యీ ప్రమాదంలో పడతారు.

పీడితుల పక్షాన రాజకీయ కార్యాచరణ అనేది బోధనాత్మక క్రియగా వుండి తీరాలి– ఆ మాటకు వున్న ప్రామాణిక అర్థంలో. అంచేత కార్యాచరణ అంటే పీడితులతో కలిసి అని అర్థం. విమోచన కోసం కృషి చేసేవాళ్ళు పీడితుల ఆవేశపూరిత పరాధీనతను అవకాశంగా తీసుకోకూడదు - యీ పరాధీనత వాళ్ళని ఆవరించుకుని ఉన్న నిర్దిష్ట పరిస్థితి నుంచి వచ్చినటువంటిది. అదే– ప్రపంచం గురించి వాళ్ళకి వున్న అప్రామాణిక దృక్పథాన్ని పుట్టిస్తోంది. వాళ్ళ పరాధీనతను వాడుకుని మరింత అధిక పరాధీనతను సృష్టించడం పీడకుల ఎత్తుగడ.

విమోచనా కార్యాచరణ యీ పరాధీనతను దుర్బల అంశంగా గుర్తించి తీరాలి. దీన్ని చింతన ద్వారా, కార్యాచరణ ద్వారా స్వాతంత్ర్యంగా మార్చాలి. ఏమైనప్పటికీ, ఎంత మహోదాత్తభరిత నాయకత్వం కూడా స్వాతంత్ర్యాన్ని ఒక కానుకగా ప్రసాదించలేదు. పీడితుల విమోచన అంటే స్త్రీ, పురుషుల విమోచన– వస్తువుల విమోచన కాదు. ఆ

రకంగా ఎవడూ తన ప్రయత్నాల ద్వారా మాత్రమే తనని విముక్తం చేసుకోలేడు, ఇతరుల వల్లా విముక్తం కాడు. విమోచన అనేది మానవ దృగ్విషయం. అసంపూర్ణ మానవులు దాన్ని సాధించలేరు. జనాన్ని సగం మనుషులుగా పరిగణించడం వాళ్ళ మానవత్వ గుణాన్ని హరించేస్తుంది. మనుషులు పీడనవల్ల మానవత్వం పోగొట్టుకున్నప్పుడు వేదన పాలవుతారు. విమోచనాక్రమం అమానవీకరణ పద్ధతుల్ని నియోగించకూడదు.

అంచేత విమోచనా కర్తవ్యంలో విప్లవ నాయకత్వం ఉపయోగించవలసిన సవ్యమైన పద్ధతి 'విమోచనా ప్రచారం' కాదు. అలా అని పీడితుల నమ్మకం పొందడానికని చెప్పి స్వేచ్ఛలో విశ్వాసాన్ని పీడితులలో పూరికే "నాటనూ" కూడదు. సవ్యమైన పద్ధతి సంభాషణాత్మక చర్చ. తాము తమ విమోచన కోసం పోరాడాలన్న పీడితుల దృఢ విశ్వాసం విప్లవ నాయకత్వం ప్రసాదించిన వరం ఏమీ కాదు. వాళ్ళ 'కాన్షైంటిజచావో" ఫలితం అది.

విప్లవ నాయకత్వం కూడా ఒక అంశాన్ని గుర్తించాలి. పోరాట ఆవశ్యకతకి సంబంధించి వాళ్ళ దృఢ విశ్వాసం కూడా (విప్లవ వివేకంలో తప్పనిసరిగా వుండవలసిన కోణం) వాళ్ళకి ఎవళ్లో దయాధర్మంగా యిచ్చింది కాదు. అది నిజమైందే. ఈ విశ్వాసాన్ని మూటగట్టి అమ్మడం కుదరదు. చింతన, కార్యాచరణ అనే వాటి మొత్తం మార్గం ద్వారా దాన్ని అందుకోవాలి. ఆ చారిత్రక సన్నివేశంలో, యదార్థ పరిస్థితిలో నాయకుడు నిమగ్నం అయినప్పుడు మాత్రమే వాళ్ళు యీ పరిస్థితిని విమర్శించేటట్టూ, దీన్ని మార్చాలని కోరుకునేటట్టూ చేస్తుంది.

ఇదే రకంగా పీడితులు (తమకి నమ్మకం కలిగేదాకా వాళ్ళు పోరాటం పట్ల నిబద్ధత చూపించలేరు, అలాంటి నిబద్ధత లేనట్లయితే, యీ పోరాటానికి విధిగా వుండాల్సిన నిబంధనను తొక్కిపెడుతున్నారన్నమాట) యీ విశ్వాసానికి కర్తలుగా చేరుకోవాలి, వస్తువులుగా కాదు. తమను ఆవరించుకుని వున్న పరిస్థితిలో సవిమర్శకంగా జోక్యం చేసుకోవాలి. ఆ పరిస్థితి వేసిన మచ్చలు వాళ్ళ మీద వున్నాయి. ప్రచారంవల్ల దీన్ని సాధించడం కుదరదు. ఈ విశ్వాసం పోరాటానికి ఆవశ్యకం (యిది లేకుండా పోరాటం నిర్వహించడం కుదరదు) అనే దృష్టి విప్లవనాయకత్వానికి తప్పనిసరి (నిజానికి యీ విశ్వాసమే ఆ నాయకత్వాన్ని అందిస్తుంది) అయినట్లే, పీడితులకీ ఆవశ్యకం. ఇది అవసరం. తీసుకురావలసిన మార్పు పీడితులతో కలిసి తేవడం అవిగాక వారికోసం తేవాలని భావిస్తే తప్ప ఈ విశ్వాసం వుండితీరాలి. ఈ రెండవ రూపమే సరైనదని నా విశ్వాసం.[23]

ఈ అంశాల్ని యిక్కడ పేర్కొనడం ఎందుకూ అంటే విప్లవానికి ప్రస్ఫుటంగా వుండాల్సిన బోధనా స్వభావాన్ని గట్టిగా చెప్పడానికి. పీడితులు తమ విమోచన కోసం పోరాటానికి అంగీకరించాలి. ఈ అంశం సుస్పష్టం. దీన్ని ప్రతి యుగంలోనూ విప్లవ నాయకులు చాటుతూనే వున్నారు. ఆ రకంగా అంతర్లీనంగా యీ పోరాటానికి వున్న బోధనా పార్శ్వాన్ని గుర్తించారు. అయినా,చాలా మంది నాయకులు (బోధనపట్ల సహజంగానే, మనం అర్థం చేసుకోగల దురభిప్రాయాలు వుండడంవల్ల కావచ్చు) పీడకులు నియోగించే “విద్యా” పద్ధతులు ఉపయోగిస్తూ వుండిపోయారు. వాళ్ళు విమోచనా క్రమంలో విద్యాపరమైన కార్యకలాపాన్ని కాదంటారు. కాని, ఒప్పించడానికి ప్రచారాన్ని వాడుకుంటారు.

మానవీకరణ కోసం పోరాటం జరగాలని ఒప్పుకున్నప్పుడు, ఆ క్షణం నుంచీ, ఆ పోరాటంలో తమ యావత్ బాధ్యతనీ కూడా ఒప్పుకోవాలని పీడితులు గుర్తించడం చాలా ముఖ్యం. వాళ్ళు ఆకలి నుంచి బయటపడేందుకు మాత్రమే తాము పోరాటం చేయడంలేదని గుర్తించి తీరాలి, కాని–

....సృష్టించడానికి, నిర్మించడానికి, ఆహా అనుకోవడానికి, సాహసించడానికి స్వేచ్ఛకావాలి. అలాంటి స్వేచ్ఛ వుండాలంటే వ్యక్తి క్రియాశీలం, బాధ్యతాయుతం కావాలి, బానిసగాగాని, యంత్రంలో బాగా అమర్చి వుంచిన చక్రంలాగా కాని కాదు... మనుషులు బానిసలుగాకుండాపోవడమే చాలదు, సాంఘిక పరిస్థితులు స్వయంచోదకమైన వాటిని యింకా ముందుకు తీసుకుపోయినట్లయితే, ఫలితం జీవితంపట్ల ప్రేమకాదు, మృత్యువుపట్ల ప్రేమ...[24]

పీడితులు మృత్యు ఆచ్ఛాదిత పీడక వాతావరణంలో రూపుతీసుకున్న వాళ్లు. వాళ్లు మానవీకరణను ప్రకటించే జీవిత మార్గాన్ని పోరాటం ద్వారా కనుక్కోవాలి. ఇలా చేయడం అంటే తినడానికి మరింత లభ్యం అవుతూ వుండడమే కాదు (అలా అని తినడానికి మరింత వుండక్కర్లేదని కాదు, యీ అంశంతో కలిసే వుండడం అని). పీడితులు ఎందుకు నాశనం అయ్యారు? ఎందుకంటే, వాళ్ళున్న సన్నివేశం వాళ్ళని వస్తువులుగా మార్చేసింది కనక. లుప్తం అయిన మానవత్వాన్ని తిరిగి పొందాలీ అంటే వాళ్లు వస్తువులుగా వుండే స్థితి పోవాలి, వ్యక్తుల్లాగా పోరాడాలి. ఇదొక తీవ్రమైన ఆవశ్యకత. మనుషులుగా తయారయేందుకు చేసే పోరాటంలో వస్తువులుగా ప్రవేశించలేరు.

తాము నాశనం అయిపోయాము అన్న గుర్తింపుతో మనుషుల పోరాటం మొదలవుతుంది. ప్రచారం, నియంత్రణ, లోబరుచుకోవడం – వాళ్ళ పునఃమానవీకరణకు పరికరాలు కాలేవు. యివన్నీ పెత్తందారీతనపు ఆయుధాలే. పటిష్టమైన పరికరం మానవీయం చేసే విద్య. దీనిద్వారానే విప్లవ నాయకత్వం పీడితులతో సంభాషణ జరపగలుగుతుంది. మానవీకరణ విద్యలో ఉపాధ్యాయులు (యీ సందర్భంలో విప్లవ నాయకత్వం) తమ విద్యార్థుల్ని (యీ సందర్భంలో, పీడితులు). యుక్తిగా వాడుకునే పద్ధతి పోతుంది. యిది విద్యార్థుల చైతన్యాన్నే వెల్లడి చేస్తుంది.

నిజానికి యీ చర్యలలో వెల్లడయ్యే చైతన్య బాహ్యరూపం అతి మౌలికంగా చైతన్య స్వభావాన్ని అందుకుంటుంది – ఉద్దేశ్యపూర్వకంగా. చైతన్యానికి సారభూతమైంది ప్రపంచంతో వుండడం. ఈ ప్రవర్తన శాశ్వతంగా, తప్పించలేనిదిగా వుండిపోతుంది. ఆ రకంగా చైతన్యం అనేది సారభూత అంశంగా తనకి భిన్నంగా వుండేదానివైపు మార్గం, తనకి బయట వుండే దానివైపు మార్గం ఏదో దాన్ని ఆవరించుకునే వుంటుంది, దాన్ని అది భావనాశక్తి సామర్థ్యంవల్ల బోధపరుచుకుంటుంది. చైతన్యం అనేది ఆ రకంగా నిర్వచన రీత్యా చూస్తే ఒక పద్ధతి, దానికి వున్న సర్వసాధారణ అర్థంలో.[25]

విప్లవ నాయకత్వం ఆ రకంగా ఉద్దేశాలు పంచుకునే విద్యను అనుసరించాలి. ఉపాధ్యాయులు, విద్యార్థులు (నాయకులు, ప్రజలు) యదార్థం గురించి ఉమ్మడి–ఉద్దేశ్యంతో వుంటారు, ఆ యదార్థాన్ని బయల్పరచడంలోనే కాదు, ఆ రకంగా దాన్ని హేతుబద్ధంగా చూడ్డమేకాదు, ఆ జ్ఞానాన్ని పునఃసృష్టి చేయడంలోనూ యిద్దరూ కర్తలే. సమష్టి చింతనవల్ల, కార్యాచరణవల్ల యదార్థం గురించిన జ్ఞానం పొందుతారు. అలా పొందుతూ తాము శాశ్వత పునఃస్సృష్టి కర్తలమని వాళ్ళు తెలుసుకుంటారు. ఈ రకంగా తమ విమోచన కోసం సాగించే పోరాటంలో పీడితుల భాగస్వామ్యం ఎలా వుండాలో అలా వుంటుంది. కుహనా భాగస్వామ్యం కాదు, నిబద్ధమైన జోక్యం వుండడం.

# వివరణలు

1. ఇవాళ తిరుగుబాటు ఉద్యమాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా యువకులు చేస్తున్న తిరుగుబాటు ఉద్యమాలు. వాటి వాటి నేపథ్యంలో అవి ఆయా ప్రత్యేక లక్షణాల్ని ప్రతిబింబిస్తాయి. అలా ప్రతిబింబిస్తూ ఉన్న సారాంశంగా ప్రపంచంలోని వ్యక్తులుగా, ప్రపంచంతో వున్న వ్యక్తులుగా జనం గురించే పట్టించుకోవడం జరుగుతోంది– 'ఏమిటి' 'ఎలా' వాళ్ళు వ్యక్తులవుతున్నారు అన్నదే ఆ పట్టింపు. వాళ్ళు వినిమయ నాగరికతను తూకం వేస్తున్నారు. అన్ని రకాల నిరంకుశాధికారాలను నిందిస్తున్నారు. యూనివర్సిటీల స్వభావాన్ని మార్చాలని ఎలుగెత్తి చాటుతున్నారు. (ఉపాధ్యాయుడు–విద్యార్థి సంబంధంలో వున్న కరుడుగట్టిన స్వభావాన్ని మార్చి, ఆ సంబంధాన్ని వాస్తవికంగా ప్రతిష్టించాలని). అసలు యదార్థ పరిస్థితినే మార్చాలని ప్రతిపాదిస్తున్నారు. యూనివర్సిటీలను నవీనం చేసేందుకూ, పాత వ్యవస్థల్ని ప్రతిఘటించేందుకూ, పాతుకుపోయిన వ్యవస్థల్ని ఎదిరించేందుకూ అలా చేస్తున్నారు. మనుషులు 'నిర్ణయా'లు చేసే కర్తలుగా వుండేట్టు చాటే ప్రయత్నంలో అలా చేస్తున్నారు. ఈ ఉద్యమాలన్నీ మన యుగశైలిని ప్రతిబింబిస్తున్నాయి. ఇది మనిషి కేంద్రంగా వుండేదానికంటే ఎక్కువగా మనిషిని గురించిన సంపూర్ణ జ్ఞానంతో వుంది.

2. "వైరుధ్యం" అన్నమాట యీ గ్రంథం అంతా, ప్రతిస్పర్థించే సామాజిక శక్తుల గతితార్కిక సంఘర్షణ అనే అర్థంలోనే వుంది.

3. పీడకులలో కూడా యీ స్వేచ్ఛాభయం కనిపిస్తుంది. అయితే అది భిన్నరూపంలో వుంటుంది. పీడితులు స్వేచ్ఛని ఆలింగనం చేసుకోవడానికి భయపడతారు. పీడితులు పీడించే "స్వేచ్ఛ" పోతుందని భయపడతారు.

4. చూడండి హెగెల్, యిదివరకే ప్రస్తావించిన పుస్తకం. పే. 236–237.

5. యజమాని మనస్తత్వానికీ, పీడితుడి మనస్తత్వానికి మధ్య వుండే సంబంధాన్ని విశ్లేషిస్తూ హెగెల్ అంటాడు : "ఒకళ్ళు స్వతంత్రులు, దాని మౌలిక స్వభావం తనకి తాను వుండడం; రెండవ వాళ్ళు ఆధారపడిన వాళ్ళు. ఆధారపడడం అనే దాని మౌలిక తత్వం మేమిటంటే– మరొకళ్ళ కోసం వుండడం. మొదటిది యజమాని లేదా స్వామి, రెండవది బానిస." యిదే గ్రంథం. పేజి 234.

6. "విముక్తి కర్తవ్యంలో గ్రహణ, సంకల్పశక్తీ యిమిడివుండాల్సిన సమయం. తర్వాత అది చరిత్రలో ప్రభావితం చేస్తూ కొనసాగుతూనే వుంటుంది. అయితే ఆధిపత్యం అన్న ఆచరణలో యీ పార్శ్వం వుండాల్సిన పని లేదు. ఆధిపత్య నిర్మాణం దాని యాంత్రిక చైతన్య రహిత కర్తవ్య

నిర్వహణలో వుంది." జోస్ లూయిజ్ ఫ్రెయిరె రాసిన అముద్రిత గ్రంథం నుంచి యీ ఉల్లేఖనకు ఆయన దయతో అంగీకరించారు.

7. "మనుషులు పరిస్థితులవల్ల, పెంపకంవల్ల తయారవుతారన్న భౌతికవాద సిద్ధాంతం, అంచేత, మారిన మనుషులు మారిన పరిస్థితులవల్ల, మారిన పెంపకంవల్ల తయారవుతారన్న సిద్ధాంతం, యీ మారిన పరిస్థితుల్ని మనుషులే కలిగిస్తారని, బోధకుడు తనకే బోధించుకోవాలని మర్చిపోతోంది. "కారల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఏంగెల్స్, సెలెక్టెడ్ వర్క్స్ (న్యూయార్క్, 1968) పేజీ.28.

8. మావో సాంస్కృతిక విప్లవంలో యిదే ప్రాథమిక అంశంగా వున్నట్టు కనబడుతోంది.

9. ఈ కాఠిన్యాన్ని- అంటే పూర్వపు పీడకుల మీద విధించే పరిమితుల్ని పీడక వ్యవస్థగా చూడకూడదు. వాళ్ళు దాన్ని తిరిగి స్థాపించడానికి పరిమితులు వాడతారు. కాని గిడసబారిపోయి, ప్రజలకు వ్యతిరేకంగా తయారవుతుంది. పాత పీడక అధికార స్వామ్యరాజ్యయంత్రాన్నే వాడుతుంది. (దాన్ని తీవ్రంగా అణచివేయాలి, మార్క్స్ నొక్కి నొక్కి చెప్పినట్టు.)

10. ఎరిక్ ఫ్రామ్ *The Heart of Man* (న్యూయార్క్, 1966) పే.32.

11. "సాంఘిక నియంత్రణ ప్రబల రూపాలు" అన్నదానికి సంబంధించి హెర్బర్ట్ మార్కస్ *"One-Dimensional Man"* (బోస్టన్, 1964) *Eros and Civilization* (బోస్టన్, 1955) చూడండి.

12. ఈ రచయితతో ఒక ఇంటర్వ్యూలో ఒక రైతు అన్నమాటలు.

13. నాండిడో మెండెస్, Memento dos vivos-A Esquarda Catop-lica no Brasil (Rio, 1966)

14. ఫ్రాంజ్ ఫానన్ *The wretched of the Earth* (NewYork, 1968) పే.52.

15. *The colonizer and the Colonized* (Boston, 1967) p x.

16. రచయిత ఇంటర్వ్యూలో ఒక రైతు మాటలు.

17. మూడవ అధ్యాయం చూడండి ఇంగ్లీషు అనువాదకుని మాట.

18. Asentamiento చిలీ వ్యవసాయ సంస్కరణ ప్రయోగంలో ఉత్పత్తి విభాగాన్ని సూచిస్తుంది-ఇంగ్లీషు అనువాదకుని వివరణ.

19. *"రైతుకు దాదాపు నరనరాల్లోనూ యజమాని అంటే భయమే" అనే రైతుతో ఇంటర్వ్యూ.*

20. *రెజిడెబ్రె Revolution in the Revolution? (న్యూయార్క్, 1967)*

21. *ఒక రైతుతో ఇంటర్వ్యూ.*

22. *ఇది బహిరంగంగా అనికాదు. దానివల్ల పీడకుడిలో ఆగ్రహం రెచ్చగొట్టినట్టవుతుంది. దాంతో మరింత పీడన వీళ్ళనెత్తి మీదపడుతుంది.*

23. ఈ అంశాల్ని వివరంగా 4వ అధ్యాయంలో చర్చించడం జరిగింది.

24. *ఫ్రాామ్, అదే గ్రంథం, పేజి. 52–53.*

25. *శాస్త్ర విజ్ఞానతత్వం అని రాస్తూ వున్న గ్రంథంలో అల్వారొ లియేర్ పింటో, యీ ఉల్లేఖన భాగాన్ని ఎంతో విలువైందిగా భావిస్తున్నాను. సమస్యని ముందు పెట్టే విద్యను అర్థం చేసుకోవడానికి ముఖ్యం. (ఈ అంశాన్ని 2వ ప్రకరణంలో చూస్తాం) పుస్తకం ప్రచురణకు ముందే యీ ఉల్లేఖనకు అనుమతి యిచ్చినందుకు ప్రొఫెసర్ లియేర్ పింటోకి కృతజ్ఞతలు.*

# అధ్యాయం

# 2

పాఠశాల లోపలగాని, బయటగాని, ఏ స్థాయిలోనైనా ఉపాధ్యాయుడికీ విద్యార్థికీ మధ్య వున్న సంబంధాన్ని జాగ్రత్తగా విశ్లేషించి చూడండి– మౌలికంగా దానికి వున్న వివరణాత్మక స్వభావం వెల్లడవుతుంది. ఈ సంబంధంలో వివరించి చెప్పే కర్త (ఉపాధ్యాయుడు) ఓపిగ్గా చెవులప్పగించే కర్మ(విద్యార్థి) వుంటారు. ఇక ఆ చెప్పే విషయాలు – విలువలు కానీయండి, యదార్థ పరిస్థితికి సంబంధించిన ప్రయోగాలు కానీయండి, అనుభవాలు కానీయండి – హరికథాక్రమంలా నిర్జీవం అయిపోతుంది, రాయిలా బిగుసుకుపోతుంది. విద్య వివరణ రోగంతో కుంగిపోతోంది.

ఉపాధ్యాయుడు యదార్థం గురించి చెపుతూనే వుంటాడు. అదేదో అచలమైనట్టు, స్థిరోభవమైనట్టూ, గిరిగీసుకుపోయినట్టూ, యిలా యిలా జరగబోతుంది అని చెప్పగలిగినట్టూ వుండిపోతుంది. లేదంటే, విద్యార్థులకు కలలో కూడా తటస్థపడని జీవితానుభవం వంటి విషయాన్ని వర్ణించి చెప్పేస్తూ వుంటాడు. తన కథనంలోని విషయాలు విద్యార్థుల్లో "నింపెయ్యడ"మే అతని కర్తవ్యం. వాటికీ యదార్థ పరిస్థితికీ ఆమడ దూరం వుంటుంది. వాళ్ళని నిమగ్నం చేసే మొత్తం పరిస్థితికీ దానికీ మధ్య సంబంధమే వుండదు. దానికీ, వాళ్ళకి ప్రాముఖ్యం కలిగించే అంశాలకు ఏ సంబంధమూ వుండదు. మాటలు ఆకుకీ అందవు, పోకకీ పొందవు. బోలు అయిపోతాయి, పరాస్తం అయిపోతాయి. కాళ్ళు నేలమీద ఆనని పదగుంఫనతో వుంటాయి.

యీ వివరణాత్మక విద్యలో వుండే ప్రప్రధాన లక్షణం మాటల సొంపు మాత్రమే. వాటి పరివర్తనాశీల శక్తికాదు. "నాలుగు నాలుగులు పదహారు", "పరా రాజధాని బెలెమ్." విద్యార్థి రాసుకుంటాడు, వల్లె వేస్తాడు. అసలు నాలుగు నాలుగులంటే ఏమిటో "పరా రాజధాని బెలెమ్" అన్న దాంట్లో 'రాజధాని' అసలు ప్రాముఖ్యం ఏమిటో

బుర్రకెక్కకుండానే ఆ మాటల్ని వల్లెవేస్తాడు. అంటే బెలెమ్‌కుపరా అంటే ఎలాంటిదో, పరా అంటే బ్రెజిల్‌కు ఎలాంటిదో తెలియకుండానే యీ వల్లె వేయడం జరిగిపోతుంది.

వివరించే (ఉపాధ్యాయుడు వివరించేవాడు) పద్ధతి వల్ల ఆ చెప్పిన విషయాన్ని యాంత్రికంగా బుర్రలో వుంచుకునే వైఖరికి విద్యార్థులు అలవాటవుతారు. ఇంకా దరిద్రం ఏమిటంటే, ఈ పద్ధతి వాళ్ళని "పెట్టెలు" అయ్యేటట్టో, "పాత్ర"లు అయ్యేటట్టో చేస్తుంది. ఆ పెట్టెల్ని, పాత్రల్ని ఉపాధ్యాయుడు తన వస్తువులతో నింపాలి. ఈ పాత్రలు ఎంత బాగా నింపగలిగితే అంత భేషైన ఉపాధ్యాయుడు అయినట్టు. ఒదిగి ఒదిగి యింకా నింపండి, యింకా నింపండి అనే పాత్రలు అంత మంచి విద్యార్థులు అయినట్టన్నమాట!

ఆ రకంగా విద్య అనేది నిల్వ చేసే పని అవుతుంది. ఇందులో విద్యార్థులే తొట్టెలు, ఆ తొట్టి నింపేవాళ్ళు ఉపాధ్యాయులు. సంభాషణాత్మక చర్చకు బదులుగా ఉపాధ్యాయుడు ప్రకటనలు యిస్తాడు. సరుకు నిక్షిప్తం చేస్తాడు. పాపం, విద్యార్థులు గంగిగోవుల్లా అందుకుంటారు, నెమరువేస్తారు, వంత పాడతారు. ఇది విద్యకి వున్న "నిధి"(banking) అన్న భావన. ఇక్కడ విద్యార్థుల ఆచరణకు అవకాశం వున్నదల్లా ఏమిటయ్యా అంటే- అందుకోవడం, నింపుకోవడం, నిలవచేసుకోవడం- దేన్ని? ఆ నిధుల్ని. తాము నిలవ చేసుకున్న వస్తువుల సేకరణదార్లు, జాబితా తయారుచేసే వర్గీకరణదార్లు అయ్యే అవకాశం వాళ్ళకి వున్నమాట నిజమే. కాని, కడపటికి తేలేదేమిటయ్యా అంటే- ప్రజలే యీ జాబితాల్లో వర్గీకృతం అయిపోతారు. వాళ్ళకి ఓ సృజనాత్మకత వుండదు, పరివర్తనా శీలత వుండదు, పరిజ్ఞానం వుండదు. విషయ జిజ్ఞాస లేకుండా, కార్యాచరణ లేకుండా వ్యక్తులు నిజమైన మనుషులు కాలేరు. జ్ఞానం ఎలా వస్తుంది? కనిపెట్టడం ద్వారా, తిరిగి కనిపెట్టడం ద్వారా వస్తుంది. ప్రపంచంలో, ప్రపంచంతో, పరస్పరంగా మానవులు కొనసాగించే అవిశ్రాంత, నిర్విరామ, నిరంతర, ఆశావహ శోధన ద్వారా వస్తుంది.

విద్యకు సంబంధించిన యీ "నిధి"(banking) భావనలో జ్ఞానం ఎవళ్ళో ప్రసాదించడం ద్వారా వస్తుంది. వాళ్ళు తామే విషయజ్ఞులమనీ, మిగిలినవాళ్ళు అజ్ఞానమూఢులనీ తమని గురించి అనుకుంటూ వుంటారు. పీడక భావజాలంలో ప్రధాన లక్షణం పరమ అజ్ఞానాన్ని యితరుల మీద విసురుతూ వుండడం. ఇది విద్యను నాస్తీకరిస్తుంది. శోధనాక్రమంగా జ్ఞానాన్ని రద్దు చేస్తుంది. విద్యార్థులను ఉపాధ్యాయుడు తన ప్రతికక్షులుగా చూస్తాడు. వాళ్ళ అజ్ఞానం అపారం అనుకుంటాడు. తన మనుగడతో

దాన్ని సమర్థించచూస్తాడు. హెగేలియన్ గతితర్కంలో బానిసలవలె పరాయీకరణ చెందిన విద్యార్థులు తాము అజ్ఞానులమని ఒప్పేసుకుంటారు. గురువుగారి మనుగడని సమర్థించేసుకుంటారు– నిజానికి బానిస మాదిరికాక, తామే ఉపాధ్యాయుడికి బోధిస్తూ వున్నామని ఎప్పటికీ తెలుసుకోలేరు.

అలాకాక విమోచనా విద్యలోని హేతుబద్ధత భేదాల్ని తొలగించే వైపు సాగే బోధనలో వుంది. విద్య ఉపాధ్యాయ–విద్యార్థి వైరుధ్యాల పరిష్కారంతో మొదలవాలి. వైరుధ్యపూరిత ధ్రువాల్ని సమన్వయ పరచాలి. ఆ రకంగా ఏక కాలంలోనే ఉభయులూ ఉపాధ్యాయులూ, విద్యార్థులూ అయ్యేట్టు చేయాలి.

ఈ పరిష్కారం యీ "నిధి" (banking) భావనలో దొరకదు, (దొరకలేదు కూడా). అందుకు విరుద్ధంగా యీ నిధి విద్య యీ వైరుధ్యాన్ని నిలబెట్టే వుంచుతుంది, యింకా చెప్పాలంటే ప్రోత్సహిస్తుంది కూడా. మొత్తంగా పీడక సమాజం ప్రతిబింబించే యీ కింది దృక్పథాలు, ఆచరణలు అందుకు కారణం.

ఎ) ఉపాధ్యాయుడు బోధిస్తాడు, విద్యార్థులకు బోధన అందుతుంది.

బి) ఉపాధ్యాయుడు సర్వజ్ఞుడు, విద్యార్థి పరమ అజ్ఞాని.

సి) ఉపాధ్యాయుడు ఆలోచన చేస్తాడు. విద్యార్థి తన గురించి యితరులు ఆలోచించేటట్టు వుంటాడు.

డి) ఉపాధ్యాయుడే మాట్లాడుతూ వుంటాడు, విద్యార్థి వింటూ వుంటాడు– అణుకువగా.

ఇ) ఉపాధ్యాయుడు క్రమశిక్షణ అమలుచేస్తాడు, విద్యార్థులు అందుకు బద్ధులవుతూ వుంటారు.

ఎఫ్) ఉపాధ్యాయుడే తనకి నచ్చినదాన్ని ఎంచుకుని అమలుజరిపిస్తాడు. విద్యార్థులు దాన్నే నెత్తిన  పెట్టుకుంటారు.

జి) ఉపాధ్యాయుడు ఆచరిస్తాడు, ఆ ఉపాధ్యాయుడి ఆచరణ ద్వారా విద్యార్థులు ఆచరిస్తున్నా మన్న భ్రమలో వుంటారు.

హెచ్) కార్యక్రమ విషయం ఉపాధ్యాయుడు ఎంపిక చేస్తాడు, విద్యార్థులు (వాళ్ళని ఎవళ్ళేనా అడిగితేగదా) అనుసరిస్తారు.

ఐ) జ్ఞానంవల్ల వచ్చే అధికారాన్ని, తన వృత్తిపరమైన అధికారాన్ని ఉపాధ్యాయుడు గజిబిజి చేసుకుంటాడు, దాన్ని విద్యార్థుల స్వేచ్ఛకు పోటీగా పెడతాడు.

జె) నేర్చుకునే పద్ధతిలో ఉపాధ్యాయుడు కర్త, విద్యార్థులు కేవలం దానికి బద్ధులు (కర్మ) మాత్రమే.

విద్యకు సంబంధించిన యీ నిధి భావన మనుషుల్ని సర్దుకుపోయేవాళ్ళుగా, ఎలాపడితే అలా లాక్కుపోగలవాళ్ళుగా చూడ్డంలో వింత ఏమీ లేదు. విద్యార్థులు తమ ఖాతాలో ఎంత మొత్తం నిలవ చేసుకుంటే అంతలా విమర్శనాత్మక చైతన్యం నష్టపోతూ వుంటారు. కాని విమర్శనాత్మక చైతన్యం వాళ్ళకి అందితేనే ప్రపంచాన్ని పరివర్తన చేసేవాళ్ళుగా ప్రపంచంలో జోక్యం కలిగించుకోగలరు. అలాగాక వాళ్ళు తమ నెత్తి మీద రుద్దుతున్న నిష్క్రియాపర పాత్రని ఏ మేరకు భరిస్తే, ఆ మేరకు యీ ప్రపంచాన్ని వున్నదున్నట్టుగా భావించి సర్దుకుపోతారు, తమలో కుక్కిన యదార్థ పరిస్థితి ఖండిత శకలాలతో సర్దుకుపోతారు.

విద్యార్థుల సృజనాత్మక శక్తిని కనీస స్థాయికి తగ్గించడమో, రద్దు చేయడమో యీ 'నిధి' విద్య చేస్తుంది. ఆ సామర్థ్యం దానికి వుంది. దాంతోబాటు దేన్నయనా తేలిగ్గా నమ్మే స్వభావానికి నీళ్ళు పోసి పెంచుతుంది. ఆ విధంగా పీడకుల ప్రయోజనాలకే అది ఊడిగం చేస్తుంది. ఈ ప్రపంచాన్ని విశదం చేసుకోవాలనిగాని, అది మార్పు చెందాలనిగాని, వాళ్ళు వీసమెత్తు చూడరు. తమ 'మానవతావాదాన్ని' పీడకులు లాభసాటి పరిస్థితిని నిలబెట్టేందుకు వాడతారు. దాంతో విద్యాబోధనలో విమర్శనాత్మక దృష్టిని పెంపొందించే ఏ చిన్న ప్రయోగాన్నీ భరించలేరు. విమర్శనాత్మక దృష్టి కలిగితే ప్రపంచం గురించిన ఏకపక్ష భావన బీటలు వారుతుంది కదా? ఈ దృష్టి వస్తే ఒక అంశానికీ మరో అంశానికీ మధ్య సంబంధం ఏమిటోనన్న శోధన కలుగుతుంది. అందుకనే పీడకులు స్వతహాగానే ఆ ప్రయోగాలకు వ్యతిరేకంగా వుంటారు.

నిజానికి పీడకుల ప్రయోజనాలు "పీడితుల చైతన్యాన్ని మార్చడంలో వుంటాయి. వాళ్ళ పీడనా పరిస్థితిని మార్చడంలో కాదు".[1] వున్న పరిస్థితికి పీడితులు ఎంతలా సర్దుకుపోతూ వుంటే, వాళ్ళ మీద పెత్తనం చెలాయించడం అంత తేలిక. ఈ లక్ష్యం సాధించడానికి పీడకులు విద్య విషయంలో యీ 'నిధి' భావనను వాడతారు. పైతృక సామాజిక కార్యాచరణ యంత్రాంగాన్ని దీనికి జోడిస్తారు. ఇందులో భాగంగా పీడితులకు "సంక్షేమలబ్ధిదారులు" అన్న మృదువైన బిరుదు దక్కుతుంది. సాధారణంగా

కనిపించేవాళ్ళకంటే, అంటే "మంచి, క్రమబద్ధ, న్యాయపూరిత" సమాజం నుంచి, దారి మళ్ళినవాళ్ళుగా, నిర్ణీతమైనదానికంటే భిన్నంగా వున్నవాళ్ళుగా పరిగణిస్తారు. అలాంటి వాళ్ళవి విడివిడి కథలేనని పరిగణిస్తారు, పీడితులు ఆరోగ్యకరమైన సమాజానికి పట్టుకున్న జబ్బు అనుకుంటారు. అంచేత "అసమర్ధులూ, సోమరిపోతులూ" అయిన వీళ్ళని, వాళ్ళ బుర్రల్ని మార్చడం ద్వారా యీ సమాజం తన వరవడిలోకి యిముడ్చుకోవాలి. ఈ అదనపు మనుషుల్ని వాళ్ళు వదులుకున్న ఆరోగ్యకరమైన సమాజంలోకి "చేర్చుకోవాలి", "కలిపేసుకోవాలి."

అయితే, నిజం మరోలా వుంది. ఈ "అంచుల్లో" వున్నవాళ్ళు సమాజం "బయట" వుంటున్నవాళ్ళుకాదు. వాళ్ళు సర్వదా "లోపలే" వుంటున్నారు. "ఇతరుల కోసం బతుకుతూ వున్న జీవులు"గా వాళ్ళని తయారు చేసిన నిర్మాణం లోపలే వుంటున్నారు. అంచేత పరిష్కారం వాళ్ళని పీడక నిర్మాణంలోకి" కలిపేసుకోవడం"వల్ల రాదు, ఆ నిర్మాణాన్ని మార్చడంవల్ల వస్తుంది. అప్పుడు వాళ్ళు "తమకి తాము జీవించేవాళ్ళు" అవుతారు. అయితే, అలాంటి పరివర్తన పీడకుల ప్రయోజనాలకు గండికొడుతుంది. అంచేతనే వాళ్ళు విద్య విషయంలో నిధి భావనను వినియోగించుకుంటారు. విద్యార్థులలో "కాన్షైంటిజచావో" ఉపద్రవం లేకుండా చేసుకోవాలనుకుంటారు.

ఉదాహరణకు వయోజన విద్యకు సంబంధించిన నిధి పద్ధతి వుంది. అది విద్యార్థులు హేతుబద్ధంగా యదార్థాన్ని పరిశీలించేందుకు అవకాశమే యివ్వదు. అందుకు బదులుగా రోజర్ పచ్చగడ్డిని మేకకు మేత మేయడంవంటి మహత్తర అంశాల్ని తెచ్చిపెడుతుంది, దాన్ని తెలుసుకోవడం ఎంత ముఖ్యమో నొక్కిచెపుతుంది. అందుకు భిన్నంగా రోజర్ కుందేలుకు పచ్చగడ్డి వేశాడు. నిధి పద్ధతిలోని 'మానవత్వం' మనుషుల్ని యంత్రాలుగా మార్చేదానికి ముసుగు కప్పుతుంది- మరింత మానవత్వపూరితంగా వుండాలనే సత్తా శాస్త్రప్రేరణను నాస్తీకరించడమే యిది.

తెలిసో తెలియకో యీ నిధి పద్ధతిని అనుసరించేవాళ్ళు (ఎంతో మంది సదుద్దేశపూరిత బ్యాంక్-క్లర్క్ టీచర్లు వున్నారు, అమానవీకరణం తాము సేవ చేస్తున్నామని వాళ్ళకు ఎరుకలేదు) యీ నిక్షిప్తాల్లోనే యదార్థ పరిస్థితి గురించిన వైరుధ్యాలు వున్నా గ్రహించలేరు. అయితే యివాళ కాకపోతే రేపైనా, అంతకుముందుదాకా చేతులు ముడుచుకు కూర్చున్న విద్యార్థులు, తమని అణిచిపెట్టి వుంచిన పరిస్థితి మీద, యదార్థాన్ని అణిచిపెట్టి వుంచాలన్న దాని మీద ఎదురు తిరుగుతారు. వాళ్ళు తమ సారభూత అనుభవం ద్వారానే యీ గుర్తింపు పొందుతారు. తాము మనుగడ సాగిస్తూ వున్న యీ

ప్రస్తుత జీవితం, మరింత సంపూర్ణ మానవులుగా తాము తయారు కావాలన్న అంతః ప్రేరణతో పొసగదని గుర్తిస్తారు. యదార్థ పరిస్థితి ఒక క్రమం, నిరంతర పరివర్తనకు గురవుతోంది అని యదార్థ పరిస్థితితో తమకు వున్న సంబంధాల ద్వారానే తెలుసుకుంటారు. స్త్రీలు, పురుషులు శోధకులు; వాళ్ళ అస్తిత్వ అంతఃప్రేరణ మానవీకరణం చెందడం; అయినప్పుడు యివాళో, రేపో యీ నిధి విద్యా పద్ధతి తమని అలా నిలబెట్టి వుంచాలనుకునే ఉద్దేశంలో వున్న వైరుధ్యాన్ని గ్రహిస్తారు; అప్పుడు తమ విమోచనా పోరాటానికి నడుం బిగిస్తారు.

కాని, యీ అవకాశం సాకారం అయ్యేదాకా మానవత్వ, విప్లవ విద్యావేత్త ఎదురుచూస్తూ కూచోడు. ఆదినుంచి తన ప్రయత్నాలు విద్యార్థిని హేతుపూరిత ఆలోచనలో నిమగ్నం చేసే దిశలో, పరస్పర మానవీకరణ గవేషణలో కలిసేట్టు చేసుకుంటారు. ఆ ప్రయత్నాలు ప్రజలపట్ల, వాళ్ళ సృజనాత్మక శక్తిపట్ల గాఢమైన విశ్వాసంతో వుండాలి. దీని సాధనకు విద్యార్థులతో తమకి వుండే సంబంధాలలో వాళ్ళు భాగస్వాములుగా వుండాలి.

నిధి విద్యా భావనలో అలాంటి భాగస్వామ్యం వుండడానికి లేదు– అందులో వింత ఏమీ లేదు. ఉపాధ్యాయుడు–విద్యార్థి, యీ వైరుధ్యం వుంది. దీన్ని పరిష్కరించాలి. నిధిలో నిక్షిప్తం చేసేవాడు, గీతలు గీసి శాసించేవాడు, మచ్చిక చేసుకునేవాడు అనే పాత్రలు వున్నాయి. వీటిని విద్యార్థులలో విద్యార్థిగా మార్చుకోవాలి. ఇలా చేయడం అంటే పీడకశక్తిని నీరుగార్చడమే, విమోచనాలక్ష్యానికి లోబడడమే.

మానవులకీ, ప్రపంచానికీ మధ్య ద్వైధీభావం వుంది అన్న వూహ నిధి భావనలో గర్భితంగా వుంది. ఓ ఫలానా వ్యక్తి లోకంలో వున్నాడు, ప్రపంచంతో లేదా యితరులతోకాని లేడు. వ్యక్తి ప్రేక్షకమాత్రుడు, పునస్సృష్టికర్తకాదు. ఈ దృష్టితో చూసినపుడు, వ్యక్తి ఒక చైతన్యపూరిత అస్తిత్వం కాదు; ఆమెగాని అతనుగాని ఒక చైతన్యం కలిగివున్నవాళ్ళే; శూన్యమైన 'మనసు.' బయటి ప్రపంచం నుంచి యదార్థం గురించిన నిక్షిప్తాల్ని అందుకునేందుకు సాత్వికంగా తెరుచుకున్న మనసు. ఉదాహరణకు, నా రాతబల్ల, నా పుస్తకాలు, నా కాఫీ కప్పు, యివన్నీ నా ముందర వున్న వస్తువులు – ప్రపంచంలో వున్న వస్తువుల శకలాలుగా నన్ను పరివేష్టించి వున్నాయి – యివి నాలోపల వుంటాయి, సరిగ్గా యిప్పుడు నేను నా పఠనమందిరంలోపల వున్నట్టే. ఈ దృక్పథంవల్ల చైతన్యానికి అందుబాటులో వుండడానికీ, చైతన్యంలో ప్రవేశించడానికీ మధ్య తేడాయే వుండదు. అయితే, యీ తేడా వుండడం తప్పనిసరి అనుకోండి; నన్ను ఆవరించుకుని వున్న వస్తువులు

నా చైతన్యానికి అందుబాటులో వుంటాయి. నాలో స్థిరంగా వుంచినట్టివి కాదు. వాటి గురించిన ఎరుక నాకు వుంది, కాని అవి, నా లోపల లేవు.

ఆ రకంగా నిధి పద్ధతి భావనలో చైతన్యం అనేది, విద్యార్థులలోకి ప్రపంచం "ప్రవేశించే" విధానాన్ని నియంత్రించడమే బోధకుడి పాత్ర అని తేల్చుతుంది. ఉపాధ్యాయుడి కర్తవ్యం ఆ క్రమాన్ని వ్యవస్థీకరించడం. అది అప్పటికే అప్రయత్నంగా తటస్థపడింది. విద్యార్థి అసలైన జ్ఞానం[2] గా పరిగణించే సమాచార నిక్షిప్తాలతో వాళ్ళని "నింపడం." ఇక జన నిష్క్రియాపర జీవులుగా విషయాలు "అందుకుంటారు" కాబట్టి, విద్య వాళ్ళని మరింత అణిగి వుండేటట్టు చేయాలి. ప్రపంచంతో సర్దుకుపోగలిగేటట్టు చేయాలి. విద్యావంతుడైన మనిషి అలా సర్దుకుపోగల మనిషి, ఏమంటే, అలాంటి స్త్రీగాని, పురుషుడుగాని యీ లోకానికి "తగ్గ"వాళ్ళు. దీన్ని ఆచరణలోకి అమలు చేసుకుంటూ వస్తే, యీ భావన పీడకుల ప్రయోజనాలకు చక్కగా నప్పుతుంది. పీడకులు రూపొందించిన ప్రపంచంతో జనం ఎంత బాగా సర్దుకుంటే, దాన్ని గురించి ఎంత తక్కువగా ప్రశ్నిస్తే అంతగా పీడకుల కడుపులో చల్ల కదలకుండా వుంటుంది.

అధిక సంఖ్యాకులు  పెత్తనం చెలాయించే అల్ప సంఖ్యాకవర్గాల వాళ్ళు గీసినగీట్లు దాటకుండా (ఆ రకంగా తమ ప్రయోజనాల హక్కులు లేకుండా చేసి) యీ వర్గాలవాళ్ళ ప్రయోజనాలకు ఎంత చక్కగా సర్దుకుపోతూ వుంటే అంత సునాయాసంగా అల్పసంఖ్యాకులు శాసించడం కొనసాగిస్తూనే వుంటారు. నిధి విద్యా సిద్ధాంతం, ఆచరణ యీ లక్ష్యాలకు చాలా చక్కగా పనికొస్తాయి. శాబ్దిక పాఠాలు, పఠనావసరాలు,[3] "పరిజ్ఞానం" ఎంత దక్కిందో మదుపు చేయడాలు, ఉపాధ్యాయుడికీ విద్యార్థికీ మధ్య అంతరం, పదోన్నతికి ప్రమాణాలు; అలా తెచ్చి యిలా తొడుక్కునే యీ పద్ధతి ఆలోచన చేయవలసిన అవసరమే వుండదు, అందుకే యీ పద్ధతి పనికొస్తుంది.

ఈ అధిక బలుపు పాత్రవల్ల నిజమైన భద్రత వుండదనీ, యితరులతో కలిసిమెలసి సాగాలనీ బేంక్–క్లర్క్ బోధకుడు తెలుసుకోలేడు. ఎవళ్ళు యితరులపై రుద్దకుపోలేరు, ఇతర విద్యార్థులతో సహజీవనం సాగించాలి. సంఘీభావానికి కావాల్సింది అసలైన మాటామంతీ, కానిపైన చెప్పిన తరహా బోధకుడు సంభాషణను తోసిపారేస్తాడు, బెదిరిపోతాడు.

కాని, యితరులతో సంభాషించడంవల్లనే, మాట కలపడం ద్వారానే మానవ జీవితానికి అర్థం వస్తుంది. ఉపాధ్యాయుడి ఆలోచన ప్రామాణికం అవ్వాలీ అంటే విద్యార్థి

ఆలోచన ప్రామాణికం కావాలి. విద్యార్థుల తరఫున ఉపాధ్యాయుడు ఆలోచించలేడు, తన ఆలోచనల్ని వాళ్ళ మీద రుద్దడమూ కుదరదు. ప్రామాణిక ఆలోచన, యదార్థ పరిస్థితి గురించిన ఆలోచన గజదంత గోపురపు ఒంటిస్తంభం మేడల్లో నుంచి రాదు, ఒకళ్ళతో ఒకళ్ళు సాగించే సంభాషణ ద్వారానే వస్తుంది. ప్రపంచానికి సంబంధించిన కార్యాచరణవల్లనే ఆలోచన జనిస్తుంది. అప్పుడే ఆలోచనకు అర్థం వుంటుందనే మాట నిజమే అయితే విద్యార్థులు ఉపాధ్యాయులకు లొంగిపడివుండడం అనేది అసంభవం అవుతుంది.

నిధి విద్య స్త్రీలు పురుషులు వస్తువులు అన్న తప్పుడు అవగాహనతో మొదలవుతుంది. అంచేత అది, ఫ్రామ్ చెప్పినట్టు ''జీవాసక్తి''(biophily)ని పెంపొందించేందుకు దోహదపడదు, తద్విరుద్ధంగా "నిర్జీవాసక్తి"(necrophily) పెరిగేందుకు దోహదపడుతుంది.

ఒక నిర్మాణ పూరిత, కార్యశీల పద్ధతి పెరగడం జీవిత లక్షణాన్ని ప్రతిబింబిస్తుంది. నిర్జీవాసక్తి వున్నవ్యక్తి గిడసబారిపోయిన దాన్నంతట్నీ యిష్టపడతాడు, యాంత్రికంగా వుండేదంతా అతనికి యిష్టం. నిర్జీవాసక్తి వున్న వ్యక్తి సజీవంగా వున్నదాన్ని నిర్జీవంగా మారుస్తాడు, జీవితాన్ని యాంత్రికంగా చూస్తాడు, సజీవ వ్యక్తులు వస్తువులైనట్టు... ధారణాశక్తిని ఎక్కువ చేస్తాడు, అనుభవాన్ని కాదు; అస్తిత్వం కంటే కలిగి వుండడమే గొప్ప. నిర్జీవాసక్తి వున్న వ్యక్తి ఒక వస్తువుతో– అది ఓ పువ్వుగాని, మనిషిగాని – తను కలిగి వున్నప్పుడే సంబంధం పెట్టుకుంటాడు; అంచేత తను కలిగి వున్నదానికి ముప్పుకలిగితే తనకీ కలిగినట్టే; కలిగినదాన్ని పోగొట్టుకుంటే ప్రపంచంతో బంధమూ పోతుంది... నియంత్రణ అంటే అతనికి యిష్టం, అలా నియంత్రించే కార్యకలాపంలో అతను జీవితాన్నే చంపేస్తాడు.[4]

పీడన–అదుపులేని నియంత్రణ – నిర్జీవాసక్తి, మృత్యుప్రేమ దాన్ని పెంచి పోషిస్తున్నాయి, జీవిత ప్రేమకాదు. విద్యకు సంబంధించిన నిధి భావన, పీడన ప్రయోజనాల్ని కాపాడుతుంది. ఇది కూడా నిర్జీవాసక్తే. చైతన్యం గురించి యాంత్రికమైన, చలన రహితమైన, స్వాభావిక, వైకల్య దృష్టితో అది విద్యార్థుల్ని దేన్నయినా అందుకునే వస్తువులుగా పరిగణిస్తుంది. ఆలోచనన్నీ, కార్యాచరణనీ నియంత్రించ చూస్తుంది. స్త్రీలనీ పురుషులనీ లోకంలోకి సర్దుకుపోయేట్టు చేస్తుంది. వాళ్ళ సృజనాత్మక శక్తిని నొక్కి పట్టేస్తుంది.

బాధ్యతాయుతంగా ఆచరించేందుకు చేసే ప్రయత్నాలు చిన్నాభిన్నం అయినపుడు, తమ ప్రతిభాపాటవాల్ని ఉపయోగించలేమని తెలుసుకున్నప్పుడు ప్రజలు వ్యథ చెందుతారు.

"శక్తిహీనతవల్ల వచ్చే యీ వ్యథ, మానవ సమతూకం దెబ్బ తినడంలోనే వేళ్ళూనుకుని వుంది"[5] కాని, ప్రజలకు వేదన కలిగించే యీ అశక్తతే ఆ శక్తిహీనతను కాదనేటట్లూ, ప్రయత్నించడం ద్వారా వాళ్ళు- ఆచరణకు దిగేట్టు (వాళ్ళ) శక్తిని పునఃస్థాపిస్తుంది. కాని (వాళ్ళు) చేయగలరా, ఎప్పుడు? ఒకసారి అధికారం వున్నవాళ్ళకి లొంగి, వీళ్ళతో మమేకం కావడం యితర వ్యక్తుల జీవితంలో యీ సూచనప్రాయ భాగస్వామ్యం ద్వారా ఆచరిస్తున్న భ్రమ (మనుషులకు వుంటుంది) నిజానికి (వాళ్ళు) ఆచరించేవాళ్ళకు లొంగి, వాళ్ళల్లో భాగం అవుతారు.[6]

పీడితులలో యిలాంటి ప్రవర్తన వుంటుంది; యీ విషయాన్ని ప్రజారంజక వ్యక్తీకరణలు బహుశా బాగా చూపిస్తాయి. అణగారినవాళ్ళు తమని సమ్మోహక శక్తి వున్న నాయకులతో మమేకం చేసుకుంటారు. తామూ క్రియాశీలంగా, ఫలవంతంగా వున్నట్టు భావించుకుంటారు. చారిత్రక క్రమంలో వాళ్ళు రూపుతీసుకుంటూ వుంటే- వాళ్ళు వెల్లడించే తిరుగుబాటు, ఫలవంతమైన ఆచరణకై కోరికతో ప్రేరితమవుతుంది. ఆధిపత్యం చెలాయించే కులీనులు, మరింత పెత్తనాన్నీ అణచివేతనీ దీనికి మందుగా పరిగణిస్తారు. వీటిని స్వాతంత్ర్యం పేరుతో క్రమపద్ధతి పేరుతో, సామాజిక శాంతి పేరుతో (అంటే కులీనవర్గాల శాంతి అని) అమలు చేస్తూ వుంటారు. ఆ రకంగా వాళ్ళు - వాళ్ళ వైపు నుంచి చూస్తే సవ్యంగానే వుండచ్చుగాని "కార్మికులు చేసే సమ్మెలోని హింసని ఖండిస్తారు. ఆ సమ్మెని అణచివేయడానికి హింసను ప్రయోగించాల్సిందిగా అదే వూపులో ప్రభుత్వానికి పిలుపు యిస్తారు."[7]

పెత్తందారీతనం విన్యాసంగావుండే విద్య, దాన్ని నేర్చుకునే వాళ్ళలో దేన్నైనా సులభంగా నమ్మేతత్వాన్ని పురికొల్పుతుంది. దానికి సిద్ధాంతపరమైన ఉద్దేశ్యమూ వుంటుంది (యీ విషయాన్ని బోధకులే తరచూ గుర్తించరు). విద్యార్థులు యీ పీడక ప్రపంచానికి అనువుగా మారేటట్టు వాళ్ళకి బుద్ధిశుద్ధి చేయడమే ఉద్దేశ్యం. ఈ ఆరోపణ చేయడానికి కారణం. ఆధిపత్యం కులీనవర్గాలు వూరికే తమ కార్యకలాపాలకి తిలోదకాలు యిచ్చేస్తారు అన్న అమాయక ఆశకాదు. సిసలైన మానవతా వాదుల దృష్టిని యీ అంశంవైపు తిప్పడం మాత్రమే దీని లక్ష్యం. విమోచన కావాలంటే నిధి విద్యా పద్ధతుల్ని వాడలేరు అన్న నిజం వాళ్ళు తెలుసుకోవాలి. అలా చేయడం ద్వారా వాళ్ళు కావాలనుకునేదాన్ని వాళ్ళు రద్దు చేస్తున్నారంతే. అలాగే విప్లవ సమాజమూ యీ పద్ధతుల్ని పీడక సమాజం నుంచి వారసత్వంగా సంక్రమింపచేసుకోకూడదు. నిధి విద్యా పద్ధతిని అనుసరించే విప్లవ సమాజం తప్పుదారిలోనైనా పోతోంది, లేదా ప్రజల్ని విశ్వసించకుండానైనా పోతోంది. ఎటు పోయి ఎటు వచ్చినా ప్రతిఘటనా భూతం దాన్ని ఆవహిస్తూనే వుంటుంది.

దురదృష్టవశాత్తూ విమోచనాలక్ష్యం కోసం బద్ధులైనవాళ్ళు కూడా యీ నిధి విద్యా భావనను పుట్టించే వాతావరణంవల్ల ప్రభావితులైపోతారు, ఆ వాతావరణం వాళ్ళను చుట్టుముట్టి వుంటుంది. అది ఎంతటి అమానవీయతను సృష్టించగలదో, లేదా దాని అసలు అంతస్సారం ఏమిటో అంతగా గుర్తించదు. ఇక్కడ ఒక అసంబద్ధత వుంది. తాము విమోచనా యత్నం అని పరిగణించే దానిలో ఆ పరాయీకరణ పరికరాన్నే వాళ్ళు వాడతారు. ఈ విద్యా పద్ధతిని నిలదీసి ఏమిటిదని అడిగేవాళ్ళని, కొందరు విప్లవకారులు, "అమాయకు"లనీ, "స్వాప్నికులనీ", యింకా చెప్పాలంటే "ప్రతీపశక్తుల"నీ కూడా ముద్రవేస్తారు. కాని, ప్రజల్ని పరాయీకరణ చెందించడం ద్వారా ఎవళ్ళూ విమోచన చేయలేరు. ప్రామాణిక విమోచన – విమోచనా క్రమం – మనుషుల్లో నింపాల్సిన మరో నిక్షిప్తం కాదు(deposit). విమోచన అనేది ఒక కార్యాచరణ, ప్రపంచాన్ని మార్చేందుకుగాను, దానికి సంబంధించి పురుషులూ, స్త్రీలూ చేసే చింతన, కార్యాచరణ. త్రికరణశుద్ధిగా విమోచనకు బద్ధులైనవాళ్ళు, ఖాళీ సీసాని నింపినట్టుగా చైతన్యాన్ని గురించి యిదేదో నింపవలసినదే అన్న యాంత్రిక దృక్పథంతో వుండరు. అలాగే విమోచన పేరుతో నిధి పెత్తందారీ పద్ధతుల్ని (ప్రచారం, నినాదాలు – యీ నిక్షిప్తాలు) వాడనూ వాడరు.

నిజంగా విమోచన లక్ష్యం కోసం కట్టుబడినవాళ్ళు యీ నిధి భావనను సమూలంగా వ్యతిరేకించాలి. అందుకు భిన్నంగా స్త్రీ, పురుషుల్ని చైతన్యయుత జీవులుగా చూడాలి. ప్రపంచంపట్ల ఆసక్తి వున్న చైతన్యంగా చైతన్యాన్ని చూడాలి. నిధి–నిక్షిప్తం చేయడం అనే విద్యాలక్ష్యానికి స్వస్తి పలకాలి. దాని స్థానే ప్రపంచంతో ఎలాంటి సంబంధాలతో మనుషులు వున్నారో ఆ సమస్యను ముందుపెట్టాలి. సమస్యను ప్రతిపాదించే విద్య, చైతన్య అంతస్సారాన్ని ప్రతిబింబిస్తూ – ఉద్దేశపూర్వకంగా – ప్రకటనల్ని కాలదన్నుతుంది, సంభాషణాయుత చర్చను ఆహ్వానిస్తుంది. ఇది చైతన్యానికి వున్న విశిష్ఠ లక్షణాన్ని సంక్షేపించి చెపుతుంది. వస్తువులపట్ల ఆసక్తి వున్నట్లుగానేకాక, ఒక జాస్పరియన్ "విభజన"లో మాదిరి, దాని మీదకే ఎదురు తిరిగి వుండడం, చైతన్యయుతంగా వుండడం అవుతుంది – చైతన్యం గురించిన చైతన్యవంతమైన చైతన్యం అన్నమాట!

విమోచనా విద్యలో సంజ్ఞా చర్యలు వుంటాయి. సమాచారాన్ని వడ్డించడం కాదు. యిదొక నేర్చుకునే సన్నివేశం. ఇక్కడ ఎరుక పరుచుకోగల వస్తువు (జ్ఞేయ ప్రక్రియలో చిట్టచివరగా చేరుకోవలసిన వస్తువులుగానే కాకుండా) ఎరుకలోకి తెచ్చుకోవలసిన వాళ్ళకి మాధ్యమంగా వుంటుంది– ఓ పక్క ఉపాధ్యాయులు, మరో పక్క విద్యార్థులు. ఆ రకంగా సమస్యను ప్రతిపాదించే విద్య, ఉపాధ్యాయ–విద్యార్థి వైరుధ్యం పరిష్కారం కావాలని ఓం

ప్రథమంలోనే ముందుకు తెస్తుంది. సంభాషణాత్మక సంబంధాలు మరొకలా అయితే అసాధ్యం. యివి ఎరుక చేసుకోవలసిన వస్తువుల్ని గ్రహించడంలో పాత్రధారుల సామర్థ్యానికి తప్పనిసరిగా వుండాల్సినవి.

నిజానికి సమస్యను ప్రతిపాదించే విద్య నిధి విద్యకు లక్షణంగా వుండే లంబధోరణిని విచ్ఛిన్నం చేస్తుంది. ఇది స్వేచ్ఛా సాధన కర్తవ్యాన్ని, యీ పైన చెప్పుకున్న వైరుధ్యాన్ని అధిగమించగలిగినప్పుడే, పరిపూర్తి చేస్తుంది. సంభాషణ పద్ధతిలో ఆ విద్యార్థుల ఉపాధ్యాయుడు, ఆ ఉపాధ్యాయుడి విద్యార్థులు వుండరు. మరో కొత్త మాట పుట్టుకొస్తుంది: ఉపాధ్యాయుడు – విద్యార్థులతో విద్యార్థులు – ఉపాధ్యాయులతో ఉపాధ్యాయుడు యిక ఎంత మాత్రమూ ఇక్కడ బోధించేవాడుగానే వుండడు. విద్యార్థులతో సంభాషణ ద్వారా తమకు తను బోధ చేసుకుంటాడు. అటుపక్క విద్యార్థులు బోధ చేసుకుంటూనే బోధిస్తారు. వాళ్ళు ఒక సంయుక్త క్రమంలో భాగస్వాములు అవుతారు, దీనివల్ల అందరూ ఎదుగుతారు. ఈ క్రమంలో "అధికారం" మీద ఆధారపడిన వాదనలకు కాలం చెల్లుతుంది; కర్తవ్య నిర్వహణ చేయాలీ అంటే అధికారం స్వేచ్ఛపక్షాన వుండి తీరాలి, దానికి ప్రతికక్షిగా కాదు. ఇక్కడ ఎవళ్ళకీ ఎవళ్ళు బోధించరు, ఎవళ్ళూ స్వయం బోధనలోనూ వుండరు. ప్రజలు ఒకళ్ళకొకళ్ళు బోధించుకుంటారు. ప్రపంచం మాధ్యమంగా వుంటుంది, తెలిసిన వస్తువుల ద్వారా యిది వుంటుంది. ఈ వస్తువులు నిధి విద్యలో ఉపాధ్యాయుడి "అధీనంలో" వుంటాయి.

నిధి భావన (ప్రతిదాన్ని ద్వైవీకరించడం దీని వైఖరి) ఉపాధ్యాయుడి కార్యాచరణలో రెండు దశల్ని విస్పష్టం చేస్తుంది. తన అధ్యయన మందిరంలోనో, ప్రయోగశాలలోనో అతను తన బోధనాంశం గురించి తయారవుతూ వుంటాడు కదా? ఆ మొదటి దశలో ఎరుక చేసుకోవలసిన వస్తువును గుర్తిస్తాడు. రెండవ దశలో దాన్ని గురించి విద్యార్థులకు బోధపరుస్తాడు. 'బాబూ, ఈ విషయం గురించి తెలుసుకోండి' అని విద్యార్థులకు చెప్పడం వుండదు. 'ధారణ చేయండి. ఉపాధ్యాయుడు చెప్పినదాన్ని బుర్రపెట్టెలో పెట్టండి' అనడం మాత్రమే వుంటుంది. ఇక విద్యార్థులూ ఎరుక చేసుకునే పని చేయరు. వాళ్ళ దృష్టిని మళ్ళించిన వస్తువు ఉపాధ్యాయుడి ఆస్తి, ఉపాధ్యాయునిలోనూ విద్యార్థిలోనూ ఉభయత్రా హేతుబద్ధ చింతనను ప్రేరేపించే మాధ్యమం లేదు కదా? అందుకనే "సంస్కృతీ పరిరక్షణ, జ్ఞానం" అన్న పేరు మీద మనకి దక్కేది ఏమిటయ్యా అంటే– ఒక వ్యవస్థ, యిక్కడ అసలైన జ్ఞానమూ లేదు, అసలైన సంస్కృతీ లేదు.

సమస్య ప్రతిపాదించే పద్ధతి ఉపాధ్యాయు-విద్యార్థి కార్యకలాపాల్ని ద్వైదీకరించదు. ఇది ఒక పక్కన ఎరుకగానూ, మరొక పక్క 'కథనం'గానూ వుండదు. ఇది సర్వదా ఎరుకగానే వుంటుంది. ఒక పథక వ్యూహరచనగాని, విద్యార్థులతో సంభాషణాత్మక చర్చగాని యిలానే వుంటుంది. ఎరుక చేసుకోగల వస్తువుల్ని ఉపాధ్యాయుడు తన సొంత ఆస్తి అని అనుకోడు; తనూ విద్యార్థులూ కలిసి ఆలోచించవలసింది అనుకుంటాడు. ఈ రకంగా సమస్యా ప్రతిపాదిక విద్య నిరంతరం అతని చింతనను పునర్నిర్మిస్తూ వుంటుంది. విద్యార్థుల చింతనలో యిలా పౌనఃపున్య నిర్మితి వుంటుంది. ఇక విద్యార్థులు – గంగిరెద్దుల్లా తల వూపుతూ వుండరు– యిప్పుడు సవిమర్శక సహపరిశోధకులుగా వుంటారు, ఉపాధ్యాయుడితో సంభాషణలో వుంటారు. ఉపాధ్యాయుడు తన వద్ద వున్న విషయాన్ని వాళ్ళ పరిశీలనార్థం వాళ్ళ ముందు పెడతాడు. విద్యార్థులు తమ మనసులో మాటల్ని చెప్పేటప్పుడు అంతకు ముందు వున్న తమ పరిశీలనల్ని పునఃస్సమీక్షించుకోవడం జరుగుతుంది. సమస్యా ప్రతిపాదక విద్యలో ఉపాధ్యాయుడి పాత్ర ఏమిటి? విద్యార్థులతో కలిసి స్తుతి స్థాయిలో వున్న జ్ఞానాన్ని అసలైన జ్ఞానంతో తీసేసి, మాట స్థాయిలో వుండే పరిస్థితుల్ని సృష్టించడం.

నిధి విద్యాబోధన అచేతనం చేస్తుంది, సృజనాత్మక శక్తిని నొక్కి పట్టేస్తుంది. సమస్యా ప్రతిపాదక విద్య యదార్థ పరిస్థితిని అంతకంతకీ వెల్లడి చేస్తూ సాగుతుంది. మొదటిదాంట్లో చైతన్యం మునిగి వుంటుంది; రెండవదాంట్లో చైతన్య ఆవిర్భావం వుంటుంది, యదార్థస్థితిలో సవిమర్శక జోక్యం వుంటుంది.

విద్యార్థులు ప్రపంచంలో, ప్రపంచంతో తమకు సంబంధించి వున్న సమస్యల్ని, మరీమరీ ఎదుర్కొంటూ వుంటారు. ఇలా జరిగేటప్పుడు మరీమరీ సవాళ్ళు ఎదురవుతాయి. వాళ్ళా సవాళ్ళకి తగ్గట్టుగా స్పందించాల్సి వుంటుంది. ఒక మొత్తం పరిస్థితిలో వున్న యితర సమస్యలతో ఈ సవాళ్ళు పెనవేసుకుపోయి వుంటాయని వాళ్ళు గ్రహిస్తారు. అదొక మీమాంస సమస్యకాదు.అలా గ్రహించడంవల్ల వచ్చిన ఎరుక రానురాను హేతుబద్ధంగా వుంటుంది, ఈ రకంగా పరాయీకరణ తక్కువ అవుతుంది. ఒక సవాల్‌కి వాళ్ళు ప్రతిస్పందించిన తీరు మరిన్ని కొత్త సవాళ్ళని రేకెత్తిస్తుంది. దాన్ని అనుసరించి నూతన అవగాహనలు వస్తాయి. క్రమేపీ విద్యార్థులు తాము నిబద్ధులమైనట్టు పరిగణించుకుంటారు.

విద్య స్వాతంత్ర్య సాధనగా వుంటుంది– విద్య పెత్తందారీతనంతో వుండడాన్ని యిది వ్యతిరేకిస్తుంది– అలా వుండడంలో మనిషి అమూర్తంగా, వేర్పాటుకుగురై, విడిగా, ప్రపంచంతో బంధం లుప్తం అయినట్టుగా భావించడాన్ని తిరస్కరిస్తుంది. ప్రపంచం

ప్రజలు లేకుండా ఒక వాస్తవంగా వుందన్న అంశాన్ని తిరస్కరిస్తుంది. ప్రామాణిక చింతన అమూర్త మానవుడుగాని, ప్రజలులేని ప్రపంచంగా వుంటాయని భావించదు. ప్రజలు ప్రపంచంతో వాళ్ళ సంబంధాలతో వున్నట్టు పరిగణిస్తుంది. ఈ సంబంధాలలో చైతన్యం, ప్రపంచం ఏకకాలంలోనే వుంటాయి. చైతన్యం దానికి ముందూ వుండదు, అనుసరించీ రాదు.

చిలీలో మాకు సాంస్కృతిక బృందాలు వున్నాయి. ఒక బృందం (సాంకేతిక భాష మీద ఆధారపడి) సంస్కృతి గురించిన మానవ పరభావన మీద చర్చ సాగింది. ఆ చర్చ మధ్యలో ఒక రైతు లేచాడు. నిధి భావన దృష్ట్యా అతను యేమీ తెలియని అజ్ఞాని. "మనిషి లేకుండా ప్రపంచం లేదని యిప్పుడు నాకనిపిస్తోంది" అన్నాడు. ఉపాధ్యాయుడు కలిగించుకుని, "వూరికే వాదన కోసం యిలా అనుకుందాం. లోకంలో మనుషులందరూ చనిపోతే చెట్టూపుట్టా పక్షీజంతువు నదులు సముద్రాలు, నక్షత్రాలు వున్న ప్రపంచమే వుంటుంది కదా... అప్పుడది ప్రపంచం కాదా?" అన్నాడు. "అబ్బే కాదు. 'యిది లోకం' చెప్పడానికి ఎవళ్ళూ వుండరు" అని రైతు నొక్కి చెప్పాడు.

అలాటి స్థితిలో ప్రపంచాన్ని గురించిన చైతన్యం లేకుండాపోతుందని రైతు చెప్పదలచుకున్నాడు. "నేను" అన్నది అది ఉండాలంటే చైతన్య ప్రపంచం వుండాలి. "నేను లేను" లేకుండా వుండదు. ఇటు ఈ నేను లేను ఆ ఉనికి మీద ఆధారపడి వుంటుంది. అంచేతనే యింతకుముందే ఉల్లేఖించిన సార్త్ర్ మాటలు:

స్త్రీ, పురుషులు తమ గురించీ, ప్రపంచం గురించీ ఏక కాలంలో ఆలోచన చేస్తూ తమ అవగాహనా పరిధిని పెంచుకుంటారు. అంతకుముందుదాకా అప్రముఖంగా వున్న దృగ్విషయాన్ని గురించి పరిశీలించడం మొదలుపెడతారు.

గ్రహింపు అనేదాన్ని నిర్దిష్టంగా అలా పిలిచినప్పుడు, అదొక స్పష్టంగా కన్పించే ఎరుక. నేను వస్తువు వైపు మళ్ళుతాను. ఉదాహరణకు పేపర్ కేసి. అది యిప్పుడు ఇక్కడ వుంది అని నేను గ్రహిస్తాను. ఆ గ్రహింపు దేనికి దాన్ని వేర్పాటుగా చూడ్డం. ఏమంటే, ప్రతి వస్తువుకీ అనుభవంలో ఒక నేపథ్యం వుంది. ఈ పేపరు చుట్టూతా పుస్తకాలు, పెన్సిళ్ళు, సిరాబుడ్డి అలా అలా యింకా వున్నాయి. ఓ రకంగా వీటిని గురించీ "గ్రహిస్తాం", గ్రహణరీత్యా, "సహజాత సీమ"లో నేను పేపరు కేసి దృష్టి పెట్టినపుడు మిగిలిన వాటివైపు దృష్టి పెట్టడం వుండదు. వాటి గురించిన గ్రహింపువుండదు, ద్వితీయ స్థాయిలోనైనా అది వుండదు. అవి కనిపించాయి, కాని వేర్పాటు కాలేదు, వాటికిగా వాటిని పట్టించుకోలేదు. ప్రతి వస్తువు గురించిన గ్రహింపు యిలాంటి సహజాతబోధ నేపథ్య పరిధితో వుంటుంది, సహజాతబోధలో ఆ వస్తువుకేసి దృష్టి మళ్ళించడం వున్నట్టయితే

ఇది కూడా ఒక "చైతన్యయుత అనుభవమే" లేదా మరింత సంక్షిప్తంగా అన్నింటి గురించిన "చైతన్యమూ" అవుతుంది. నిజానికి ఆ వస్తువు నేపథ్యం గురించిన "ఉమ్మడి గ్రహింపు" అవుతుంది.[8]

ఒకటి దానికిగా అది వుంది. అయితే దాన్ని లోతైన అర్థంలో గ్రహించలేదు, (అసలంటూ దాన్ని గ్రహిస్తేగనక) దానికి ఒక సమస్యా స్వభావం వుందని భావిస్తే, అది "ప్రత్యేకించి వుండడం" లాగా. అంచేత ఒక సవాల్‌లాగా వస్తుంది. ఆ రకంగా స్త్రీ, పురుషులు తమ "నేపథ్య స్పృహ" నుంచి అంశాల్ని దేనికి దాన్ని ప్రత్యేకించుకుంటారు. వాటి గురించి ఆలోచన చేస్తారు. ఈ అంశాలు వాళ్ళ పరిశీలనా వస్తువులు అవుతాయి. అలా అవడంతో వాళ్ళ చర్యలకీ, ఎరుకకీ లక్ష్యం అవుతాయి.

సమస్య ప్రతిపాదక విద్యలో జనం "తమ ఉనికి తీరు", యీ లోకంలో ఎలా వుందో, తాము యీ లోకంతో, యీ లోకంలో ఎలా వుంటున్నారో సవిమర్శకంగా గ్రహించే శక్తిని పెంపొందించుకుంటారు. ఈ ప్రపంచం స్థిరోభవ అంటూ అలానే వుండే యదార్థం కాదని తెలుసుకుంటారు. వాస్తవానికి యిదొక క్రమం, మార్పు చెందుతూ వుంది అని తెలుసుకుంటారు. స్త్రీ, పురుషులు యీ ప్రపంచంతో గతి తార్కిక సంబంధంలో వుంటారు, ఈ సంబంధాలని వాళ్ళు ఎలా గ్రహిస్తారు (అసలు గ్రహిస్తారో లేదో) అన్నది స్వతంత్రంగా వున్నా, వాళ్ళు యీ లోకంలో తమని గురించి ఎలా తెలుసుకోవడం జరుగుతుందీ అన్నదానిమీదనే వాళ్ళు అనుసరించే కార్యాచరణ రూపం ఎక్కువ ఆధారపడి వుంటుంది అనేదీ నిజమే. అంచేత ఉపాధ్యాయుడు-విద్యార్థి, విద్యార్థి- ఉపాధ్యాయుడు ఏకకాలంలోనే తమని గురించీ ఆలోచన చేసుకుంటారు, ప్రపంచం గురించి ఆలోచన చేసుకుంటారు, కార్యాచరణ నుంచి ఈ ఆలోచనను ద్వైధీకరణం చేయరు. ఆ రకంగా ఆచరణ-ఆలోచనల ప్రామాణిక రూపాన్ని స్థాపిస్తారు.

విద్యాభావనలు, ఆచరణలు అన్న రెండూ యిప్పుడు విశ్లేషణలో వున్నాయి, మరోసారి స్పర్థిస్తాయి. నిధి విద్య (కారణాలు విశదమే) యదార్థాన్ని మార్మికం చేస్తుంది. మనుషులు ఈ లోకంలో ఎలా ఉనికిలో వున్నారో వివరించే కొన్ని నిజాల్ని మరుగున పెట్టే యత్నం చేస్తుంది. సమస్యా ప్రతిపాదన విద్య మార్మికతను తప్పించే కర్తవ్యం చేబడుతుంటుంది. నిధి విద్య సంభాషణను ప్రతిఘటిస్తుంది. సమస్యా ప్రతిపాదన విద్య ఎరుక చేసుకోవడాన్ని తప్పనిసరి అవసరమైన అంశంగా సంభాషణను పరిగణిస్తుంది. యీ తెలుసుకోవడం యదార్థాన్ని ఆవిష్కరిస్తుంది. నిధి విద్య విద్యార్థుల్ని సహాయక వస్తువులుగా మారుస్తుంది. సమస్య ప్రతిపాదన విద్య వాళ్ళని హేతుయుత చింతనాశీల్ని చేస్తుంది. నిధి విద్య సృజనాత్మకతకు సంకెళ్ళు వేస్తుంది. ప్రపంచం నుంచి చైతన్యాన్ని

విడదీసి ఉద్దేశ్యపూర్వకతను (అసలంటూ మొత్తంగా నాశనం చేయలేకపోయినా) అణచిపెడుతుంది. ఆ రకంగా మరింత మానవీకరణ చెందాలన్న ప్రజల అస్తిత్వపూరిత, చారిత్రక అంతఃప్రేరణ లేకుండా చేస్తుంది. సమస్యా ప్రతిపాదక విద్య సృజనాత్మకత మీదనే ఆధారపడుతుంది. అసలైన చింతనకు ప్రేరణ యిస్తుంది. యదార్థ పరిస్థితికి సంబంధించి కార్యాచరణ కలిగిస్తుంది. ఆ రకంగా ప్రజల అంతఃప్రేరణకు ప్రతిస్పందిస్తుంది. ఆ ప్రజలు శోధనలో సృజనాత్మక పరివర్తనలో నిమగ్నమైనప్పుడు ప్రామాణికమైన మనుషులు అవుతారు. మొత్తం మీద చెప్పాలంటే; అచేతనపూరితమైన, స్థిరమైన అంశాలుగా నిధి విద్య సిద్ధాంతం ఆచరణ స్త్రీలనీ, పురుషుల్నీ చారిత్రక మానవ ప్రాణులుగా గుర్తించడంలో విఫలం అవుతుంది; సమస్య ప్రతిపాదక విద్య ప్రజల చారిత్రకతను ఆరంభ బిందువు చేస్తుంది.

సమస్యా ప్రతిపాదక విద్య స్త్రీ, పురుషులు మానవ ప్రాణులుగా రూపొందుతున్న క్రమాన్ని ధృవపరుస్తుంది– యదార్థపరిస్థితిలో, వాళ్ళు అసంపూర్ణ, అవికసిత జీవులుగానే వుంటారు. నిజానికి, ఇంకా పూర్ణతపొందని ఇతర జంతువులకు భిన్నం కాని, చారిత్రకం అవని, మనుషులు తాము అసంపూర్ణులమని తామే తెలుసుకుంటారు. తమ అసంపూర్ణత గురించిన స్పృహ వాళ్ళకు వుంటుంది. ఈ అసంపూర్ణతలోనూ, ఈ స్పృహలోనూ విద్య ప్రత్యేకంగా మానవ వ్యక్తీకరణ అన్న దాని వేళ్ళు దిగి వుంటాయి. మనుషుల అసంపూర్ణ స్వభావం, యదార్థానికిగల పరివర్తనా స్వభావం విద్యను నిరవధిక కార్యక్రమంగా చేస్తాయి.

ఈ కార్యాచరణలో ఆ రకంగా విద్య నిరంతరం తిరిగి రూపొందుతూనే వుంటుంది. ఉండడం కోసమని అది అయితీరాలి. దీని "కాలపరిమితి" (ఈ మాటకి వున్న చెర్గసోనియన్ అర్థంలో) శాశ్వతం, మార్పు అన్న విరుద్ధాల క్రీడ వుంటుంది. నిధి విధానం శాశ్వతత్వాన్ని నొక్కి చెబుతుంది. అందువల్ల తిరోగమన పూరితం అవుతుంది. సమస్య ప్రతిపాదక విద్య – ఇది "సుభిక్షంగా" వున్న వర్తమానాన్ని గాని, విధికృతంగా సంభవించబోయే భవిష్యత్తునుగాని అంగీకరించదు. చలనశీల ప్రస్తుతంలో పాతుకుని వుంటుంది. విప్లవాత్మకం అవుతుంది.

సమస్యా ప్రతిపాదక విద్య విప్లవాత్మక భవిష్యత్తు. అంచేత అది రాబోయేదాన్ని తెలియజేస్తుంది. (కనుక ఆ విధంగా ఆశావహంగా వుంటుంది.) అంచేత అది మానవాళి చారిత్రక స్వభావానికి అనురూపంగా వుంటుంది. అంచేత తమని తామే అధిగమించే జీవులుగా స్త్రీలనీ, పురుషులనీ ధృవపరుస్తుంది. వాళ్ళు ముందుకు సాగుతారు, ముందుకు చూస్తారు. ఒకే చోట పాతుకుపోవడం వాళ్ళకి మరణ సమానం. వాళ్ళకి గతాన్ని చూడ్డం అనేది తాము ఏమిటో ఎవరు అన్న విషయాన్ని మరింత స్పష్టంగా బోధపరుచుకునే

మార్గం మాత్రమే. ఆ రకంగా వాళ్ళు మరింత వివేచనాయుతంగా భవిష్యద్దర్శనం చేస్తారు. అంచేత యీ విద్య తమ అసంపూర్ణతను గుర్తించిన ప్రాణులుగా జనాన్ని నిమగ్నం చేసే ఉద్యమంతో సాదృశ్యం చెందుతుంది- అది ఒక చారిత్రక ఉద్యమం. దానికి దాని నిర్గమన బిందువు వుంది. దాని కర్తలు వున్నారు, దాని లక్ష్యం వుంది.

నిర్గమన బిందువు ప్రజలలోనే వుంది. ప్రపంచం లేకుండా, యదార్థ పరిస్థితి లేకుండా ప్రజలు వుండరు కాబట్టి, యీ ఉద్యమం మానవ-ప్రపంచ సంబంధంతో ప్రారంభమవుతుంది. ఆ రకంగా నిర్గమన బిందువు "ఇక్కడ-ఇప్పుడు" వున్న స్త్రీ, పురుషులతోనే సర్వదా ఆరంభమవుతుంది. ఈ ఇక్కడ-ఇప్పుడు ఈ పరిస్థితి కలిగిస్తోంది. వాళ్ళు ఇందులో గొంతువరకు దిగబడి వున్నారు. దాన్నుంచి వాళ్ళు ఆవిర్భవిస్తారు, దాంతో వాళ్ళు జోక్యం చేసుకుంటారు. ఈ పరిస్థితే వాళ్ళ గ్రహణను నిర్ణయిస్తుంది దాని నుంచి అడుగు వేసినపుడు మాత్రమే వాళ్ళు కదలగలుగుతారు. దీన్ని ప్రామాణికంగా సాగించాలీ అంటే వాళ్ళు తమ పరిస్థితి తమ పరిస్థితి విధికృతమనో, మార్చవీలులేనిదనో అనుకోకూడదు. కేవలం పరిమితులు విధించేది మాత్రమేనని ఆ రకంగా సవాలుగా వుందని గ్రహించాలి.

నిధి విధాన విద్య ప్రత్యక్షంగానో పరోక్షంగానో వున్న పరిస్థితి గురించి మనుషులు విధి లిఖితం అని భావించడాన్ని మరింత పటుతరం చేస్తుంది. సమస్యా ప్రతిపాదక విద్యావిధానం యిదే పరిస్థితిని వాళ్ళ ముందు ఒక సమస్యగా పెడుతుంది. ఈ పరిస్థితి వాళ్ళ ఎరుకకు వస్తువు అయినప్పుడు, విధి భావన ఉత్పన్నం చేసిన అమాయక, ఇంద్రజాలిక అవగాహన మరో విధమైన అవగాహనను అందిస్తుంది. ఈ అవగాహనలో యదార్థాన్ని గ్రహిస్తూనే తనను తానూ గ్రహించడం వుంటుంది. ఆ రకంగా అది వాస్తవం గురించిన సవిమర్శక లక్ష్యంగా వుంటుంది.

తమ పరిస్థితి గురించి ప్రజలు లోతైన అవగాహన కలిగించుకుంటారనుకోండి. అప్పుడు పరిస్థితి అనేది ఒక చారిత్రక యదార్థమని, దాన్ని మార్చవచ్చునని ప్రజలు తెలుసుకుంటారు. చేతులెత్తేయడం పోయి పరివర్తనకై కృషి ప్రారంభమవుతుంది. శోధనకు దారి యిస్తుంది. వీటి మీద మనుషులకు నియంత్రణ వుంటుంది. ప్రజలు, శోధనా ఉద్యమంలో విధాయకంగా యితరులతో కలిసి నిమగ్నం అయిన చారిత్రక జీవులుగా, ఆ ఉద్యమాన్ని నియంత్రించలేదనుకోండి- అది వాళ్ళ మానవత్వాన్ని ఉల్లంఘించడం అవుతుంది(అవుతోంది). శోధనా క్రమంలో నిమగ్నం కాకుండా కొందరు వ్యక్తులు ఇతరుల్ని అడ్డగించారనుకోండి- అది హింస అవుతుంది. ఏ సాధనాలు వాడుతున్నామనేది

ముఖ్యంకాదు. తమ నిర్ణయాధికారాన్ని తప్పించి, పరాధీనం చేయడం అంటే మానవుల్ని వస్తువులుగా మార్చడమే.

శోధనా ఉద్యమం మానవీకరణం వైపు నడిపించాలి – యిదే ప్రజల చారిత్రక కర్తవ్యం. అయితే యావత్ మానవ గవేషణ విడిగా లేదా వ్యక్తిగతంగా సాగించడం కుదరదు. సౌభ్రాతృత్వంతో, సంఘీభావంతో సాగాలి. అంచేత ఇది పీడక పీడిత ప్రతిస్పర్థి సంబంధాలలో వికసించదు. ఇతరుల్ని ప్రామాణిక మానవులు కాకుండా అడ్డగించే ఎవళ్ళూ తామూ పరిపూర్ణులు కాలేరు. అలాటి వారు వ్యక్తిగతంగా మరింత ఎక్కువ, మానవులుగా వుండ ప్రయత్నించడం మరింత అహంభావపూరితంగా అయ్యేట్టు చేస్తుంది. యిదొక అమానవీకరణ రూపం. మానవత్వ పూరితంగా వుండేందుకు, కలిగి వుండడం మౌలికమైంది కాదనికాదు. ఇది అవసరం కాబట్టే, కొంతమంది కలిగి వుండడం అనేది యితరులు కలిగి వుండడానికి అవరోధంగా తయారవకూడదు, రెండవవాళ్ళని మొదటివాళ్ళు అణగదొక్కే శక్తి కాకూడదు.

సమస్యా ప్రతిపాదక విద్య మానవత్వ పూరితమైంది, విమోచనా కార్యాచరణ శీలం అయింది. అంచేత పెత్తందారీతనానికి గురైన ప్రజలు తమ విమోచన కోసం పోరాటం చేయాలి అన్న అంశాన్ని ప్రాథమికమైందిగా పెడుతుంది. ఆ లక్ష్యంతో, ఇది ఉపాధ్యాయులు, విద్యార్థులు విద్యాక్రమంలో కర్తలయ్యేట్టు చేస్తుంది. పెత్తందారీతనాన్ని ఓడించడం ద్వారా, బుద్ధితత్వాన్ని దూరం చేయడం ద్వారా ఈ పని చేస్తుంది. ప్రజలకు యదార్థ పరిస్థితి గురించి వున్న అవాస్తవ అవగాహననీ యిది జయించేట్టు చేస్తుంది. ఈ ప్రపంచం– ఇక ఎంతమాత్రమూ దీన్ని గురించి చర్చించే మాయమాటలు చెల్లవు – స్త్రీలు, పురుషులూ సాగించే పరివర్తనా కార్యాచరణకు లక్ష్యం అవుతుంది. ఆ కార్యాచరణ వల్ల వాళ్ళ మానవీకరణ జరుగుతుంది.

సమస్యా ప్రతిపాదక విద్య పీడకుల ప్రయోజనాలకి జోహుకుం అనదు. పీడక వ్యవస్థ ఏదీ కూడా పీడితుల్ని ప్రశ్నించనివ్వదు. ఎందుకు? అని అడగనివ్వదు. ఒక విప్లవ సమాజం మాత్రమే ఈ విద్యను ఒక క్రమపద్ధతిలో సాగించగలదు. అలా అయినప్పుడు, యీ పద్ధతిని ఉపయోగించడానికి, విప్లవ నాయకులు పూర్తి అధికారాన్ని చేతిలో పెట్టుకోనక్కర్లేదు. విప్లవక్రమంలో, ఒక తాత్కాలిక విధానంగా నిధి పద్ధతిని, నాయకులు ఉపయోగించలేరు. ఇక దారిలేదు చూడండి తర్వాత అసలు సిసలైన విప్లవ పద్ధతిలో వుంటాం కదా అన్న ఉద్దేశంతో సమర్థించలేరు. వాళ్ళు విప్లవపూరితంగా వుండి తీరాలి – అంటే, – ఆది నుంచీ కూడా సంభాషణాత్మకంగా వ్యవహరించాలి.

# <u>వివరణలు</u>

1. సైమన్ ది బ్యూవోయిర్ *"Lapense de Droite, Anjoural 'hun' (పాతిస్) ఎస్.టి. E & Pensaninto Politico de la Dereahea" (బ్యూనస్ అయిరిస్, 1964) పే.34.*

2. సార్త్రె "జీర్ణమవగల", " పోషకంగా వుండే" విద్య అన్న భావనకు యిది తూగుతుంది. ఇందులో ఉపాధ్యాయుడు "వడ్డించిన" జ్ఞానం వాళ్ళని "నింపుతుంది." జోపోల్ సార్త్ర "Une idee fundamentale de la phenomenologie de Husserl; L'intentionalife' చూడండి Situations (Paris, 1947).

3. ఉదాహరణకు కొంతమంది ప్రొఫెసర్లు ఫలానా ఫలానావి చదవాలి అని జాబితా యిస్తూ, యీ ఫలానా పుస్తకం 10 నుంచి 15 పేజీదాకా చదవాలని చెపుతారు – తమ విద్యార్థులకు "సహాయ"పడ్డానికి మరి!

4. ఫ్రామ్, యిదే గ్రంథం, పే.41.

5. యిదే గ్రంథం, పేజి.31.

6. యిదే గ్రంథం.

7. రైనాల్డ్‌నైబుర్ Moral Man and Immoral Society (న్యూయార్క్, 1960) పే.130.

8. ఎడ్మండ్ హస్సెరల్ Ideas - General Introduction to Pure Phenomenology (లండన్, 1969, పే.105–106).

# అధ్యాయం

# 3

సంభాషణ అనేది మానవ కార్యకలాపం. ఈ రకంగా దీన్ని విశ్లేషించుకునే ప్రయత్నం చేస్తూ వున్నప్పుడు సంభాషణకు ఆయువుపట్టు ఒకటి వుందని మనికి తెలుస్తుంది, అదే– మాట. అయితే మాట కేవలం సంభాషణను సాధ్యం చేసే పనిముట్టు మాత్రమే. మాటలో వుండే అంశాలని మనం ఒడిసి పట్టుకోవాలి. మాటలోపల్నే మనకు రెండు పార్శ్వాలు కనిపిస్తాయి– ఆలోచన, కార్యాచరణ. ఇవి ఎంత తీవ్రమైన ప్రతిచర్యలతో వుంటాయంటే, ఒకదానికి ఏకాస్త నీళ్లు వదిలినా– రెండవది తక్షణం నష్టపోతుంది. ఏక కాలంలో కార్యాచరణ[1] శీలత లేని నిజమైన మాట అంటూ వుండదు. అంటే యేమిటి? నిజమైన మాటను పలకడం అంటే ప్రపంచాన్ని మార్చడం అని.[2]

యదార్థ పరిస్థితిని మార్చలేని అప్రామాణిక పదం ఎలా వస్తుందీ అంటే– దాని అంశీభూత లక్షణాల మీద ద్వైధీ భావాన్ని రుద్దినప్పుడు. మాటకు వున్న కార్యాచరణ పార్శ్వాన్ని తీసివేస్తేగనక, ఆలోచన నష్టపోతుంది, అప్పుడా మాట ఊకదంపుడు వాగుడు అవుతుంది, శాబ్దిక ఆడంబరంగా మారుతుంది. పరాయీకరణ చెందిన, పరాయీకరణ అయ్యే 'ఆడంబరం'గా మారిపోతుంది. సారంలేని శూన్యం అవుతుంది. అది ప్రపంచాన్ని ఖండించలేనిది అవుతుంది. పరివర్తన సాధించాలన్న నిబద్ధత లేనప్పుడు ఖండన అసాధ్యం, కార్యాచరణ లేకుండా పరివర్తన వుండదు.

ఇక అటు పక్క ఒక్క కార్యాచరణ మీదనే పదేపదే నొక్కి చెప్పడం వుందనుకోండి, ఆలోచన హరించుకుపోతుంది. అప్పుడామాట క్రియాశీలత అనే ధోరణి కిందకీ మారిపోతుంది. ఈ రెండవది – ఆచరణ ఆచరణ కోసమే అసలైన కార్యాచరణను రద్దు

చేస్తుంది. సంభాషణ అసాధ్యం అయ్యేటట్టు చేస్తుంది. ద్వైదీ లక్షణంలో ఏదైనా, అప్రామాణికమైన రూపాల్ని కల్పించడం ద్వారా, అప్రామాణిక ఆలోచనల్ని సృష్టిస్తుంది. దాంతో అసలుకే వున్న ద్వైదీ లక్షణం మరింత బలం పుంజుకుంటుంది.

మానవ మనుగడ  చేతులు ముడుచుకుని కూర్చోలేదు. అలా అని దొంగమాటలతో పుంజుకోనూ పుంజుకోదు. సత్యపూరితమైన మాటలలోనే స్త్రీ, పురుషులూ ఈ లోకాన్ని మార్చగలరు. మానవత్వ పూరితంగా మనుగడ సాగించడం అంటే, ప్రపంచాన్ని పేర్కొవడం (name), దాన్ని మార్చడం. ఒకసారంటూ పేర్కోవడం జరిగితే, ప్రపంచం ఆ పేర్కొన్నవాళ్ళకి ఒక సమస్యగా యిటు తిరిగి దర్శనమిస్తుంది. అప్పుడు కొత్తగా పేర్కోవడం అవసరం అవుతుంది. మానవులు మౌనం[3]లో రూపొందరు;  మాటలో, చేతలో, కార్యాచరణ ఆలోచన అనే వాటిలో రూపొందుతారు.

కాని, నిజమైన మాట పలకడం అంటే – ప్రపంచాన్ని మార్చడం అని. అదే పని, అదే కార్యాచరణ. ఆ మాటను పలకడం ఏ కొద్దిమంది హక్కుభుక్తమో కాదు, ప్రతివాళ్ళకీ వున్న హక్కు. ఫలితంగా ఎవళ్ళూ ఒంటరిగా నిజమైన మాటలు అనలేరు. ఏదో శాసితమైన చర్యలాగా మరొకళ్ళ కోసం కూడా అనలేరు; దీనివల్ల ఇతరుల మాటలు కొల్లపోతాయి.

సంభాషణ మనుషులమధ్య భేటీ, ప్రపంచమే దీని మాధ్యమం. ప్రపంచాన్ని గురించి పేర్కోగలందుకు యిది వుంటుంది. అంచేత పేర్కోదలచినవాళ్ళకీ, పేర్కోదలచనివాళ్ళకీ మధ్య సంభాషణ జరగదు – ఇతరులు తమ మాటను పలికే హక్కు లేకుండా తిరస్కరించినవాళ్ళకీ, మాటను పలికే హక్కు తిరస్కృతమైన వాళ్ళకీ మధ్య సంభాషణ జరగదు. తమ మాటను తాము పలికే మౌలిక హక్కు లేకుండా తిరస్కృతమైనవాళ్ళు మొట్టమొదట ఈ హక్కును తిరిగిపొందాలి, అమానవీకరణ దాడి కొనసాగకుండా నిరోధించాలి.

మనుషులు తమ మాటలు మాట్లాడడం ద్వారా ప్రపంచాన్ని పేర్కోవడం ద్వారా, లోకాన్ని మార్చేటట్టయితే, సంభాషణ ఒక మార్గం అవుతుంది. దాని ద్వారా వాళ్ళు మానవ జీవులుగా ప్రాముఖ్యం సంతరించుకుంటారు. ఆ రకంగా సంభాషణ అనేది మనుగడ అవసరం. సంభాషణ ఒక భేటీ. ఇందులో సంభాషణాపరుల ఏకీకృత ఆలోచనలు, ఆచరణలూ ప్రపంచాన్ని ఉద్దేశించినవే అయి వుంటాయి. ఈ ప్రపంచాన్నే మార్చాల్సి వుంది, మానవీకరణం చేయాల్సి వుంది. అంచేత సంభాషణ అనేదాన్ని ఒకళ్ళు తమ

భావనల్ని మరొకళ్ళలో 'నిక్షిప్తం' చేసే పనిగా కుదించకూడదు. అలాగే సంభాషణ చేసేవాళ్ళు "మింగ" గలిగే ఒట్టి భావాల మార్పిడిగానూ వుండకూడదు. అదే విధంగా సంభాషణ అనేది రెండు పక్షాల మధ్య ప్రతిస్పర్థిగా, కోడిగుడ్డుకు యీకలు పీకే వివాదాస్పద చర్చగా వుండకూడదు. ఒక పక్షంవాళ్ళు ప్రపంచాన్ని పేర్కోవడానికిగాని, సత్యాన్వేషణకు బద్ధులయిగాని వుండరు, తాము సత్యాలనుకున్నవాటిని ఇతరుల మీద రుద్దచూస్తారు. సంభాషణ అనేది ప్రపంచాన్ని పేర్కోదలచే స్త్రీ, పురుషుల మధ్య భేటీ కనుక వేరే ఎవళ్ళో మరొకళ్ళ కోసం పేర్కోవడం కుదరదు. ఇదొక సృజనాత్మక చర్య. ఒకళ్ళు మరొకళ్ళు దాష్టీకం చెలాయించచూసే పరికరం కాకూడదు. సంభాషణలో ఆధిపత్యం ఎప్పుడూ సంభాషణాపరుల ప్రపంచమే, మానవాళి విమోచన కోసం ప్రపంచాన్ని జయించడం.

ప్రపంచంపట్ల, ప్రజలపట్ల గాఢమైన అనురాగం లోపించితే సంభాషణ వుండదు. సృజన, పునఃసృజన చర్య అయిన ప్రపంచాన్ని పేర్కోవడం అనేది ప్రేమతో పునీతం కాకపోతే సాధ్యపడదు.[4] సంభాషణకు పునాది ప్రేమ, అదే సంభాషణ కూడా. ఇది తప్పనిసరిగా బాధ్యతాయుతమైన పౌరుల కర్తవ్యం. ఆధిపత్య పరిస్థితిలో అది వుండలేదు. ఆధిపత్యం ప్రేమకు పట్టిన రోగాన్ని వెల్లడి చేస్తుంది; పెత్తందారుల పీడనా నందపు పెత్తనానికి గురైన వాళ్ళ బాధల్లో ఆనందం చూసే జబ్బు. ప్రేమ అనేది సాహసోపేతమైన చర్య, భయం నుంచి వచ్చిందికాదు, అంచేత ప్రేమ అంటే ఇతరులపట్ల నిబద్ధత. పీడితులు ఎక్కడ తటస్థపడినా సరే, ప్రేమ చర్య వాళ్ళ లక్ష్యం కోసమే నిబద్ధం అవడం – విమోచనా లక్ష్యం. ఈ నిబద్ధత, ప్రేమ పూరితం అవడంవల్ల, సంభాషణాత్మకం అవుతుంది. ధైర్యంగల చర్య కాబట్టి ప్రేమ అనేది భావోద్వేగదౌర్బల్యం కాదు. స్వేచ్ఛ చర్యగా ఇది కుహనాలకి సాకుగా వుండకూడదు. ఇతర స్వేచ్ఛాయుత చర్యలను పెంపొందించాలి, లేకపోతే అది ప్రేమే అవదు. పీడక పరిస్థితులకు మంగళం పాడడం ద్వారానే ప్రేమని తిరిగి పాదుకొల్పడం జరుగుతుంది. పీడక పరిస్థితి దీన్ని అసాధ్యం చేస్తుంది. నేను ప్రపంచాన్ని ప్రేమించలేకపోతే – నేను జీవితాన్ని ప్రేమించలేకపోతే – సంభాషణలో పాల్గొలేను.

ఇక అటునుంచి చూస్తే, వినయం లోపిస్తే సంభాషణకు ఆస్కారం వుండదు. ప్రపంచాన్ని పేర్కోవడం అనేది మనుషులు నిరంతరంగా ప్రపంచాన్ని సృజిస్తూనే పునః సృజన చేస్తూనే వుండేది, దురహంకార చర్యకాదు. సంభాషణ అనేది బోధపరచుకోవడం, ఆచరించడం అనే సమష్టి కర్తవ్యాన్ని ఉద్దేశించిన భేటీగా, అందులోని భాగస్వామ్య పక్షాల్లో (ఒక పక్షమైనాగాని) వినయంలోపిస్తే వుండదు. మొదటి వాడు ఏమీ తెలియని అజ్ఞాని అని పరిహసిస్తూ, నా అజ్ఞానాన్ని నేను గుర్తించనపుడు, సంభాషణలో ఎలా పాల్గొగలను?

ఇతరులకంటే నాది ప్రత్యేకపద్ధతి అనే దృష్టితోనే నేను వుంటే ఎలా సంభాషణలో పాల్గొగలను?– ఇతరులలో “నేను” అన్నదాన్ని గుర్తించకుండా వూరికే “అది” పరిగణిస్తూ వుంటే? నాకు నేను ‘పరిశుద్ధ’ మనుషుల బృందంలోవాణ్ణిగా ఎంచుకుంటూ, సత్యజ్ఞానాల ఆధిపత్యం వున్నవాళ్ళ బృందం మనిషిగా ఎంచుకుంటూ, ఇతర సభ్యుల్ని “జన సమూహం”, “శుద్ధి జరగని జనాభా”గా పరిగణిస్తూ వుంటే నేను ఎలా సంభాషణలో పాల్గొగలను? ప్రపంచాన్ని పేర్కోవడం అనేది ఒక కులీన వ్యవహారమనీ, చరిత్రలో ప్రజల సన్నిధి పతనానికి చిహ్నమనీ, ఆ రకంగా దాన్ని తప్పించాల్సివుందనీ అనుకోడం మొదలుపెడితే నేను ఎలా సంభాషణలో పాల్గొగలను? ఇతరుల సేవను, దోహదాన్ని మూసి పెట్టేస్తే – అంతేగాక, తప్పుగా భావిస్తే – నేను సంభాషణలో ఎలా పాల్గొగలను? తొలగిస్తారన్న భయంతో, అసలా వూహకే వేదననీ, దౌర్బల్యాన్నీ కలిగించుకునే నేను సంభాషణలో ఎలా పాల్గొగలను? స్వీయ అర్హతకీ సంభాషణకీ లంగరందదు. స్త్రీగాని, పురుషుడుగాని వినయం లోపిస్తే (లేదా, పోగొట్టుకుని వుంటే) ప్రజల దగ్గరకు చేరలేరు. ప్రపంచాన్ని పేర్కోవడంలో భాగస్వాములు కాలేరు. తనూ ఇతరుల్లాగే మర్త్యుడన్న గుర్తింపులేని ఎవళ్ళైనా సరే– భేటీ బిందువు దగ్గరకు చేరాలంటే ఎంతో దీర్ఘయాత్ర చేయవలసి వుంటుంది. ఆ భేటీ బిందువు దగ్గర ఎవళ్ళూ పరమశుంఠలూ కారు, అచ్చమైన రుషిపుంగవులూ కారు. వాళ్ళు ప్రజలు, అంతే. కలిసి ప్రయత్నం చేస్తున్నారు, అప్పటికి తమకి తెలిసినదానికంటే ఎక్కువ తెలుసుకోవాలని ప్రయత్నం చేస్తున్నారు, అంతే.

ఇంకా సంభాషణకు మానవాళిపట్ల గాఢమైన విశ్వాసం వుండడం అవసరం. సృష్టి, పునస్సృష్టి చేయగల సామర్థ్యంలో విశ్వాసం అది. మరింత మానవత్వ పూరితంగా తయారయ్యే (ఇది ఏ కొద్దిమంది కులీనుల హక్కు మాత్రం కాదు, అందరి జన్మహక్కూనూ) జీవిత లక్ష్యంలో విశ్వాసం అది. ప్రజలపట్ల విశ్వాసం వుండడం, సంభాషణకు ప్రజలపట్ల విశ్వాసం వుండడం కార్యకారణభావన దృష్ట్యా అవసరం, “సంభాషి” అయిన మనిషి, ఇతరుల్ని ముఖాముఖి కలుసుకోకముందే వాళ్ళని విశ్వసిస్తాడు. అయితే, అతని విశ్వాసం అమాయకమైంది మాత్రం కాదు. “సంభాషి” హేతుబద్ధంగా వుంటాడు. సృష్టించడానికీ, మార్పు చేయడానికీ మనుషులకు శక్తి వుంది, కాని పరాయీకరణ చెందిన నిర్దిష్ట పరిస్థితుల్లో వ్యక్తులు ఆశక్తిని వినియోగించడానికి విఘాతం కలుగుతోంది అనీ అతనికి తెలుసు. అయితే, ప్రజలపట్ల విశ్వాసాన్ని ఎంత మాత్రమూ విధ్వంసం చేయకుండానే ఈ అవకాశం అతనికి ఒక సవాల్‌గా తటస్థపడుతుంది. దీనికి అతను ప్రతిస్పందించాలనుకుంటాడు. సృష్టించి, పరివర్తన చేసే శక్తి, కొన్ని నిర్దిష్ట పరిస్థితుల్లో భంగపడినా, పునరుజ్జీవం కాగలదని

అతనికి నమ్మకం కుదురుతుంది. ఆ పునరుజ్జీవన, విమోచన చెందిన శ్రమజీవులు బానిస శ్రమని తోసిరాజనడం ద్వారా, ఏదో దయాధర్మభిక్షంగా కాక, విమోచన కోసం పోరాటంలో పోరాటం ద్వారా జరగొచ్చు – అది జీవితానికి ఉత్సాహాన్ని ప్రసాదిస్తుంది. ప్రజలపట్ల ఈ విశ్వాసం లేకపోయినట్లయితే సంభాషణ ఒక ప్రహసనంగా మారుతుంది, ఇక అది పైతృక కూహకాలకి దిగజారుతుంది.

ప్రేమ, వినయం, విశ్వాసం అనే పునాది మీద ఆధారపడిన సంభాషణ సమాన దృష్టితో, అంటే ఏ ఒక పక్షంవైపూ మొగ్గని, సంబంధంతో వుంటుంది. ఇక్కడ సంభాషితుల మధ్య పరస్పర విశ్వాసం తార్కిక పరిణామంగా వుంటుంది. ఈ పరస్పర విశ్వాసవాతావరణాన్ని కల్పించలేకపోతే సంభాషణ – ప్రేమాస్పదంగా, వినయపూరితంగా, నిండు విశ్వాసభరితంగా వున్న వైరుధ్యపూరితంగా తయారవుతుంది. ప్రపంచాన్ని పేర్కోవడంలో పరస్పర విశ్వాసమే సంభాషితుల్ని మరింత సున్నిత భాగస్వాముల్ని చేస్తుంది. ఇందుకు భిన్నంగా నిధి విధాన విద్యలో సంభాషణా వ్యతిరేక పద్ధతిలో ఇలాంటి విశ్వాసమే లోపిస్తుంది. సంభాషణకు మానవాళిలో విశ్వాసమే ప్రాథమిక అవసరం అవుతుంది, అలాగే సంభాషణవల్ల విశ్వాసం కలుగుతుంది. సంభాషణ కుంటుపడితేగనక, అందుకు తగ్గ పునాది పరిస్థితులు లోపించాయని అర్థం. దొంగప్రేమ, నక్కవినయం, ఇతరులపట్ల నమ్మకం లోపించడం విశ్వాసాన్ని కలిగించవు. యదార్థ, నిర్దిష్ట పరిస్థితి గురించి తన ఉద్దేశాలకు మద్దతుగా చూపించే ఒక పక్షం ఇతరుల ముందు పెట్టే రుజువుల మీద విశ్వాసం ఆధారపడి వుంటుంది. ఆ పక్షంవాళ్ళ మాటలు, చేతల మధ్య సమన్వయం లేకపోతే సంభాషణ బతికి బట్టకట్టదు. చెప్పేది ఒకటి, చేసేది ఒకటి అయితే ఎవళ్ళన్నా అన్న మాటల్ని ఆషామాషీగా తీసుకోవడం జరిగితే విశ్వాసం కలగదు. ప్రజాస్వామ్యం, ప్రజాస్వామ్యం అని స్తోత్రం ఒక పక్క చేస్తూ, మరో పక్క ప్రజల నోరు నొక్కేయడం ప్రహసనం అవుతుంది. మానవత్వం గురించి ధాటిగా మాట్లాడ్డం, మరో పక్క మనుషుల్ని నాస్తీకరించడం పచ్చి అబద్ధం అవుతుంది.

ఆశ లేకుండా నిజమైన సంభాషణ వుండదు. మనుషుల అసంపూర్ణత్వంలోనే ఆశ పాతుకుని వుంది; దాన్నుంచి వాళ్ళు నిరంతరశోధనలో సాగుతారు – ఆ శోధన ఒకళ్ళతో ఒకళ్లు మనసులో మాట చెప్పుకుంటేనే వస్తుంది. నిరాశ ఒక రకమైన నిశ్శబ్దం. ప్రపంచాన్ని కాదనడం. పలాయనం చిత్తగించడం. అన్యాయపూరిత వ్యవస్థవల్ల పుట్టుకొచ్చిన అమానవీకరణం ప్రజల నిరాశకు కారణం కాకూడదు, ఆశకు కారణం కావాలి. అన్యాయం తిరస్కరించిన మానవత్వ గవేషణకే నిరంతరం నడిపించాలి. అలాగని ఆశ అంటే,

భగవదనుగ్రహం కోసం ఎదురు తెన్నులు చూస్తూ కూచోవడంకాదు. పోరాడుతూ వున్నంతకాలం నేను ఆశతోనే వుంటాను. ఆశతో నేను పోరాటం సాగిస్తూ వుంటే నేను నిరీక్షిస్తూ వుండగలను. మరింత మానవత్వ పూరితం కావాలని స్త్రీలు పురుషులూ చూస్తూ, భేటీ అయ్యేదే సంభాషణ. ఇది నిరాశాభరిత వాతావరణంలో కొనసాగదు. తమ ప్రయత్నాలవల్ల ఒరిగేది ఏమీ లేదని సంవాదకులు అనుకుంటే గనక ఆ సంభాషణ–భేటీ శుష్కం అవుతుంది, వట్టిపోతుంది, అధికార పూరితమే అవుతుంది, నిరాసక్తం అవుతుంది.

ఇక చివరిగా, సంభాషణలు విమర్శనాత్మకచింతనలో నిమగ్నం కాకపోయినట్లయితే అసలు సంభాషణ అనేదే వుండదు – ప్రపంచానికీ ప్రజలకీ మధ్య అభేద్యమైన సంఘీభావం విచక్షణ చేసి చూసే చింతన కావాలి. వాటి మధ్య ద్వైధీభావాన్ని అంగీకరించని చింతన కావాలి. యదార్థపరిస్థితిని ఒక జడపదార్థంగా గాక ఒక క్రమంగా, ఒక పరివర్తనగా చూసే చింతన కావాలి. కార్యాచరణ నుంచి విడివడి వున్నట్టు పరిగణించని చింతన కావాలి. ఏం ముంచుకొస్తుందోనన్న భయం లేకుండా నిరంతరం తత్కాలీనతలో నిమగ్నం అయివుండే చింతన. విమర్శనాత్మక ఆలోచనకీ అమాయకపు ఆలోచనకీ మధ్య భేదం వుంటుంది. ఈ అమాయకపు ఆలోచన "చారిత్రక కాలాన్ని ఒక భారంగా, గత అనుభవాల, సంచితాల స్థిరీకరణగా,[5] దాన్నుంచి ప్రకృతం సాధారణీకృతంగా, "మర్యాదప్రవర్తన"తో వుండాలని చూస్తుంది. అమాయకంగా ఆలోచించేవాడికి ముఖ్యం అయింది ఈ సాధారణీకరించిన "యివాళ్టి"తో సర్దుకుపోవడం. విమర్శనాత్మక ఆలోచనా శీలికి ముఖ్యం అయింది యదార్థాన్ని మార్చడం. మనుషుల్ని మానవీకరించడం కొనసాగించడంగా అది సాగుతుంది. పియర్రె ఫర్టర్ మాటల్లో–

ఇక భయంలేదు అనిపించే దానికి అంటిపెట్టుకుపోయి ఐహిక భయాలు తొలగించుకోవడం ఇక ఎంతమాత్రమూ గమ్యంకాదు, కాని దాన్ని ఐహికం చేయడం... ఈ విశ్వం నాకు స్థలంగా నాకు వ్యక్తం అవదు, నేను అనుకూలంగా ఒదిగిపోయేటట్టు చేసే భారీ ప్రత్యక్షతను నెత్తిమీద దించడం కాదు. ఒక అవకాశంగా నేను కార్యాచరణలో వుండగా రూపుతీసుకునే ప్రదేశంగా వెల్లడి కావాలి.[6]

అమాయకపు ఆలోచన గమ్యం ఇలా భయంలేని స్థలానికి గట్టిగా కరుచుకుపోయి వుండడం, దానితో సర్దుకుపోవడం. ఆ రకంగా తత్కాలీనతను కాదనడం, ఫలితంగా తననే కాదనుకోవడం కూడా జరుగుతుంది.

విమర్శనాత్మక చింతన అవసరం అయిన సంభాషణ మాత్రమే విమర్శనాత్మక చింతనను కలిగించగలిగే సామర్థ్యంతో వుంటుంది. సంభాషణ లేకపోతే ఒకళ్ళతో ఒకళ్ళకి (Communication) వ్యక్తీకరణ వుండదు. వ్యక్తీకరణ లేకపోతే అసలైన విద్యా వుండదు. ఉపాధ్యాయుడికీ విద్యార్థికీ మధ్య వున్న వైరుధ్యాన్ని పరిష్కరించగల విద్య ఏ పరిస్థితుల్లో సంభవం? వాళ్ళిద్దరికీ మాధ్యమంగా వున్న వస్తువును గుర్తించగలిగిన చర్యను ఇద్దరూ స్పృశించినప్పుడు. ఆ రకంగా స్వేచ్ఛాసాధనగా విద్య సంభాషణాత్మక స్వభావం, బోధనాత్మక పరిస్థితిలో ఉపాధ్యాయుడు-విద్యార్థి, విద్యార్థుల్ని-ఉపాధ్యాయుల్ని కలుసుకున్నప్పుడు ఆరంభంకాదు. ఉపాధ్యాయులు తను విద్యార్థులను దేన్ని గురించి సంభాషించాలని తమని తాము ప్రశ్నించుకున్నప్పుడు జరుగుతుంది. సంభాషణలో వుండాల్సిన విషయం గురించి ముందే పట్టించుకోవడమే విద్యాకార్యక్రమ వస్తువును నిజంగా పట్టించుకోవడం అవుతుంది.

ఇక సంభాషణ వ్యతిరేక నిధి బోధకుడికి విద్యార్థులకు దేన్ని గురించి దంచాలా అన్న కార్యక్రమం మాత్రమే వుంటుంది. తన ప్రశ్నలకు తనే జవాబు చెపుతాడు. తన కార్యక్రమాన్ని తనే ఏర్పాటు చేసుకుంటాడు. సంభాషణాత్మక, సమస్యా ప్రతిపాదక ఉపాధ్యాయ-విద్యార్థి సంబంధంలో విద్యా కార్యక్రమ వస్తువు అనేది ఒక కానుకా కాదు, నెత్తిమీద రుద్దిందీకాదు - విద్యార్థుల్లో శకలాలుగా సమాచారాన్ని పెట్టడం - వాళ్ళు తాము ఇంకా ఎక్కువ తెలుసుకోవాల్సి వున్న విషయాల[7] గురించి వ్యక్తులకు వ్యవస్థీకృతమైన, క్రమబద్ధమైన, అభివృద్ధి చెందిన "పునఃప్రతిపాదన" అవుతుంది.

ప్రామాణిక విద్య 'బి' కోసం 'ఎ' జరిపించలేదు. లేదా 'బి' గురించి 'ఎ' జరిపించలేదు, 'బి'తో కలిసి 'ఎ' జరిపించగలదు. దీని మాధ్యమం మాట- ఉభయపక్షాలలో నాటుకుని, సవాల్‌గా వుండేమాట, దీనివల్ల అభిప్రాయుత దృక్పథాలూ ఏర్పడతాయి. ఈ దృక్పథాల్లో ఆందోళనలు, సందేహాలు, ఆశలు, నిరాశలు నిబిడీకృతమైవుంటాయి. ప్రముఖమైన చర్చనీయాంశాలు గర్భితంగా వుంటాయి. వీటి ఆధారంగా విద్యాకార్యక్రమ వస్తువును రూపొందించగలం. ఆదర్శం ఏమిటీ అంటే- "సచ్ఛీలుడైన మనిషి"ని తయారు చేయడం. ఆ కోరికతో అమాయకపు మానవత్వం తరచూ అసలైన ప్రజల నిర్దిష్ట, అస్తిత్వపూరిత, ప్రకృత పరిస్థితిని పరిగణనలోకి తీసుకోదు. పియర్రె ఫర్టర్ ప్రామాణిక మానవత్వం ఎలా వుండాలో చెప్పాడు. అది మన పరిపూర్ణ మానత్వం గురించి ఎరుక ఆవిర్భవించే అవకాశంలో వుంటుంది. అది ఒక నిబంధన, ఒక విధాయకం, ఒక సన్నివేశం, ఒక ప్రణాళిక.[8] మనం శ్రామికుల దగ్గరకు పట్టణవాసిగాని, రైతుగాని[9]

– నిధి విధాన శైలిలో అలా వెళ్ళి 'జ్ఞానాన్ని' ఇవ్వలేం, లేదా మనమే వండి సిద్ధం చేసిన కార్యక్రమం వస్తువులో వున్న "సచ్చీలుడి నమూనా"ను రుద్దలేం. ఎన్నో రాజకీయ పథకాలు, విద్యావిధాన పథకాలు కాళ్ళు విరగ్గొట్టుకున్నాయి ఎందుకంటే వాటికి పథక రచన చేసినవాళ్ళు యదార్థ పరిస్థితి గురించి తమ బుర్రల్లో వున్న అభిప్రాయాలనే ఆ పథకాల్లో ఇరికించారు. ఒక్కసారి కూడా "ఆ పరిస్థితిలో వున్న మనుషుల్ని" పరిగణనలోకి తీసుకోలేదు (తాము చేసే పనులకు వస్తువులుగా మాత్రం తప్ప); ఆ మనుషులెవరంటే తమ పథకాలకి లక్ష్యం ఎవరో వాళ్ళు.

అసలైన మానవతావాదిగా వుండే ఉపాధ్యాయుడికి నడుం బిగించి విప్లవవానికి మార్చవలసి వున్న యదార్థ పరిస్థితే కార్యాచరణ రంగం అవుతుంది. ఇతరులతో కలిసి వాళ్ళు ఈ పరివర్తన జరిపించాలి. ఇతరులు కాదు. పీడకులు ప్రజల్ని బుద్ధి శుద్ధి చేస్తూ వాళ్ళతో వ్యవహరిస్తారు. వేలు పెట్టి ముట్టుకోవడానికి లేకుండా ఈ యదార్థ పరిస్థితితోనే వాళ్ళు సర్దుకుపోవాలి. అయితే, దురదృష్టవశాత్తూ విప్లవకార్యాచరణ కోసం ప్రజల తోడ్పాటు కోరుకునే దృష్టితో, విప్లవ నాయకులే ఆమూలాగ్రం ప్రాయోజిత కార్యక్రమ వస్తువు వుండే నిధి పంథాలో పడిపోతూ వుంటారు. వాళ్ళు పట్టణ ప్రజల్ని, రైతు జనాల్ని కార్యక్రమాల్లో చేత్తో పట్టుకుని సమీపిస్తారు. అవి ప్రపంచం గురించి తమకు వున్న దృక్పథంతో సరితూగుతాయి. ప్రజల దృక్పథంతో[10] కాదు. ప్రజల నుంచి కొల్లగొట్టిన మానవత్వాన్ని తిరిగి సంపాదించడానికి ప్రజల పక్షాన పోరాడ్డమే ప్రాథమిక లక్ష్యం అని భావించాలిగాని తమవైపు "ప్రజల్ని లాగేసుకోవడం" కాదు. ఇలాంటి మాటలు విప్లవ నాయకుల పదజాలంలో వుండకూడదు. పీడకుల పక్షానివి అవి. విప్లవకారుడి పాత్ర ఏమిటంటే విమోచన చేయడం, విమోచన పొందడం, అదీ ప్రజలతో– అంతేగాని వాళ్ళని తమ వైపు లాక్కోవడం కాదు.

ఇక కులీనవర్గాల రాజకీయ కార్యకలాపం వుంటుంది. ఇక్కడ వాళ్ళు పీడితులలో స్తబ్ధతను ప్రోత్సహించడానికి నిధి భావనను వినియోగించుకుంటారు. అది పీడితుల చైతన్య స్థితి "మునిగిపోవడం"తో అనురూపంగా వుంటుంది. ఈ స్తబ్ధతను ఆధారం చేసుకుని ఆ చైతన్యాన్ని నినాదాలతో "నింపేం"దుకు చూస్తారు. దాంతో పీడితులకు స్వేచ్ఛ అంటే మరింత భయం కలుగుతుంది. ఇలాంటి పని నిజమైన విమోచనా కార్యకలాపంతో పొసగదు. పీడకుల నినాదాలని ఒక సమస్యగా ముందు పెట్టి, ఆ రకంగా పీడితులలో వుండే నినాదాలనే వాళ్ళ నుంచి "బయటకు" తోసేస్తుంది. మానవతావాదుల కర్తవ్యం వాళ్ళ నినాదాలని పీడకుల నినాదాలతో పోటీ పెట్టడం

కాదుకదా? పీడకులకు పీడితులు ప్రయోగక్షేత్రంగా వుంటారు, ఇవాళ మొదటి బృందం నినాదాలకి "మకాం" ఇవ్వడం, రేపు అవతలి వాళ్ళ నినాదాలకి ఇవ్వడం వాళ్ళపని. ఇందుకు భిన్నంగా మానవతావాదుల కర్తవ్యం ఏమిటీ అంటే– పీడితులు చైతన్యపూరితం అయ్యేటట్టు చూడ్డం. వాళ్ళు ద్వంద్వ జీవులుగా తమలో పీడకులకి "మకాం" యిచ్చినంత కాలం, అసలు సిసలైన మానవులు కాలేరు అన్న చైతన్యం వాళ్ళకి కలిగేటట్టు చూడ్డం.

ఈ కర్తవ్యంలో ఇంకో భావన గర్భితమైవుంది. "ముక్తి" సందేశం చేతిలో పెట్టుకుని అందించేందుకుగాను విప్లవ నాయకులు వెళ్ళరు. తమ ఉభయుల "యదార్థపరిస్థితి" ఎలా వుందో, ఆ పరిస్థితి గురించిన "ఎరుక" ఏమిటో వాళ్ళతో సంభాషణ ద్వారా తెలుసుకుందుకు వెళ్ళాలి. ఈ పరిస్థితి గురించి వాళ్ళ అవగాహనలో అనేక అంతరాలు వుంటాయి. వాళ్ళు వుంటూ వున్న ప్రపంచం గురించి, ఎలాంటి ప్రపంచంతో తాము వుంటున్నారో దాన్ని గురించి వాళ్ళ ఎరుకలో అంతరాలు వుంటాయి. ప్రపంచం గురించి ప్రజలకు వున్న ఆ ఫలానా దృక్పథాన్ని మన్నించలేకపోతే, ఆ విద్యావిధానం నుంచిగాని రాజకీయ కార్యక్రమం నుంచి గాని అనుకూలమైన ఫలితాలు పొందడం కష్టం. అలాంటి కార్యక్రమం సాంస్కృతిక దాడి[11] అవుతుంది, సదుద్దేశాలు ఎన్నైనా వుండచ్చు.

విద్యాపరమైన, రాజకీయ కార్యాచరణలో వస్తువును ఎలా వ్యవస్థీకరించాలీ అన్నదానికి ఆరంభం ప్రజల ఆకాంక్షల్ని ప్రతిబింబించే ప్రకృత, జీవన, నిర్దిష్ట పరిస్థితి అయివుండాలి. కొన్ని మౌలిక వైరుధ్యాల్ని ఉపయోగించుకుంటూ ప్రజలకు ఈ జీవన, నిర్దిష్ట, ప్రకృత పరిస్థితిని ఒక సమస్యగా ప్రతిపాదించాలి. అది వాళ్ళని నిలదీస్తుంది, ప్రతిస్పందన అవసరం అవుతుంది – ఏదో బౌద్ధిక స్థాయిలో కాదు, కార్యాచరణ స్థాయిలో.[12]

మనం ఎప్పుడూ వూరికే ఈ ప్రకృత పరిస్థితి గురించి ఉపన్యాసం దంచకూడదు. ప్రజల వ్యావృత్తితో, సందేహాలతో, ఆశలతో, భయాలతో ఏ సంబంధమూ లేని, లేదా అంటీ ముట్టనట్టు వుండే కార్యక్రమాల్ని వాళ్ళముందు వుంచకూడదు – ఒకే సందర్భంలో పీడితుల చైతన్యంలో వున్న భయాల్ని నిజానికి ఎక్కువ చేసే కార్యక్రమాలు. ప్రపంచం గురించి నా మనసులో వున్న అభిప్రాయం ఇదీ అనిగాని, వాళ్ళ మీద ఆ అభిప్రాయాల్ని రుద్దే ప్రయత్నం చేయడంగాని మన పని కాదు. వాళ్ళతో సంభాషించాలి. మన భావాలేమిటో వాళ్ళ భావాలేమిటో ప్రజలతో చర్చించాలి. వాళ్ళ కార్యాచరణలో అనేక విధాలుగా వెల్లడి అయ్యే వాళ్ళ ప్రపంచ దృక్పథం ప్రపంచంలో వాళ్ళున్న "పరిస్థితి"ని ప్రతిబింబిస్తుందని మనం గుర్తించాలి. ఈ పరిస్థితిని సవిమర్శకంగా గుర్తించలేని విద్యా కార్యక్రమంగాని,

రాజకీయ కార్యాచరణగాని "నిధి" పద్ధతికి గురయ్యే ప్రమాదంతో వుంటాయి. లేదా మరుభూమిలో మాటలు చల్లడమనే ప్రమాదంతో వుంటాయి.

తరచుగా విద్యావేత్తలు, రాజకీయ వాదులూ మాట్లాడుతూ వుంటారు. కాని అవి ఎవళ్ళకైనా అర్థమైతేకదా? ఏమంటే, ఎవళ్ళకి ఉపన్యాసంయిస్తున్నారో ఆ ప్రజల నిర్దిష్ట పరిస్థితికి వాళ్ళ భాష ఆమడ దూరంలో వుంటుంది. ఆ రకంగా వాళ్ళ ప్రసంగం దూరస్థంగా వుంటుంది, దూరస్థం చేసే పద గుంఫనతో వుంటుంది. ఉపాధ్యాయుల భాషా, రాజకీయవాదుల భాషా (రాజకీయవాది కూడా బోధకుడు కావాలన్న విషయం రానురాను మరీ స్పష్టం అవుతోంది. అంటే, ఆ పదానికి వున్న విస్తృత అర్థంలోనే) ప్రజల భాషలాగా ఆలోచన లేకుండా నిలబడలేదు. ఇక ఆ భాషగాని, ఆ ఆలోచనగాని అవి ఉద్దేశించే నిర్మాణం లేకుండా వుండవు. ప్రయోజనాత్మక వ్యక్తీకరణ కోసం విద్యావేత్త, రాజకీయవాది ఆ ఆలోచనా, ఆ భాషా ప్రజలలో గతితార్కికంగా ఎలా ఏర్పడి వున్నాయో ఆ నిర్మాణ పరిస్థితి అర్థం చేసుకోవాలి.

యదార్థ పరిస్థితే ప్రజల మధ్య మాధ్యమంగా వుంటుంది. ఆ యదార్థ పరిస్థితి గురించి ఉపాధ్యాయుల అవగాహన ఎలా వుంది, ప్రజల అవగాహన ఎలా వుంది తెలియాలంటే విద్యలో వున్న కార్యక్రమ విషయం మనం తెలుసుకోవాలి. నేను "చర్చించవలసిన విషయ విశ్వం"[13] "ఉత్పాదక విషయాంశాల సముదాయం" అని నేను వ్యవహరించిన సంగతిని శోధించాలి. అదే వాళ్ళ స్వేచ్ఛాసాధనాంశంగా విద్యలో సంభాషణకు తలుపు తెరుస్తుంది. ఆ శోధన విధానం కూడా సంభాషణాత్మకంగా వుండాలి. చర్చించవలసిన సంగతులు ఎలా ఉద్భవిస్తున్నాయో, ఈ అంశాలకు సంబంధించి ప్రజల చైతన్య ప్రేరణ ఎలా వుందో తెలుసుకునే అవకాశాన్ని అందిస్తూ వుండాలి. సంభాషణాత్మక విద్య విమోచనా లక్ష్యంతో వుంటుంది. శోధించవలసిన విషయం అందుకు సమతూకంతో వుండాలి. దీని లక్ష్యం వ్యక్తులు కాదు (శరీర నిర్మాణతత్వంలా) ఆ వ్యక్తులు యదార్థ పరిస్థితిని సూచించడానికి వాడే ఆలోచన – భాష. వాళ్ళు ఏ యే స్థాయిల్లో ఆ యదార్థ పరిస్థితిని అవగాహన చేసుకుంటారో అది ముఖం. ఏ ప్రపంచ దృక్పథం వుంటుందో అది, అలాంటి ప్రపంచంలోనుంచే వాళ్ళ "ఉత్పాదక విషయాలు" వుంటాయి.

మరింత సూటిగా చెప్పాలంటే "ఉత్పాదక విషయం" గురించి వివరించే పని చేయాలి. "కనీస విషయ విశ్వం" (minimum thematic) అంటే ఏమిటో కూడా ఇది స్పష్టం చేస్తుంది. ఇలా వివరించే ముందు కొన్ని ప్రాథమిక ఆలోచనల్ని ముందు పెట్టడం అవశ్యం విధాయకం అని నాకనిపిస్తుంది. ఉత్పాదక విషయం అన్న భావన

నిరంకుశజోక్యంగాని, రుజువు చేయవలసిన క్రియాశీల పరికల్పనగాని కాదు. రుజువు చేయవలసిన క్రియాశీల పరికల్పనే అయినట్లయితే గనక, ప్రాథమిక విచారణ ఆ విషయ స్వభావాన్ని ధృవపరచుకోవాలని చూడదు, అసలు ఆ విషయాలు వున్నాయా, రద్దయ్యాయా అని చూస్తుంది. అలాంటి సందర్భంలో ఆ విషయ పుష్కలత్వం. దాని ప్రాముఖ్యం, దాని బహుముఖీనత, దాని పరివర్తనలు, దాని చారిత్రక రూపం వంటి వాటిని అర్థం చేసుకునే ప్రయ త్నానికి ముందు, అది వస్తుగత వాస్తవమా కాదా అని మనం ధృవపరచుకోవాలి. సవిమర్శక సందేహ దృక్పథం ధర్మబద్ధమే అయినా, ఉత్పాదక అంశాలు యదార్థాన్ని ధృవపరచుకోవడం సాధ్య పడదు– ఒకళ్ళ జీవితానుభవం నుంచే కాదు, మానవ – ప్రపంచ సంబంధ సవిమర్శక ఆలోచన ద్వారా కూడా సాధ్యపడదు, ఇందులో గర్భితం అయి వున్న ప్రజల మధ్య సంబంధాలనిబట్టి కూడా సాధ్యపడదు.

ఈ అంశం గురించి మరింత శ్రద్ధపెట్టి చూడాలి. అసంపూర్ణ జీవిగా, తన చర్యల గురించేగాక, తన ఆలోచనను లక్ష్యంగా తననే పరిశీలించుకోగలవాడు మానవుడొక్కడే. ప్రాథమిక విచారణ అని– యిది మరీ సాధారణ అంశంగా కనిపించినా – గుర్తుంచుకోవాలి. ఈ సామర్థ్యమే అతన్ని ఇతర జంతువుల నుంచి వేరు చేస్తుంది. అవి తమనీ, తమ చర్యలనీ విడివిడిగా చూసుకోలేవు. పైపై వున్న, పీడితకన్పించే ఈ అంశంలోనే ప్రతివాళ్ళ జీవితకాలంలోనూ, వాళ్ళ చర్యలకు పరిమితులు గీసే హద్దులు వున్నాయి. జంతుజాల కార్యకలాపాలు వాటి విస్తరణే కావడంవల్ల ఆ కార్యకలాప ఫలితాలు వాటి నుంచి అభిన్నంగా వుంటాయి. జంతువులు లక్ష్యాలను నిర్దేశించుకోలేవు. వాటికి ప్రాకృతిక పరివర్తన ఆవల ఏ ప్రాముఖ్యతనూ సాధించలేవు. అంతేగాక, ఆ కార్యకలాపం జరిపించే “నిర్ణయం” వాటిదికాదు, మొత్తం వాటి జాతికి వర్తిస్తుంది. ఆ రకంగా జంతువులు “వాటి అస్తిత్వంలోనే వుండేవి.”

జంతువులు వాటికి అవిగా నిర్ణయించుకోలేవు. తమని గాని, తమ కార్యకలాపాల్నిగాని వస్తుగతం చేసుకోలేవు. తాము నిర్దేశించుకున్న గమ్యాలూ వుండవు. తాము ఏ పరమార్థమూ కల్పించుకోలేని ప్రపంచంలో మునిగిపోయి వుంటాయి. వాటికి ఒక ‘ఇవాళా’ లేదు, ఒక ‘రేపూ’ లేదు. అని తలమునకలుగా ప్రస్తుతంలోనే వుంటాయి. ఆ రకంగా జంతువులు అచారిత్రకం అవుతాయి. వాటి అచారిత్రక జీవితం, కచ్చితమైన అర్థంలో తీసుకుంటే “లోకం”లో వుండదు; జంతువుకు సంబంధించి యీ ప్రపంచం “నేను” “నేను–ఇతర” వంటి ఏ తేడాలతోనూ వుండదు. మానవ ప్రపంచం చారిత్రక అస్తిత్వంలో అదిగా వుండేందుకు తాను కర్తగా వుంటుంది. జంతువులు వాటిని ఎదుర్కొనే

ఆకారంతో ప్రతిఘటనకు గురికావు, ఉత్ప్రేరకం అవుతాయంతే. వాటి జీవితం ప్రమాదభరితం కావాలని లేదు. ప్రమాదాలు అందుకునే స్పృహే వాటికీ వుండదు. ప్రమాదాలు ఆలోచనలతో గ్రహించే సవాళ్ళు కావు, వాటిని సూచించే చిహ్నాలతో "గుర్తించడం" జరుగుతుంది. ఆ రకంగా నిర్ణయాలు తీసుకునే ప్రతిస్పందన అవసరం వాటికి లేదు.

ఫలితంగా జంతువులు తమకిగా దేనికీ బద్ధులు కాలేవు. వాటి అచారిత్రక పరిస్థితి జీవితానికి "సంబంధించి" కార్యక్రమానికి పూనుకునేటట్టు చేయలేదు. అవి పూనుకోలేవు కాబట్టి. జీవితాన్ని అవి నిర్మించలేవు. అవి నిర్మించలేవు కాబట్టి, జీవితరేఖల్ని మార్చలేవు. జీవితంవల్ల నాశనం అవుతామనీ అవి గ్రహించలేవు. తమకు 'బోలు'గా వున్న ప్రపంచాన్ని అర్థవంతమైన, ప్రతీకాత్మక ప్రపంచంగా విస్తరించుకోలేవు. ఇలాంటి విస్తరిత ప్రపంచంలో సంస్కృతి, చరిత్ర వుంటాయి. ఫలితంగా జంతువులు 'జాంతవీకరణం' చేసుకోలేవు – తమని జాంతవీకరణం చేసుకుందుకుగాను – యిదే జరగనప్పుడు ఇక 'అజాంతవీకరణమూ' చేసుకోలేవు. అడవిలో కూడా అవి తమ అస్తిత్వ జీవులుగానే వుంటాయి. జంతు ప్రదర్శనశాలలో మాదిరి అక్కడా జంతువులాగే వుంటాయి.

ప్రజలు ఇందుకు విరుద్ధం – తమ కార్యకలాపాల గురించి వారికి ఎరుక వుంటుంది. వాళ్ళు వున్న లోకం గురించిన స్పృహ వుంటుంది. నిర్ణయాలు తీసుకునే అధికారం తమకే వుంటుంది. ప్రపంచంతో వాళ్ళకి వున్న సంబంధాల గురించి, ఇతరులతో వాళ్ళకి వున్న సంబంధాల గురించి నిర్ణయించుకునే అధికారం వాళ్ళకి వుంటుంది. తమ సృజనశీల ఉనికితో ప్రపంచాన్ని, మార్చే సాధనాల ద్వారా, ప్రేరేపించే శక్తి వాళ్ళకి వుంది – జంతువుల మాదిరి బతకడమే కాదు, జీవిస్తారు.[14] మనుషుల మనుగడ చారిత్రకం. జంతువులు తాత్కాలిక, నిస్సార, ఏకమాత్రపు 'ఆధారం'తో బతికేస్తాయి. మనుషులు అలాకాదు, నిరంతరం పునస్సృష్టి చేస్తూ పరివర్తన జరిపిస్తూ వుండే లోకంలో వాళ్ళు వుంటారు. జంతువులకు ఇక్కడ వున్నది ఒక ఆవాసం మాత్రమే, దాంతో అవి సంబంధం కలిగించుకుంటాయి. మనుషులకు సంబంధించి 'ఇక్కడ' అనేది ఒట్టి భౌతిక ప్రదేశమేకాదు, ఒక చారిత్రక ప్రదేశం కూడా.

కచ్చితంగా చెప్పాలంటే జంతువుకు 'ఇక్కడ', 'ఇప్పుడు', 'రేపు', 'నిన్న' అనేవి వుండవు. వాటి బతుకు చైతన్యరహితం అయి, ముందే పూర్తిగా నిర్ణయమై పోయి వుంటుంది. 'ఇప్పుడు', 'ఇక్కడ', 'అక్కడ' అనే పరిమితులని అధిగమించలేవు.

అయితే, మానవులు అలాకాదు, తమ గురించిన ఎరుకా వాళ్ళకి వుంటుంది, ఆ రకంగా ప్రపంచం గురించిన ఎరుకా వుంటుంది –మానవులు చైతన్యవంతులు – వాళ్ళు పరిమితుల విధి నిర్ణాయకతకీ, తమ స్వాతంత్ర్యానికీ మధ్య ఒక గతితార్కిక సంబంధంతో వుంటారు. వాళ్ళు ప్రపంచాన్ని తమ నుంచి విడిగా చేసుకుంటారు. అలా చేస్తూ దాన్ని దానిగా వుండే వస్తుగత దృష్టితో చూస్తారు. తమ కార్యకలాపాల నుంచి తమని విడిగా చేసుకుంటూ, తమలోనే తమ నిర్ణయాల స్థానాన్ని స్థాపించుకుంటూ, ఇతరులతో లోకంతో తమ సంబంధాల్ని స్థాపించుకుంటూ, ప్రజలు తమని పరిమితం చేసే సన్నివేశాల్ని అధిగమిస్తారు. “పరిమిత–సన్నివేశాలు”[15] అవి సంకెళ్ళు అని మనిషి గుర్తించినపుడు, తమ విమోచనకు గుదిబండలు అని ఒకసారంటూ గుర్తించినపుడు, యీ సన్నివేశాలు నేపథ్యం నుంచి ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. ఒక ఫలానా పరిస్థితికి చెందిన నిర్దిష్ట చారిత్రక పార్శ్వంగా వెల్లడవుతూ వుంటాయి. స్త్రీ, పురుషులు తమ చర్యలతో యీ సవాళ్ళకి ప్రతిస్పందిస్తారు. దీన్ని వియేరియా పింటో “పరిమిత–చర్యలు” అంటారు. ఆ “అందించిన” దాన్ని నోరుమెదపకుండా నెత్తిమీద పెట్టుకోవడం కాకుండా రద్దు చేసి, లొంగదీసుకునేందుకు నడిపించే చర్యలు అవి.

ఆ రకంగా నిరాశావాతావరణాన్ని కల్పించేవి యీ “పరిమిత – సన్నివేశాలు” కావు, కాని ఒక ఫలానా చారిత్రక సన్నివేశంలో స్త్రీ, పురుషులూ వాటిని ఎలా గ్రహిస్తారన్నదే విషయం : అవి సంకెళ్ళుగా, అధిగమించలేని అవరోధాలుగా గుర్తిస్తున్నారా లేదా అన్నదే విషయం. సవిమర్శనే గ్రహణ చర్చలలో వుంది, ఆశ, స్థైర్యం అభివృద్ధి చెందుతాయి, ఈ పరిమిత–సన్నివేశాన్ని అధిగమించే ప్రయత్నం వైపు మనుషులను నడిపిస్తాయి. ఈ లక్ష్యాన్ని నిర్దిష్ట, చారిత్రక యదార్థ పరిస్థితిలో నిర్వహించే కార్యాచరణతోనే సాధించవచ్చు. ఈ నిర్దిష్ట, చారిత్రక యదార్థంలోనే చారిత్రకంగా పరిమిత–సన్నివేశాలు వుంటాయి. ఈ యదార్థ పరిస్థితిని మార్చి, ఈ సన్నివేశాల్ని తొలగించినప్పుడు కొత్తవి వస్తాయి, అప్పుడు మళ్ళీ కొత్త పరిమిత–సన్నివేశాలు వస్తాయి.

జంతువుల ఆధారిత ప్రపంచంలో పరిమిత–సన్నివేశాలనేవి వుండవు. వాటి అచారిత్రక లక్షణం అందుకు కారణం. పైగా జంతువులకు పరిమిత–చర్యలను నిర్వహించే సామర్థ్యం వుండదు. ఇలాంటి చర్యలకు ప్రపంచంపట్ల నిర్ణాయకమైన దృక్పథం వుండాలి. ప్రపంచాన్ని మార్చగలందుకుగాను ప్రపంచం నుంచి వేర్పాటు, దాన్ని వస్తుగతం చేయడం అన్నమాట. స్వభావతః ఈ ఆధారప్రాయమైందానితో బంధితం అయిపోయి జంతువులు తమకీ, ప్రపంచానికీ మధ్య భేదం ఏర్పాటు చేసుకోలేవు. ఆ రకంగా జంతువులు

పరిమిత–సన్నివేశాలతో సీమితం కావు – ఈ సన్నివేశాలు చారిత్రకం – మొత్తం ఆధారభూతమైందానితో అవుతాయి. అంచేత జంతువులకు నప్పినపాత్ర వాటి ఆధారభూతమైనదానికి సంబంధించుకోవడం కాదు (అలాంటి సమయంలో, ఆధారభూతం అయ్యేది ప్రపంచమే). దానికి అనురూపంగా వుండడం. ఆ విధంగా జంతువులు ఒక గూడు, ఒక తుట్టె, ఒక బొరియ "ఉత్పత్తి" చేసుకుంటాయిగాని, అవి పరిమిత–చర్యల ఫలితం అయిన ఉత్పత్తుల్ని సృష్టించుకోలేవు, అంటే, ప్రతిస్పందనల్ని మార్చుకోవడం. వాటి ఉత్పత్తి కార్యకలాపం ఒక భౌతిక తృప్తికి లోబడే వుంటుంది, అది వూరికే ప్రేరకం మాత్రమే, ఎదిరించి నిలబడే దానికంటే, "ఒక జంతువు ఉత్పత్తి దాని శరీర తక్షణ అవసరాలకి చెందిందే, మరి మనిషైతే స్వేచ్ఛగా తన ఉత్పత్తిని ఎదుర్కొంటాడు"[16].

ఒక జీవి కార్యకలాప ఫలితంగా వచ్చిన ఉత్పత్తులు మాత్రమే – అవి భౌతిక శరీరానికి చెందినవే అవవు. (ఆ ఉత్పత్తులకు దాని ముద్ర వున్నాగానీ), ఆ రకంగా అది ప్రపంచం అవుతుంది. అలాంటి ఉత్పత్తి చేయగల సమర్థత వున్న జీవి ( ఆ రకంగా తన గురించి తనకి విధాయకంగా ఎరుక వుంటుంది, "తన కోసమే అస్తిత్వం"), తన సంబంధిత ప్రపంచంలో అస్తిత్వ క్రమంలో లేకపోతే ఆమెగాని, అతనుగాని అస్తిత్వంతో వుండరు. అస్తిత్వ రహితమైనప్పుడు ప్రపంచమే యిక వుండదు.

జంతువులు తమ నుంచి విడిగా ఉత్పత్తులు సృష్టించవు (వాటి కార్యకలాపం పరిమిత–చర్యలతో వుండవు కాబట్టి)– మరి మానవాళి – ప్రపంచం మీద తాము జరిపే కార్యకలాపాల ద్వారా సంస్కృతీ, చరిత్రల రాజ్యాన్ని సృష్టించగలదు. ఈ రెండింటి మధ్యా భేదం ఏమిటంటే– మానవాళి కార్యాచరణ అస్తిత్వంలో వుంది. మానవులు మాత్రమే కార్యాచరణ శీలురు. వాస్తవ పరిస్థితిని నిజంగా మార్చగలిగే కార్యాచరణ, చింతన అనేదిగా కార్యాచరణ జ్ఞానానికీ, సృజనకీ మూలాధారం. జంతువుల కార్యకలాపానికి కార్యాచరణత వుండదు. అంచేత సృజన వుండదు, మనుషులకే పరివర్తనాత్మక కార్యకలాపం వుంటుంది.

మానవులు పరివర్తన చేసే, సృజన చేసే జీవులుగా, యదార్థ పరిస్థితుల్లో శాశ్వత సంబంధాలతో వుంటారు. పాదార్థికమైన వాటినేగాకుండా – ఇంద్రియస్పర్శరూప గ్రహణ వస్తువులైన – సాంఘిక సంస్థల్ని, భావాలని సృష్టిస్తారు.[17] తమ కార్యాచరణ కొనసాగించడం ద్వారా స్త్రీ పురుషులు ఏకకాలంలోనే చరిత్రనూ సృష్టిస్తారు, చారిత్రక–సాంఘిక అస్తిత్వం వున్నవాళ్ళుగా అవుతారు. మానవులు జంతువులకు భిన్నంగా – కాలాన్ని పరిణామయుతం చేస్తారు కాబట్టి గతం, వర్తమానం, భవిష్యత్తులుగా చేస్తారుకాబట్టి వాళ్ళ చరిత్ర, వాళ్ళు సృష్టించిన ప్రయోజనంలోనే, అభివృద్ధి చెందుతోంది. అదొక నిరంతరం పరివర్తనా

క్రమంగా సాగుతుంది. ఇందులోనే మహత్తర అంశాలు రూపు దిద్దుకుంటాయి. ఈ మహత్తర అంశాలు కాలంలో మూసుకుపోయిన దశలు కావు. అచల కుహరాలు కావు. దానికి ప్రజలు సీమితమూ అవరు. అదే జరిగేటట్టయితే, చరిత్ర ప్రాథమిక నియమమైన నిరంతరాయత – అదృశ్యమైపోతుంది. అందుకు భిన్నంగా చారిత్రక నిరంతరాయత చలన సూత్రాలలో మహత్తర అంశాలు పరస్పరం కలిసిపోతాయి.[18]

ఒక యుగం వుంది. సంక్లిష్ట భావాలు, భావనలు, ఆశలు, సందేహాలు, విలువలు, ప్రతిఘటనలు వాటి ప్రతిస్పర్ధి అంశాలతో గతితార్కిక ప్రతిచర్యలతో వుండడం వాటి విశిష్టత. ఇవన్నీ ఒక సమగ్రత కోసం నడుంకడతాయి. ఎన్నో భావాల, విలువల, భావనల, ఆశల నిర్దిష్ట ప్రాతినిధ్యం, అలాగే సంపూర్ణ మానవీకరణలో మనుషులకు ఎదురయ్యే అడ్డంకులు యుగాల సారాన్ని నిర్దేశిస్తాయి. ఈ సారభూత విషయాల్లో ఇతర విషయాలూ గర్భితమై వుండచ్చు. అవి స్పర్థించుకొనేవి కావచ్చు, ఇంకా చెప్పాలంటే విరుద్ధ స్వభావంతో కూడా వుండొచ్చు. నిర్వర్తించి, సాధించుకోవలసిన కర్తవ్యాలన్నీ అవి సూచించవచ్చు. ఆ రకంగా చారిత్రక సారభూత విషయాలు ఎప్పుడూ విడివిడిగా కేటాయింపై వుండవు. వాటికిగా అవి వుండవు. శకలాలుగా వుండవు. స్థిరోభవ వరదోభవ అంటూనూ వుండవు. అవి సర్వదా వాటి ప్రతికక్షిగా వున్నవాటితో గతితార్కిక పరస్పర చర్యలతో వుంటాయి. ఈ విషయాలు మానవ–ప్రపంచ సంబంధంలో తప్ప మరెక్కడా కనిపించవు. ఒక యుగంలో పరస్పర చర్యలతో వున్న విషయ సముదాయమే దాని "విషయపూరిత విశ్వం" అవుతుంది.

ఈ "విశ్వ సంబంధి విషయాలు" ఒక గతితార్కిక వైరుధ్యం నిలదీసి పెట్టినపుడు, ప్రజలూ అంతే వైరుధ్య పూరిత స్థానాలు తీసుకుంటారు. కొందరు వున్న నిర్మాణాల్ని అలానే వుంచచూస్తారు, కొందరు వాటిని మార్చాలని చూస్తారు. ఈ విషయాల మధ్య ఒక ప్రతికూలత ఏర్పడుతుంది. ఆ విషయాలు యదార్థ పరిస్థితిని ప్రతిబింబించేవేకదా! అప్పుడు ఆ విషయాలనీ, ఆ యదార్థాన్నీ మార్మికం చేసే ధోరణి తలెత్తుతుంది. అహేతుక వాతావరణం, పాక్షిక దృష్టి స్థాపితమవుతాయి. ఈ వాతావరణం ఆ విషయాలలోని గాఢమైన ప్రాముఖ్యాన్ని హరించి, వేరే ప్రమాదాన్నీ, వాటి చలనశీల విశిష్ట అంశాన్నీ గుల్ల చేసే ప్రమాదాన్ని కలిగిస్తుంది. అలాంటి పరిస్థితిలో అభూత–కల్పనా అహేతుకతే మౌలిక అంశం అయిపోతుంది. ప్రపంచాన్ని గురించిన సవిమర్శక, చలనశీల దృక్పథం దీనికి ప్రతిస్పర్థిగా వుండే విషయం కదా? అది యదార్థం ముసుగు తొలగించడానికి ప్రయత్నిస్తుంది, దాని మార్మికతను బట్టబయలు చేసే యత్నం చేస్తుంది. మానవకర్తవ్య

పరిపూర్తి సాధనకు యత్నిస్తుంది. యదార్థ పరిస్థితిని ప్రజావిమోచనకు అనుకూలించేటట్టు చేసే శాశ్వతవర్తనే ఆ కర్తవ్యం.

అంతిమ విశ్లేషణలో, ఈ విషయాలు (thems)[19] పరిమిత సన్నివేశాల్ని కలిగి వుంటాయి, వాటిలో వుండనూ వుంటాయి. అవి ఆశించే "కర్తవ్యాలు" "పరిమిత–చర్యలు" అయితే ఆ విషయాలు పరిమిత–సన్నివేశంతో కమ్ముకుపోయి, ఆ రకంగా విశదంగా గోచరం కాకపోవచ్చు. అప్పుడు తదనురూపమైన కర్తవ్యాలు – చారిత్రక ఆచరణ రూపంలో ప్రజల ప్రతిస్పందనలు – ప్రామాణికంగాగాని, హేతుబద్ధంగా గాని పరిపూర్తి కావు. ఈ సన్నివేశంలో, ఆ సన్నివేశానికి అతీతంగా వున్నదాన్ని – అంటే, విపర్యాస భేదంగా వున్నదాన్ని – ఆవిష్కరించుకునేందుకు మనుషులు పరిమితుల్ని అధిగమించ లేకపోతున్నారు. ఇందులోనే ప్రయోగం చేయని అవకాశం దాగి వుంది.

క్రోడీకరించి చెప్పాలంటే, పరిమిత–సన్నివేశాల్లో, ఈ పరిస్థితులవల్ల ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ప్రభావితమయ్యే మనుషుల మనుగడ, వాటితో నాస్తీకృతులై అణచివేతకు గురైన మనుషుల మనుగడ గర్భితమై వున్నాయి. ఇలా మనడానికీ, మరింత మానవత్వంతో మనడానికీ మధ్య ఈ సన్నివేశాలు గీతలు గీస్తున్నాయనీ, అవి అస్తిత్వానికీ, శూన్యానికీ మధ్య గీతలు కావనీ ఈ మనుషులు గుర్తించాలి. అప్పుడు వాళ్ళు క్రమంగా హేతుపూరితమయ్యే తమ చర్యల్ని, ఆ గ్రహణలో గర్భితమైన వున్న అప్రయోగిత అవకాశాన్ని సాధించే దిశలో మళ్ళిస్తారు. ఇక అటుపక్క ఈ ప్రకృత సన్నివేశంవల్ల లబ్ధిపొందిన వాళ్ళు, ఈ అప్రయోగిత అవకాశాన్ని ముప్పుతెచ్చిపెట్టే పరిమిత – సన్నివేశంగా పరిగణిస్తారు. దాన్ని సాకారం కాకుండా చూస్తారు. యథాతథ పరిస్థితికి నీళ్ళు పోసి సాకే పని చేస్తారు. ఫలితంగా చారిత్రక సాంఘిక వాతావరణంలో జరిపే విమోచనా కార్యకలాపాలు, ఉత్పాదక విషయాలతోనే కాక, ఆ విషయాల్ని గ్రహించే పద్ధతితో కూడా అనురూపంగా వుండాలి. ఈ అవసరంవల్ల మరోటి వస్తుంది– అర్థవంతమైన విషయాంశాల పరిశోధన.

ఉత్పాదక విషయాంశాలను నిర్దిష్ట పరిధుల్లో స్థిరీకరించవచ్చు. సామాన్యం నుంచి ప్రత్యేకతలకు చరిస్తూ వుంటాయి. విభిన్న రీతుల అంశ ప్రమాణాలని ఉప అంశాలను (sub units) కలుపుకుని వున్న విస్తృత మహత్తర అంశం – ఖండవ్యాప్త, ప్రాంతీయ, జాతీయ ఇంకా అలా అలా – విశ్వజనీన లక్షణ శోభితమై వుంటుంది. మన యుగంలోని మౌలిక పరిమాణ అంశం "ఆధిపత్యంగా నేను పరిగణిస్తాను. దీంట్లో దీనికి విరుద్ధమైన విమోచనాంశం యిమిడి వుంది. ఈ లక్ష్యాన్ని సాధించాల్సి వుంది. ఎంతో

క్షుభితం చేసే ఈ విషయం మన యుగానికి ఇంతకు ముందే చెప్పుకున్న మానవ పరిశీలనా శాస్త్ర స్వభావాన్ని కలిగిస్తుంది. మానవీకరణం సాధించాలీ అంటే; అమానవీకర పీడన తొలగాలి; ఇందుగ్గాను మనుషుల్ని వస్తువులుగా మార్చిన పరిమిత–సన్నివేశాలు అధిగమించడం అవసరం.

చిన్న వలయాల్లో సమాజాలకు విశిష్టం అయిన విషయాలని, పరిమిత సన్నివేశాలని (అదే ఖండంలో, లేదా అనేక ఖండాల్లో) ఈ విషయాల ద్వారా, పరిమిత – సన్నివేశాల ద్వారా చూడగలం. అవి చారిత్రక సారూప్యతల్ని పంచుకుంటాయి. ఉదాహరణకు తక్కువ అభివృద్ధి పరాధీనత సంబంధానికి విడిగా దీన్ని అర్థం చేసుకోలేం. ఇది తృతీయ ప్రపంచ సమాజాల పరిమిత – సన్నివేశాన్ని సూచిస్తుంది. ఈ లక్ష్యం – సమాజాలకీ, మహానగర సమాజాలకీ మధ్య వున్న వైరుధ్యాన్ని అధిగమించడం పరిమిత – సన్నివేశంలో వుంది. ఈ కర్తవ్యం తృతీయ ప్రపంచ దేశాల అప్రయోగిత అవకాశాన్ని కలిగిస్తుంది.

ఈ విశాల మహత్తర విషయంలో ఏ ఫలానా సమాజానికైనా విశ్వవ్యాప్త, ఖండాంతర్గత లేదా చారిత్రక సమాన విషయాలతోబాటు, దాని ప్రత్యేక విషయాంశాలు, దానికిగా దాని పరిమిత – సన్నివేశాలూ వుంటాయి. ఇంకా చిన్న పరిధుల్లోపల, అదే సమాజంలో విషయవైవిధ్యం కనిపించగలదు. ప్రాంతాలుగా, ఉపప్రాంతాలుగా విభజితమై వుండొచ్చు. ఇవన్నీ మొత్తంగా యావత్ సమాజానికీ చెందినవే. ఇవి మహత్తర ఉపపరిమాణాంశాలు అవుతాయి. ఉదాహరణకు అదే జాతీయ పరిమాణాంశంలో "సమకాలీనేతర సహజీవనం" అనే వైరుధ్యం కనిపించవచ్చు.

ఉపపరిమాణాంశాలలో జాతీయ విషయాంశాలు వాటి అసలు ప్రాముఖ్యంతో కనిపించవచ్చు. కనిపించకపోవచ్చు. వాటిని అనుభూతం చేసుకోవడం వుండొచ్చంతే – కొన్ని సందర్భాలలో అదీ హుళక్కి కావచ్చు. కానైతే "ఉపపరిమాణాల్లో విషయాంశాలు అభావం కావడం బొత్తిగా అసంభవం. ఓ ఫలానా ప్రాంతంలో వ్యక్తులు ఒక ఉత్పాదక విషయాన్ని గ్రహించలేకపోవచ్చు. లేదా వక్రీకరించిన రూపంలో గ్రహించవచ్చు, దానివల్ల జనం ఇంకా మునిగిపోయివున్న పీడక పరిమిత – సన్నివేశం మాత్రమే వెల్లడి కావచ్చు.

మొత్తం మీద, పరిమిత – పరిస్థితిని ఇంకా సంపూర్ణంగా గ్రహించని ఆధిపత్య అధీనంలో వున్న చైతన్యం, వూరికే తత్కాలిక గోచరమైందాన్నే పట్టుకోగలుగుతుంది. పరిమిత – పరిస్థితి[20] హక్కుభుక్తం అయిన ఆటంకపరిచే శక్తిని ఈ తాత్కాలిక గోచరానికే

బదలాయిస్తుంది. ఉత్పాదక విషయాల పరిశోధనకు ఈ చర్య చాలా ముఖ్యమైంది. యదార్ధ పరిస్థితికి సంబంధించి సవిమర్శక అవగాహన వుండదు, తునకలు తునకలుగా దాన్ని అర్థం చేసుకుంటారు, ఒక పూర్ణత్వంలో పరస్పర ప్రతిచర్యలతో వుండే అంశాలుగా చూడరు. ఇలా వున్నప్పుడు యదార్థాన్ని వాళ్ళు నిజంగా తెలుసుకోలేరు. నిజంగా దీన్ని గురించి తెలుసుకోవాలీ అంటే వాళ్ళు ఎక్కడ మొదలవుతున్నారో దాన్ని తల్లకిందులు చేసుకోవాలి. మొదట ఆ సందర్భం గురించిన సంపూర్ణావగాహన వుండాలి. ఆ తర్వాత అందులో వున్న అంశాలని విడదీసి, వేరువేరుగా చూడగలరు. ఈ రకమైన విశ్లేషణ వల్ల పూర్ణస్వరూపం గురించిన స్పష్టమైన అవగాహన సాధించగలరు.

విషయ పరిశోధనకు అవసరమైన  పద్ధతిలో ఇంతే సముచితం అయింది ఇంకొటి వుంది. అది సమస్యా ప్రతిపాదక విద్యకు సముచితంగా వుంటుంది. అదేమంటే ఒకానొక సందర్భంలో ఒక వ్యక్తిలో వుండే యదార్థత తాలూకు ప్రధాన కోణాలను ప్రదర్శించడం. దీని విశ్లేషణనిబట్టే అందులో వున్న విభిన్న అంశాల ప్రతిచర్యలని గుర్తించడం వీలవుతుంది. ఈలోపున ప్రధాన పార్శ్వాలు, శకలాలుగా ప్రతిచర్యలలో వున్నవి, పూర్ణ యదార్థ పార్శ్వాలుగా గుర్తింపు పొందాలి. ప్రధాన మౌలిక పార్శ్వాల్వ విమర్శక వైఖరిని సాధ్యం చేస్తుంది. యదార్ధ పరిస్థితి గురించిన గ్రహణ, అవబోధన వరకు పొందుతాయి. నూతన గాఢత్వం సంతరించుకుంటాయి. కనిష్ట విషయ విశ్వంలో (ప్రతిచర్యలతో వున్న ఉత్పాదక విషయాలు) వున్న ఉత్పాదక విషయాల పరిశోధన కాన్‌షైంటి జచావో (conseintig acao) పరిశీలనా పద్ధతి కొనసాగించినట్లయితే, ఆ రకంగా స్త్రీ, పురుషులు తమ ప్రపంచం గురించి విమర్శనాత్మక ఆలోచన చేసేందుకు నాంది అవుతుంది, లేదా అందుకు శ్రీకారం చుడుతుంది.

ఏమైనా ఈ సందర్భంలో, మనుషులు వాస్తవ పరిస్థితిని ఒక సాంద్రమైన, అభేద్యమైన ఆవృతమైన దానిగా గ్రహిస్తేగనక, నిర్దిష్టంగాని అమూర్త భావనలతో మొదలుపెట్టడం తప్పనిసరి అవుతుంది. అలా అని ఈ పద్ధతి నిర్దిష్టం అయిన దాన్ని అమూర్తానికి కుదించడం కాదు (ఇలా చేస్తేగనక దాని గతి తార్కిక స్వభావమే నాస్తీకరణ చెందుతుంది). ఆ ఉభయాంశాలూ విరుద్ధాంశాలుగా, ప్రతిఫలనలో గతితార్కికంగా పరస్పర సంబంధంతో వున్నవిగా చూపించడమే. ఆలోచన గతితార్కిక చలనం ఒక నిర్దిష్ట, అస్తిత్వ "సంకేత" పరిస్థితి[21] విశ్లేషణలో నిర్ద్వంద్వంగా ఉదాహృతమవుతుంది. దీన్ని సంకేత రహితం చేయడంవల్ల అమూర్త అనిర్దిష్ట స్థితినుంచి నిర్దిష్ట స్థితికి సాగడం జరుగుతుంది. ఇందుకోసం శకలం నుంచి పూర్ణత్వానికి, మళ్ళీ శకలాలకి మళ్ళడం అవసరం. అప్పుడు

మళ్లీ కర్త తనని కర్మలో, ఆ వస్తువులో తనని గుర్తించడం అవసరం (సంకేత సూచక నిర్దిష్ట అస్తిత్వ సన్నివేశం). వస్తువును, అందులో తను వున్నట్టుగా, ఇతర కర్తలతో కలిసి వున్నట్టుగా గుర్తించడం జరుగుతుంది. ఈ సంకేత రహిత చర్చ బాగా జరిగినట్లయితే, సంకేత సూచక విశ్లేషణలో ప్రక్రియ అనిర్దిష్టం నుంచి నిర్దిష్టానికి మధ్య సాగే ముందూ వెనకాగతి, అమూర్తతను అధిగమించడానికి నడిపిస్తుంది. ఇది నిర్దిష్టమైందాన్ని సవిమర్శక గ్రహణం చేసుకోవడం ద్వారా జరుగుతుంది. ఈ నిర్దిష్టమైంది అప్పటికే, సాంద్ర, అభేద్య యదార్థం అనే స్థితి పోతుంది.

ఒక వ్యక్తికి సంకేత సూచక అస్తిత్వ పరిస్థితిని అందిస్తాం. (ఒక రేఖామాత్ర దృశ్యమే- ఒక ఫోటో గ్రాఫ్ తరహా అన్నమాట. దానివల్ల అమూర్తాల నుంచి అస్తిత్వ యదార్థ నిర్దిష్ట స్థితికి నడిపించడం జరుగుతుంది) అప్పుడు అతని ధోరణి ఆ సంకేత సన్నివేశాన్ని "విభాగించు"కో చూస్తుంది. సంకేత రహితం చేసే ప్రక్రియలో, ఈ విభాగించడం "సన్నివేశ వివరణ" అని మనం పిలిచే దశకు అనురూపంగా వుంటుంది, ఆకుకు ఆకు, పోకకు పోకగా వున్న సంపూర్ణత్వంలోని భాగాల మధ్య ప్రతి చర్యల ఆవిష్కరణను సానుకూలం చేస్తుంది. ఈ మొత్తం (సంకేతసన్నివేశం) ఇదివరలో పొడిపొడిగానే గ్రహణం అయ్యేది. ఇప్పుడది, విభిన్న పార్శ్వాల నుంచి ఆలోచన వెనక్కి పారడంతో అర్థవంతం కావడం ఆరంభమవుతుంది. అయితే, సంకేత సూచికం కావడం అనేది ఒక అస్తిత్వ సన్నివేశ ప్రతిఫలనం. కాబట్టి, సంకేతరహితం చేసుకునేవాడు ఈ ప్రతిఫలనం నుంచి అసలు నిర్దిష్ట పరిస్థితి వైపు అడుగు వేస్తాడు. అప్పుడావ్యక్తి దానిలో, దానితో తనని చూసుకోవడం జరుగుతుంది. ఓ వ్యక్తి వస్తుగత యదార్థ పరిస్థితికి సంబంధించి భిన్నంగా ఎందుకు ప్రవర్తిస్తూ వుంటాడో భావనాత్మకంగా వివరించడం ఆ రకంగా సాధ్యపడుతుంది, ఒకసారంటూ ఆ యదార్థ పరిస్థితి అగోచరత్వం అదృశ్యమై అసలైన స్థితిలో అందితే: మానవులు ఎదిరించాల్సిన సవాల్ అవుతుంది.

సంకేత రాహిత్యపు అన్ని దశల్లోనూ, మనుషులు ప్రపంచం గురించిన తమ దృక్పథాన్ని బహిర్గతం చేసుకుంటారు. ప్రపంచం గురించి ఆలోచిస్తూ, దాన్ని ముఖాముఖీ చూస్తూ వుండే దారిలో విధి పూరితంగా, చలనశీలంగా లేదా స్థిరత్వంగా వాళ్ళకి ఉత్పాదక విషయాలు కనిపిస్తాయి. ఆ విషయాలే అభావం అన్నది గర్భితమైనట్టు కనిపించే నిజం – ఉత్పాదక విషయాల్ని నిర్దిష్టంగా వెల్లడి చేయలేని బృందం అందుకు విరుద్ధంగా చాలా నాటకీయ విషయాల్ని సూచిస్తోందన్నమాట. మౌన విషయం అనేది పరిమిత – సన్నివేశం ముంచెత్తేసే ధాటిలో మూగ నిర్మాణాన్ని సూచిస్తుంది.

ఉత్పాదక విషయం యదార్థ పరిస్థితితో తెగతెంపులు చేసుకుని ప్రజలలో కనిపించదన్న ముక్కని నేను మళ్ళీ నొక్కి చెపుతున్నాను. అలాగే ప్రజలతో తెగతెంపులు చేసుకున్న యదార్థంలోనూ కనిపించదు. "నిర్జన్ల క్షేత్రం" సంగతి చెప్పనే అక్కర్లేదు. దీన్ని మానవ–ప్రపంచ సంబంధంలో మాత్రమే అవగాహన చేసుకోగలం. ఉత్పాదక విషయాన్ని గురించి పరిశోధించడం అంటే యదార్థ పరిస్థితి గురించి ప్రజల ఆలోచనను, యదార్థ పరిస్థితిలో ప్రజల కార్యాచరణ గురించి పరిశోధించడమే. ఆ ఆచరణే వాళ్ళ ఆలోచనాపూరిత కార్యాచరణ. సరిగ్గా యీ కారణంగానే, ఇప్పుడు ప్రతిపాదిస్తున్న పరిశీలనా పద్ధతికి పరిశోధకులు, ప్రజలు (మామూలుగా అయితే వీళ్ళని ఆ పరిశోధనా వస్తువులుగా పరిగణిస్తూ వుంటారు) సహ–పరిశోధకులు నిర్వహించాలి. తమ విషయాంశాల గురించి పరిశీలనలో స్త్రీ, పురుషులు ఎంత క్రియాశీల వైఖరి తీసుకుంటారో, అంతలా వాళ్ళకి యదార్థ పరిస్థితి గురించిన సవిమర్శక స్పృహ గాఢతరం అవుతుంది. ఆ విషయాంశాల్ని చెప్పడంలో, ఆ యదార్థ పరిస్థితిని స్వాధీనపరుచుకుంటారు.

తమ అర్థవంతమైన విషయాంశాల అన్వేషణలో పరిశోధకులుగా ప్రజల్ని చేర్చుకోవడం అంత మంచిది కాదని కొందరు అనుకుంటారు; వాళ్ళ చొరబాటు ప్రభావం (బాగా గమనించండి, ఎంతో ఆసక్తికలవాళ్ళ "చొరబాటు" – లేదా ఆసక్తి వుండవలసినట్టి – వాళ్ళ విద్యలోనే) ఫలితాల్ని "కలుషితం" చేస్తుందనీ, ఆ రకంగా ఆ శోధన వస్తుతత్వాన్నే త్యజిస్తుందనీ వాళ్ళు అంటారు. ఇక్కడ వున్న లొసుగు ఏమిటంటే– విషయాంశాలు, అసలైన వస్తుగత పరిశుద్ధతతో వుంటాయన్న భావన. విషయాంశాలే వస్తువులు అనుకోడం. నిజానికి విషయాంశాలు ప్రపంచంతో ప్రజల సంబంధాలతో వుంటాయి, నిర్దిష్టమైన కార్యాలకి సంబంధించి వుంటాయి. ఒక యదార్థ స్థితి వుందనుకోండి, ఆ ఒకటే చిన్న సంక్లిష్ట ఉత్పాదక విషయాంశాల్ని విభిన్న యుగాల ఉప విషయాంశాల్లో కల్పించవచ్చు. అంచేత ఓ ఫలానా వస్తుగత అంశానికి స్త్రీ, పురుషులు దాన్ని గ్రహణ చేసుకునే తీరుకీ మధ్య ఉత్పాదక విషయాంశాలకీ మధ్య ఒక సంబంధం వుంటుంది.

అర్థవంతమైన విషయాంశాల్ని ప్రజలు వెల్లడి చేస్తారు. ఓ ఫలానా వ్యక్తీకరణ సందర్భం అంతకు ముందు దానికంటే భిన్నంగా వుండొచ్చు. వాళ్ళు గనక ఆ విషయాలు ఉద్దేశించే వస్తుగత నిజాలు వాళ్ళ గ్రహణలో మారినట్లయితే ఇలా జరగచ్చు. అయితే పరిశోధకుడు చూడాల్సింది, ఆ "ఫలానా" దాన్ని జనం దర్శించే ఆరంభ బిందువు ఏదో కనిపెట్టడం ముఖ్యం అని. ఈ పరిశోధనా క్రమంలో ఈ యదార్థాన్ని గ్రహించే పద్ధతిలో ఏదన్నా పరివర్తన జరిగిందా లేదా అని. (వస్తుగత యదార్థం మార్పు లేకుండానే

వుంటుందనుకోండి. పరిశోధనా క్రమంలో ఆ యదార్థం గురించి గ్రహణ మారినవుంటే గనక, పరిశోధనా ధర్మబద్ధతకు అది విఘాతం కలిగించదు.)

అర్థవంతమైన విషయాంశాల్లో అంతర్గర్భితంగా వున్న ఆకాంక్షలు, ఉద్దేశాలు, లక్ష్యాలు మానవ ఆకాంక్షలు, ఉద్దేశాలు, లక్ష్యాలు. అని మనం అర్థం చేసుకోవాలి. అవి ఏవో "ఆ మూలసౌధంబులో," స్థిరీకృత స్థూల వస్తువులుగా వుండడంలేదు; అవి సంభవిస్తూ వున్నాయి. అవీ మానవులతో సమానంగా చారిత్రకమైనవే. ఫలితంగా, వాటిని మానవులు తప్ప అవగతం చేసుకోలేరు. ఈ విషయాలని అర్థం చేసుకోవడం, అవగతం చేసుకోవడం అంటే వాటిని రూపొందించుకున్న మనుషుల్ని, వాళ్ళు సూచిస్తూ వున్న యదార్థాన్ని రెండింటినీ అర్థం చేసుకోవడమే అవుతుంది. కాని-ప్రజలు తప్ప ఈ విషయాలని అర్థం చేసుకోవడం సాధ్యం కానందువల్లే సరిగ్గా - వాటికి సంబంధించినవాళ్ళు కూడా వాటిని బాగా అర్థం చేసుకోవడం అవసరం. ఆ రకంగా విషయాంశ శోధన యదార్థం గురించీ, స్వీయ స్పృహ గురించీ సమష్టి కృషి అవుతుంది. అదే విద్యాక్రమానికీ, లేదా ఒక విమోచనా స్వభావ సాంస్కృతిక కార్యకలాపానికీ ఆరంభ బిందువు అవుతుంది.

అందువల్ల శోధనకు దాపురించే అసలు ప్రమాదం, శోధనకు వస్తువులు అవుతారనుకునే వాళ్ళు, తామూ సహ - శోధకులు అని తమని తెలుసుకోవడంవల్ల విశ్లేషణాత్మక ఫలితాలు "కలుషితం" అవుతాయనేది కాదు. అందుకు భిన్నంగా. శోధించవలసిన విషయాల మూలాన్ని అర్థవంతం అయిన అంశాల నుంచి అసలు ప్రజలకే బదలాయించడంలో ముప్పు వున్నది. ఆ రకంగా ప్రజల్ని శోధనకు వస్తువులుగా చేయడంలో వుంది. ఈ శోధన ఎందుకోసం? ఒక విద్యాకార్యక్రమం రూపొందించే పునాదికి తోడ్పడడం. ఈ క్రమంలో ఉపాధ్యాయుడు - విద్యార్థి, విద్యార్థులు - ఉపాధ్యాయులు ఆ వున్న వస్తువు ఏదో దాన్ని గురించి తమకు తెలిసినదాన్ని జోడించుకుంటారు. అందుచేత, ఈ శోధన కూడా అదే విధంగా పరస్పర కార్యాచరణ మీద ఆధారపడి వుండాలి.

విషయాంశ పరిశోధన, మానవ పరిధిలో సంభవిస్తుంది. దాన్ని ఏదో యాంత్రికమైన పనిగా కుదించకూడదు. ఇదొక అన్వేషణా క్రమం. జ్ఞాన క్రమం. ఆ రకంగా సృజనక్రమం. అలాంటి క్రమం కాబట్టి, అర్థవంతమైన విషయాలను అనుసంధించేందుకు సమస్యల అల్లికను శోధకులు కనిపెట్టడం అవసరం. ఆ శోధన ఎంతో విమర్శనాత్మకంగా వున్నప్పుడు ఎంతో బోధనాత్మకంగా వుంటుంది. యదార్థ పరిస్థితి గురించి దృక్పథాలు "కేంద్రీకృతం కావడం", పాక్షిక సంకుచిత స్థూల రేఖలు

వుండడం జరగకపోతేగనక ఎంతో విమర్శనాత్మకంగా వుంటుంది. పూర్తి యదార్థం గురించిన భావనకే అతుక్కుపోయి వుంటేగనక అలా వుంటుంది. ఆ రకంగా అర్థవంతమైన విషయాంశాలలో విషయాల మధ్య లింకులు ఎలా వున్నాయో పట్టించుకోవాలి. సమస్యల్ని సమస్యలుగా ముందు పెట్టడం వుండాలి. వాటి చారిత్రక – సాంస్కృతిక సందర్భాల్ని గురించి పట్టించుకోవాలి.

ఒక ఉపాధ్యాయుడు ప్రజలకు అందించడానికి కార్యక్రమాన్ని విపులీకరించలేనట్లే, ఒక పరిశోధకుడు విషయాంశ విశ్వం శోధన "మజిలీల"లో తను అంతకు ముందే నిర్ణయించుకున్న విశేషాలను విపులీకరించలేడు. విద్య, దాన్ని సమర్థించేందుకు రూపొందించిన విద్యాశోధన రెండూ, కార్యకలాపాలపట్ల సహానుభూతితో వుండాలి, ఆ పదానికి వున్న వ్యుత్పత్తి అర్థంలో. అంటే తన నిరంతర "రూపొందే" సంక్లిష్ట క్రమంలో గ్రహించే వాస్తవికత గురించి ఉమ్మడి అనుభవాన్ని కలిగి, పరస్పరం తెలియచేసు కుంటుండాలి.

పరిశోధించే వ్యక్తి, శాస్త్రీయ నిష్పాక్షికత పేరుతో, సజీవమైందాన్ని నిర్జీవమైందానిగా, రూపొందే దాన్ని అది అస్తిత్వంలో వున్నట్టుగా, జీవితాన్ని మృత్యువుగా మార్చేసేవాడైతే, మార్పంటే వణికి చచ్చేవాడన్నమాట. ఆమెగాని, అతనుగాని మార్పులో (దాన్ని కాదనరు, అలాగని కోరనూ కోరరు) జీవిత చిహ్నాల్ని చూడరు, మృత్యు చిహ్నాల్ని, శైథిల్యాన్ని చూస్తారు. మార్పు గురించి అధ్యయనం చేయాలనుకుంటారు. నిజమే – కాని దాన్ని నిరోధించడానికే అలా చేస్తారు. అంతేగాని, దాన్ని ఉత్తేజపరిచి, గాఢతరం చేయడానికి కాదు. కానైతే మార్పును మృత్యుసూచకంగా చూడడంలో, బెసగకుండా శీలలు బిగించేసిన నమూనాలను చేరడానికి శోధనకు ప్రజల్ని స్తబ్ధ వస్తువులుగా చేయడంలో, జీవి హంతకుడిగా తన స్వభావాన్ని బట్టబయలు చేసుకుంటున్నట్టు చెప్పాలి.

మళ్ళీ చెపుతున్నాను– విషయాంశాల శోధనలో ప్రజల ఆలోచనల శోధన నిండి వుంటుంది – యదార్థ పరిస్థితి అవగతం చేసుకోవడానికి ప్రజలలో ప్రజల మధ్య కలిసి వుండేవాళ్ళల్లోనే సంభవించే ఆలోచన నేనుగా యితరుల కోసంగాని, యితరులు లేకుండాగాని ఆలోచించలేను. అలాగని ఇతరులూ నా కోసం ఆలోచించలేరు. ప్రజల ఆలోచనలు అంధవిశ్వాసపూరితంగా వుండొచ్చు, లేదా అమాయకంగా వుండచ్చు, అయితేనేం, వాళ్ళు కార్యాచరణలో వాళ్ళ వూహల గురించి పునరాలోచించినప్పుడే మార్చగలరు. తమ భావాల్ని కల్పించుకోవడం, వాటిని ఆచరణలో చూడడం యీ క్రమంలో యిమిడి వుండాలి. ఇతరుల వూహల్ని మింగడం కాదు.

ప్రజలు "ఒక సన్నివేశంలో" అస్తిత్వంతో వుంటారు. ఆ రకంగా దేశకాల పరిస్థితుల్లో పాతుకుని వుంటారు. ఆ పరిస్థితులు వాళ్ళ మీద ముద్రవేస్తాయి, వాళ్ళు పరిస్థితుల మీద ముద్ర వేస్తారు. ఆ సన్నివేశత్వం  గురించి వాళ్ళు, అది ఏ మేరకు ఎదిరిస్తూ వుంటే ఆ మేరకు దానికి సంబంధించి కార్యనిర్వహణ జరిపే మేరకు దాన్ని గురించి ఆలోచిస్తారు. మానవులు అస్తిత్వంతో అలా వున్నారు. ఎందుకనీ అంటే, వాళ్ళు ఒక సన్నివేశంలో అస్తిత్వంతో వున్నారు కాబట్టి. వాళ్ళ మనుగడ గురించి సవిమర్శకంగా ఆలోచన చేయడమేగాక, దానికి సంబంధించి సవిమర్శకంగా ఆచరణకు నడుం కట్టినప్పుడు ఆ మేరకు వాళ్ళు మరింత అస్తిత్వంతో వుండగలరు.

సన్నివేశత్వం గురించిన ఆలోచన మనుగడ పరిస్థితుల గురించిన ఆలోచనే : సవిమర్శక ఆలోచన, ఈ సాధనం ద్వారా ప్రజలు తాము ఒకళ్ళకొకళ్ళు "ఒక సన్నివేశం"లో వున్నట్టు తెలుసుకుంటారు. ఈ సన్నివేశం ఒక సాంద్రమైన, ముంచెత్తేసే యదార్థంగా కాకుండా లేదా యాతన పెట్టే అగోచరస్థలంగా కాకుండా వున్నప్పుడే, దాన్ని వాళ్ళు ఒక వస్తుగత – సమస్యాత్మక సన్నివేశంగా గ్రహిస్తారు – అప్పుడు మాత్రమే నిబద్ధత వుంటుంది. మానవాళి ముంపునుంచి బయటపడుతుంది. యదార్థపరిస్థితి విచ్చుకునే కొద్దీ దాంతో జోక్యం చేసుకునే సామర్థ్యాన్ని సంతరించుకుంటుంది. యదార్థ పరిస్థితిలో జోక్యం అంటే చారిత్రక స్పృహే – ఆ రకంగా బయటపడడం నుంచి ఒక ముందడుగు వేయడం. అది ఆ సన్నివేశం గురించిన కాన్‌షైంటిజచావోగా పరిణమిస్తుంది. సకల ఆవిర్భావాలకీ విలక్షణమైన స్పృహ గాఢతరం కావడమే యీ కాన్‌షైంటిజచావో.

చారిత్రక స్పృహను గాఢం చేసే ప్రతి విషయాంశపరిశోధనా ఆ రకంగా నిజంగా బోధనాత్మకం, ప్రామాణిక విద్య సర్వం ఆలోచనను శోధిస్తున్నట్లు ప్రజల ఆలోచనల్ని ఉపాధ్యాయులు, ప్రజలు ఎంత శోధిస్తే, ఆ రకంగా సంయుక్తంగా విద్యని పొందితే, అంతలా వాళ్ళు శోధించడం కొనసాగిస్తారు. విద్య, విషయాంశ పరిశోధనా సమస్య ప్రతిపాదక విద్య అన్న భావనలో వుంటాయి. ఇవి ఒకే క్రమంలో వున్న రెండు భిన్నక్షణాలు.

నిధి విద్యా పద్ధతిలో సంభాషణ వ్యతిరేక, వ్యక్తీకరణ వ్యతిరేక ధోరణిలో "నిక్షేపించడం" వుంటుంది కదా? ఇందుకు విరుద్ధంగా సమస్యా ప్రతిపాదక కార్యక్రమ వస్తువుగల పద్ధతిలో అనిదంపూర్వమైన సంభాషణాత్మక – ప్రపంచం గురించి విద్యార్థులు ఏమనుకునేదీ వుంటుంది, వాళ్ళ ఉత్పాదక విషయాంశాలు ఎక్కడివో తెలుస్తుంది. ఆ రకంగా వస్తువు నిరంతరం విస్తరించుకుని, నవనవోన్మేషం అవుతుంది. సంభాషణాత్మక

ఉపాధ్యాయుడు పరస్పర సంబంధం వున్న శిక్షణాంశాల బృందంతో తమ పరిశోధనలో వెల్లడైన విషయాంశ విశ్వం గురించే పని చేస్తూ వుంటాడు. అతని కర్తవ్యం ప్రజలకు ఆ విశ్వాన్ని "తిరిగి వివరించడం" – ఆ "వివరించడం" ఒక ఉపన్యాసంగాకాక, ఒక సమస్యగా వివరించడం జరగాలి.

ఉదాహరణకు ఒక వ్యవసాయ ప్రాంతం వుందనుకోండి. అక్కడి నిరక్షరాస్యతా శాతం చాలా ఎక్కువనుకోండి. వయోజన విద్యా కార్యక్రమాన్ని సమన్వయ పరిచే బాధ్యత ఒక బృందం మీద వుందనుకుందాం. ఆ కార్యక్రమంలో అక్షరాస్యతా ప్రచారం, అక్షరాస్యతానంతర దశ కలిపి వున్నాయనుకోండి. మొదటి దశలో సమస్య – ప్రతిపాదక విద్య "ఉత్పాదక పదాన్ని" వెతికి, పరిశోధిస్తుంది. రెండవ దశలో "ఉత్పాదక విషయాన్ని" వెతికి, పరిశోధించాలి.

సరే, ఇక్కడ, ఉత్పాదక విషయాలను లేదా అర్థవంతమైన విషయాంశాలను[22] శోధించడం మాత్రమే చూద్దాం. పని చేసే రంగం గురించి శోధకులు ఒకసారంటూ నిర్ణయం చేసుకుంటే, ద్వితీయ ఆధారాల ద్వారా ఆ రంగంతో ప్రాథమిక పరిచయం చేసుకుంటే, వాళ్ళు శోధన మొదటి దశను ప్రారంభిస్తారు. ఈ ఆరంభంలో (మానవ కార్యకలాపంలో వున్న ఏ ఆరంభంలో మాదిరినే కొన్ని గండాలు, కష్టనష్టాలు వుంటాయి. అవి ఒక స్థాయివరకూ మామూలుగానే వుంటాయి. అవి ఆ ప్రాంతంలోని వ్యక్తులతో తొలిసారిగా పరిచయం అయినప్పుడు అన్ని వేళలా విశదంగా వుండకపోయినా గానీ, తొలి పరిచయంలో, శోధకులు ఒక ఇష్టాగోష్టి సమావేశానికి ఒప్పుకునేటట్టు సుమారైన సంఖ్యలో సభ్యుల్ని తీసుకురాగలగాలి. ఆ సమావేశంలో ఆ ప్రాంతంలో తమ వున్న లక్ష్యాల గురించి వాళ్ళు మాట్లాడగలరు. ఆ సమావేశంలో ఆ పరిశోధనకు కారణాన్ని వివరించాలి. దాని వల్ల లాభాలు ఏమిటో చెప్పాలి. ఇంకా పరస్పర విశ్వాసం, అవగాహన లేకపోతే ఆ శోధన అసాధ్యం అని వివరించాలి. సమావేశంలో వున్నవాళ్ళు పరిశోధనకీ, తదనంతర కార్యక్రమానికి[23] అంగీకరిస్తే గనక, తమకి సాయపడేందుకు వాలంటీర్లని రమ్మని శోధకులు పిలుపు ఇస్తారు. ఆ వాలంటీర్లు ఆ ప్రాంతంలో వున్న జీవితం గురించి అవసరమైన సమాచార గణాంకాల్ని పోగుచేస్తారు. ఇంతకంటే మరింత ప్రాముఖ్యం వహించేది శోధనలో ఈ వాలంటీర్లు చురుగ్గా వుండడం.

ఈ లోపున పరిశోధకులు ఆ ప్రాంతంలో తామే పర్యటిస్తారు. వారేం దూకుడుగా మీదకు పోరు. సానుభూతితో పరిశీలించేవాళ్ళుగా, తాము చూసిందాన్ని "అవగాహన చేసుకునే" వైఖరితో కనిపించేట్లు వుంటారు. తమ గ్రహింపును ప్రభావితం చేసే

విలువలతోనే శోధకులు ఆ ప్రాంతానికి చేరడం మామూలు. అలా అని ఆ ఎరుక విషయాంశ పరిశోధనను మార్చేటట్టు ఆ విలువల్ని దింపే సాధనంగా వుంటుందని కాదు. ఏ ప్రజల విషయాంశాల గురించి శోధిస్తున్నారో వాళ్ళు పాలుపంచుకొనేటట్లు ఆ విలువల పార్శ్వం (పరిశోధకులకు ఈ గుణం వుంటుందని భావిద్దాం) ప్రపంచం గురించిన విమర్శనాత్మక గ్రహింపు అంటే, యదార్ధ పరిస్థితిని తెరతీసి చూపించేందుకుగాను యదార్ధ పరిస్థితిని సవ్యమైన పద్ధతిలో సమీపించడం అన్నమాట. విమర్శనాత్మక గ్రహింపును రుద్దడం అంటూ జరగదు. ఆ రకంగా విషయాంశ శోధన ఆది నుంచీ ఒక విద్యాన్వేషణగా, ఒక సాంస్కృతిక కార్యకలాపంగా వుంటుంది.

అధ్యయనం చేస్తూ వున్న ఆ ప్రాంతం, అదేదో విస్తార, అద్వితీయ, సజీవ "సంకేతం" అయినట్టూ, దాన్ని టీకా టిప్పణితో వివరించుకోవలసి వున్నట్టూ, తమ విమర్శనాత్మక "గమ్యాన్ని" పరిశోధకులు తమ సందర్శనల్లో ముందు పెడతారు. ఆ ప్రాంతాన్ని ఒక్కతున్న అంశాల్ని పాక్షిక పార్శ్వాల విశ్లేషణ ద్వారా "విభజించ" చూస్తారు. ఈ క్రమంలో వాళ్ళు, ఈ విభిన్న భాగాలు ఎలా ప్రతిచర్యలతో వున్నదీ తెలుసుకుని, తమ అవగాహనను విస్తృతం చేసుకుంటారు. ఆ తర్వాత అవిభాజ్య ఏకాండంగా వున్నదానిలోకి చొచ్చుకుపోవడానికి ఇది వాళ్ళకి ఉపకరిస్తుంది

సంకేతాన్ని వివరించుకునే దశలో, పరిశోధనకు ఆ ప్రాంతపు జీవితంలో వున్న కొన్ని విశేషాల్ని పరిశీలిస్తారు. ఒకోసారి ప్రత్యక్షంగా, కొన్నిసార్లు అక్కడుండేవాళ్ళతో ఇష్టాగోష్టి సంభాషణల ద్వారా పరిశీలిస్తారు. ప్రతి అంశాన్ని నోట్‌బుక్కులో రాసుకుంటారు. ఇందులో పైకి అంత ముఖ్యం కావేమో అనిపించేవీ వుండొచ్చు. ప్రజల మాటతీరు, జీవనశైలి, చర్చిలో వాళ్ళ ప్రవర్తన, పనిలో వాళ్ళ ప్రవర్తన లాంటివాటిని. ప్రజల నుడికారాన్ని నమోదు చేసుకుంటారు: వాళ్ళ వ్యక్తీకరణలు, పదబంధాలు, వాక్య నిర్మాణం (వాళ్ళ ఉచ్చారణ అపసవ్యంగా వున్నా పట్టించుకోకుండా, వాళ్లు తమ ఆలోచనల్ని ఎలా రూపొందించుకుంటున్నారు అన్నదాన్ని పట్టించుకుంటారు).[24]

పరిశోధకులు ఆ ప్రాంతాన్ని వైవిధ్యపూరిత సందర్భాలలో పరిశీలించడం చాలా ముఖ్యం. పొలాల్లో వ్యవసాయ కార్మికులు, స్థానిక సంఘ సమావేశాలు (పాల్గొంటున్న వాళ్ళ ప్రవర్తననీ, భాషనీ, అధికారులకీ సభ్యులకీ మధ్య వున్న సంబంధాలనీ ఎత్తి రాసుకుంటూ), స్త్రీలు, యువజనులు నిర్వహించే పాత్ర, ఖాళీ సమయాలు, క్రీడలు ఇళ్ళల్లో మనుషుల్తో మాట్లాడే మాటలు (భార్యా, భర్త, తల్లిదండ్రులూ, బిడ్డలూ, వాళ్ళ మధ్య సంబంధాలు గుర్తించి రాసుకుంటూ), ఆ ప్రాంతాన్ని గురించి ప్రాథమికంగా

విచారణ చేసేటప్పుడు ఏ కార్యకలాపమూ దృష్టిలో పడకుండా తప్పించుకోకూడదు.

పర్యటన జరిపిన ప్రతిసారీ పరిశోధకుడు సూక్ష్మంగా ఒక నివేదికను తయారు చేయాలి. మొత్తం బృందం దాన్ని గురించి చర్చించాలి. చేయి తిరిగిన పరిశోధకులూ, స్థానిక సహాయకులూ ఉభయులూ ప్రాథమిక విచారణలో గమనించిన వాటిని మదుపు చేసేందుకు ఇలా చర్చసాగాలి. సహాయకులు పాల్గొనడానికి వీలుగా వుండేటట్టు ఈ సమీక్షా సమావేశాలు ఆ ప్రాంతంలోనే జరగాలి.

ఈ సమీక్షా సమావేశాలు ప్రత్యేకంగా జీవించే సంకేతాన్ని వివరించుకునే రెండవ దశ అవుతాయి. ప్రతివ్యక్తీ ఇలా వివరించే సందర్భంలో, ఒక సందర్భాన్ని లేదా సన్నివేశాన్ని తను ఎలా గ్రహించిందీ, లేదా అనుభూతి చెందిందీ చెప్తాడు. మిగిలిన వాళ్ళందరూ అదే సందర్భన్నో, సన్నివేశాన్నో చూసి వివరించే వాళ్ళే కదా? ఆ రకంగా ఇతని వివరణ వాళ్ళ ముందు వుంటుంది. ఈ సమయంలో వాళ్ళు ఇతరుల "పరిశీలనవల్ల", తమ "పరిశీలన"ను పునఃపరిశీలించుకుంటారు. ఆ రకంగా యదార్థ పరిస్థితి గురించి ప్రతి వ్యక్తీ తన విశ్లేషణలో వివరిస్తూ, సంభాషణాత్మకంగా, విభజించి విడిగా వున్న పూర్ణత్వంకేసి మళ్ళిస్తాడు. దానివల్ల అది మళ్ళీ పూర్ణం అయి, పరిశోధకుల నూతన విశ్లేషణకు దారి తీయిస్తుంది. దాన్నిననుసరించి కొత్త పరిగణనాత్మక, విమర్శానాత్మక సమావేశం జరుగుతుంది. అక్కడ నివాసం వుండేవాళ్ళ ప్రతినిధులు, పరిశోధనా బృందంలో సభ్యులుగా అన్ని కార్యకలాపాల్లోనూ పాల్గొంటారు.

ఆ పూర్ణత్వాన్ని ఆ బృందం ఎంతలా విభాగించి, పునఃస్సమాకలనం చేస్తుందో అంత సన్నిహితంగా అది మౌలిక, ద్వితీయ వైరుధ్యాల కీలకాన్ని చేరుతుంది. ఆ ప్రాంతం ప్రజలు ఈ వైరుధ్యాలలోనే వుంటారు కదా? ఇలా వైరుధ్యాల కేంద్రబిందువును గుర్తించడం ద్వారా, పరిశోధకులు ఈ దశలోనే కూడా, తమ విద్యాకార్యకలాప వస్తువు గురించిన కార్యక్రమాన్ని నిర్వహించుకోగలుగుతారు. నిజానికి, ఆ వస్తువులో ఈ వైరుధ్యాలు ప్రతిబింబిస్తే గనక, అది ఆ ప్రాంతానికి సంబంధించి అర్థవంతమైన విషయాంశం అవుతుంది, నిస్సందేహంగా ఇక అప్పుడు ఎవళ్ళేనాగానీ, ఈ పరిశీలనల మీద ఆధారపడి కార్యాచరణ గురించి డంకా బజాయించవచ్చు. "పైనుంచి దిగుమతి అయిన నిర్ణయాల"పై ఆధారపడిన కార్యాచరణకంటే విజయవంతం అయ్యే అవకాశం దీనికే ఎక్కువ వేసుకుని చెప్పొచ్చు. అయితే, పరిశోధకులు ఈ సంభావ్యత చూసి ఆకర్షితులైపోకూడదు. ఈ వైరుధ్యాల కేంద్ర స్థానం గురించిన తొలి గ్రహింపుతో మొదలుపెట్టి, (ఈ వైరుధ్యాల్లో మరింత విస్తృత యుగ విభాగంగా ఆ సమాజపు మౌలిక వైరుధ్యాలూ వుంటాయి) ఈ

వైరుధ్యాల గురించి అక్కడ నివాసముంటున్న వాళ్ళ చైతన్యస్థాయిని అధ్యయనం చేయడమే మౌలిక అంశం.

సహజంగానే, ఈ వైరుధ్యాలు పరిమిత–సన్నివేశాలు అవుతాయి, విషయాలని నిమగ్నం చేసుకుంటాయి, కర్తవ్యాల్ని నిర్దేశిస్తాయి. వ్యక్తులు గనక యీ పరిమిత–సన్నివేశాల్లో చిక్కుకుని, తమని తాము విడిపించుకోలేనట్లయితే ఈ పరిస్థితులకి సంబంధించి వాళ్ళ విజయాంశం విధిలిఖితం అవుతుంది. ఈ విషయాంశం నిర్దేశించే కర్తవ్యం లుప్తం అవుతుంది. ఆ రకంగా పరిమిత–సన్నివేశాలే వస్తుగత యదార్థాలైనట్లు వ్యక్తుల అవసరాలను బట్టి అనిపిస్తూ వున్నాగానీ, ఈ వ్యక్తుల చైతన్యస్థాయిని ఆ సన్నివేశాల దృష్ట్యా పరిశోధించాల్సి వుంది.

ఒక పరిమిత–సన్నివేశం ఒక నిర్దిష్టయదార్థం. వేర్వేరు ప్రాంతాల్లో (ఇంకా చెప్పాలంటే అదే ప్రాంతంలోని ఉపప్రాంతంలో) వ్యక్తులు శుద్ధ విరుద్ధమైన విషయాంశాలనీ, కర్తవ్యాల్నీ ఇది నిర్దేశించవచ్చు. అంచేత పరిశోధకులు మౌలికంగా పట్టించుకోవలసింది, గోల్డ్‌మన్ చెప్పినట్టు "నిజమైన చైతన్యం", "గర్భిత చైతన్యం."

"అనుభవం మీద ఆధారపడిన విభిన్న కారణాలు ప్రతిస్పర్థిగా వుంచుతూ, గర్జిత చైతన్యం ఆకళింపు అవడానికి లోబడేటట్టు చేసే వైవిధ్య పూరిత అవరోధాల, మళ్ళింపుల ఫలితమే అసలైన చైతన్యం."[25]

"అప్రయోగిత అవకాశాన్ని" గ్రహించడం అసాధ్యం అనేది నిజమైన చైతన్యంలో గర్భితమై వుంది. ఇదేమో పరిమిత–సన్నివేశాల ఆవల వుంది. అయితే, అప్రయోగిత అవకాశాన్ని "నిజమైన (లేదా ప్రస్తుతం వున్న) చైతన్య స్థాయిలో సాధించడం కుదరదు. కాని, "ప్రయోగకార్యాచరణ"తో దాన్ని సాధించవచ్చు. ఇది ఇప్పటివరకూ గుర్తించని సదవకాశాన్ని వెల్లడి చేస్తుంది. అప్రయోగిత అవకాశం, నిజమైన చైతన్యం సంబంధం వున్నదే, ప్రయోగించే కార్యాచరణ, గర్భిత చైతన్యం మాదిరి. గోల్డ్‌మన్ చెప్పిన "గర్భిత చైతన్యం", నికోలాయ్, "గ్రహించని ఆచరణ యోగ్య పరిష్కారాలు"[26] అని చెప్పిన మాటలూ ఒకటే. (మనం దీన్ని అప్రయోగిత అవకాశం అంటున్నాం). ఇవి గ్రహించిన "ఆచరణ యోగ్య పరిష్కారాలకీ", "ప్రస్తుతం అమలవుతూ వున్న పరిష్కారాలకీ" విభేదంతో వుంటాయి, గోల్డ్‌మన్ "నిజమైన చైతన్యం"తో తూగుతాయి. ఆ ప్రకారంగా, పరిశోధకులు పరిశోధన తొలిదశలో కొంచెం అటూ ఇటూగా వైరుధ్యాల సంక్లిష్టతను అందుకుంటారు అన్న మాట నిజమే. అయినా వాళ్ళు బోధనాత్మక కార్యకలాప కార్యక్రమ వస్తువును

రూపొందించేందుకు అది అధికారం ఇవ్వదు. యదార్థ పరిస్థితికి సంబంధించిన ఈ అవగాహన ఇంకా వాళ్ళదే, ప్రజలది కాదు.

వైరుధ్యాల సంక్లిష్టతను అవగతం చేసుకోవడంతో పరిశోధనలో రెండవ దశ మొదలవుతుంది. పరిశోధకులు సర్వదా ఒక బృందంగానే నడుచుకుంటూ వుంటారు. వాళ్ళ యీ వైరుధ్యాలలో కొన్నింటిని సంకేత చిహ్నాల్ని అభివృద్ధి చేసేందుకు ఎంచుకుంటారు. వాటిని విషయాంశ పరిశోధనలో వాడుకుంటారు. ఆ సంకేత చిహ్నాలు (రేఖామాత్రమైనవిగాని, ఫోటోలుగాని)[27] వస్తువులు. ఇది సంకేతాల్ని వివరించుకునే వాళ్ళకి వాళ్ళ సవిమర్శక విశ్లేషణలో మాధ్యమంగా వుంటాయి. దృశ్యసాధనాల్ని తయారు చేసేందుకు మామూలుగా వుండే వాటికంటే కొన్ని సూత్రాల ఆధారంగా ఈ సంకేతం చేయడం అనేది జరుగుతుంది.

మొట్టమొదటి అవసరం ఈ సంకేతం రూపొందించడం, ఎవళ్ళ విషయాంశాల్ని పరిశీలిస్తూ వున్నామో ఆ వ్యక్తులకు పరిచయం అయిన సన్నివేశాల్నే తప్పకుండా ప్రదర్శించాలి. అప్పుడే వాళ్ళు ఆ సన్నివేశాల్ని సులభంగా గుర్తిస్తారు (ఆ రకంగా వాళ్ళకు వాటితో సంబంధం కలుగుతుంది). భాగస్వాములకు అపరిచితంగా వున్న యదార్థ పరిస్థితిని చూపించడం (పరిశోధనా క్రమంలోగాని, ఆ తరవాతి దశలోగాని, అంటే కార్యక్రమ వస్తువుగా అర్థవంతమైన విషయాంశాలని అందించేటప్పుడు) ససేమిరా వుండకూడదు. ఈ తర్వాతి పద్ధతి (అది గతితార్కికమే కావచ్చు, ఏమంటే, వ్యక్తులు తమకు పరిచితంగాని యదార్థం చూసి తమదాంతో పోల్చుకుంటారు, వాళ్ళ వాళ్ళ పరిమితులు తెలుసుకుంటారు) మరింత మౌలికమైన దానికంటే ముందు వుండకూడదు. ఈ మౌలికమైంది భాగస్వాములను ఆవరించిన పరిస్థితి నుంచి వచ్చినటువంటిది, అంటే–భాగస్వాములు తమ యదార్థ పరిస్థితిని విశ్లేషించుకుంటారు. అంతకుముందే వాళ్ళకి వున్న వక్రీకృతగ్రహింపు ఏమైందీ తెలుసుకుంటారు. ఆ రకంగా ఆ యదార్థం గురించి కొత్త అవగాహన పెంపొందించుకుంటారు.

సంకేత చిహ్నాల్ని తయారుచేసుకోవడానికి మౌలికంగా అవసరం అయింది మరోటి వుంది. విషయాంశ కేంద్ర బిందువు మరీ వెల్లడిగా వుండకూడదు. మరీ చిక్కుగానూ వుండకూడదు. మొదటి రకం ప్రచారం కిందికి దిగజారుతుంది. అక్కడ సంకేతచిహ్న వివరణే అక్కర్లేదు. ఆ విషయం అంతకుముందే తేల్చేశాం. ఇక దాన్ని చెప్పడమే ఇందులో వుంటుంది. రెండవది చిక్కుముడిగానో బేతాళ ప్రశ్నలాగానో తయారవుతుంది. అవి మనుగడ సన్నివేశాల్ని చూపిస్తూ వుంటాయి కాబట్టి, సంకేతం చేయడం సంక్లిష్టతలో

తేలిగ్గా వుండాలి. అనేక రకాలుగా విప్పుకొనేటట్టు వుండాలి. బుద్ధిశుద్ధినీ, ప్రచారధోరణుల్ని తప్పించుకోవాలంటే ఇది అవసరం. సంకేతీకరణ అంటే నినాదాలు కాదు. అవి కనిపించే విషయాలు, సవాళ్ళు, వాటివైపు సంకేతాల్ని విప్పుకునేవాళ్ళు విమర్శక ఆలోచన మళ్ళించాలి.

సంకేతాల్ని విప్పుకునే క్రమంలో అనేక రీతుల విశ్లేషణావకాశాలు అందించేందుకుగాను సంకేత కల్పనే "విషయపరంగా విచ్చుకోవడం" జరిగేలా ఏర్పాటు చేసుకోవాలి. సంకేతాల గురించి వాటిని విశ్లేషించుకునే వాళ్ళు ఆలోచన చేసేటప్పుడు ఇతర విషయాంశాల దిశలో సంకేతాలు తెరుచుకోవాలి. ఈ తెరుచుకోవడం (విషయపరవస్తువు మరీ చిక్కగా వున్నా లేదా మరీ వెల్లడిగా వున్నా జరగదు) అనేది గతితార్కికంగా విధాయకం. ఈ  గతి తార్కిక సంబంధాలు విషయాలమధ్యా వాటి ప్రతిద్వంద్వుల మధ్యా వుంటాయి. ఆ రకంగా సంకేతీకరణలు, మనుగడ సన్నివేశంలో వున్నదాన్ని ప్రతిబింబించే సంకేతాలు వస్తుగతంగా ఒక పూర్ణత్వం కల్పిస్తాయి. పూర్ణత్వం రూపొందడంలో అందులో వున్న అంశాలు పరస్పర ప్రతిచర్యలతో వుంటాయి.

సంకేతాల్ని విశ్లేషించుకునే క్రమంలో, ఆ భాగస్వాములు తమ విషయాంశాల్ని బహిరంగం చేసుకుంటారు. ఆ రకంగా ప్రపంచం గురించి తమ "నిజచైతన్యాన్ని" వెల్లడి చేసుకుంటారు. అలా చేసేటప్పుడు వాళ్ళు ఓ విషయాన్ని గ్రహిస్తారు. ఇప్పుడు తాము విశ్లేషించుకుంటూ వున్న పరిస్థితిని వాస్తవానికి అనుభవంలో చూసి, తాము ఎలా ఆచరించిందీ గ్రహిస్తారు. ఆ రకంగా "తమ పూర్వ గ్రహణ గురించిన గ్రహింపు" అందుకుంటారు. ఈ చైతన్యం సాధించిన తర్వాత, వాస్తవం గురించి భిన్నంగా గ్రహిస్తారు. వాళ్ళ గ్రహింపు పరిధి విస్తృతం చేసుకోవడం ద్వారా, వాళ్ళు తమ "నేపథ్య చైతన్యంలో" వాస్తవ పరిస్థితి రెండు పార్శ్వాల మధ్య వున్న గతి తార్కిక సంబంధాల్ని సునాయాసంగా తెలుసుకుంటారు.

"పూర్వగ్రహణ గురించిన గ్రహింపు", "గతజ్ఞానం గురించిన జ్ఞానం" ప్రేరితం కావడంవల్ల, సంకేత విపులీకరణ, నూతన గ్రహణ దర్శనం ప్రేరితం అవుతుంది, నూతన జ్ఞానం అభివృద్ధి చెందుతుంది. ఈ నూతన గ్రహణ, జ్ఞానం విద్యా ప్రణాళికకు నాంది పలకడంతో క్రమపద్ధతిగా కొనసాగుతాయి. ఈ ప్రణాళిక అప్రయోగిత అవకాశాన్ని ప్రయోగించే కార్యాచరణగా మారుస్తుంది, గర్భిత చైతన్యం నిజమైన చైతన్యాన్ని అధిగమించినట్టు.

సంకేతీకరణం తయారు చేయడానికీ, సాధ్యమైన మేరకు, అవి ఇతరమైనవాటితో "కలుపుకొని" వైరుధ్యాల్ని ప్రతిబింబించాలి. మనం అధ్యయనం చేసే ప్రాంతంలోని వైరుధ్యాల పద్ధతి ఇందులో వుంటుంది.[28] ఇలా "కలుపుకొని వచ్చే సంకేతీకరణల్లో ప్రతి ఒక్కదాన్ని తయారు చేసేటప్పుడు, అందులో వున్నయితర వైరుధ్యాల్ని సంకేత చిహ్నం చేయాలి. మొదటిదాన్ని విప్పుకోవడం, రెండవదాన్ని విప్పుకోవడం ద్వారా గతితార్కికంగా స్పష్టం అవుతుంది.

ఈ సందర్భంలో, గాబ్రియేల్ బోడ్ మన పద్ధతికి చాలా విలువైన సహాయం చేశారు. ఆయన చిలీ ప్రభుత్వోద్యోగి, యువకుడు. చిలీ ప్రభుత్వ సంస్థల్లో ఒక ప్రముఖమైన దాంట్లో పని చేస్తున్నారు. అది Institute de delsnollo Agropecurio (INDAP).[29] ఆయన అక్షరాస్యతానంతర దశలో ఈ పద్ధతి వాడారు. ఎకాయెకీ తమ అవసరాలకు సంబంధించిన సంకేత సందర్భం వచ్చినప్పుడే రైతులు చర్చలో ఆసక్తి చూపించారని అప్పుడు ఆయన గమనించారు. సంకేతం నుంచి ఏ కాస్తపక్కకు మళ్ళినా, సంకేత వివరణ చర్చలో బోధకుడు ఏ మాత్రం జోక్యం చేసుకుని ఇతరమైనవాటికి దారి తీయించినా, మౌనమే సమాధానమైంది. వాళ్ళు బదులు వచ్చింది. తమకేం పట్టనట్టే వుండిపోయారు. అటు పక్క ఈ సంకేతీకరణ[30] వాళ్ళ అవసరాల మీద లగ్నం అయివున్నా రైతులు క్రమపద్ధతిగా చర్చలో ఏకాగ్రత చూపించలేదనీ ఆయన గమనించాడు. ఆ చర్చ ఒక సంయోజన అందని అంచుకు మళ్ళిపోయేది. తమ అవసరాలకీ, ఆ అవసరాల ప్రత్యక్ష, పరోక్ష కారణాలకీ మధ్య వున్న సంబంధాన్ని దాదాపు ఎప్పుడూ గ్రహించనేలేదు. పరిమిత - సన్నివేశాలకు ఆవల వున్న అప్రయోగిత అవకాశాన్ని వాళ్ళు గ్రహించలేకపోయారనే చెప్పాలి. ఆ పరిమిత సన్నివేశాలే ఆ అవసరాలను కలిగించాయి.

అప్పుడు బోడె భిన్న పరిస్థితుల్ని ఏకకాలంలోనే ముందు పెట్టే ప్రయోగం చేయాలని నిర్ణయించుకున్నారు, ఈ నైపుణ్యంలోనే ఆయన చేసిన సేవ వుంది. ప్రాథమికంగా ఆయన ఒక జీవిత సన్నివేశం గురించి చాలా తేలికైన సంకేతాన్ని ముందు పెడతారు. ఈ తొలి సంకేతాన్ని "మూలం" అని పిలిచారు. అది మౌలిక కేంద్రకాన్ని సూచిస్తుంది. తర్వాత 'ద్వితీయ' సంకేతాలకు విస్తరిస్తూ ఒక విషయం విచ్చుకోవడం జరుగుతుంది. "మూల" సంకేతం విచ్చుకోవడం అయ్యాక ఉపాధ్యాయుడు ఆ చిత్రించిన రూపాన్ని ఒక సూచికగా భాగస్వాముల ముందు నిలబెట్టి వుంచుతాడు. దాని పక్కనే ద్వితీయ సంకేతాల్ని విజయవంతంగా నిలుపుతాడు. ఈ రెండవవి మూలసంకేతంతో ప్రత్యక్ష సంబంధంలో వుంటాయి. దాంతో భాగస్వాముల చురుకైన ఆసక్తి వుంటుంది. ఆ రకంగా వాళ్ళు సంయోజన అందుకుంటారు.

మౌలిక, ద్వితీయ శ్రేణి సంకేతాల మధ్య వున్న గతితర్కం ద్వారా ఆయన భాగస్వాములలో ఒక పూర్ణత్వ భావన వ్యక్తం చేయగలిగారు. అదే గాబ్రియెల్ బోడ్ మహత్తర విజయం. వ్యక్తులు యదార్థ పరిస్థితిలో మునిగిపోయి వుంటారు. వాళ్ళు తమ అవసరాలని గురించి తలచుకుంటూ వుంటారంతే. అలాంటివాళ్ళు యదార్థ పరిస్థితి నుంచి బయటకి వచ్చి, తమ అవసరాల కారణాలు గ్రహిస్తారు. ఈ రకంగా వాళ్ళు నిజమైన చైతన్యస్థాయి దాటి గర్భిత చైతన్యానికి వేగంగా వెళ్ళగలరు.

ఒకసారంటూ సంకేతీకరణలు తయారైతే, అంతర్ శాఖల బృందం వాటి ద్వారా సాధ్యమయ్యే విషయాంశాల ముఖాల్ని అధ్యయనం చేసినట్లయితే, పరిశోధకులు మూడవ దశ ఆరంభిస్తారు. అది పరిశోధన. "విషయ పరిశోధనా బృందాల్లో"[31] సంభాషణల్ని విపులీకరించుకోవడానికి నాంది పలకడం కోసం ఆ ప్రాంతం వైపు మళ్ళుతారు. ఈ చర్చలో అంతకు ముందు దశలో తయారైన అంశాల్ని విపులీకరిస్తారు. వాటి టేప్ చేస్తారు. తర్వాత అంతర్ శాఖల బృందం విశ్లేషణ చేసుకోవడానికి ఇది వీలు కలిగిస్తుంది.[32] పరిశోధకుడు విపులీకరించే సమన్వయకర్తకు తోడుగా, మరో యిద్దరు నిపుణులు – ఒక మనస్తత్వ శాస్త్రవేత్త, ఒక సామాజిక శాస్త్రవేత్త – ఈ సమావేశాలకు హాజరవుతారు. విపులీకరించేవాళ్ళల్లో ప్రస్ఫుటంగా కనిపించే (పైకి అప్రముఖంగానే వున్నవి) ప్రతిస్పందనల్ని నమోదు చేయడం వాళ్ళ కర్తవ్యం.

విపులీకరణ క్రమం సాగుతున్న సమయంలో, సమన్వయకర్త వ్యక్తులు చెప్పేది వినడమే కాదు, వాళ్ళని నిలదీయాలి. సంకేతం అయిన మనుగడ సన్నివేశాన్ని, వాళ్ళు చెప్పే సమాధానాల్ని సమస్యలుగా చూపుతూ వుండాలి. ఇలా అనుసరించే విధాన పద్ధతిలో ఒక ఉద్వేగ వర్జనా శక్తి వుంటుంది. దానివల్ల విషయ పరిశోధన బృందాల భాగస్వాములు అనేక మానసిక ఉద్వేగాల్ని బాహిరం చేసుకుంటారు, తమ గురించి తమకి వున్న అభిప్రాయాల్ని బాహిరం చేసుకుంటారు. ప్రపంచం గురించి, ఇతరుల గురించి తమ అభిప్రాయాల్ని వెల్లడి చేసుకుంటారు. ఇలాంటి వ్యక్తీకరణ వేరే పరిస్థితుల్లో సాధ్యంకాకపోవచ్చు.

శాంతియాగోలో ఇలాంటి విషయ శోధన[33] ఒకటి జరిగింది. ఒక ఆవాస ప్రాంతవాసులు, రోడ్డు మీద నడుచుకుంటూ పోతున్న తాగుబోతు వ్యక్తి గురించి చూపించే దృశ్యం గురించీ, మొగలో నుంచుని మాట్లాడుకుంటూ వుంటున్న దృశ్యం గురించీ చర్చించారు. బృందంలో వున్న భాగస్వాములు, "దేశానికి ఉపయోగపడేవాడూ, ఉత్పత్తిదాయకుడూ అయిన ఆ ఒకే ఒక్కడు తాగుబోతుగా వున్నాడు. తక్కువ కూలీకి రోజంతా ఒళ్ళు హూనం చేసుకుని ఇంటికి తిరిగిపోతున్నాడు. అతనికి కుటుంబం

గురించిన బెంగ. వాళ్ళ అవసరాలు తీర్చలేకపోతున్నానని. అతనొక్కడే పనివాడు. అతను చక్కని పనివాడు, మనలాగే తాగుడుమైకంలో పడిపోయేవాడునూ."

పరిశోధకుడు[34] మద్యపానం ప్రభావాల గురించి అధ్యయనం చేయాలని అనుకున్నాడు. చర్చలో భాగస్వాములుగా వున్నవాళ్ళకి తనే తయారుచేసిన ప్రశ్నావళిని యిచ్చి అడిగివుంటే ఈ పైన చెప్పుకున్న సమాధానాలు వచ్చి వుండేవి కావు. సూటిగా అడిగిస్తే గనక, "అయ్యో తాగుడా? దాని మొహమే ఎరగమే" అని వాళ్ళు అడ్డం తిరుక్కుని వుండేవారేమోకూడా. అయినా వున్న పరిస్థితి అది. దాన్ని గురించి సంకేతీకరణ జరుగుతోంది. వాళ్ళ వ్యాఖ్యల్లో దాన్ని గుర్తించారు, అందులో తమనీ గుర్తించారు. అప్పుడు నిజంగా తాము ఏమనుకుంటున్నదీ వాళ్ళు చెప్పారు.

ఈ ఉద్ఘాటనల్లో రెండు ముఖ్యాంశాలు వున్నాయి: ఒక పక్క తక్కువ ఆదాయాల విషయం మాటల్లో చెపుతున్నాడు. దోపిడీకి గురవుతున్నామన్న బాధ వుంది. తాగుతున్నామన్న బాధా వుంది – యదార్థం నుంచి పలాయనం చిత్తగించడానికి తాగడం, నిష్క్రియాపరత్వ నిర్వేదన అధిగమించే ప్రయత్నంగా, ఇక ఆఖరిగా ఆత్మవినాశకర పరిష్కారంగా అది తేలింది. ఇక అటు పక్క తాగుబోతుని గొప్పగా ప్రదర్శించి శ్లాఘించడమూ వుంది. అతను "ఒక్కడే దేశానికి ఉపయోగపడేవాడు, ఏమంటే, అతను పని చేస్తాడు, ఇతరులు వదురుతారంతే", తాగుబోతును మెచ్చుకున్నాక, చర్చలో భాగస్వాములు అతనిలో తమ ప్రతిబింబాన్ని చూస్తారు. పనివాళ్ళుగా, వాళ్ళు తాగుతారు – 'మర్యాదైన పనివాళ్ళు."

దీనికి విరుద్ధంగా నైతిక బోధకుని[35] వైఫల్యం వూహించండి. తాగుడు చెడ్డది సుమా అని నీతి వాక్యాలు దంచుతాడు. ఇదిగో సద్గుణ సంపన్నమైంది ఇదీ అని ఏదో ఉదాహరణ చూపెడతాడు. దాన్ని చూస్తే సద్గుణ శోభితం అయిందేమీ వీళ్ళకు కనిపించదు. అంచేత యిక్కడా, ఇతర సందర్భాల్లోనూ గట్టి మార్గం ఏమిటంటే కాన్షైంటి జచావో, ఆ పరిస్థితికి సంబంధించి, విషయపర శోధన ఆరంభం నుంచీ దాన్ని ప్రయత్నించి చూడాలి (కాన్షైంటిజచావో సన్నివేశం గురించిన స్వీయ గ్రహణలోనే ఆగిపోదు, వాళ్ళ మానవీకరణకు అవరోధాలుగా వున్నవాటికి వ్యతిరేకంగా చేసే కార్యాచరణ ద్వారా పోరాటంలో వుంటుంది).

మరో ప్రయోగం జరిగింది. ఈసారి పొలాల్లో రైతుల పనిని చిత్రించే పరిస్థితి అది. ఆ యావత్ చర్చా సమయంలో స్థిరంగా, అండగా వున్న విశిష్ట లక్షణం నేను గమనించాను. అది కూలీ పెంచడం, అందరూ కలిసి ఒక యూనియన్‌గా ఏర్పడ్డం.

అలా ఏర్పడితే ఈ కోరికను సాధించుకోవచ్చు. ఆ సమావేశంలో మూడు సన్నివేశాల గురించిన చర్చ సాగింది. అసలు అంశం అటు తిరిగి ఇటు తిరిగి ఇదే అయింది.

ఇప్పుడు ఈ మనుషుల కోసం తన విద్యా కార్యక్రమాన్ని నిర్వహించే ఉపాధ్యాయుణ్ణి గురించి వూహించండి. ఈ మనుషుల్లో "శుభ్ర"మైన పుస్తకాలు చదివేవాళ్ళు వున్నారనుకోండి. ఆ పుస్తకాల్లో వున్నది ఏమిటీ అంటే "బావిలో నీరు వుంది" లాంటి విషయాలు. సరే, వాళ్ళు వాటినే చదువుకుంటారు. కాని సరిగ్గా ఇలాంటి విద్యలోనూ, రాజకీయాల్లోనూ ఎప్పుడూ జరిగేది ఏమంటే విషయాంశపర పరిశోధనతోనే విద్య సంభాషణాత్మక స్వభావం మొదలువుతుందని గుర్తించారు.

ఈ బృందాల్లో సంకేత విపులీకరణంటూ ఒకసారి జరిగితే, పరిశోధనలో ఆఖరు దశ ఆరంభమవుతుంది. పరిశోధకులు తమ పరిశోధనల ద్వారా తెలుసుకున్న విషయాల అంతర్ శిక్షణాంశాలకి సంబంధించి క్రమరీతి అధ్యయనం అందుకుంటారు. అంతకుముందు సమావేశాల్లో రికార్డు చేసిన టేపుల్ని వినడం, మనస్తత్వ శాస్త్రవేత్త, సామాజిక శాస్త్రవేత్త తయారుచేసుకున్న నోట్సు అధ్యయనం చేయడం వుంటాయి. అప్పుడు పరిశోధకులు ఆయా సమావేశాల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా వచ్చిన అంశాల పట్టిక తయారుచేసుకుంటారు. ఈ అంశాల్ని విభిన్న సామాజిక శాస్త్రాల ప్రకారం వర్గీకరించుకోవాలి. వర్గీకరణ అనగానే, కార్యక్రమాన్ని విపులీకరించుకునేటప్పుడు ఆ అంశాలు విడివిడి విభాగాలకు చెందుతాయని అనుకోవడం కాదు. ఆ విషయాంశం ఒక ప్రత్యేక రీతిలో దానికి సంబంధించిన సామాజిక శాస్త్రాలకు చెందుతుందని గ్రహించడమే. ఉదాహరణకు ఒక విషయాంశం అభివృద్ధికి సంబంధించింది అనుకోండి, అది సరిగ్గా చెప్పుకోవాలంటే ఆర్థిక శాస్త్రానికి చెందుతుంది, అలా అని గిరిగీసి అంతేనని అనుకోకూడదు. ఆ విషయాంశం సామాజిక శాస్త్రానికి, సామాజిక మనస్తత్వ శాస్త్రానికీ (సాంస్కృతిక పరిణామాలకి, వైఖరుల విలువల సవరణలకి-అభివృద్ధి తత్వానికి ఇవీ అంతే సమంజసమైనవి సంబంధించిన రంగాలు) కూడా కేంద్ర బిందువుగా వుండచ్చు. అది రాజకీయ శాస్త్రానికీ కేంద్ర బిందువుగా వుండచ్చు (అభివృద్ధికి సంబంధించిన నిర్ణయాలు వుండే రంగం), విద్యకు సంబంధించి వుండొచ్చు, ఇంకా అలా అలా వుండచ్చు. ఈ రకంగా ఒక పూర్ణత్వాన్ని ప్రతిబింబించి చేసే విషయాంశాల్ని పట్టువిడుపులు లేకుండా సమీపించలేం. విషయాంశాల్ని యదార్థ పరిస్థితి ఇతర అభిముఖాలతో అల్లుకుపోయిన పౌష్కల్యంతో పరిశీలించిన తర్వాత, ఆ పుష్కలత్వాన్ని (ఆ రకంగా వాటి శక్తిని) బలిపెట్టే తీరులో వాటిని ఉపయోగించడం, వాటి ప్రత్యేకతలకు నామం పెట్టి ఉపయోగించడం దయనీయం.

విషయాంశాలు ఫలానది ఫలానా అని విడదీయడం పూర్తయింది, ఒకసారంటూ అలా జరిగేక, ప్రతి నిపుణుడూ ఇతర సంబంధిత శిక్షణాంశాల బృందం ముందు తన విషయాంశాన్ని "విభాగించి" చూపిస్తాడు. ఇలా అంతరంశాల విభజన చేయడంలో ఆ నిపుణుడు కేంద్రబిందువు ఏమిటో చూస్తాడు. ఇందులో నేర్చుకునే విభాగాలు వుంటాయి. ఒక క్రమరీతి స్థాపనా వుంటుంది. అప్పుడు ఆ విషయాంశానికి సంబంధించిన సాధారణ అవలోకన యిస్తాడు. ఇలా ప్రతి నిర్దిష్ట పథకం గురించీ చర్చిస్తారు. మిగిలిన నిపుణులు సూచనలు చేస్తారు. ఆ సూచనల్ని ఆ పథకంలో చేర్చనూవచ్చు, లేదా ఆ విషయాంశం గురించి రాసే సంక్షిప్త వ్యాసంలో జోడించుకోనూవచ్చు. ఈ వ్యాసాలకి గ్రంథాల వివరణ పట్టీ జతచేస్తారు. ఈ వ్యాసాలు, "సాంస్కృతికబృందాల్లో" పనిచేసే ఉపాధ్యాయ–విద్యార్థి శిక్షణకు ఎంతో విలువైన ఉపకరణాలుగా వుంటాయి.

అర్థవంతమైన విషయాంశాల్ని విభాగించే సమయంలో, కొన్ని మౌలిక విషయాల్ని జతచేయాల్సిన అవసరం వుందని ఆ బృందం గుర్తిస్తుంది. ఈ మౌలిక విషయాల్ని జనం అంతకు ముందు సాగిన పరిశోధనలో నేరుగా సూచించి వుండరు. ఈ విషయాల్ని చేర్చడం అవసరం అని తేలింది. అది విద్య సంభాషణాత్మక స్వభావానికి అనురూపంగానూ వుంటుంది. విద్యాకార్యక్రమం సంభాషణాత్మకమైందైతే ఉపాధ్యాయుడు విద్యార్థులు, అంతకు ముందు సూచించని విషయాల్ని చేర్చడంలో భాగస్వామ్య హక్కు కలిగి వుంటారు. ఈ రెండవ తరహా విషయాల్ని నేను వాటి ప్రయోజనం దృష్ట్యా "కలిపిన విషయాలు" అంటున్నాను. అవి కార్యక్రమ విభాగంలో రెండు విషయాల మధ్య సంబంధాన్ని కలిగించవచ్చు, ఆ రెండింటి మధ్య అంతరాల్ని పూడుస్తాయి, లేదా సామాన్య కార్యక్రమ వస్తువుకీ, ప్రపంచం గురించి ప్రజలకు వున్న దృక్పథానికీ మధ్య సంబంధాన్ని ఎత్తి చూపించవచ్చు. అంచేత, ఈ విషయాల్లో ఒకదాన్ని విషయాంశ విభాగాల ప్రారంభంలో వుంచవచ్చు.

సంస్కృతికి సంబంధించిన మానవ శాస్త్రపరిశీలనా భావన యిలా చేర్చిన అంశాల్లో ఒకటి. ప్రపంచంలో మానవుల పాత్రని, ప్రపంచానికి అనుకూలంగా సర్దుకుపోవడం కంటే, పరివర్తన చెందించేవాళ్ళుగా వాళ్ళ పాత్రని ఇది స్పష్టం చేస్తుంది.[36]

విషయాంశాల విభజన ఒకసారంటూ పూర్తయితే,[37] సంకేతీకరణ దశ వస్తుంది; ప్రతి విషయాన్ని ఎలా చక్కగా చెప్పాలా అన్న మార్గం, దాన్ని అందివ్వడం ఎలా అన్న మార్గం ఎన్నుకోవడం జరుగుతుంది. సంకేతీకరణ సరళమైందీ కావచ్చు లేదా మిశ్రితమూ కావచ్చు. సరళమైందాట్లో దృశ్య (చిత్రాలుగాని వర్ణనాత్మకంగాని), స్పర్శదృశ్య, శ్రవణమార్గాన్ని వాడుకోవడం వుంటుంది. మిశ్రితం అయినదాంట్లో అనేక రకాల మార్గాలు

వుంటాయి.[38] దృశ్య, వివరణాత్మక మార్గాన్ని ఎంచుకోవడం సంకేతీకరించవలసిన విషయం మీదే కాక, మనం ఎవళ్ళకి చెపుతున్నామో వాళ్ళు అక్షరాస్యులవునో కాదో అన్నదాని మీదా ఆధారపడి వుంటుంది. విషయాంశాల్ని సంకేతీకరించడం జరిగాక, బోధనాత్మక పరికరాలు (ఫోటోలు, స్లైడ్లు, ఫిల్ముఖండాలు, పోస్టర్లు, చదివే పుస్తకాలు వగైరావగైరా) తయారు చేయడం వుంటుంది. కొన్ని విషయాల్నిగాని, కొన్ని విషయాల భాగాల్నిగాని, రికార్డు చేసిన ఇంటర్వ్యూలకు టాపిక్స్ కింద బయట నిపుణులకు ఆ బృందం ప్రతిపాదించవచ్చు.

ఉదాహరణకు అభివృద్ధి విషయాంశాన్నే తీసుకుందాం. విభిన్న ఆలోచనా ధోరణులకు చెందిన ఆర్థిక వేత్తల్ని – ఇద్దరినో, ఇంకా ఎక్కువ మందినో, ఆ బృందం అడుగుతుంది. కార్యక్రమం ఏమిటైందీ చెపుతుంది. శ్రోతలకు అర్థమయ్యే భాషలో ఆ విషయం గురించి ఇంటర్వ్యూ కోరుతుంది. ఆ నిపుణులు సరేనంటే, పదిహేను యిరవై నిముషాల ఇంటర్వ్యూని టేప్ చేస్తారు. ఆ నిపుణులు చెప్పేటప్పుడు వాళ్ళ ఫోటోలూ తీసుకుంటారు.

సంస్కృతీ బృందానికి ఈ టేపు చేసిన ఇంటర్వ్యూని అందించేటప్పుడు ముందుగా నాలుగు ముక్కలు చెప్పాలి. ఆ వక్త ఎవరో, ఆవిడగాని ఆయనగాని ఏం రాశారో, ఏం చేశారో, ఏం చేస్తున్నారో అందులో చెప్పాలి. ఆ లోపునే ఆ వక్త ఫోటోని తెరమీద ప్రదర్శించాలి. ఉదాహరణకు వక్త విశ్వవిద్యాలయంలో ప్రొఫెసరనుకోండి. అలాంటప్పుడు ఆ పరిచయంలో విశ్వవిద్యాలయాల గురించి చర్చల్లో పాల్గొనేవాళ్ళు ఏమనుకుంటున్నదీ, వాటి నుంచి వాళ్ళు ఏం ఆశిస్తూ వున్నదీ చర్చలో వుండొచ్చు. ఆ బృందానికి ముందే చెపుతాం, రికార్డు చేసిన ఇంటర్వ్యూ తర్వాత అందులో వున్నదాన్ని గురించిన చర్చ వుంటుందని (ఇది శ్రవణ సంకేతీకరణగా పని చేస్తుంది). ఈ బృందం ఆ తర్వాత, చర్చ సమయంలో అందులో పాల్గొన్న వాళ్ళ ప్రతిస్పందన ఎలా వున్నదీ నిపుణులకు చెపుతుంది. ఈ ఉపాయంవల్ల మేధావులకీ యదార్థ పరిస్థితికీ అనుసంధానం కలుగుతుంది. వాళ్ళు పాపం, సదుద్దేశం వున్నవాళ్ళేగాని, ప్రజల యదార్థ పరిస్థితికి ఓ మాదిరిగా దూరం అయినవాళ్ళే..

కొన్ని విషయాలనీ, కేంద్రకాంశాలనీ నాటకీకరణ పద్ధతిలో అందించవచ్చు. అంటే, విషయాలే వుంటాయి, “పరిష్కారాలు” వుండవు! ఈ నాటకీకరణ సంకేతీకరణగా పని చేస్తుంది, చర్చించవలసిన సమస్యా ప్రతిపాదక సన్నివేశంగానన్నమాట!

మరో బోధనాత్మక వనరు వుంది – విద్యకు సంబంధించిన నిధి పద్ధతి కాకుండా సమస్యా ప్రతిపాదక దృష్టిలోనే నడిపించినంత కాలం పత్రికల్లో, వ్యాసాల్ని, వార్తాపత్రికల్ని,

పుస్తకాలలో అధ్యాయాల్ని (ముందు కొన్ని భాగాలుగా మొదలుపెట్టి) చదవడం, చర్చించడం అది. రికార్డు చేసిన ఇంటర్వ్యూలలో మాదిరిగానే, మొదట్లోనే ఆ రచయిత ఎవరైందీ పరిచయం చేస్తారు, అసలు అందులో వున్నవాటి గురించి తర్వాత చర్చిస్తారు.

ఇదే విధంగా వార్తాపత్రికలలో ఓ ఫలానాదాన్ని గురించి సంపాదకీయ వ్యాఖ్యలు వుంటాయి కదా, వాటిని విశ్లేషించడమూ తప్పనిసరిగా వుండాలి. "ఉన్న వాస్తవం ఇదే కదా, మరి ఈ పత్రికవాళ్ళు ఇలాగా, ఆ పత్రికవాళ్ళు అలాగా వ్యాఖ్యానాలు చేయడం ఏమిటి?" అని చర్చించాలి. ఈ అభ్యాసం వల్ల విమర్శనా దృష్టి పెరుగుతుంది. అప్పుడు ప్రజలు తమకేసి ఎక్కుపెట్టిన 'ప్రకటనలకు' వార్తాపత్రికలకూ, వార్తా ప్రసారాలకూ బుద్ధావతారాల్లా స్తబ్ధుగా వుండరు, స్వేచ్ఛాకాములైన చైతన్యాలుగా స్పందిస్తారు.

ఇలా బోధన సరంజామా అంతా తయారవుతుంది. వీటికి చిన్న పరిచయ పూర్వక ఉపోద్ఘాతాల్ని జతచేయాలి. అప్పుడు ఉపాధ్యాయుల బృందం ప్రజలకు వాళ్ళ విషయాంశాల్ని, ఒక క్రమ పద్ధతిలో, విస్తృతీకరించిన రూపంలో అందించడానికి తయారుగా వుంటుంది. ప్రజల నుంచి వచ్చిన విషయాంశాలు మళ్ళీ వాళ్ళదగ్గరకే చేరతాయి – నిక్షిప్తం చేయవలసిన సరుకుగా కాదు, పరిష్కరించవలసిన సమస్యలుగా.

ప్రాథమిక విద్య ఉపాధ్యాయుల మొదటి కర్తవ్యం. విద్యా ప్రచారంలో కార్యక్రమ సాధారణ స్వరూపాన్ని ముందు పెట్టడం. ప్రజలు వాళ్ళకు వాళ్ళుగానే ఈ కార్యక్రమంలో వున్నట్టు తెలుసుకుంటారు. అదేదో వింత అయినట్టు వాళ్ళకి అనిపించదు. ఏమంటే, అది పుట్టిందే వాళ్ళనుంచి. ఉపాధ్యాయులు (విద్య సంభాషణాత్మక స్వభావం మీద ఆధారపడి), ఆ కార్యక్రమంలో జోడించిన అంశాల గురించీ, వాటి ప్రాముఖ్యం గురించీ వివరిస్తారు.

పైన చెప్పినట్టు ప్రాథమిక విషయాంశ పరిశోధన సాగించడానికి బోధకులకు తగినన్ని నిధులు లేవనుకోండి, వాళ్ళు – సన్నివేశం గురించిన కనీస అవగాహనతో – "పరిశోధించవలసిన సంకేతీకరణలు"గా అందుబాటులోకి వచ్చేందుకు కొన్ని ప్రాథమిక విషయాల్ని ఎంపిక చేసుకోవాలి. అందుకు అనుగుణంగా ఉపోద్ఘాత విషయాలలో మొదలుపెట్టి, అదే సమయంలో మరింత విషయాంశ పరిశోధన ప్రారంభించవచ్చు.

ఈ మౌలిక విషయాలలో ఒకటి (ఇది కీలకమైందనీ, తప్పించుకోలేనిదనీ నా అభిప్రాయం) సంస్కృతికి సంబంధించి మానవ శాస్త్రపరిశీలనా భావన, స్త్రీలా, పురుషులా రైతులా, పట్టణ శ్రామికులా, అక్షరాభ్యాసం చేస్తున్నారా, అక్షరాస్యతానంతర కార్యక్రమంలో నమోదై వున్నారా, మరింతగా తెలుసుకోవాలన్నదే వాళ్ళ ఆరంభబిందువుగా వుందా(ఈ

పదానికి వున్న ఆచరణాత్మక అర్థంలో) అన్నవి ఈ భావనలో తర్కించే సంగతులు. సంస్కృతి ప్రపంచం గురించి వాళ్ళు చర్చించేటప్పుడు, యదార్థ పరిస్థితి గురించి వాళ్ళ చైతన్యస్థాయి ఎంత వుందో దాని ద్వారా వెల్లడవుతుంది. ఇందులో అనేక విషయాలు గర్భితమై వున్నాయి. వాళ్ళ చర్చలో యదార్థ పరిస్థితి ఇతర పార్శ్వాలూ తగులుతాయి, వాటిని మరింత విమర్శనాత్మక ధోరణిలో గ్రహిస్తారు.

ఇప్పుడు నాకున్న అనుభవం దృష్ట్యా ఒక విషయాన్ని నొక్కి చెప్పగలను. సంస్కృతి భావన, అన్ని కోణాల నుంచిగాని, అధిక కోణాల నుంచి గాని కల్పనా శక్తితో చర్చించినట్లయితేగనక విద్యాకార్యక్రమ విభిన్న దృశ్యాన్ని అందిస్తుంది. దీనికితోడు, సాంస్కృతిక బృంద భాగస్వాములతో కొన్ని రోజుల సంభాషణ తర్వాత, ఉపాధ్యాయులు వాళ్ళని సూటిగా అడిగెయ్యవచ్చు: వీటికి తోడుగా మరే ఇతర అంశాలు లేదా విషయాల గురించి మనం చర్చిద్దాం?" ప్రతి వాళ్ళూ ఏదో జవాబు చెపుతారు కదా! వాటిని రాసిపెట్టుకోవాలి. వెంటనే దాన్నొక సమస్యగా బృందం ముందు పెట్టొచ్చు.

ఉదాహరణకు బృందంలో ఒక సభ్యుడు "నేను జాతీయత గురించి మాట్లాడాలనుకుంటున్నాను" అనొచ్చు. "భేషుగ్గా!" అని ఉపాధ్యాయుడు దాన్ని రాసిపెట్టుకుంటాడు. "జాతీయత అంటే ఏమిటి? జాతీయత గురించిన చర్చలో మనకేం ఆసక్తిగా వుంటుంది?" అని జతచేస్తాడు. ఒక సలహాను ఒక సమస్యగా బృందం ముందు పెట్టినప్పుడు కొత్త విషయాలు పుట్టుకొస్తాయన్నది నా అనుభవం. ఒక ప్రాంతంలో (ఉదాహరణకు) ఒకే రోజు రాత్రి ముప్పై సాంస్కృతిక బృందాలు సమావేశం అవుతున్నాయనుకుందాం. అందరు సమన్వయకర్తలూ (ఉపాధ్యాయులు) ఈ తరహాలోనే వెళ్ళారని అనుకుందాం. అప్పుడు అధ్యయనం చేయడానికి కేంద్ర బృందానికి సమృద్ధిగా ముడి సరుకు దక్కుతుంది.

విమోచనాత్మక విద్య దృష్టి నుంచి చూస్తే ముఖ్యాంశం ప్రజలు తమ ఆలోచనల కర్తలం తామే అని భావించుకునే స్థితి రావడం. ప్రపంచం గురించిన దృక్పథాల్ని, ఆలోచనల్ని చర్చించడం ద్వారా ఇది జరగాలి. వాళ్ళు చర్చల సమయంలో సూటిగానో, గర్భితంగానో తమవిగాని, తమ మిత్రులవిగాని సూచనలు వెల్లడిస్తారు. ఇలా ఎందుకు జరుగుతుందీ అంటే, విద్య తన కార్యక్రమాన్ని ప్రదర్శించదు, ఈ కార్యక్రమాన్ని ప్రజలతో సంభాషణాత్మకంగా వెతుక్కోవాలి అన్న నమ్మకం నుంచి పుట్టుకొస్తుంది కాబట్టి. ఇది పీడితుల విద్య అవుతుంది. దీన్ని విస్తృతం చేసుకోవడంలో పీడితులే తప్పనిసరిగా పాలు పంచుకోవాలి.

# వివరణలు

1. కార్యాచరణ, ఆలోచన: మాట = కార్యం = కార్యాచరణ

   కార్యాచరణను వదిలిపెట్టడం = శాబ్దిక ఆడంబరం

   ఆలోచనను వదిలిపెట్టడం = ఒట్టి క్రియాశీలత

2. ఈ ఆలోచనల్లో కొన్ని ప్రొఫెసర్ ఎర్నని మేరియా ప్రయోరితో జరిపిన సంభాషణల్లో ఆవిర్భవించాయి.

3. నేను గాఢ తపస్సుకి సంబంధించిన మౌనం గురించి ప్రస్తావించడం లేదు. అందులో పైకి మనుషులు లోకాన్ని వదిలిపెడతారు. దాన్నుంచి ముడుచుకుంటారు, ఆ రకంగా ఒక పూర్ణత్వంలో పరిశీలించాలని చూస్తారు. ఆ రకంగా ప్రపంచంతోనే వుంటారు. కాని, ఈ రకమైన మరలడం తపశ్శాలి యదార్థంతో "స్నపితు'డైనప్పుడే ప్రామాణికం అవుతుంది; అంతేకాని, ఆ మరడలం ప్రపంచంపట్ల ఏవగింపునీ, పలాయనాన్ని సూచించినప్పుడు కాదు, ఒక రకమైన "చారిత్రక మానసిక వ్యాధి" అవుతుంది. (Schizophremia అని ఇంగ్లీషు మాటని ఇక్కడ వాడారు. అంటే ఆలోచనలకి, ఆచరణకీ, భావాలకీ సంబంధం లేకుండా వ్యవహరించే ఒక రకం మానసిక వ్యాధి, మతిభ్రమణం అని అర్థంద తెలుగు అను.)

4. విప్లవానికి వున్న సృజనాత్మక, విమోచనాత్మక స్వభావంవల్ల విప్లవాన్ని ఒక ప్రేమ పూరిత చర్యగా నిజమైన విప్లవవాదులు గ్రహించాలని నాకు మరింతగా నమ్మకం కలుగుతోంది. విప్లవ సిద్ధాంతం లేకుండా – ఆ రకంగా అది శాస్త్రం – సాధ్యపడని విప్లవం ప్రేమతో పొసగనిది కాదు. అందుకు భిన్నం. ప్రజలు మానవీకరణం చెందేందుకు విప్లవం చేస్తారు. వ్యక్తులు విప్లవవాదులు అయ్యేటట్టు చేసే గాఢమైన ప్రేరణ ఏది నిజానికి, ప్రజల అమానవీకరణ కాకపోతే? పెట్టుబడిదారీ ప్రపంచం "ప్రేమ" అన్న పదాన్ని వక్రీకరించింది. అంతమాత్రంచేత మౌలికంగా విప్లవానికి అనురాగపూరిత స్వభావాన్ని నిరోధించలేం. విప్లవ వాదులకు జీవితంపట్ల వున్న ప్రేమనీ అది నిరోధించలేదు. గువేరా (పరిహాసం పాలయ్యే ప్రమాదం వున్నా) దాన్ని ధృవపరచడానికి జంకలేదు. "ఒక మాట చెప్పనివ్వండి. పరిహాసంగా కనిపిస్తే అలానే అనుకోండి. అసలైన విప్లవవాది గాఢమైన ప్రేమానురాగాలతో వుంటాడు. ఈ గుణం లేకుండా నిజమైన విప్లవవాది వుంటాడని భావించడం అసాధ్యం" (*Vencerens - The speeches and writings of the Guevara*. సంపాదకత్వం : జాన్ గెరాస్సి. (న్యూయార్క్, 1969) పే.398.

5. ఒక మిత్రుడికి రాసిన ఉత్తరం నుంచి.

6. పియర్రె ఫర్టర్ *Educacao & Vida* (రియో ,1966) పే.26–27.

7. మాలరాక్‌కీ మావోకు దీర్ఘ సంభాషణ జరిగింది. "మీకు తెలుసో లేదో నేను చాలా కాలంగా అంటూ వున్నాను, ప్రజా సమూహాల నుంచి మనం గజిబిజిగా అందుకున్న దాన్నిగురించే వాళ్ళకి మనం చెప్పాల్సి వుంది" అన్నాడు మావో. (ఆంద్రీమాలరాక్ Antia Memoies, న్యూయార్క్, 1968 పే.361-362.) ఈ ఉద్ఘాటనలో మొత్తం సంభాషణా సిద్ధాంతం అంతా వుంది. విద్యాకార్యక్రమ వస్తువును ఎలా నిర్మించుకోవాలి అన్నదంతా వుంది. దీన్ని విద్యార్థులకు ఏది భేష్ అయిందో ఉపాధ్యాయుడు అనుకున్నదాని ప్రకారం వివరించడం కుదరదు.

8. ఫర్టర్, ఇదే గ్రంథం పే.165.

9. రైతులు సామాన్యంగా వలస పరిస్థితిలో వుంటారు. ప్రకృతి పేగుబంధంతో వుంటారు. ప్రకృతిని రూపొందించేవాళ్ళుగాకంటే అందులో అంగీభావంగా వుంటారు.

10. "మన సాంస్కృతిక కార్యకర్తలు ఎంతో ఉత్సాహభరితంగా, అంకితభావంతో ప్రజలకు సేవ చేయాలి. ప్రజలకు బంధితులైపోవాలి. వాళ్ళ నుంచి దూరంగా పోకూడదు. అందుగ్గాను ప్రజల ఆకాంక్షలకీ ఆశలకీ అనురూపంగా నడచుకోవాలి. ప్రజల కోసం చేసే పని యావత్తూ వాళ్ళ అవసరాల దృష్ట్యానే జరగాలి తప్ప, ఏ ఒక్క వ్యక్తి ఇష్టానిష్టాలనిబట్టీ కాదు. అది ఎంత సులక్షణమైన వైనాగానీ, ప్రజలు వాళ్ళకిగా ఒక ఫలానా మార్పు కోరుకుంటారు, కాని తాముగా ఆ అవసరాన్ని గుర్తించరు, మార్పు జరిపించడానికి యింకా మొగ్గుతోనూ వుండరు, కృతనిశ్చయులయీ వుండరు. అలాంటి సందర్భాలలో ఓపిక పట్టి చూడాలి. మనం కృషి ద్వారా ప్రజలు ఆ అవసరాన్ని గుర్తించే దాకా, దాన్ని అమలు జరిపించే కోరిక, కృతనిశ్చయం చూపించేదాకా ఆ మార్పును జరిపించకూడదు. లేకపోతే మనం ప్రజాబాహుళ్యానికి దూరం అయిపోతాం.... ఇక్కడ రెండు సూత్రాలు వున్నాయి. ఒకటి వాళ్ళు ఆ మార్పు వుంటే బాగుంటుందే అనుకోవడం వేరు, మార్పు అవసరం వేరూ. రెండవది-ప్రజల కోరిక, వాళ్ళకిగా వాళ్ళు మనస్సులో తీర్మానించుకోవాలి, మనం వాళ్ళకోసం నిర్ణయాలు చేయడం లేదు." మావో జెడాంగ్ Selected works, Vol. III "The United Front and Cultural work" (అక్టోబరు 30, 1944) బీజింగ్, 1967 పే.186-187.

11. ఈ అంశాన్ని మరింత వివరంగా అధ్యాయం 4 చర్చిస్తుంది.

12. నిజమైన మానవతావాదులు నిధి విధానాన్ని ఉపయోగించడం, మితవాదులు సమస్యా ప్రతిపాదక విద్యలో నిమగ్నం అవడంలాగా స్వవచో వ్యాఘాతం అవుతుంది. (ఈ మితవాదులే ఎప్పుడు నిలకడగా వుంటారు - వాళ్ళు సమస్యా ప్రతిపాదక బోధనను ఆరు నూరైనా పెట్టరు.)

13. "అర్థవంతమైన చర్చావిషయం" అన్న పదబంధాన్ని యిదే అర్థంలోవాడడం జరిగింది.

14. బతుకు (live), జీవించు (exist) అన్న పదాలకు ఇంగ్లీషు భాషలో వాటి వుత్పత్తికి భిన్నమైన అర్థాల్ని సమకూర్చుకున్నాయి. బతుకు అనేది మరింత మౌలిక పదం, పూరికే బట్టకట్టలేదు. "జీవించు" అన్న దానికి మరింత లోతైన అర్థం వుంది. "తయారయ్యే' క్రమంలో నిమగ్నం కావడం.

15. 'పరిమిత-సన్నివేశ' సమస్యను ప్రొఫెసర్ అల్వారో వియేరియా పింటో స్పష్టంగా వివరించారు. జాస్టర్స్‌లో మొదట కనిపించిన నిరాశాపూరిత అర్థం లేకుండానే ఈ పదబంధాన్ని వాడరు. వియేరియా పింటో దృష్టిలో 'పరిమిత-సన్నివేశాలు' అనేవి 'అవకాశాలు మూసుకుపోయిన దుర్భేద్య హద్దులు" కావు. అసలైన హద్దులు. అన్ని అవకాశాలూ ఇక్కడే మొదలవుతాయి." అవి "ఉనికిని శూన్యం నుంచి విడదీసే ఎల్లలుకావు; ఉనికిని మరింతగా వుండే ఉనికి నుంచి విడదీసే ఎల్లలు." అల్వారో వియేరా పింటో, Consciencia & Rearlidade Nacional (రిమోడిజనిరో, 1960, Vol.4, p.284).

17. ఈ అంశానికి సంబంధించి కారల్ కౌశిక్ Dialectica de lo concerto చూడండి (మెక్సికో, 1967).

18. చారిత్రక యుగాల గురించి హాన్స్ ఫ్రెయిర్ Teoria de la ipoca a tual (మెక్సికో) చూడండి.

19. నేను ఈ విషయాల్ని "ఉత్పాదక" అన్నాను. ఏమంటే, వాటిని ఎలా అర్థం చేసుకున్నా, ఎలాంటి ఆచరణకు దారితీసినా, ఎన్నో విషయాలుగా విచ్చుకునే అవకాశం వాటిలో వుంటుంది, అప్పుడవి నెరవేర్చవలసిన నూతన కర్తవ్యాలకి పిలుపునిస్తాయి.

20. మధ్యతరగతి వ్యక్తులు ఎక్కువగా ఈ బాపతు ప్రవర్తన కనబరుస్తారు. రైతుకంటే భిన్నంగా వుండొచ్చదంతే. వాళ్ళకి స్వాతంత్ర్యం అంటే భయం. దాంతో సమర్థనలూ, హేతుబద్ధం చేసుకోవడాలూ వస్తాయి. అవి మౌలికమైందాన్ని కమ్మేస్తాయి. పనికిమాలిన దాన్ని గొప్పచేసి చెపుతాయి. నిర్దిష్ట యదార్థ పరిస్థితిని తోసివేస్తాయి. సమస్య వుంది, దానికి సంబంధించి పరిమిత-సన్నివేశం విషయంలో ఇబ్బందికరమైన గ్రహణే విశ్లేషితమవుతుంది. అలాంటి సందర్భంలో వాళ్ళు చర్చల అంచుల్లోనే వుండే మొగ్గు చూపిస్తారు. సమస్య ఆయువుపట్టు ఏమిటో చూడ్డానికి సుతరామూ ఇష్టపడరు. వాళ్ళు ఎంతో గొప్ప చేసి చూపించే నిరర్థక, ద్వితీయ శ్రేణిని ఎత్తిపెట్టే మౌలిక ప్రతిపాదనను ఎవళ్ళన్నా ముందు పెట్టారనుకోండి, వాళ్ళకి చిరాకు కలుగుతుంది కూడానూ.

21. అస్తిత్వ సన్నివేశాన్ని సంకేత సూచకం చేయడం అంటే ఆ సన్నివేశాన్ని ప్రతిబింబించడమే, ప్రతి చర్యలతో వున్న కొన్ని అంశీభూత మూల భాగాల్ని చూపించించడమే. సంకేత సూచకంగా వున్న సన్నివేశాన్ని సంకేత రహితం చేయడమే సవిమర్శక విశ్లేషణ.

22. "ఉత్పాదక పదాల" శోధన గురించీ, వాడుక గురించీ నా E ducacao como pratica da Liberdade చూడండి.

23. బ్రెజిలియన్ సామాజిక శాస్త్రవేత్త మారియా ఎడీఫెరిరా (ఒక అముద్రిత గ్రంథంలో) చెప్పినట్టు, విషయాంశ శోధన ప్రజలకి నిజంగా చెందినదాన్ని వాళ్ళకి తిరిగి ఇచ్చినప్పుడే ఆ మేరకు సమర్థనీయం అవుతుంది. ప్రజల గురించి తెలుసుకునే యత్నంగా కాక, వాళ్ళతో కలిసి వాళ్ళని సవాల్ చేసే యదార్థ పరిస్థితిని తెలుసుకుందుకు అది ప్రాతినిధ్యం వహించే మేరకు సమర్థనీయం అవుతుంది.

24. ఒక రచయిత ప్రజల ఉచ్చారణనీ, వ్యాకరణ అపభ్రంశాల్నీకాక వాళ్ళ వాక్యనిర్మాణాన్ని, వాళ్ళ ఆలోచనా నిర్మాణాన్ని ఎంత సొడ్డు లేకుండా పట్టుకోగలడో తెలియచెప్పే సాటిలేని ఉదాహరణ బ్రెజిలియన్ నవలా రచయిత గుయ్ మారె రోజా బ్రెజిలియన్ లోతట్టు ప్రాంతవాసుల "అర్థవంత విషయాంశా"లకు సాటిలేని పరిశోధకు నిజానికి గుయ్ మారె రోజా (రచయితగా ఆయన అసాధారణమైన విలువను దీన్నిబట్టి తక్కువ చేస్తున్నామని కాదు) *Grande Serato* రచయితలో వున్న యీ పార్శ్వాన్ని అంత ఎక్కువగా పట్టించుకోలేదు. ఈ పార్శ్వాన్ని విశ్లేషిస్తూ ప్రొఫెసర్ షాలొడి టార్సో ఒక వ్యాసం తయారు చేస్తున్నారు. (ఈ గ్రంథం ఇంగ్లీషు అనువాదం "The Devil to pay Backlords") (న్యూయార్క్, 1963).

25. ల్యూసియెన్ గోల్డ్‌మన్ *The Human Sciences and Philosophy* (లండన్, 1969) పే. 118.

26. ఆంద్రే నికొలాయ్ *Comportment Economique of Structures Sociales* (పారిస్, 1960).

27. సంకేత చిహ్నం మౌఖికమైందీ కావచ్చు. ఇలాంటప్పుడు ఒక జీవన సమస్యను అందించే కొన్ని మాటలు కావచ్చు. తర్వాత సంకేతం విప్పుకోవడం వస్తుంది. చిలీలో వ్యవసాయాభివృద్ధి సంస్థ ఈ పద్ధతిని విజయవంతంగా విషయాంశ శోధనలో వాడింది.

28. జోస్ ఫియెరి, అముద్రిత రచనలో ఈ సిఫార్సు చేశారు.

29. ఇటీవలిదాకా ఐఎన్‌డిఎపికి జార్వెస్ బోన్‌బోల్ అనే ఆర్థిక వేత్త, ప్రామాణిక మానవతావాది నిర్దేశకులుగా వున్నారు.

30. ఫ్రెయెరి నిర్వచనం ప్రకారం ఈ సంకేతీకరణలు "కలుపుకుని వచ్చేవి" కాదు.

31. "ప్రతి పరిశోధక బృందంలోనూ" గరిష్ఠంగా ఇద్దమైమంది వుంటారు. అధ్యయనం జరిపే ప్రాంతంలో, ఉపప్రాంతంలో పదిశాతంలో భాగస్వాములుగా నిమగ్నం చేయడానికి ఎన్ని బృందాల అవసరం అయితే అన్ని వుంటాయి.

32. తదనంతర సమీక్షా సమావేశాలలో ఆ ప్రాంతం వలంటీర్లు వుండాలి. వాళ్ళు పరిశోధనలో సాయపడ్డారు కదా? "విషయ పరిశోధనా బృందాలు" నుంచి కొందరు భాగస్వాములు వుండాలి. వాళ్ళ సేవ వాళ్ళకి న్యాయంగా వుండే హక్కు అవుతుంది., నిపుణుల విశ్లేషణకు తప్పనిసరి సాయమూ అవుతుంది. వీళ్ళు నిపుణులతో సహ–శోధకులుగా, వీళ్ళు నిపుణులు ఆ ఫలితాల గురించి చేసే వ్యాఖ్యానాలని సరిదిద్దుతారు, లేదా సమర్థిస్తారు. అనుసరించే పద్ధతి దృష్ట్యా వాళ్ళ భాగస్వామ్యంవల్ల పరిశోధనకు (ఆదినుంచీ ఇది సానుభూతిపూర్వక విమర్శక సంబంధంతోనే వుంటుంది) అదనపు కవచం అందుతుంది. ఆదినుంచీ ఆఖరిదశ దాకా ప్రజాప్రతినిధులు వుండడంవల్ల, అంటే విషయపర విశ్లేషణలో, ఈ విద్యా కార్యాచరణ విమోచనాపర సాంస్కృతిక కార్యాచరణకి సంబంధించిన కార్యక్రమ వ్యవస్థీకరణలో కొనసాగడంలో రక్షకంగా వుంటుంది.

33. దురదృష్టవశాత్తూ ఈ ప్రత్యేకశోధన పూర్తవలేదు.

34. పాట్రిషియో లోప్స్ అనే మనస్తత్వ శాస్త్రవేత్త, ఆయన కృషి గురించి *Educacao como pratica da Liberdade* లో వుంది.

35. నైబుర్, పైన చెప్పుకున్న గ్రంథం చూడండి.

36. సంస్కృతికి సంబంధించి మానవ పరిశీలనా శాస్త్ర ప్రాముఖ్యం కోసం Educacao como pratica da Liberdade చూడండి.

37. అంతస్సంబంధం వున్న భాగాల పూర్ణత్వం మొత్తం కార్యక్రమం అవుతుందని గమనించాలి. ఆ భాగాలు వాటికిగా అవే స్వతంత్ర పూర్ణత్వం వుంటాయి.

ఆ విషయాలు వాటికిగా అవి పూర్ణమే, కాని మొత్తం కార్యక్రమంలో పరస్పర ప్రతిచర్యలతో వుండే విషయాంశ విభాగాలుగా వుండే అంశాలూ అవుతాయి.

విషయాంశ విభజన, వాటి మౌలిక కేంద్రక అన్వేషణలో, మొత్తం విషయాల్ని విభాగిస్తుంది, ఇవి పాక్షిక అంశాలు.

సంకేతీకరణ క్రమం, మనుగడ సన్నివేశాల్ని ప్రదర్శించడంలో ఇలా విడదీసిన విషయాన్ని తిరిగి పూర్ణం చేసే యత్నం చేస్తుంది.

సంకేతాన్ని విపులీకరించుకునేటప్పుడు, వ్యక్తులు గర్భితమై వున్న విషయాన్ని లేదా విషయాల్ని అవగాహన చేసుకునేందుకు సంకేతీకరణను విభజించుకుంటారు. గతితార్కిక విపులీకరణ క్రమం అంతటితో ముగిసిపోదు, తిరిగి పూర్ణం కావడంతో పూర్తవుతుంది. బాగా బోధపరచుకునేందుకు విడదీసిన మొత్తాన్ని మళ్ళీ అలా పూర్ణం చేసుకోవడం అన్నమాట. (ఇతర సంకేతీకరణ సన్నివేశాలకు దీనితో వున్న సంబంధాలకి లాగానే, అన్నీ కలిసి మనుగడ సన్నివేశాల్ని ప్రదర్శిస్తాయి).

38. సంకేతీకరణ అ) సరళం : దృశ్యమార్గం, చిత్రాలు, వర్ణన, స్పర్శవేద్య మార్గం, శ్రవణ మార్గం. ఆ) మిశ్రితం : అనేక మార్గాలు ఏకకాలంలో వుండడం.

# అధ్యాయం

## 4

ఈ అధ్యాయంలో సాంస్కృతిక కార్యాచరణ సిద్ధాంతాల గురించి విశ్లేషిస్తాం. సంభాషణ వ్యతిరేక, సంభాషణాత్మక మూసల్లో నుంచి రూపు తీసుకున్నవి అవి. ఇదివరకటి అధ్యాయాల్లో స్పృశించిన ముఖ్యవిషయాల ప్రస్తావన ఈ అధ్యాయంలో మళ్ళీ మళ్ళీ వస్తూ వుంటుంది. ఆ ముఖ్యాంశాల్ని విస్తరించడానికిగాని, కొత్త ప్రకటనల్ని వివరించడానికిగాని ఇలా ప్రస్తావించడం జరుగుతుంది.

మరోసారి మానవాళి, కార్యాచరణశీలమని, జంతువులతో విభేదిస్తుందని పునరుద్ఘాటిస్తూ మొదలుపెడతాను. జంతువులకు ఒట్టి కార్యకలాపం మాత్రమే వుంటుంది. జంతువులు ప్రపంచం గురించి పరిగణించవు. అందులో మునిగి వుంటాయి. ఇందుకు భిన్నంగా మానవులు ప్రపంచం నుంచి ఆవిర్భవిస్తారు, దాన్ని వస్తుగతం చేస్తారు. అలా చేయడం ద్వారా దీన్ని అర్థం చేసుకుంటారు, తమ శ్రమతో దాన్ని మారుస్తారు.

జంతువులు ఇలా శ్రమ చేయవు. ఒక నేపథ్యంలో వుంటాయి. దాన్ని అధిగమించలేవు. అందుచేత ప్రతి జంతువు జాతీ తనకి సంక్రమించిన నేపథ్యంలోనే వుంటుంది. ఈ నేపథ్యాలు మానవులకు వెల్లడిగా వుంటే, అవి తమకు తాము ఒక్క సంగతీ చెప్పుకోలేవు.

కాని మానవ కార్యకలాపంలో కార్యాచరణ, ఆలోచన వుంటాయి. దీన్నే ఆలోచనాయుత కార్యాచరణ అంటున్నారు (praxis). ప్రపంచాన్ని మార్చడం.

కార్యాచరణకుగాను దీన్ని ప్రకాశవంతం చేయడానికి సిద్ధాంతం అవసరం. మానవ కార్యకలాపం సిద్ధాంతం, ఆచరణలతో వుంటుంది; ఇది ఆలోచన, కార్యాచరణ. నేను రెండవఅధ్యాయంలో నొక్కి చెప్పినట్టు దీన్నిఒట్టి వాగాడంబరంగాగాని, గుడ్డిదాపుపనిగాగాని కుదించకూడదు.

'విప్లవ సిద్ధాంతం లేకుండా విప్లవ ఉద్యమ వుండదు,[1] అన్న లెనిన్ మాటలు సుప్రసిద్ధం, దీనర్థం ఏమిటి? విప్లవం శాబ్దిక గుంఫన వల్లారాదు, యధాలాపంగా చేయడంవల్లా రాదు. ఆలోచనాయుత కార్యాచరణ ద్వారానే వస్తుంది అని, అంటే, ఆలోచన ఆచరణ వుండాలి. మార్చవలసిన నిర్మాణాల వైపు నిర్దేశితం అవ్వాలి. ఈ నిర్మాణాల్ని మూలమట్టంగా పరివర్తన చెందించే విప్లవ ప్రయత్నం వున్నంత మాత్రాన ఆ నాయకులు ఆలోచనా శీలురు అయిపోరు, పీడితులు ఒట్టి కార్యకర్తలు అయిపోరు.

ప్రజలు పీడితులుగా వున్నారు. యదార్థ పరిస్థితి వాళ్ళని అలా చేసింది. అలాంటి ప్రజలపట్ల త్రికరణశుద్ధిగా నిబద్ధమై వున్నప్పుడు ఈ పరివర్తనకు అవసరమైన సిద్ధాంతం అవసరం. ఈ పరివర్తనా కార్యక్రమంలో ప్రజలకు మౌలిక పాత్ర లేకుండా ఆ సిద్ధాంతం చేయకూడదు. చేయమన్నదాన్ని చేస్తారుగాని పీడితులు వాళ్ళేం ఆలోచించగలరనే ధోరణిలో నాయకులు పీడితులని చూడకూడదు. వాళ్ళకి ఆలోచించే అవకాశం లేకుండా చేయకూడదు. మనమే పని జరిపిస్తున్నామనే భ్రమలో వుంచకూడదు. నిజానికి అలా చేస్తే గనక వాళ్ళని బొమ్మల్లా ఆడిస్తున్నట్టే అవుతుంది. ఈ సందర్భంలో కూహకాలకు వ్యతిరేకులు అనుకున్నవాళ్ళే ఇలా చేసినట్లవుతుంది.

సమన్వయం చేసే బాధ్యత నాయకులది. కొన్ని సందర్భాల్లో నిర్దేశించాలి కూడా – కాని ఆలోచనాయుత కార్యాచరణను పీడితులకు లేకుండా చేసే నాయకులు తమ కార్యాచరణకే తూట్లు పొడుస్తున్నారన్నమాట! ఇతరుల మీద తమ మాటల్ని రుద్దడం ద్వారా ఆ మాటను వాళ్ళు వమ్ము చేస్తున్నారు. తమ పద్ధతులకీ, తమ లక్ష్యాలకీ మధ్య వైరుధ్యాన్ని సృష్టిస్తున్నారు. వాళ్ళుగనక నిజంగా విమోచనకు నిబద్ధమైనట్లయితే వాళ్ళ ఆచరణ, ఆలోచన ఇతరుల కార్యాచరణ, ఆలోచనలేకుండా ముందుకు సాగవు.

విప్లవ పూరిత చింతనాయుత కార్యాచరణ, పెత్తందారీ కులీన కార్యాచరణకు ప్రతిస్పర్థిగా వుండితీరాలి. స్వభావరీత్యానే అవి ఎదురుబొదురుగా వుంటాయి. నాయకుల నిర్ణయాల్ని వూరికే గంగిరెద్దుల్లా తలవూపి అమలు జరిపే ప్రజల కార్యాచరణ అనే అసంబద్ధ ద్వైధీ విభజనను విప్లవ పూరిత కార్యాచరణ సహించలేదు – పెత్తందారీ

కులీనుల ఆదేశాల పద్ధతిని ప్రతిఫలించే ద్వైధీభావం ఇది. విప్లవ పూరిత కార్యాచరణ అనేది ఒక ఐక్య, పీడితులు తమ స్వాధీనులైనట్లు నాయకులు చూడకూడదు.

మసిపూసి మారేడు కాయ చేయడం, నినాదప్రాయం చేయడం, "నిక్షేపించడం", కఠినతరంగా బిగించడం, ఉత్తర్వులు ఇవ్వడంవంటివి విప్లవపూరిత కార్యాచరణలో అంతర్భగంగా వుండవు. ఖచ్చితంగా చెప్పాలంటే– అవి పెత్తందారీ కార్యాచరణలో భాగాలుగా వుంటాయి. కాబట్టి పెత్తనం చెలాయించాలీ అంటే, పెత్తందారు ప్రజలకి నిజమైన కార్యాచరణ లేకుండా తిరస్కరించి తీరాలి. వాళ్ళ మాటలు వాళ్ళు చెప్పకుండా తిరస్కరించాలి. వాళ్ళ ఆలోచనలు వాళ్ళు చేయకుండా తిరస్కరించాలి. ఆమెగాని అతనుగాని సంభాషణాత్మకంగా చర్చించలేరు. అలా చేయడం అంటే అది తమ అధికారానికి మంగళం పాడడమేనా కావాలి, లేదా పీడితుల పక్షాన వాళ్ళ లక్ష్యం కోసం కలవడమేనా కావాలి. అదీ యిదీ కాదనుకుంటే ఎక్కడ్నో పప్పులో కాలు వేసి అధికారాన్ని పోగొట్టుకునైనా వుండాలి.

ప్రధాన పార్శ్వంగా చెప్పుకుంటే, ప్రజలతో విప్లవ నాయకులకు సంబంధాలు వుంటాయి కదా? అలాంటి సంబంధాల్లో సంభాషణాత్మకంగా వుండని నాయకులు పెత్తందారు లక్షణాలని నిలబెట్టుకుని వుండాలి. అంటే నిజమైన విప్లవవాదులు కాదన్నమాట! లేదా తమ పాత్ర విషయంలో చాలా పక్కదారి పట్టేసి తమ పాక్షిక ధోరణికి తామే బందీలయిపోయి వుండాలి. ఆ మేరకు విప్లవేతరం అయినట్టే. వాళ్ళు అధికారాన్ని కూడా అందుకోవచ్చు. ఇంకా చెప్పాలంటే సంభాషణ వ్యతిరేక ఆచరణ ఫలితంగా వచ్చిన ఏ విప్లవపు చెల్లుబాటైనా సందేహాస్పదమే.

పరివర్తనకు కర్తలుగా తమ పాత్రపట్ల పీడితులు మరింత విమర్శనాత్మక చైతన్యంతో విప్లవ కార్యక్రమంలో పాల్గోవడం ముఖ్యమనే దానికి మినహాయింపులే లేవు. వాళ్ళా క్రమంలోకి వూగిసలాడుతూ అడుగు పెడితే, సగం తాముగా, సగం తమలోనే పీడకులుగా వుంటే పీడక సన్నివేశం వాళ్ళ మీద రుద్దిన ఆ డోలాయమాన పరిస్థితితోనే వుంటూ అధికారం చేపడితే – వాళ్ళు అధికారం అందుకున్నామని వూహించు కుంటున్నారంతే.[2] వాళ్ళ మనుగడ ద్వంద్వత్వంవల్ల పాక్షిక వాతావరణం ఏర్పడ్డానికీ, విప్లవానికి ఎసరుపెట్టే నిరంకుశాధికార ప్రతిష్టాపనకు వీలు కలగవచ్చు. విప్లవ క్రమంలో ఈ సందిగ్ధత గురించి పీడితులు ఎరుక కలిగించుకోలేకపోతే, వాళ్ళ క్రమంలో విప్లవ పూరితమైన దానికంటే మరింత ఎక్కువ కసీ పగా వుండేట్టు పాల్గోవచ్చు.[3] విప్లవాన్ని విమోచనా పథంగా కంటే. ఆధిపత్య సాధనంగా వాళ్ళు కాంక్షించవచ్చు,

నిజమైన మానవత్వాన్ని మూర్తిమంతం చేసుకున్న విప్లవ నాయకులకు కష్టాలూ, సమస్యలూ వుండొచ్చు. ఇలాంటి కష్టాలూ, సమస్యలూ (అత్యంత సదుద్దేశాలతోసహా) ప్రజల కోసం విప్లవాన్ని నిర్వహించే నాయకుల బృందానికి ఇంకా చాలా ఎక్కువగా వుంటాయి. ఇలా ప్రయత్నం చేయడం అంటే ప్రజలు లేకుండా విప్లవాన్ని జరిపించడమే అవుతుంది. ఎందుకంటే ప్రజల్ని ఇలాటి క్రమంలోకి తీసుకురావడానికి వాళ్ళని అణిచిపెట్టడానికి ఉపయోగించిన అదే పద్ధతుల్ని ఉపయోగించడం జరుగుతుంది.

ప్రతి ప్రామాణిక విప్లవానికీ ప్రజలతో సంభాషణ తప్పనిసరిగా వుండాలి. దానివల్లే అది విప్లవం అవుతుంది. సైనిక తిరుగుబాటుకీ దీనికీ తేడా ఇదే. సైనిక తిరుగుబాటులో సంభాషణ గింభాషణ ఏం వుండవు. ఒట్టి దగా (న్యాయబద్ధత సంపాదించుకునేందుకుగాను) లేదా బలప్రయోగం (అణచిపెట్టడానికిగాను) అసలైన విప్లవం మాత్రమే వుంటాయి. ముందుగానో, వెనకగానో ప్రజలతో ఒక సాహసవంతమైన సంభాషణకు శ్రీకారం చుట్టాలి. అసలు దాని ధర్మబద్ధత ఆ సంభాషణ[4]లోనే వుంటుంది. అది ప్రజలంటే భయపడకూడదు. వాళ్ళ వ్యక్తీకరణ, అధికారంలో వాళ్ళు సమర్థవంతంగా పాల్గోవడంపట్ల భయపడకూడదు. అది వాళ్ళకి జవాబుదారీగా వుండాలి. తన విజయాల గురించి దాపరికం లేకుండా వాళ్ళతో మాట్లాడాలి. తన తప్పుల గురించి, పొరపాటు అంచనాల గురించి, కష్టాల గురించి వాళ్ళతో మాట్లాడాలి.

సంభాషణ ఎంత ముందుగా మొదలైతే ఉద్యమం అంతగా నిజమైన విప్లవపూరితం అవుతుంది. విప్లవానికి మౌలికంగా అవసరం అయిన సంభాషణ మరో తీవ్రమైన అవసరానికి అనురూపం అవుతుంది. ఒకళ్ళతో ఒకళ్ళకి వ్యక్తీకరణతో లేనట్లయితే స్త్రీలుగాని, పురుషులుగాని నిజమైన మానవులు కాలేరు. ఎందుకంటే నిజమైన మానవులంటే మౌలికంగా మనసులో మాటలు ఒకళ్ళకొకళ్ళు చెప్పుకునేవాళ్ళు, సంభాషణను అడ్డగించడం అంటే మనుషుల్ని 'వస్తువుల' స్థాయికి దిగలాగడం అన్నమాట – ఇలాంటి పని పీడకులదేగాని, విప్లవకారులదికాదు.

మరోసారి నొక్కి చెబుతున్నాను, ఆలోచనాయుత కార్యాచరణను నేను సమర్థిస్తున్నాను. ఇందులో ద్వైధీవిభజన ఏమీలేదు. అలాంటి దానివల్ల కార్యాచరణను ఆలోచన అనే తొలిదశగా, ఆచరణ అనే ద్వితీయ దశగా విభజించవచ్చు. ఆలోచన, ఆచరణ ఏకకాలంలోనే జరుగుతాయి. అయితే యదార్థ పరిస్థితి గురించి సవిమర్శక విశ్లేషణ వల్ల ఒక ప్రత్యేక తరహా కార్యాచరణ రూపం అసాధ్యమనో, ప్రస్తుత సమయంలో వర్తించదనో వెల్లడవుతుంది. ఆయా ఆచరణరూపాల అననుకూలత గురించిగాని అమలు

జరపడం కుదరదని గాని (ఆ రకంగా వాటిని వాయిదా వేయడం, బదులుగా మరోదాన్ని తెచ్చుకోవడం) ఆలోచన ద్వారా గ్రహించినవాళ్ళు నిష్క్రియాపరంగా వున్నారని తప్పుపట్టలేం. విమర్శనాత్మక ఆలోచన కూడా కార్యాచరణే.

విద్యలో ఉపాధ్యాయుడు – విద్యార్థి ఎరుక చేసుకోవాల్సిన వస్తువు గురించి తెలుసుకోవడానికి ప్రయత్నిస్తారు. ఆ ప్రయత్నం ఆ వస్తువుతోనే ముగిసిపోదు. ఈ విషయం గురించి నేను లోగడే చెప్పాను. తెలిసిన ఈ చర్య ఇతర ఉపాధ్యాయులకీ – విద్యార్థులకీ విస్తరించుకుంటుంది. ఎలాగ అంటే, వాళ్ళ అవగాహనా సామర్థ్యానికి ఈ వస్తువు మాధ్యమం అవుతుంది. ఇదే విషయం విప్లవ ఆచరణకీ వర్తిస్తుంది. అంటే, పీడితులూ నాయకులూ ఉభయులూ కూడా సమంగానే విప్లవకార్యాచరణకు కర్తలు. యదార్ధ పరిస్థితి మాధ్యమంగా వుంటుంది. ఉభయపక్షాల కార్యాచరణను మార్చేసే వీలు వుంటుంది. ఈ కార్యాచరణ సిద్ధాంతంలో ఎవళ్ళం కూడా ఒక కార్యకర్త గురించో, లేదా వూరికే కార్యకర్తల గురించో మాట్లాడం, పరస్పర సంభాషణలో వున్న పాత్రధారుల గురించి చెప్పుకుంటాం.

ఇలా చెప్పడమంటే విప్తవ శక్తులలో విభజన, ద్వైధీ భావం కలహం రావాలని చెబుతున్నట్లు అనిపించవచ్చు. నిజానికి దాని సారాంశం అందుకు పూర్తి భిన్నం. వాళ్ళ మధ్య అచంచల సంఘీభావం. ఈ అన్యోన్య సంబంధం అలా వున్నా మనకో ద్వైధీ విభాగం కనిపిస్తుంది నాయకులు ఒక పక్క, ప్రజలు మరోపక్క ఉండాలి. పీడన సంబంధాల సిసలైన ప్రతిరూపమే. విప్లవ క్రమంలో అన్యోన్య సంబంధాన్ని లేదుపొమ్మనడం, ప్రజల్ని సంఘటితపరుస్తున్నామన్న పేరుతో వాళ్ళతో సంభాషణను తప్పించుకోవడం, అలాగే విప్లవ శక్తిని బలోపేతం చేస్తున్నాం. లేదా ఐక్య సంఘటన ఇదిగో వచ్చేస్తోందన్న పేరుతో సంభాషణను తప్పించుకోవడం– నిజంగా చెప్పాలంటే స్వాతంత్ర్యంపట్ల భయమే. ఇది ప్రజల్లో విశ్వాసం లుప్తం అవడమేనా కావాలి, లేదా ప్రజలంటే భయమైనా కావాలి. కాని ప్రజల్నే నమ్మలేకపోతే, ఇక విమోచనకు అర్థమే లేదు; ఇలాంటి సందర్భంలో విప్లవం జరిపించడం ప్రజలకోసం జరిపించడం కూడా కాదు, నాయకుల కోసం ప్రజల చేత జరిపించినట్లవుతుంది – నిజంగా మొదటికే మోసం అయిన స్థితి!

విప్లవాన్ని ప్రజలూ నాయకుల కోసం జరిపించరు, నాయకులూ ప్రజల కోసం జరిపించరు. ఇద్దరూ కలిసి సంఘీభావంగా జరిపిస్తారు. ఈ సంఘీభావం ఎప్పుడు వస్తుదంటే నాయకులు ప్రజలతో వినయంగా, ఆదరపూర్వకంగా, ధైర్యంగా భేటీ అయినపుడే అని చెప్పాలి. ఉన్న స్త్రీ పురుషులందరికీ యీ భేటీకి తగినంత సాహసం వుండకపోవచ్చు.

కాని భేటీని తప్పించుకున్నట్లయితే వాళ్ళు బిగిసిపోతారు. పైవాళ్ళని ఒట్టి వస్తువులుగా చూస్తారు. జీవితాన్ని పోషించడానికి బదులు, దాన్ని హతమారుస్తారు. జీవితాన్ని అన్వేషించడానికిబదులు, దాన్నుంచి పలాయనం చిత్తగిస్తారు. యివన్నీ పీడక కులీన లక్షణాలే.

సంభాషణ వుండాలీ అని చెప్పడం అంటే – ప్రపంచాన్ని మార్చే ప్రయత్నంలో స్త్రీ, పురుషుల ముఖాముఖి – ఏదో అమాయకత్వం అనీ, స్వీయ మానసిక ధోరణిలో భావవాదం[5]గా వుంటుందనీ కొందరు అనొచ్చు. ప్రపంచంలో, ప్రపంచంతో మనుషులకు ఇతర మనుషలతో వున్న వాటికంటే మరింత యదార్థమైన లేదా నిర్దిష్టమైనవేవీలేవు – కొంతమంది ఇతరులకు వ్యతిరేకంగా వుండే పీడక, పీడిత వర్గాల యదార్థపరిస్థితి.

ప్రామాణికమైన విప్లవం యదార్థపరిస్థితిని మార్చాలని చూస్తుంది. ఈ పరిస్థితి వల్లే వ్యవహారాలు ఇలా దిగజారి అమానవీకరణ పరిస్థితి ఏర్పడింది. ఈ యదార్థ పరిస్థితి మారకపోతే తమ కడుపులో చల్లకదలకుండా వుంటుందని అనుకుంటూ వున్నవాళ్ళు ఈ పరివర్తనను జరిపించరు. దీన్ని సాధించవలసింది శనిదేవత రథ చక్రపుటిరుసులలో పడి నలిగినవాళ్ళూ వాళ్ళ నాయకులునూ. ఏమైనా ఈ సత్యం తీవ్రంగా ఫలితార్థంగా వుండాలి: అంటే, నాయకులు దానికి ఒక రూపాన్ని ఇవ్వాలి. ప్రజలతో సన్నిహిత సంబంధం ద్వారా ఇది జరగాలి. ఈ సన్నివేశ కలయికవల్ల రెండు బృందాలూ కలిసి ఎదుగుతాయి. ఇక నాయకులు స్వయం కిరీటధారులు కాకుండా, ప్రజల కార్యాచరణతో కలిసివున్న తమ కార్యాచరణలో ప్రతిష్టితం అవుతారు. లేదా నలుగురూ మన్నించే నాయకులు అవుతారు.

చాలా మందికి యదార్థ పరిస్థితి గురించి యాంత్రిక దృక్పథమే వుంటుంది. వ్యక్తుల ప్రపంచ చైతన్యాన్ని ఆయా నిర్దిష్ట పరిస్థితులే నియంత్రిస్తామని గ్రహించలేరు. అలాగే తమ చైతన్యం తమ వైఖరులనీ యదార్థ పరిస్థితిలో తాము వ్యవహరించవలసిన తీరునీ నియంత్రిస్తుందనీ గ్రహించరు. యాంత్రికంగా[6] యదార్థ పరిస్థితిని మార్చేయొచ్చని వాళ్ళు అనుకుంటారు. యదార్థ పరిస్థితి గురించి ఆ వ్యక్తికి వున్న చైతన్యం కుహనా చైతన్యం అనీ, అదొక సమస్య అనీ ముందు పెట్టరు. అలాగే విప్లవ కార్యాచరణ ద్వారా తప్పుడు చైతన్యాన్ని తగ్గించుకుంటూరావాలనీ , నిజమైన చైతన్యాన్ని పెంపొందించాలనీ అనుకోరు. మానవ సంబంధంకాని చారిత్రక యదార్థం అంటూ వుండదు. మానవాళి లేకుండా చరిత్రా లేదు, మానవుల కోసం చరిత్రా వుండదు. మానవాళికి సంబంధించిన చరిత్ర వుంది. దీన్ని నిర్మించింది ప్రజలే (మార్క్స్ చెప్పినట్టు). మళ్ళీ ఇటు వైపు చరిత్ర

వాళ్ళని నిర్మిస్తుంది. అధిక సంఖ్యాక వర్గాలకు కర్తలుగా చరిత్రలో పాల్గొనే హక్కు తిరస్కృతమైనపుడు వాళ్ళు పరాయీకరణపాలై, పెత్తందారీతనం కిందికి పోతారు. ఆ పరిస్థితిని తొలగించి ఆ రకంగా 'కర్మలు'గా వున్న పరిస్థితి నుంచి కర్తల హోదాకి, ఎదగాలి. అంటే? ప్రజలు ఆచరణకు కంకణం కట్టుకోవాలన్నమాట. అలాగే ఆలోచనలూ చేయాలన్నమాట! ఈ మార్చవలసిన యదార్థ పరిస్థితికి సంబంధించినవే ఈ రెండూ.

యదార్థ పరిస్థితి ఎంతలా అణచివేస్తూ వుందో అంటూ వూరికే దాని గురించి అనుకుని, తాము కర్మలుగా వున్నామనీ తెలుసుకుని, హమ్మయ్య, ఇక మనకీ విషయం తెలిసింది. కర్తలైపోయాం అనుకోవడం నేల విడిచి సాము చేయడం అన్నమాట! ఇలా గుర్తించినంత మాత్రాన్నే అలా భావిస్తూ వున్నవాళ్ళు కర్తలైనట్టుకాదు. దీనర్థం ఏమిటీ అంటే, నా సహ పరిశోధకులొకరు చెప్పినట్టు,[7] భావి కర్తలన్నమాట – ఈ భావి అనేది తమ నూతన హోదాని ఘనీభవింపచేసుకునేందుకు నడిపిస్తుంది.

ఇక అటు పక్క క్రియాశీలం (యిది నిజమైన కార్యాచరణ కాదు) అన్నది విప్లవపథానికి నడిపిస్తుందనుకోవడం తప్పుడు వూహ. కార్యాచరణ సంపూర్ణత్వంలో వున్నప్పుడే ప్రజలు నిజమైన విమర్శతో వుంటారు. అంటే, వాళ్ళ చర్యలు విమర్శనాత్మక ఆలోచనను పొదువుకుని వుంటే, అది వాళ్ళ ఆలోచనను మరింతగా వ్యవస్థీకరిస్తూ వుంటే, యదార్థ పరిస్థితి గురించి వాళ్ళ అమాయకత్వ అవగాహన కింద వాళ్ళని మరింత హెచ్చుస్థాయికి నడిపిస్తే అప్పుడది యదార్థ పరిస్థితి ఇలా వుండడానికి కారణాలు ఏమిటా అని వాళ్ళు గ్రహించగలిగేటట్టు చేస్తుంది. విప్లవ నాయకులు ప్రజలకీ హక్కు లేకుండా చేశారనుకోండి, వాళ్ళు తమ ఆలోచనా సామర్థ్యాన్నే కుంటుపరచుకుంటున్నారన్న మాట. కనీసం సవ్యంగా ఆలోచించే సామర్థ్యాన్ని విప్లవ నాయకులు ప్రజలు లేకుండా పొందలేరు. అలా అని ప్రజల కోసమూ ఆలోచించలేరు. ప్రజలతోబాటే ఆలోచించగలరు.

ఇక పెత్తందారీ కులీనులు అలా కాదు – ప్రజలు లేకుండానే ఆలోచించగలరు, ఆలోచిస్తారు కూడా – వాళ్ళు ప్రజల గురించి బాగా తెలుసుకుందుకు, ఆ రకంగా మరింత ఎక్కువ పెత్తనం చెలాయించేందుకు ప్రజల గురించి ఆలోచించే వైభోగం వాళ్ళు వదులుకోరు. ఫలితంగా ప్రజలకీ కులీనులకీ మధ్య వివరమైన సంభాషణగాని, పరస్పర భావ వ్యక్తీకరణగాని వుందీ అంటే "ప్రకటనల్ని" నిక్షిప్తం చేయడంగానే వుంటుంది అది. ఆ ప్రకటన ఉద్దేశం ఏమిటీ అంటే మచ్చిక చేసుకునే ప్రభావం కలిగించడం.

ప్రజలతో కలిసి ఆలోచించనపుడు ఆధిపత్య కులీనులు ఎందుకు నీరసపడిపోరు? ఎందుకంటే ప్రజలంటేనే వాళ్ళకు ప్రతికూలం, వాళ్ళ మనుగడ రహస్యమే అది. కులీనులు ప్రజలతో కలిసి ఆలోచించినట్లయితే గనక ఈ వైరుధ్యం వెనక్కి జారుతుంది. వాళ్ళు ఇక ఎంత మాత్రం పెత్తనం చేయలేరు. ఏ యుగంలోనైనాగానీ పెత్తందారుల వైపునుంచి చూసినట్లయితే, సరైన ఆలోచన అంటే ప్రజల ఆలోచనారాహిత్యం నుంచే వస్తుంది.

తర్వాత రాయల్ సొసైటీ అధ్యక్షులు అయిన శ్రీమాన్ గిడ్డే ఒక అభ్యంతరం లేవనెత్తారు. అలాటివి ప్రతి దేశంలోనూ వుంటాయి. "ఒళ్ళు వొంచి పని చేసే పేద వర్గాల ప్రజలకు విద్యనందించే ప్రణాళిక సూత్రరీత్యా ఎంత మురిపెంగా కనిపిస్తూ వున్నప్పటికీ అది వాళ్ళ నీతి సూత్రాలకీ, ఆనందానికీ భంగకరం అవుతుంది. వాళ్ళని వ్యవసాయంలో శ్రమశక్తి అవసరమయ్యే ఇతర ఉద్యోగాల్లో మంచి పనివాళ్ళు అయ్యేటట్టు చేసే చదువు జీవితంలో తమ ఖర్మ యిలా వుందేమిటి అని ఏవగించుకునేటట్టు చేస్తుంది. ఒదిగి వుండడం నేర్పేబదులు చిర్రుబుర్రులాడేటట్టూ, వక్రీభవనం చెందేటట్టూ చేస్తుంది. ఉత్పత్తి చేసే దేశాల్లో ఈ విషయం చూస్తూనే వున్నాం. దీనివల్ల దేశద్రోహకర పత్రాలు చదవడం అబ్బుతుంది. క్రైస్తవ వ్యతిరేక విషపూరిత గ్రంథాలు రచనలు చదవడం వొంట పడుతుంది. ఇక పెద్దా గొప్పా అనే తేడాలే చూడని పొగరు పెరుగుతుంది. దీంతో ఇక కొన్నేళ్ళల్లోనే చట్టం కొరడా ఝుళిపించవలసిన అవసరం కలుగుతుంది."[8]

ఇంతకీ శ్రీమాన్ గిడ్డే నిజంగా కోరేది (యివాళ్టి కులీనులు కోరేదీ యిదే, వాళ్ళు యింత నిరాశాపూరితంగా, దాపరికం లేకుండా ప్రజా విద్యను తిట్టిపొయ్యకపోయినా) ప్రజలు ఆలోచించరాదు అని. పీడక వర్గంగా అన్నియుగాల్లోనూ శ్రీమాన్ గిడ్డేలు, ప్రజలతో కలిసి ఆలోచించరు, యిక అటు ప్రజల్ని వాళ్ళకిగా ఆలోచించుకోనివ్వరు.

అయితే, ఇలాంటిది, విప్లవ నాయకుల విషయంలో నిజంకాదు; వాళ్ళు ప్రజలతో కలిసి ఆలోచించనట్లయితే, వాళ్ళ శక్తి హరించుకుపోతుంది. ప్రజలే వాళ్ళ నిరంతర దిక్సూచులు, ఆలోచనలకు ఒట్టి లక్ష్యాలు మాత్రం కాదు. ప్రజల్ని మరింత బాగా అర్థం చేసునేందుకు విప్లవ నాయకులు ప్రజల గురించీ ఆలోచించవలసి వున్నా, ఈ ఆలోచించడం కులీనుల కంటే భిన్నం అయింది. ప్రజల్ని విమోచన చేయడం కోసం (పెత్తనం చెలాయించడం కంటే) నాయకులు ప్రజల గురించి ఆలోచనకు తమనే అందించుకుంటారు. మొదటి చెప్పింది ఆలోచన, రెండవది కామ్రేడ్ (సహచరుడు) ఆలోచన.

పెత్తందారీతనం, దాని స్వభావరీత్యానే, ఒక ఆధిపత్య ధ్రువాన్ని, ఆధిపత్యంలో పెట్టుకున్న ధ్రువాన్ని ప్రతిస్పర్థంగా వుండేటట్లు కోరుతుంది. విప్లవ విమోచన ఈ వైరుధ్యాన్ని పరిష్కరించాలని చూస్తుంది. ఈ ధ్రువాలు వున్నాయని గుర్తించడమే కాదు, ఈ ప్రయత్నంలో నుంచి ఉద్భవించిన నాయకత్వ బృందం వుందనీ చూస్తుంది. ఈ నాయకత్వ బృందం ప్రజల పీడిత పరిస్థితితో మమేకం అవుతుంది, లేదా విప్లవ పూరితం కాకుండాపోనైనా పోతుంది. పెత్తందారుల మాదిరి వూరికే ప్రజల గురించి ఆలోచన చేయడం, ఆ ఆలోచనలో తమదంటూ ఏమీ ఇవ్వకపోవడం, ప్రజలతో కలిసి ఆలోచించలేకపోవడం, విప్లవ నాయకులు కాకుండా పోవడానికి ఇది రాచ మార్గం అన్నమాట.

పీడన క్రమంలో కులీనులు పీడితుల "జీవన్మృత" స్థితి మీదనే బతుకుతూ వుంటారు. పీడితులకీ తమకీ మధ్య లంబకోణ సంబంధంలోనే తమ స్థానాన్ని నిర్ధారించుకుంటారు. విప్లవ క్రమంలో ప్రభవించే నాయకత్వానికి స్థానాన్ని నిర్వర్తించుకునే మార్గం ఒక్కటే వుంది– పీడితులతోబాటు, వాళ్ళ నుంచి పునర్జీవనం పొందేందుకు "మృతి" చెందడమే.

పీడన క్రమంలో ఒకళ్ళు మరొకళ్ళని పీడిస్తారు అని మనం న్యాయంగానే చెప్పగలం. కాని విమోచనా క్రమంలో ఒకళ్ళు మరొకళ్ళని విమోచన చేస్తారు అని ఈ మాదిరిగా చెప్పలేం. ఆ ఫలానా ఆయన తనని తాను విమోచన చేసుకున్నాడనీ చెప్పలేం. మానవులు పరస్పర సంబంధంతో ఒకళ్ళనొకళ్ళు విమోచన చేసుకుంటారని మాత్రం చెప్పగలం. ఇలా అంటున్నామంటే విప్లవ నాయకుల ప్రాముఖ్యాన్ని తగ్గిస్తున్నామని కాదు. అందుకు భిన్నంగా ఇది. వాళ్ళ విలువను నొక్కి చెపుతుంది పీడితులతో "జీవిత తిరస్కృతుల"తో "ఇలలోని నిర్భాగ్యదామోదరుల"తో కలిసి జీవిస్తూ పని చేయడం, కంటే గొప్ప ఏం వుంది చెప్పండి? ఈ పరస్పర సంబంధంలో విప్లవ నాయకులు తమ స్థితికి హేతువునే కాదు, సంతోషానికి ప్రేరణనూ చూడాలి. పెత్తందారీ కులీనులు తమ స్వభావం రీత్యా, ప్రామాణిక సూత్ర రీత్యా చేయలేనిదాన్ని, తమ స్వభావానికి తగ్గట్టు విప్లవనాయకులు చేయగలరు.

ఒక వర్గంగా కులీనులు అణగారిన ఆర్తుల పట్ల కనబరిచే ప్రతి దాంట్లోనూ మొదటి అధ్యాయంలో వివరించుకున్నట్టు, కుహనా దాతృత్వం పొంగిపొర్లుతూ వుంటుంది. విప్లవ నాయకులు ఈ కుహనా ఔదార్యంతో వుండలేరు. తిమ్మిని బమ్మిని చేయనూలేరు. పీడక కులీనులు ప్రజల్ని తమ పదఘట్టన కింద అణగదొక్కి రెపరెపలాడతారు. విప్లవనాయకులు ప్రజల పరస్పర సంబంధాలలోనే వికసించగలరు. ఆ రకంగా పీడకుడి

కార్యాచరణ మానవత్వ పూరితంగా వుండదు.  విప్లవకారుడి కార్యాచరణ మాత్రం తప్పనిసరిగా మానవత్వ పూరితంగా వుండాలి.

పీడకుల అమానవీయత, విప్లవపూరిత మానవత రెండూ శాస్త్రాన్ని ఉపయోగపెట్టుకుంటాయి. కాని మొదటివాళ్ళ చేతుల్లో శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం పీడితుల్ని "వస్తువుల" స్థాయికి దిగజార్చేందుకు పని చేస్తుంది. ఈ విప్లవపూరిత మానవతలో మానవీకరణ పెంపొందించడానికి పని చేస్తుంది. రెండవ క్రమంలో పీడితులు కర్తలై తీరాలి. లేనట్లయితే వాళ్ళని శాస్త్రీయ అభిరుచికి వట్టి వస్తువులుగానే చూడ్డం జరుగుతుంది.

విప్లవం పేరుతో, శాస్త్రీయ విప్లవ మానవతావాదం, పీడితుల్ని విశ్లేషించవలసిన వస్తువులుగా చూడదు (ఆ విశ్లేషణ మీద ఆధారపడి). ప్రవర్తనా నియమావళి ఇదిగో అని శాసించడం వుండదు. ఇలా చేయడం అంటే పీడక భావజాల కల్పిత గాథల్లో కూరుకుపోవడమే అవుతుంది; "అజ్ఞానాన్ని శాశ్వత సత్యం" చేయడం అవుతుంది. ఈ పుక్కిటి పురాణంలో, అవతలి వాళ్ళ అజ్ఞానం ఇదీ అని శాసించే వాళ్ళెవరో వుంటారన్న ధ్వని వుంది. అలా శాసనం జారీ చేసేవాడు తన వర్గం ఏమిటో, తనేమిటో విశదీకరించుకుంటాడు, తెలుసుకునేవాళ్ళల్లాగా, తెలుసుకుందునే పుట్టినవాళ్ళల్లాగా, ఆ రకంగా అతను ఇతరుల్ని పరాయివాళ్ళుగా పరిగణిస్తాడు. తన వర్గం మాటలు "నిజమైన" మాటలుగా కనిపిస్తాయి. ఇతరుల మీద వాటిని రుద్దుతాడు లేదా రుద్దచూస్తాడు: పీడితుల మీద; వాళ్ళ మాటల్ని వాళ్ళ నుంచి కాజేశారుగా. ఇతరుల మాటల్ని తస్కరించేవాళ్ళు ఇతరుల శక్తి సామర్థ్యాలంటే మహా అనుమాన పడతారు, వాళ్ళని చేతకాని వాజమ్మలకింద కట్టేస్తారు. మాట్లాడవద్దు అని కట్టడి చేసిన వాళ్ళు ఏం చెపుతున్నారో వినకుండానే వాళ్ళు మాట చెప్పిన ప్రతిసారీ వాళ్ళ అధికారానికి మరింత అలవాటు పడిపోతారు. ఇలా చేయి, ఇలా చేయి అని చెప్పడానికి మహా సరదా పడతారు. హుకుంలు ఇవ్వడం, పురమాయించడం వారిది ఎంతో ముచ్చట కలిగిస్తాయి. తాము ఆజ్ఞలు ఇవ్వవలసిన వాళ్ళు. లేకపోతే ఒక్క క్షణం వూపిరి పీల్చుకోలేరు. సంభాషణ అంటే అసలే కుదరదు.

అలాకాక శాస్త్రీయ, మానవతావాద నాయకులు ప్రజలు గొర్రెలు అన్న కల్పనను నమ్మరు. అది కల్పన మాత్రమేనన్న అనుమానం క్షణమాత్రం కూడా వుండే హక్కు వారికి లేదు. తాము, తాము మాత్రమే సర్వం తెలుసుకోగలవాళ్ళం అన్న విశ్వాసం వాళ్ళకు వుండదు – అలా చేస్తే ప్రజల్నే అనుమానిస్తున్నట్టు. ప్రజలకి అనుభవం రీత్యావచ్చే జ్ఞానం కంటే విప్లవ చైతన్యంవల్ల ఒక ఆకు ఎక్కువ తెలిసినట్టుగా వాళ్ళకి న్యాయంగానే అనిపించవచ్చు. అయినా వాళ్ళ గ్రహింపును ప్రజల మీద రుద్దరు. ప్రజల్ని నినాదప్రాయం

చేయరు. వాళ్ళతో సంభాషణ జరుపుతారు. అప్పుడు ప్రజల అనుభవజ్ఞానం, నాయకుల విమర్శనాత్మక జ్ఞానంతో పరిపుష్టం అయి, క్రమేణా యదార్ధ పరిస్థితి కారణాల గురించిన జ్ఞానంగా మారుతుంది.

ప్రజలు శుద్ధ అజ్ఞానులంటూ వాళ్ళ అజ్ఞానాన్ని తిరుగులేనిదిగా చూపే భ్రమా కల్పనను పీడక కులీనులు వదులుకుంటారని ఆశించడం మన అమాయకత్వం. విప్లవ నాయకులు అలా చేయనట్లయితే గనక అది వచో వ్యాఘాతం అవుతుంది. వాళ్ళు ఆ అభూత కల్పనను బట్టే నడుచుకున్నట్లయితే గనక ఇంకా వైరుధ్యం అవుతుంది. విప్లవనాయకుల కర్తవ్యం ఈ సమస్యలు ఒట్టి అభూత కల్పనలు అని చూపించడమేకాదు. పీడక కులీనులు వాడే అన్ని రకాల కల్పన ఇలా సమస్యలుగా ముందు వుంచడం. అందుకు బదులుగా విప్లవనాయకులు పీడకుల పెత్తందారీ పద్ధతుల్ని అనుకరించచూస్తేగనక, ప్రజలు రెండు పద్ధతుల్లో ఏదో ఒక రకంగా ప్రతిస్పందించవచ్చు. కొన్ని చారిత్రక పరిస్థితుల్లో వాళ్ళ నాయకులు వాళ్ళల్లో నిక్షిప్తం చేసిన కొత్త వస్తువుతో మచ్చిక అయి వుండవచ్చు. తమలో వున్న పీడకుడ్ని బెదిరించే "మాట" వేరే పరిస్థితుల్లో వాళ్ళని భయపెట్టవచ్చు.[9] ఈ రెండు సందర్భాల్లోనూ వాళ్ళు విప్లవవాదులు కాలేరు. మొదటిదాంట్లో ఒక భ్రమ. రెండవ దాంట్లో అది అసంభవత.

కొంత మంది మరోలా వాదిస్తారు. వాళ్ళు మంచి వాళ్ళే. తప్పు పట్టడానికి లేదు. కాని పొరపాటు అవగాహనలో పడి ఇలా వాదిస్తారు. సంభాషణాత్మక క్రమం ఒక పట్టాన తెమలదు, ఎడతెగనిది.[10] (సరే, యీ మాట నిజం కాదనుకోండి) అంచేత ఒకళ్ళతో ఒకళ్ళ సంభాషణ లేకుండానే విప్లవాన్ని కొనసాగించాలి, "ప్రకటనల" ద్వారా నడిపించాలి. ఇక విప్లవమంటూ వస్తే అప్పుడు ఆమూలాగ్రం సరిచూసుకునే విద్యా కృషిని అభివృద్ధి చేయవచ్చు అని అంటారు. అదీగాక యీ వాదనను సమర్థించుకునేందుకు మరో మాటా అంటారు., అధికారం హస్తగతం కాకుండా – విమోచనా విద్యను – నిర్వహించడం సాధ్యం కాదు అని.

ఈ పై ఉద్ఘాటనల్లోని కొన్ని మౌలిక విషయాలని విశ్లేషించుకోవడం ధర్మం, ఈ స్త్రీలూ, పురుషులూ (లేదా వాళ్ళల్లో అధిక శాతం) ప్రజలతో సంభాషణను విశ్వసిస్తారు. అయితే, ఈ సంభాషణ అధికారం రావడానికి ముందే సాధ్యపడుతుందని విశ్వసించలేరు. అధికారం చేతిలోకి తీసుకోకముందే నాయకులు విమర్శనాత్మక విద్యాధోరణిలో వుండగలిగే అవకాశాన్ని తోసిరాజనడమంటే వాళ్ళు సాంస్కృతిక విప్లవం అవడానికి సన్నద్ధం చేసే సాంస్కృతిక కార్యకలాపంగా విప్లవానికి వున్న విద్యాపర గుణాన్ని కాదంటున్నారన్నమాట.

అదీగాక, అధికారం హస్తగతం అయ్యే, ఆరంభించబోయే నూతన విద్యా విధానంతో సాంస్కృతిక కార్యకలాపాన్ని గందరగోళపరుస్తున్నారన్నమాట!

పీడక కులీనులు విమోచనాత్మక విద్యను అమలు పరుస్తారని ఆశించడం ఎంత అమాయకత్వమో ఇదివరకే నొక్కి చెప్పాను. కాని విప్లవానికి తిరుగులేని విద్యా గుణం వుంది. కాబట్టి, విమోచన చేస్తే తప్ప అది విప్లవం కాదు. అధికారం హస్తగతం చేసుకోవడం అనేది విప్లవక్రమంలో ఒక ఘటన మాత్రమే – అది ఎంత నిర్ణాయకమైందైనాగానీ ఒక క్రమంగా చూసినట్లయితే విప్లవానికి "ముందు" అనేది పీడక సమాజంలో వుంది. అది విప్లవ చైతన్యానికి మాత్రమే తెలుస్తుంది.

విప్లవం పీడక సమాజంలో వున్న సాంఘిక చట్రంలోనే పుడుతుంది. అది సాంస్కృతిక కార్యాచరణగా వున్న మేరకు, సాంఘిక చట్రం అభివృద్ధి అవకాశాలకు తగురీతిలో స్పందించకుండా వుండలేదు. ప్రతి అంశం దానిలోనే అభివృద్ధి చెందుతుంది (లేదా పరివర్తన చెందుతుంది), దాని వైరుధ్యాల పరస్పర చర్యల ద్వారా అది జరుగుతుంది. బాహ్య నియంత్రణలు అవసరమే అయినా, ఈ అభివృద్ధి అంశాలతో మౌనంగా వ్యవహరించినపుడే ఫలవంతం అవుతాయి.[11] విప్లవ నవ్యత్వం పాత దాంట్లోనే ఆవిర్భవిస్తుంది. అంటే పీడక సమాజంలో అధికారం అందుకోవడం అనేది కొనసాగే విప్లవక్రమంలో ఒక ఘటన మాత్రమే. విప్లవంపట్ల ఏదో పాతుకుపోయిన దృష్టిగాక గమనశీల దృష్టి వుంటే, "పూర్వం', "అనంతరం" అనే అంతిమ విభజన చేయడం జరుగదు. అధికారం అందుకోవడం అనేది ఈ రెండింటికీ మధ్య విభజనరేఖగానూ వుండదు.

విప్లవం వాస్తవ పరిస్థితుల నుంచి వస్తుంది. పీడక సన్నివేశాన్ని తొలగించాలని చూస్తుంది. విమోచన కొనసాగించే క్రమంలో స్త్రీ, పురుషులూ నిమగ్నం అయ్యే సమాజానికి నాంది పలుకుతుది. విప్లవానికి సంభాషణాత్మక, విద్యా గుణం వుంది, అందువల్లే అది సాంస్కృతిక విప్లవం అవుతుంది. ఆ రకంగా అది అన్ని దశల్లోనూ ఆ గుణాలు వుండేటట్టు చూసుకోవాలి. విప్లవం సంస్థాగతం కాకుండా వుండాలంటే, విప్లవ ప్రతీఘాత – నిరంకుశ అధికార వ్యవస్థగా ఘనీభవించి గిడసబారిపోకుండా వుండాలంటే, విద్య ఔన్నత్యమే మహాశక్తివంతమైన సాధనం. ఎందుకంటే, తిరోగమనవాదులైన విప్లవవాదులే ప్రతీఘాత విప్లవాన్ని జరిపిస్తారు.

అధికారం చేతిలోకి రాక పూర్వం ప్రజలతో సంభాషించడం సాధ్యం కాదనీ వాళ్ళకి సంభాషణ గురించిన అనుభవం లేదనీ అంటారనుకోండి. అది అధికారంలోకి వచ్చింతర్వాత ప్రజలకీ సాధ్యం కాదు. అధికారం వినియోగించుకోవడంలోనూ వాళ్ళకి అనుభవం లేదు కదా! విప్లవ క్రమం చలన శీలం. అది అవిచ్ఛిన్న చలన శీలతలో వుంది. విప్లవనాయకులతో ప్రజల కార్యాచరణలో వుంది. ప్రజలు, నాయకులు సంభాషణనీ, అధికార వినియోగాన్నీ రెండింటినీ నేర్చుకుంటారు. ఎవళ్ళన్నా ఈత నీటిలో నేర్చుకుంటారు గాని, లైబ్రరీలోకాదు అని చెప్పినంత స్పష్టంగా ఇదీ చెప్పొచ్చు.

ప్రజలతో సంభాషణ అనేది ఏదో దయాధర్మభిక్షంగా ఇచ్చేదీ కాదు, వరప్రసాదమూకాదు. ఇక పెత్తనం దాష్టీకం చెలాయించేందుకు ఎత్తుగడాకాదు. ప్రపంచాన్ని గురించి "పేర్కోవడం" అనే భేటీగా సంభాషణ, అసలైన మానవీకరణ సాధించడానికి మౌలికమైన పూర్వ నిబంధనగా వుంటుంది. గాజొ పెత్ర విచ్ మాటల్లో– తననీ తన ప్రపంచాన్నీ మానవుడు మార్చుకోగలిగేటట్టు చేసేదే స్వేచ్ఛాయుత కార్యాచరణ, స్వేచ్ఛకు అనుకూలమైన నిబంధన అవసరం అనే దాని పరిమితులు తెలుసుకుని వుండడం... మానవ సృజనాత్మక అవకాశాల గురించిన చైతన్యం వుండడం... స్వేచ్ఛాయుత సమాజం కోసం జరిపే పోరాటం, దాని ద్వారా మనిషికి వ్యక్తిగతంగా మరింత స్వేచ్ఛను కలిగించలేనట్లయితే, స్వేచ్ఛాయుత సమాజం కోసం పోరాటమే కాదు.[12]

ఈ అభిప్రాయం నిజం అయితే, విప్లవపూరిత కార్యక్రమం అత్యంత శక్తివంతమైన విద్యా గుణం కలిగిందై వుంటుంది. ఆ రకంగా విప్లవపథంలో ప్రజలకు అన్నీ తెరచి వుంచుతుంది. ఏదీ వాళ్ళల్లో ప్రవేశించకుండా కవచధారణ చేయించడం కాదు. విప్లవపథం ప్రజలతో సంభాషణ జరపడంలో వుంటుంది, వాళ్ళపట్ల అవిశ్వాసంలో కాదు. లెనిన్ చెప్పినట్టు, విప్లవానికి ఎంత ఎక్కువగా సిద్ధాంతం అవసరం అయితే, అంత ఎక్కువగా నాయకులు ప్రజలతో వుండాలి. పీడక అధికారానికి వ్యతిరేకంగా నిలబడేందుకు అది అవసరం.

ఈ సాధారణ సూత్రీకరణల మీద ఆధారపడి, సంభాషణ వ్యతిరేక, సంభాషణ అనుకూల సిద్ధాంతాల గురించి మరింత దీర్ఘంగా విశ్లేషణ చేద్దాం.

### గెలవడం

సంభాషణ వ్యతిరేక కార్యాచరణకు మొదటి లక్షణం గెలవడం అన్న అవసరం. సంభాషణ వ్యతిరేక వ్యక్తికి ఇతరులతో సంబంధాలు వాళ్ళని ఏ మాత్రంలోనైనా జయించి

లోబరుచుకోవడం అన్నదానిమీదే గురిపెట్టి వుంటాయి. ఈ పద్ధతుల్లో సామం వుంటుంది, దండం వుంటుంది. ఎంతో నయాన చెప్పడం (పైతృకత్వం); ఇక తలెత్తకుండా మోదడం కూడా వుంటాయి.

జయించడం అన్న ప్రతి చర్యలోనూ ఒక విజేత వుంటాడు. పరాజితుడు వుంటాడు. విజేత తను అనుకున్నదాన్ని పరాజితుడి మీద రుద్దుతాడు. వాళ్ళని తన హక్కుభుక్తం చేసుకుంటాడు. పరాజితుడికి తనే ఫలానా ఫలానా గిరిగీసి చూపిస్తాడు. ఆ పరాజితుడు ఈ రూపాన్ని తనలో పెట్టుకుంటాడు. మరొకళ్ళను "నింపుకోవడం" ద్వారా సందిగ్ధ జీవులు అవుతారు. వాళ్ళ 'గెలుపు' తొలి నుంచి, మనుషుల్ని వస్తువుల స్థాయికి మార్చి, మృత్యుప్రీతి కలిగిస్తుంది.

సంభాషణ వ్యతిరేక కార్యాచరణ వాస్తవ, నిర్దిష్ట, పీడక పరిస్థితికి కట్టుబడి వుంటుంది. సంభాషణాత్మక కార్యాచరణ ఆ పరిస్థితిని తొలగించి విప్లవపూరితం చేయడానికి తప్పనిసరి అవుతుంది. నేల విడిచిసాము చేసే రీతిలో ఓ వ్యక్తి సంభాషణాత్మకమో అందుకు వ్యతిరేకమో అవడం అస్పష్టముగా వుండదు. ఇది లోకంలోనే జరుగుతుంది. ఆమెగాని, అతనుగాని మొట్టమొదట సంభాషణ వ్యతిరేకులై పీడకుడు అవడం అంటూ వుండదు. రెండూ, ఏక కాలంలోనే వుంటాయి. పీడక వస్తుగత సన్నివేశంలోనే, సంభాషణ వ్యతిరేకత పీడకుడికి మరింత పీడనకుగాను అవసరం– ఆర్థికంగానేకాదు, సాంస్కృతికంగా కూడా. పరాజితులకు వాళ్ళ మాట, వాళ్ళ వ్యక్తీకరణ, వాళ్ళ సంస్కృతి లుప్తం అవుతాయి. పీడన పరిస్థితి అంటూ ఒకసారి ఏర్పడితే, సంభాషణ వ్యతిరేకత, దాన్ని పెంచిపోషించుకోవడం కోసం, తప్పనిసరి అవుతుంది.

విమోచనా కార్యాచరణ స్వతహాగా సంభాషణాత్మకం కాబట్టి సంభాషణ ఆ కార్యాచరణవల్ల తర్వాత వచ్చేది కాదు, దాంతోపాటుగా వుండాలి. విమోచన అనేది అనశ్వర నిబంధన కాబట్టి, సంభాషణ విమోచనా కార్యాచరణలో నిరంతరం సాగే పార్శ్వంగా వుంటుంది.[13]

అసలు సంభాషణ వ్యతిరేక కార్యాచరణలోనే సర్వదా గెలవడం అన్న కోరిక (లేదా గెలుపు ఆవశ్యకత) ప్రత్యక్షమై వుంది. ఈ దిశలో పీడకులు, ప్రపంచ పరిశీలకులుగా పీడితుల లక్షణాన్ని నలిపిపారెయ్యాలని చూస్తారు. పీడకులు సంపూర్ణంగా ఈ కార్యం నిర్వర్తించలేరు. కాబట్టి, ప్రపంచాన్ని గురించి అభూతకల్పన చేయాలి, మార్మికం చేయాలి. ప్రపంచం చూస్తే దగా, మోసం కనిపిస్తున్నాయి. ఈ దగా, మోసం పీడితుల

పరాయీకరణనీ, స్తబ్దతనీ పెంచడానికి తయారైనవి. మరి దీన్ని పీడితులకు అందించడం ఎలాగ? ఇందుగ్గాను పీడకులు అనేక రంగురంగుల ఫోకసింగ్ పద్ధతులు తెచ్చిపెడతారు. ప్రపంచాన్ని ఒక సమస్యగా పెట్టే ఛాయలు కూడా అందులో వుండవు. ఆ జాగ్రత్తలు తీసుకుంటారు. ఇదొక స్థిరీకృత పదార్థం, ఇలా అందివచ్చిందంతే – ప్రజలు, ప్రేక్షకుల్లాగా దీనితో సర్దుకుపోవాలి.

అణచివేత మార్గం గుండా ప్రజల దగ్గరకు వెళ్ళడం పీడకులకు అవసరం, వాళ్ళని స్తబ్ధుగా వుంచాలి కదా! ఈ సామీప్యత, ఏమైనప్పటికీ, ప్రజలతో వుండడం అన్నదాన్ని నిమగ్నం చేసుకోదు, నిజమైన వ్యక్తీకరణ వుండదు. యథాతథ పరిస్థితిని నిలబెట్టి వుంచుకునేందుకుగాను ఏదో కల్పించి చెప్పాలి. దాని ద్వారా దీన్ని సాధించుకుంటారు. ఉదాహరణకు పీడక వ్యవస్థ "స్వేచ్ఛాసమాజం", తమకి ఇష్టం వచ్చినట్టుఇష్టం వచ్చిన చోట పని చేసుకునే హక్కు ప్రజలందరికీ వుందనీ, యజమానితో పడకపోతే, ఓ దణ్ణం పారేసి ఏదో ఉపాధికి వెళ్ళవచ్చనీ చెప్పే హరికథ చూడండి, ఈ సమాజం మానవ హక్కుల్ని గౌరవిస్తుంది. అంచేత సాగిలపడి సాష్టాంగ నమస్కారం చేయాలి అన్న హరికథ చూడండి; ఒళ్ళు దాచుకోకుండా పనిచేసేవాడెవడేనాగానీ పారిశ్రామిక వేత్త అయిపోవచ్చు తెలుసా అన్న హరికథ ఇంకా అధ్వానం,వూళ్ళో వీధులు తిరిగి బఠానీలు అమ్ముకునేవాడు కూడా ఒక పారిశ్రామిక వేత్తతో సమానమే, ఒక భారీ ఫ్యాక్టరీ యజమానితో సమానమే అని సాగదీసే హరికథ. ఇక విద్య సార్వత్రిక హక్కు అన్న కల్పన. బ్రెజిల్ పిల్లల్లో ప్రాథమిక పాఠశాలల్లో చేరేవాళ్ళల్లో వేళ్ళ మీద లెక్కపెట్టగలిగిన కొద్దిమంది మాత్రమో యూనివర్శిటీ స్థాయికి చేరుతున్న ప్రస్తుత పరిస్థితులలో వున్న కల్పన ఇది. ఇక అందరూ వ్యక్తులకీ సమాన హక్కులున్నాయన్న హరికథ వుంది. అదీ ఎప్పుడు? "ఎవళ్ళతో మాట్లాడుతున్నారో తెలుసా నీకు?" అని అడిగే పరిస్థితి వున్న సమయంలో. ఈ పరిస్థితి ఇంకా వుంది. మరో కల్పన వుంది. పీడకుల సాహసకృత్యాలు. "భౌతికవాద" బర్బరత్వానికి "వ్యతిరేకంగా" పాశ్చాత్య క్రైస్తవ నాగరికత పరిరక్షకులట. కులీనుల ఔదార్య దానగుణాల కల్పన వుంది. మరి వాళ్ళు ఒక వర్గంగా నిజానికి చేసేది ఏమిటీ అంటే– జాగ్రత్తగా ఎంపిక చేసుకున్న "మంచిపనులు" (ఆ తర్వాత వీటిని "నిష్కామయోగంతో అందించే సహాయాల"ని జీడీపాకంలా సాగదీసి చెప్పుకుంటారు. దీన్ని పోప్ జాన్–23[14] అంతర్జాతీయ స్థాయిలో చెడామడా తిట్టిపోశాడు). తమ బాధ్యతలు గుర్తించిన పెత్తందారీ కులీనులు ప్రజల అభివృద్ధికి దోహదం చేస్తారండి, ప్రజలు కృతజ్ఞతా సూచకంగా, వారు చెప్పిన సూక్తులు నెత్తిమీద పెట్టుకుని వాళ్ళకు అనుకూలంగా

వుండాలి. ఇక తిరుగుబాటు అనేది దైవద్రోహం అన్న కల్పన. సొంత ఆస్తి అనేది వ్యక్తిగత మానవాభివృద్ధికి మూలం (పీడకులే నిజమైన మానవులుగా వున్నంత కాలం) అన్న కల్పన. పీడకుల కృషి గురించీ, పీడితుల సోమరితనం గురించీ, మోసపూరిత తత్వం గురించీ చెప్పే కల్పన, అలాగే, పీడితులు జన్మతః అల్పులు పీడకులు జన్మతః అధికులు అన్న కల్పన.[15]

ఈ కల్పనలన్నీ (యింకా మిగిలిన వాటిని పాఠకులు పట్టిక వేసుకోవచ్చు) అణగారిన, పీడితులలో భాగమై పోవడం చాలా ముఖ్యం. వీటిని నగీషీలతో, షోకులతో ప్రచారం చేస్తారు. నినాదాలతో చాటుతారు. ఇదీ ఎలా అంటే "ప్రజా ప్రచార సాధనాల ద్వారా – అలాంటి పరాయీకరణ నిజమైన కమ్యూనికేషన్ అయినట్టు![16]

క్రోడీకరించి చెప్పుకోవాలీ అంటే ఏకకాలంలో తప్పనిసరిగా సంభాషణ వ్యతిరేకంగా వుండని, పీడక పరిస్థితి వుండదు. పీడకులు నిర్విరామంగా పీడితుల్ని నిరంతరం జయించేందుకు అర్పితులవని సంభాషణ వ్యతిరేకతా వుండదు. ప్రాచీన రోమ్‌లో ప్రజల్ని "మెత్తబరచడానికి" తమ ప్రశాంతతను భద్రం చేసుకోవడానికిగాను వాళ్ళ 'రొట్టె వినోదం'' యివ్వాల్సిన అవసరం వుందని పెత్తందారీ కులీనులు ఉద్బోధించేవారు. ఇవాళ్లి పెత్తందారీ కులీనులు, ఏ యుగంలోనైనా వున్నట్టే, ఇతరుల్ని లొంగదీసుకునే అవసరం కొనసాగిస్తున్నారు (జన్మాంతర పాపం కొత్త అచ్చుతో) రొట్టె వినోదం కలిపో, కలపకో. గెలవడం వస్తువు, పద్ధతులు చారిత్రకంగా మారుతూ వుంటాయి, మారందల్లా ఏమిటంటే (పెత్తందారీ కులీనులు వున్నంతకాలం) పీడించాలన్న మృత్యుహేల.

**విభజించి, పాలించడం**

పీడక చర్య సిద్ధాంతంలో మరో ముఖ్యమైన పార్శ్వం ఇది. పీడన అంతా పాతదని. పీడక అల్ప సంఖ్యాకులు అధిక సంఖ్య జనాల్ని లోబరుచుకుంటూ వున్నప్పుడు, వాళ్ళని విభజించి వుంచాలి. తాము అధికారంలో వుండేందుకుగాను అలా విభజించే వుంచాలి. ప్రజలు ఐక్యంగా వుంటే తమ పెత్తందారీతనానికి ముప్పుకాదూ? ఆ రకంగా పీడకులు ఏది అందివస్తే ఆ పద్ధతిని (హింసతో సహా) వాడి, పీడితుల్లో ఏ మూలో ఐక్యత వైపు మొగ్గ తొడుగుతూ వున్న చైతన్యాన్ని అడ్డగిస్తారు. ఐక్యత, నిర్మాణం, పోరాటం అనే భావనలు తొంగిచూస్తే చాలు– వాటికి ప్రమాదకరం ముద్ర వేస్తారు. నిజానికి పీడకులకు – ఈ భావనలు ప్రమాదకరమైనవిగా వుంటాయి – ఎందుకంటే విమోచనా సాధనకు అవి అవసరం కదా.

పీడితుల్ని మరింతగా దుర్బలపరచడం పీడకులకు లాభం. వాళ్ళని వేర్వేరు చేయాలి, వాళ్ళల్లో చీలికలు తెచ్చి తగవులు పెట్టి తమ పబ్బం గడుపుకుంటారు. అనేక మార్గాల ద్వారా ఈ పనులు జరిపిస్తారు. ఇందుకోసం అధికార వర్గం నిరంకుశ చర్యలు మొదలు సాంస్కృతిక కార్యాచరణ రూపాల దాకా వుంటాయి. ఈ రూపాలలో వాళ్ళు ప్రజలకు సాయం చేస్తున్నట్లు నటిస్తూ వాళ్ళని బొమ్మల్లా ఆడిస్తారు.

పీడక సాంస్కృతిక కార్యకలాపంలో ప్రధానలక్షణం ఒకటుంది. జీవితాల్ని అంకితం చేసిన అమాయక వృత్తి కళాకారులు దీన్నసలు గమనించనే లేరు. వాళ్ళకి ఎంతసేపూ సమస్యల కేంద్ర బిందువు మీదే దృష్టి లగ్నం అయి వుంటుంది తప్ప, ఒక మొత్తంలో భాగంగా దాన్ని చూడరు. కమ్యూనిటీ అభివృద్ధి పథకాల్లో ఒక ప్రాంతాన్నిగాని, మండలాన్నిగాని "స్థానిక కమ్యూనిటీలు"గా విభజించి పెట్టేస్తారు. ఆ కమ్యూనిటీలను వాటికిగా అవి ఏక మొత్తం అనీ, మరొక మొత్తంలో భాగం అనీ అధ్యయనం చేయడమే వుండదు (మండలం, ప్రాంతం, ఇంకా అలా అలా). ఆ మొత్తం కూడా మరో విశాలమైన మొత్తంలో భాగం (దేశం, ఖండం మొత్తంలో భాగం అయినట్టు). అలా ఎంతలా జరిగితే అంతలా పరాయీకరణ తీవ్రతరం అవుతుంది. ప్రజలు ఎంత దూరస్థం అయితే, వాళ్ళని విభజించడం అంత సులభం, అలా విభజించి వుంచడమూ సులభం. ఈ కార్యాచరణ కేంద్రీకృత రూపాలు, పీడితుల కేంద్రీకృత జీవన విధానాల్ని తీవ్రతరం చేస్తాయి (ముఖ్యం గ్రామీణ ప్రాంతాల్లో). పీడితులు యదార్థ పరిస్థితిని విమర్శనాత్మకంగా గ్రహించకుండా అడ్డగిస్తాయి. ఇతర ప్రాంతాల్లో పీడిత స్త్రీ, పురుషుల సమస్యల నుంచి వాళ్ళని వేర్పాటు చేస్తాయి.[17]

ఇదే చీలిక ఫలితం "నాయకత్వ శిక్షణా తరగతు"లనే వాటిల్లోనూ సంభవిస్తుంది. (నిజానికి ఆ నిర్వాహకులకు అలాంటి ఉద్దేశాలంటూ లేకపోయినా, నిర్వహణలో) ఆఖరికి దూరం చేయడంతో ముగుస్తాయి. నాయకుల్ని తర్ఫీదు చేసి పెట్టడం ఆ బృందాన్ని ముందుకు తీసుకుపోవచ్చన్న అమాయకపు వూహ దీనికి ఆధారం – అక్కడికి భాగాలు పూర్ణత్వాన్ని ముందుకు తీసుకుపోతున్నట్టు, పూర్ణత్వం ముందుకు సాగుతూ భాగాల్ని ముందుకు తీసుకుపోవడం కానట్టు. తగినంత నాయకత్వ సామర్థ్యాల్ని ప్రదర్శించేవాళ్ళు ఆ శిక్షణా తరగతులకి ఎంపిక అవుతారు. వాళ్ళు తమ బృందంలోని వ్యక్తుల ఆకాంక్షల్ని ప్రతిఫలింపచేస్తారు. వెల్లడి చేస్తారు. వాళ్ళు జీవన విధానంలో సమరస భావం చూపిస్తారు. యదార్థ పరిస్థితి గురించిన ఆలోచనలోనూ సమరస భావంతో వుంటారు. వాళ్ళ సహచరుల ప్రధాన లక్షణాలు ఇవే. వాళ్ళకి "నాయకులు" అన్న హోదాని ఇచ్చే ప్రత్యేక సామర్థ్యాలు

వాళ్ళు ప్రదర్శిస్తూ వున్నప్పటికీ వాళ్ళా శిక్షణ పూర్తి చేసుకుని, అంతకుముందు వాళ్ళల్లో లేని జవసత్వాలతో తిరిగి బృందంలోకి తిరిగి వస్తారు. వాళ్ళా శక్తి యుక్తుల్ని తమ సహచరుల మునిగిపోయిన, అణగారిన చైతన్యాన్ని నియంత్రించేందుకేనా వాడతారు, లేదా తమ బృందాల్లోనే పరాయివాళ్ళయిపోతారు. ఆ రకంగా వాళ్ళకి పూర్వం వున్న నాయకత్వ స్థానానికి ముప్పు వస్తుంది. ఆ హోదా పోగొట్టుకోకుండా వుండేందుకని వాళ్ళు తమ బృందాన్ని నేర్పుగా బుట్టలో వేసుకోచూస్తారు, కాని, మరింత సమర్థవంతంగా ఒక పూర్ణత చెందినదిగా, పూర్ణత చేసేదిగా సాంస్కృతిక కార్యకలాపం నాయకుల్నేగాకుండా మొత్తం బృందాన్ని సమీపించినప్పుడు, దీనికి ప్రతికూలమైందీ సంభవిస్తుంది. మునుపటి నాయకులు ఇతరులందరితోపాటూ ఎదగనేనా ఎదుగుతారు. లేదా వాళ్ళ బదులు కొత్త నాయకులేనా వస్తారు. బృందంలోనూ తన సామాజిక చైతన్యం ఫలితంగా ఇలా కొత్త నాయకులు వస్తారు.

పీడకులు కమ్యూనిటీ మొత్తంగా పురోగతి చెందడం ఇష్టపడరు, ఎంపిక చేసిన నాయకులు ముందుకుపోవడాన్ని ఇష్టపడతారు. ఈ రెండో మార్గం పరాయీకరణను నిలబెట్టి వుంచడం ద్వారా మొత్తం వాస్తవ పరిస్థితిలో చైతన్యం ఆవిర్భవించకుండా, విమర్శనాత్మక జోక్యం రాకుండా అడ్డగిస్తుంది. ఈ సవిమర్శక జోక్యం లేకుండా పీడితులు ఒక వర్గంగా ఐక్యత సాధించడం కష్టం.

పీడకులకు నిద్రపట్టకుండా చేసే మరో సంగతి వర్గసంఘర్షణ, ఏమంటే, వాళ్ళు తమని పీడక వర్గంగా భావించుకోరు. ఎంత గింజుకున్నా సామాజిక వర్గాలున్నాయన్న విషయాన్ని కాదనలేక, వాళ్ళు శ్రమని అమ్ముకోవాల్సినవాళ్ళకీ, శ్రమను కొనుగోలు చేసేవాళ్ళకీ మధ్య సదవగాహన, సామరస్యం వుండాలని ధర్మపన్నాలు చెపుతారు.[18] ఏమైనా ఈ రెండు వర్గాల మధ్యా దాపరికం లేకుండా వున్న వైరుధ్యంవల్ల ఈ “సామరస్యం” అసాధ్యం అవుతుంది.[19] వర్గాల మధ్య సామరస్యం కావాలి అని కులీనులు పిలుపుయిస్తారు. అక్కడికి వర్గాలనేవి, ఓ ఆదివారం మధ్యాహ్నం కుతూహలంతో దుకాణం కిటికిలోకి తొంగిచూస్తే వ్యక్తులు యాదృచ్ఛికంగా గుమిగూడ్డం వంటివి కాబోలు! కాస్త నిలిచి బట్టకట్టి, కనిపించే సామరస్యం పీడకుల మధ్యనే వుంటుంది. వాళ్ళు అభిప్రాయ భేదాల్తో వుండొచ్చు, అడపాడదపా స్వప్రయోజనాలరీత్యా మాటా మాటా అనుకోవచ్చు కూడా. కాని, తమ వర్గానికి ఎసరు వస్తోందీ అని పసిగట్టగానే జట్టు కట్టేస్తారు. ఇదే విధంగా పీడితుల మధ్య సామరస్యం కూడా వాళ్ళు విమోచనా పోరాటంలో నిమగ్నమైనప్పుడే వస్తుంది. మహా అరుదైన సందర్భాల్లోనే ఉభయవర్గాలూ ఏకం అయి సామరస్యంతో పని చేయడం

సాధ్యమవడమే కాకుండా అవసరం కూడా అవచ్చు. కాని వాళ్ళని ఒకటిగా చేసిన ఆపత్కాలం గడిచిపోగానే వాళ్ళ వైరుధ్యాలు మళ్ళీ వస్తాయి, అవి వాళ్ళ మనుగడను సూచిస్తాయి. నిజానికి అవి ఎన్నడూ అదృశ్యం అవలేదు.

పెత్తందారీ వర్గం చేసే అన్ని పనులూ పీడక రాజ్యాన్ని నిలబెట్టి వుంచడానికిగాను విభజన తేవలసిన దాని అవసరాన్ని చూపెడుతూ వుంటాయి. యూనియన్లలో వేలుపెట్టడం, పీడక వర్గాలలో కొందరు "ప్రతినిధుల"పట్ల పక్షపాతం (నిజానికి వాళ్ళు పీడకుడి ప్రతినిధులు, తమ సహచరులకు కాదు.) నాయకత్వ లక్షణాల్ని ప్రదర్శించే వ్యక్తుల్ని వాళ్ళు ఇలా "మెత్తబర్చడకపోతే" ప్రమాదం ఎదురవవచ్చు. పైకి తీసుకురావడం, కొందరికి సౌకర్యాలు సమకూర్చడం, కొందరిని జరిమానాలతో శిక్షించడం. ఇవన్నీ విభజించే మార్గాలే. కులీనులకి అనుకూలించే వ్యవస్థని నిలబెట్టి వుంచడానికి ఇవన్నీ అవసరం. అవి దోచుకునే కార్యాచరణ రూపాలు, అది ప్రత్యక్షం కావచ్చు, పరోక్షం కావచ్చు. పీడితుల్లో కనిపించే ఒక బలహీనత: వాళ్ళ ప్రాథమిక అభద్రత, పీడితులు ద్వంద్వంతో అభద్రంగా వుంటారు. పీడకుడి ఛాయవాళ్ళలో "గూడు" కట్టుకుని వుంది. ఒకసారి ఎదిరిస్తారు, మరోసారి  ఒక దశలో ఆకర్షితులవుతారు. ఈ బాపతు పరిస్థితుల్లో విభజన చర్యల ద్వారా పీడకులకు మంచి ఫలితాలే కలుగుతాయి.

దీనికి తోడు, తాము ఒక వర్గంగా ఏకం కాకుండా అడ్డగించే ఉద్దేశ్యంతో అందించిన "ఆహ్వానాన్ని" అంగీకరించకపోతే ఎంత మూల్యం చెల్లించాలో పీడితులు తమ అనుభవం నుంచి గ్రహిస్తారు: ఉద్యోగానికి ఉద్వాసన, తమ పేర్లు "బ్లాక్‌లిస్ట్"లో చేరడం, అంటే– ఉద్యోగాల తలుపులన్నీ మూసుకుపోయినట్టు. వాళ్ళ మౌలిక అభద్రతాభావం ఆ రకంగా నేరుగా వాళ్ళ శ్రమ బానిసత్వం కావడానికి నడిపిస్తుంది. (అంటే నిజానికి బిషప్ స్పిట్ నొక్కిచెప్పినట్టు తమ వ్యక్తిత్వం బానిస అవడమే).

ప్రజలు తమ ప్రపంచాన్ని సృష్టించుకున్న మేరకు ( అది మానవ ప్రపంచం) తమ పరివర్తనాత్మక శ్రమతో సృష్టించుకున్నప్పుడు మాత్రమే పరిపూర్తి చెందుతారు. మానవులుగా మానవాళి పరిపూర్తి ప్రపంచ పరిపూర్ణతలో వుంది. పని ప్రపంచంలో వుండడం అంటే మనిషికి పూర్తి పరాధీనత, అభద్రత నిత్యం నెత్తిమీద వేలాడే కత్తి అయినప్పుడు – వాళ్ళ పని వాళ్ళది కానప్పుడు– ఆ వ్యక్తి పరిపూర్ణత చెందలేదు. స్వేచ్ఛాయుతం కాని పని సంపూర్ణ అన్వేషణ కాకుండాపోతుంది, అమానవీకరణకు చక్కని సాధనం అవుతుంది.

ఐక్యత కోసం పీడితులు వేసే ప్రతి అడుగూ ఇతర చర్యలకేసి చూపిస్తూ వుంటుంది. ఇవాళకాకపోతే రేపైనా వాళ్ళు వ్యక్తిత్వహరణం జరిగిన పరిస్థితిని గ్రహిస్తారు. తాము చీలిపోయి వున్నంతకాలం సులభంగా మాయలకీ, ఆధిపత్యానికీ లొంగిపోతామని తెలుసుకుంటారు. ఐక్యత, నిర్మాణం వాళ్ళ దౌర్బల్యాన్ని పరివర్తనాత్మకశక్తిగా మారుస్తాయి. దాంతో వాళ్ళు ప్రపంచాన్ని తిరిగి సృష్టిస్తారు. మరింత మానవీయం[20] చేస్తారు. వాళ్ళు ఆకాంక్షించే మరింత మానవీయ ప్రపంచం, పీడకుల “మానవీయ ప్రపంచానికి విరుద్ధంగా వుంటుంది – ఇది పూర్తిగా పీడకుల అధీనమై వుంటుంది. వాళ్ళు తమకీ (అమానవీయం చేసేవాళ్ళకీ) పీడితులకీ (అమానవీయం అయినవాళ్ళకీ) మధ్య అసంభవమైన సామరస్యాన్ని బోధిస్తారు. పీడకుడు, పీడితుడు పరస్పర విరుద్ధంగా వుంటారు కాబట్టి ఒకళ్ళకి శాపం అయింది ఒకళ్ళకి వరంగా వుంటుంది.

యథాతథస్థితిని ఇలానే నిలబెట్టి వుంచేందుకు విభజించి వుంచడం అవసరం. సంభాషణ వ్యతిరేక కార్యకలాప సిద్ధాంతపు మొట్టమొదటి లక్ష్యం ఇదే. ఇందుకు తోడు పెత్తందార్లు తాము అమానవీయం చేసే స్త్రీ, పురుషులకు తామే మోక్ష ప్రదాతలమని చాటుకుంటారు. ఈ ప్రవక్తల భంగిమ ఏమైనా వాళ్ళ అసలు రంగును మాపలేదు. అది తమని రక్షించుకోవడం. వాళ్ళు తమ సంపదల్ని, తమ అధికారాన్ని, తమ జీవన విధానాన్ని రక్షించుకోవాలని చూస్తారు. ఇతరుల్ని అణచిపెట్టడంలో వాళ్ళకి వాటంగా ఉపయోగపడేవి ఇవే. వాళ్ళ పొరపాటు ఏమిటంటే.– మనుషులు తమని తాము రక్షించుకోలేరు అని (మోక్షం అనే మాటను ఎవళ్ళు ఎలా అర్థం చేసుకున్నప్పటికీ). అంటే వ్యక్తులుగాగాని, పీడక వర్గంగాగాని ఇతరులతో కలిసే విముక్తి సాధించాలి. పీడన సాగేంతవరకూ కులీనులు పీడితులతో వుండలేరు. వాళ్ళకి వ్యతిరేకంగా వుండడమే పీడన సారం.

పీడన చర్యను గనక మనస్తత్వ శాస్త్రరీత్యా విశ్లేషిస్తే పీడకుల “దొంగ ఔదార్యం” బయటపడుతుంది (అధ్యాయం–1లో వివరించుకున్న విషయం). అది వాళ్ళ అంతరాత్మ దోషత్వ పార్శ్వం. ఈ దొంగ ఔదార్యంతో అతను అన్యాయపూరిత, శవప్రాయ వ్యవస్థను నిలబెట్టి వుంచడమేకాదు, తన కోసం “శాంతి”నీ కొంటాడు. అయితే, శాంతిని కొనడం సాధ్యపడదు. సంఘీభావంలో, ప్రేమ పూరిత చర్యలలో శాంతిని అనుభవించాలి, పీడనలో ఇది సాధ్యం కాదు. అంచేత సంభాషణ వ్యతిరేక సిద్ధాంతంలో వున్న ప్రవక్తభంగిమ ఈ కార్యాచరణ మొదటి విశిష్ట అంశాన్ని బలపరుస్తుంది. అంటే జయించడాన్ని అవశ్యం చేస్తుంది.

యథాతథపరిస్థితిని నిలబెట్టి వుంచడానికి, (ఆ రకంగా) పెత్తందార్ల అధికారాన్ని నిలబెట్టి వుంచుకోవడానికి ప్రజల్ని విభజించడం అవసరం. తమ వ్యూహాల్ని పీడితులు పసిగట్టకుండా చూడడం పీడకులకు ముఖ్యం. అంచేత పీడకులు తాము "ఆవారాగాళ్ళ నుంచి, రౌడీల నుంచి, దైవ శత్రువుల నుంచి వాళ్ళు చేసే రాక్షస కృత్యాల నుంచి పీడితుల్ని కంటికి రెప్పలా కాపాడుకుంటున్నా"మని (ఈ వర్ణనలన్నీ మానవాళి మానవీకరణకు సాహసోపేతంగా కృషి చేసిన మహనీయులపై ఎక్కుపెట్టిన ఆరోపణలు) వాళ్ళని నమ్మించాలి. ప్రజల్ని విభజించి గందరగోళపరచడానికి, విధ్వంసకులు తాము నిర్మాతలమని చాటుకుంటారు. నిజంగా నిర్మాతలైనవాళ్ళని విధ్వంసకులని తిట్టిపోస్తారు. ఈ బిరుదుల్ని సవరించే బాధ్యత సర్వదా చరిత్ర తన భుజ స్కంధాల మీద పెట్టుకుంటూనే వుంటుంది. ఇవాళ అధికార పరిభాషలో అయితే తిరాడెంటెస్[21] కుట్రదారుడే. ఆయన నడిపించిన విమోచనా పోరాటం కుట్రపూరితమే. అయితే తిరాడెంటెస్‌ని బందిపోటు అని పిలిచి, అతనిని ఉరితియ్యమని, అతని మృతశరీర భాగాల్ని ఖండాలుగా వీధుల్లోనూ, పొరుగు ప్రాంతాల్లోనూ ఒక హెచ్చరికగా చల్లమనీ ఆజ్ఞాపించిన వ్యక్తి[22] గాదు జాతీయ నాయకుడు. అసలు నాయకుడు తిరాడెంటెస్. కులీనులు అతనికి ఇచ్చిన బిరుదును చరిత్ర చించేసింది. ఆయన సాగించిన చర్యలోని మహత్వాన్ని గుర్తించింది. తమ రోజుల్లో విమోచనకోసం ఐక్యత కోరినవాళ్ళే నిజమైన నాయకులు – విభజించి పాలించడానికి తమ అధికారాన్ని వాడుకున్నవాళ్ళు కాదు.

## టక్కుటమార విద్య

సంభాషణ వ్యతిరేక కార్యకలాప సిద్ధాంతానికి మరోపార్శ్వం ఈ టక్కుటమార వ్యూహం. విభజన సిద్ధాంతం లాగానే ఇదీ లోబరుచుకోవడానికి ఒక సాధనం, నేర్పరితనంతో బురిడీ కొట్టించి పెత్తందారీ కులీనులు జన సమూహాల్ని తమ లక్ష్యాలకు అనుగుణంగా మలుచుకుంటారు. ప్రజల రాజకీయ అజ్ఞానం ఎంత బొమ్మజెముడులా వుంటే (గ్రామీణ ప్రాంతంలోగాని, పట్టణ ప్రాంతంలోగాని) అంత సునాయాసంగా వాళ్ళని అధికారప్రియులు మాయ చేసేస్తారు.

ఈ అధ్యాయం మొదట్లో చెప్పుకున్న అభూత కల్పనలతో ప్రజల్ని యుక్తిగా వంచిస్తారు. ఒక చిట్కా తర్వాత ఇంకోటి. బూర్జువా తన ఆదర్శాన్నే ప్రదర్శించుకుంటాడు, వాళ్ళ అభ్యున్నతికి అదో అవకాశంలాగా చూపిస్తాడు. మరి ఈ చిట్కాలు నడవాలిగా, అందుకని ప్రజలు బూర్జువాల మాటల్ని నమ్మాలి.

కొన్ని చారిత్రక పరిస్థితుల్లో అధికార పక్షానికీ, అణగారిన పక్షానికీ మధ్య ఒప్పందాల ద్వారా ఈ వ్యూహ నిర్వహణ జరుగుతుంది. పైపైన చూస్తే మాత్రం ఈ ఒప్పందాలు వర్గాల మధ్య సంభాషణేనేమో ననిపింపచేస్తాయి. నిజానికి ఇవి సంభాషణాత్మకం కాదు, ఎందుకంటే వాటి అసలు తత్వం అధికార శిష్టుల తిరుగులేని ప్రయోజనాలు. ఆఖరికి ఒప్పందాల్ని పెత్తందార్లు తమ లక్ష్యాల సాధనకు వాడుకుంటారు.[23] "జాతీయ పెట్టుబడిదారీ విధానం" అని పిలిచేదాన్ని కాపాడ్డం కోసం "జాతీయ బూర్జువావాదుల"ని పిలిచేవాళ్ళు ప్రజల నుంచి పొందిన తోడ్పాటు ఇందుకు ఉదాహరణగా చూపించవచ్చును. ఇవాళ కాకపోతే రేపైనా ఈ ఒప్పందాలు ప్రజల అణచివేతను పెంచుతాయి. ప్రజలు చారిత్రక క్రమంలో ఆవిర్భూతమవుతూ వున్నప్పుడు (చాలా అమాయకంగానైనాకానీ) దానివల్ల పెత్తందారీ కులీనులకు ఎసరు వస్తుందని భయం కలిగినప్పుడు మాత్రమే ఈ ఒప్పందాల్ని ప్రతిపాదిస్తూ వుంటారు. ప్రజలు ఈ చారిత్రక క్రమంలో ఇక ఎంతమాత్రమూ ప్రేక్షకుల్లా వుండరు, ఎదిరించే లక్షణాలు తొంగిచూస్తూ వుంటాయి. ఆ తొలి చిహ్నాలు కనిపించగానే పెత్తందారీ కులీనులకు గుబులు మొదలవుతుంది, తమ నైపుణ్యాల గురించిన అనుమానాలు తలెత్తుతాయి.

ఈ చారిత్రక క్రమంలో, పెత్తందారీతనాన్ని నిలబెట్టి వుంచుకోవడానికి టక్కుటమార విద్యల ప్రయోగం మౌలిక ఆయుధం అవుతుంది. ప్రజలు రంగం మీదకు రాకపూర్వం ఈ యుక్తులకు, కూహకాల (కచ్చితంగా చెప్పాలీ అంటే) అవసరం లేదు. మొత్తంగా లోబరచుకోవడమే వుండేది. యదార్థ పరిస్థితిలో పీడితులు ఆసాంతం మునిగిపోయి వున్నప్పుడు వాళ్ళని మభ్యపెట్టే అవసరం ఏం వుంటుంది? కార్యాచరణకు సంబంధించిన సంభాషణ వ్యతిరేక సిద్ధాంతంలో, టక్కుటమార విద్యల ప్రయోగం చారిత్రక క్రమంలో నూతన నిర్దిష్ట పరిస్థితులకు పీడకులు స్పందించే తీరు అన్నమాట. ఇలా నేర్పుగా మభ్యపెట్టడం ద్వారా పెత్తందారీ కులీనులు ప్రజల్ని అప్రామాణిక తరహా "నిర్మాణం"లోకి నడిపిస్తారు. ఆ రకంగా ముప్పుకలిగించే ప్రత్యామ్నాయాన్ని తప్పించుకుంటారు; చైతన్యవంతులైన, చైతన్యవంతులవుతూ వున్న ప్రజల నిజమైన నిర్మాణం.[24] ప్రజలకు రెండే ప్రత్యామ్నాయాలు ఈ చారిత్రక క్రమంలో వున్నాయి. తమ విమోచన కోసం ప్రామాణికంగా నిర్మాణం చేసుకోవాలి లేదా కులీనులు ఆడించినట్టు ఆడాలి. ప్రామాణిక నిర్మాణం పెత్తందార్ల నుంచి ప్రేరణ పొంది వస్తుందన్నమాట కల్ల. అది విప్లవ నాయకుల ద్వారా జరగాల్సిన కర్తవ్యం.

అయితే, పీడితుల్లో అధిక భాగం పట్టణ శ్రామికవర్గమే వుంటుంది. ముఖ్యంగా దేశంలో మరింత పారిశ్రామికవంతం అయిన కేంద్రాల్లో, ఈ విభాగాలు అడపాదడపా అసహనం చూపుతుంటాయి. కాని వాళ్ళకి విప్లవ చైతన్యం తక్కువ, తామేదో ఓ మెట్టు పైన వున్నట్టు భావించుకుంటూ వుంటారు. టక్కుటమార విద్యల మాయలూ మాటకారితనాలూ ఇక్కడ ఏపుగా పెరిగేందుకు పట్టు ఎక్కువ వుంటుంది.

ఈ బాపతు టక్కుటమార విద్యలకు విరుగుడు విమర్శనాత్మక విప్లవపూరిత నిర్మాణంలో వుంటుంది. చారిత్రక క్రమంలో ప్రజలకు తమ స్థానం ఏమిటో సమస్యగా ముందు నిలబెడుతుంది. అది జాతీయ యదార్థపరిస్థితి. అసలు మాయలూ మోసాలూ కూడా ఈ చైతన్యంవల్ల తెలుస్తాయి– ఫ్రాన్సిస్కో వెఫర్ట్ చెప్పినట్టు.

వామపక్ష సిద్ధాంతాలన్నీ ప్రజల మీద ఆధారపడినవే. వాళ్ళ చైతన్యం మీద ఆధారపడినవే. వాళ్ళ చైతన్యం గజిబిజిగా వుంటే వామపక్షాల వేళ్ళుపాతుకోవు. రేపోమాపో పతనం తప్పదు, వామపక్షాలు (బ్రెజిల్‌లో మాదిరి) త్వరగా అధికారంలోకి రావడం ద్వారా విప్లవాన్ని సాధించవచ్చున్న భ్రమలో వున్నాగానీ ఇదే జరగబోయేది.[25]

కూహకాల పరిస్థితిలో, వామపక్షాలకు "త్వరగా అధికారంలోకి" తిరిగి వచ్చే ప్రలోభం దాదాపు ఎప్పుడూ వుంటుంది. ఒక నిర్మాణాన్ని రూపొందించడానికి పీడితులతో కలవాల్సిన అవసరం మర్చిపోతాయి. పెత్తందారీ కులీనులతో అసంభవమైన "సంభాషణ"కు దిగుతారు. దాంతో ఆ శిష్టుల ఎత్తుగడల్లో పడి, మరి తనూ ఈ కులీనక్రీడలోకి జారిపోతుంది, జారిపోయి, దాన్ని "వాస్తవ స్థితి" అంటాయి.

నైపుణ్యంతో మభ్యపెట్టడం కూడా లోబరుచుకోవడంలాంటిదే. దానికీ దీనికీ లక్ష్యం ఒకటే. ఇది ప్రజల్ని మత్తులో పెడుతుంది, వాళ్ళు ఆలోచనలు చేయకుండా వుండడానికన్నమాట! ప్రజలు చారిత్రక క్రమంలో తమ ఉనికికి విమర్శనాత్మక ఆలోచనను జోడించడంవల్ల ఏర్పడే స్థితి విప్లవాన్ని సాకారం చేస్తుంది. ఈ సవ్యమైన ఆలోచనను "విప్లవపూరిత చైతన్యం" అనండి, లేదా "వర్గచైతన్యం" అనండి– మీ ఇష్టం. కాని, ఇది విప్లవానికి తప్పనిసరి షరతు. పెత్తందారీ కులీనులకీ ఈ విషయం బాగా తెలుసు. దాంతో అసంకల్పిత ప్రతీకార చర్యలాగా, శారీరక దౌర్జన్యంతోబాటుగా, సకల మార్గాలనీ, ప్రజలకు ఆలోచన రాకుండా చేయడానికి వాడతారు. విమర్శనా సామర్థ్యం అభివృద్ధి చేసే సంభాషణ సత్తా గురించి వాళ్ళ సూక్ష్మబుద్ధితో గ్రహిస్తారు. కొంత మంది విప్లవ నాయకులు ప్రజలతో సంభాషణను ఒక "బూర్జువా, తిరోగమన" కార్యకలాపంగా

పరిగణిస్తే, బూర్జువాలు మొత్తం పీడితులకీ విప్లవనాయకులకీ మధ్య సంభాషణ చాలా ప్రమాదకరమైందని భావించి, తప్పించవలసిందని అనుకొంటారు.

టక్కుటమార విద్యల్లో ఒక పద్ధతి, వ్యక్తిగత విజయంపట్ల బూర్జువా దాహాన్ని వ్యక్తులకు ఎక్కించడం. ఈ ఎత్తుగడను కొన్ని సందర్భాల్లో కులీనులు నేరుగా అమలు జరుపుతారు. కొన్ని సందర్భాల్లో పరోక్షంగా జరిపిస్తారు, జనాకర్షక నాయకుల ద్వారా, వెఫర్ట్ చెప్పినట్టు ఈ నాయకులు సంపన్న కులీనులకీ ప్రజలకీ మధ్య వారధులుగా పని చేస్తారు. జనాకర్షకత ఆవిర్భావం ఒక రాజకీయ కార్యాచరణగా ఆ రకంగా, పీడితుల ఉత్థానంతో సందర్శిస్తుంది. ఈ క్రమంలో పుట్టుకొచ్చిన జనాకర్షక నాయకుడు సంశయాత్ముడు, ఒక "ఉభయచర" జీవి, రెండు అంశాలతో వుంటాడు. ప్రజలకీ పెత్తందారీ సంపన్నులకీ మధ్య కండెలా తిరుగుతూ వుంటాడు. రెండు బృందాల చారలూ తన మీద వుంటాయి.

జనాకర్షక నాయకుడు ప్రామాణికమైన ప్రజానిర్మాణం కోసం పోరాడడు. అందుకు బదులుగా తనూ యుక్తులతో నెట్టుకొస్తూ వుంటాడు. అంచేత ఈ బాపతు నాయకుడు విప్లవానికి వీసమెత్తు సాయం చేయడు. తన ద్విపాత్ర పోషణను, ద్వంద్వ నటనను వదిలించుకోవడం ద్వారా మాత్రమే, ప్రజల పక్షాన వుండాలని తిరుగులేకుండా తీర్మానించుకున్నప్పుడే (ఆ రకంగా జనాకర్షకం వదిలించుకుని) అతను టక్కుటమార విద్యలను వదులుకుంటున్నట్టు, విప్లవాత్మక నిర్మాణం కోసం తనని అర్పితం చేసుకుంటున్నట్టు చెప్పాలి. ఈ దశలో అతను ప్రజలకీ కులీనులకీ మధ్య వారధిగా వుండడు, కులీనులకు వైరుధ్యంగా తయారవుతాడు. దాంతో వెంటనే వారు అతన్ని తొక్కి పెట్టడానికి చేతులు కలుపుతారు. ప్రభుత్వాధినేతగా ఆఖరిపాదంలో, మే దినోత్సవ ఉత్సవాలు జరిగినప్పుడు, గె టూలియో వర్గాస్,[26] నాటకీయంగా, నీళ్ళు నమలని రీతిలో చెప్పిన మాటలు గమనించండి:

"నా ప్రభుత్వం ఒక బ్రహ్మాండమైన పునర్నిర్మాణ కార్యక్రమాన్ని అమలు జరపబోతోంది, కార్మికుల నిత్య, స్థిర సహకారం లేకుండా దాన్ని విజయవంతం చేయలేమని మీకు తెలియచేసుకుంటున్నాను."[27]

అప్పుడు వర్గాస్ తమ అధికారంలో వున్న మొదటి తొంభై రోజుల గురించీ చెప్పాడు అది "అక్కడా ఇక్కడా ఎదురవుతూ వున్న కష్టాల, అవరోధాల కాలం. ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా ప్రతిపక్షం వాటిని ఎగసన దోస్తోంది" అని చెప్పాడు. ఆయన

ప్రజలతో నేరుగా మాట్లాడాడు. తన "నిస్సహాయత్వం, జీవన ప్రమాణ వ్యయం, తక్కువ జీతాలు.. నిర్భాగ్యుల అసహాయత, మంచి కాలం ముందు రాదా అన్న ఆశతో జీవించే అధిక సంఖ్యాకుల కోరికలు" వగైరాల గురించి మాట్లాడాడు."

కార్మికులకు ఆయన చేసిన విజ్ఞప్తిలో మరింత నిష్పాక్షిక ధ్వని వుంది.

"ఈ క్షణంలో ప్రజల ఆర్థిక వ్యవస్థను సమర్థించడానికి, తక్షణ చర్యలు తీసుకునేందుకు తగ్గ నిర్దిష్ట పరికరాలుగాని, చట్టాలుగాని పాలనా యంత్రాంగం దగ్గర లేవు అని మీకు తెలియచేసుకుంటున్నాను. ఆ రకంగా ప్రజలు నిర్మాణయుతం కావడం అవసరం. తమ ప్రయోజనాల్ని కాపాడుకోవడానికేకాదు, ప్రభుత్వం తన లక్ష్యాలని అమలుపరచడానికి అవసరం అయిన పునాది తోడ్పాటుని అందించడానికి కూడా... నాకు మీ ఐక్యత కావాలి. నాతో సంఘీభావంగా, మీరు యూనియన్లలో మిమ్మల్ని వ్యవస్థీకరించుకోవాలి అని తెలియచేసుకుంటున్నాను. మీరంతా ప్రభుత్వం వెనకదన్నుగా నిలబడడానికి పటుతరంగా, సుసంఘటిత బృందంగా వుండాలని కోరుతున్నాను. అపుడు ప్రభుత్వం సమస్యల్ని పరిష్కరిస్తుంది. నాకు మీ ఐక్యత అవసరం. ఆ విధంగా విధ్వంసకులకు వ్యతిరేకంగా పోరాడగలం. అప్పుడే మీరు చట్టా వ్యాపారుల, బకాసుర రాక్షసుల పాలబడకుండా వుంటారు, ప్రజల ప్రయోజనాలకు విరుద్ధమైన వాటి పాలబడకుండా వుంటారు.... కార్మికులకు విజ్ఞప్తి చేయవలసిన సమయం వచ్చింది. మీ యూనియన్లలో స్వేచ్ఛాయుత, సంఘటిత శక్తులుగా ఏకంకండి... ఈ ప్రస్తుత సమయంలో శ్రామిక జన ఆర్గనైజేషన్ల వత్తాసు లేకుండా సామాజిక లక్ష్యాన్ని సాధించడంగాని, మనుగడ కొనసాగించడంగాని ఏ ప్రభుత్వానికీ సాధ్యంకాదు.[28]

మొత్తం మీద తేల్చి చెప్పుకోవాల్సింది ఏమిటంటే ప్రజలు ఐక్యం అయి తమ హక్కుల పరిరక్షణ కోసం సంఘటితం కావాలని వర్గాస్ చాలా తీవ్రంగా పిలుపు ఇచ్చాడు. ఒక ప్రభుత్వాధినేతగా, దారిలో వున్న అవరోధాల గురించీ, ఆటంకాల గురించీ ప్రజలకు చెప్పాడు. వాళ్ళతో కలిసి పాలన సాగించడానికి వున్న అసంఖ్యాక కష్టాల గురించి చెప్పాడు. ఆ క్షణం నుంచీ ఆయన ప్రభుత్వానికి కష్టాలు పెరుగుతూ వచ్చాయి. చివరకి 1954 ఆగస్టులో విషాదస్థితి అంచుకు తీసుకుపోయాయి. వర్గాస్ గనక ప్రజలతో సంఘటితత్వాన్ని బహిరంగంగా సమర్థిస్తూ ఆఖరి రోజుల్లో చెప్పకుండా వున్నట్లయితే గనక, జాతీయ ప్రయోజనాల కోసం ఆ తర్వాత అనేక చర్యలు తీసుకోకుండా వున్నట్లయితేగనక, ప్రతీఘాత కులీనులు తాము తీసుకున్న చర్యల్లాంటి వాటిని తీసుకుని వుండరు.

ఏ జనాకర్షక నాయకుడేనా గానీ (ఎంత ఆచి తూచి అయినా) ప్రజల వైపు నడిచే దారిలో ఏ మాత్రం వున్నాగానీ, వారధిగా వుండే సంపన్నులు లేకుండా సాగినట్లయితే గనక – వీళ్ళు అతన్ని నొక్కేస్తారు, వాళ్ళకి గనక అగ్గడించేందుకు తగ్గ శక్తివుంటే కాని నాయకుడు తనని పైతృకత ప్రాపకానికి పరిమితం చేసుకున్నంత కాలం, సాంఘిక సంక్షేమ కార్యక్రమాలకు పరిమితం చేసుకున్నంత కాలం, ఏదో అడపాదడపా అతనికీ, సంపన్న వర్గాలకీ మధ్య గొణుగుడులూ మూలుగులూ వున్నా, తాడు తెగిపోయేటంత భేధాభిప్రాయాలు రావడం అరుదు. సంక్షేమ కార్యక్రమాలు టక్కుటమార విద్యల్లో పరికరాలే, చివరికి లోబరుచుకోవడం అన్న లక్ష్యానికి దోహదపడేవే. అవి అచేతన వైపు నడిపిస్తాయి, ప్రజలని వాళ్ళ సమస్యల అసలు కారణాల నుంచి మళ్ళిస్తాయి, ఆ సమస్యలని కచ్చితంగా పరిష్కరించడం నుంచి మళ్లిస్తాయి. అవి పీడితుల్ని వ్యక్తుల బృందాలుగా చీలుస్తాయి. ఏదో కాకి బావనోట్లోంచి జారిపడ్డ మాంసం ముక్క దొరక్కపోతుందా తమకి అన్న ఆశ కలిగిస్తాయి. అయితే ఈ సన్నివేశంలో ఓ కాంతిరేఖ మెరుపు లేకపోలేదు: సాయం అందుకున్న వ్యక్తులు ఇంకా ఇంకా కోరుకుంటారు. ఏ సాయమూ అందనివాళ్ళు ఆ అందుకున్నవాళ్ళని చూసి, అసూయ పెంచుకుంటారు, తమకీ సాయం కోరుకుంటారు. పెత్తందారీ కులీనులు అందరికీ "సాయం" ఎలాగూ అందించలేరుకాబట్టి, పీడితుల అశాంతి అలా పెరుగుతూనే వుండడం సారాంశంగా తేలుతుంది.

ఈ టక్కుటమార విద్యల వైరుధ్యాన్ని విప్లవనాయకులు వాడుకోవాలి, పీడితులకు దాన్నొక సమస్యగా ముందు పెట్టాలి, వాళ్ళని వ్యవస్థీకరించేలక్ష్యంతో ఆ పని సాగాలి.

## సాంస్కృతిక దురాక్రమణ

సంభాషణ వ్యతిరేక కార్యాచరణ సిద్ధాంతంలో ఒక మౌలిక లక్షణం వుంది: సాంస్కృతికపరమైన దాడి. ఇదీ విభజన ఎత్తుగడల్లాగా, టక్కుటమార విద్యల్లాగా లోబరుచుకోవడమనే లక్ష్యానికే సాయపడుతుంది. ఈ పరిణామంలో దురాక్రమణదారుల మరొక బృందపు సాంస్కృతిక నేపథ్యంలోకి చొచ్చుకుపోతారు, ఆ బృందపు అభివృద్ధి అవకాశాలని తుంగలో తొక్కుతారు. ప్రపంచం గురించి తమకు వున్న భావాలనే వాళ్ళ మీద రుద్దుతారు. దురాక్రమణకు గురైనవాళ్ళ నోరునొక్కేసి వాళ్ళ సృజనాత్మకతకు గిరి గీస్తారు.

నాగరికంగా వున్నా, ముతగ్గా వున్నా సాంస్కృతిక దురాక్రమణ ఎప్పుడూ హింసాత్మక చర్యే అవుతుంది. అది దురాక్రమణకు గురైన సంస్కృతిని పీడిస్తుంది.

వాళ్ళు పాపం, తమ పునాదులు ఎక్కడ వుండేవో తెలియకుండాపోతారు. లేదా, ఆ ప్రమాదాన్ని ఎదుర్కొంటారు. సాంస్కృతిక దాడిలో (అన్ని సంభాషణ వ్యతిరేక చర్యల ప్రణాళికల్లో మాదిరి) ఈ క్రమంలో దురాక్రమణదారులే స్క్రీన్‌ప్లే రచయితలు, నటులు. వాళ్ళ దాడికి గురైనవాళ్ళు దాన్ని అనుభవించేవాళ్ళు. దురాక్రమణదార్లు మూస పోస్తారు. అందుకు గురైనవాళ్ళు ఆ మూసలో పోత పోసుకొంటారు. దురాక్రమణదార్లు ఎంపిక చేసుకుంటారు. అందుకు గురైనవాళ్ళు ఆ దారిలో నడుస్తారు. లేదా, నడవాల్సి వుంటుంది. దురాక్రమణదార్లు నటిస్తారు. దురాక్రమణకు గురైనవాళ్ళకు నటిస్తున్నామన్న భ్రమ మిగులుతుంది. అదీ దురాక్రమణ చర్యల ద్వారా.

పెత్తందారీతనంలో దురాక్రమణ అంతర్భాగంగా వుంది. కొన్ని సమయాల్లో భౌతికంగా, పైకి తెలిసేటట్టు వుంటుంది. కొన్ని సమయాల్లో ముసుగు కప్పి వుంటుంది. దురాక్రమణదారుడు సాయం అందించే మిత్రుడి పాత్ర పోషిస్తూ వుంటాడన్నమాట! చివరికి తేలేది దురాక్రమణ అనేది ఆర్థిక, సాంస్కృతిక పెత్తందారీతనం రూపం అని. దురాక్రమణను ఒక ప్రపంచ నాగరిక పట్టణ సమాజం, పరాధీన సమాజంపై సాగించవచ్చు. లేదా, అదే సమాజంలో ఒక వర్గం మీద మరో వర్గం పెత్తనం చెలాయించడంలో గర్భితమై వుండచ్చు.

సాంస్కృతికంగా లోబరుచుకోవడం జరిగినప్పుడు, ఆ దాడికి గురైనవాళ్ళ సాంస్కృతిక ప్రామాణికత్వం పోతుంది, వాళ్ళు దురాక్రమణదార్ల విలువలకు, ప్రమాణాలకు, లక్ష్యాలకు ప్రతిస్పందించడం మొదలవుతుంది. దురాక్రమణదార్లకు పెత్తనం చేయాలన్న కాంక్ష వుంటుంది, తమ జీవిత విధానాలకు అనుగుణంగా వుండేట్టు ఇతరుల్ని మూస పోసుకోవాలని వుంటుంది, దురాక్రమణకు గురైనవాళ్ళు యధార్థ పరిస్థితిని గురించి ఎలా అవగతం చేసుకున్నారో తెలుసుకోవాలని వుంటుంది – ఇదంతా ఎందుకూ అంటే, మరింతగా తొక్కిపెట్టి వుంచడానికి.[29] సాంస్కృతిక దురాక్రమణలో మరీ ముఖ్యమైన సంగతి ఇంకోటి వుంది. దురాక్రమణకు గురైనవాళ్ళు తమ యధార్థ పరిస్థితిని తమ దృష్టి నుంచిగాక, దురాక్రమణదారుడి దృష్టి నుంచే చూస్తారు. తమ మీద దాడి చేసినవాళ్ళని ఎంతలా వీళ్ళు అనుకరిస్తే అంతలా ఆ మహానుభావుల స్థానం చెక్కుచెదరకుండా వుంటుంది.

సాంస్కృతిక దురాక్రమణ నెగ్గుకు రావాలీ అంటే, దురాక్రమణకు గురైనవాళ్ళు తాము జన్మతః వాజమ్మలమని అనుకుని తీరాలి. ప్రతిదానికీ దాని ప్రతిద్వంద్వి వుంటుంది కదా? దురాక్రమణకు గురైనవాళ్ళు తాము వాజమ్మలమని నమ్మితే, దురాక్రమణదార్ల

ఆధిక్యాన్ని ఒప్పుకోవడమూ అవసరమే. ఆ రకంగా దురాక్రమణ చేసినవాళ్ళ విలువలు, అందుకు గురైనవాళ్ళకు నమూనా అవుతాయి. దురాక్రమణ ఎంత కోరలు పదునెక్కి, ఎంతలా దురాక్రమణకు గురైనవాళ్ళు తమ సంస్కృతి ఆత్మకు దూరం అవుతారో, అంతలా దురాక్రమణదార్లు పెట్టిన నమూనాకు వాళ్ళు లొంగిపోతారు– వాళ్ళలాగే నడవడం, వాళ్ళలా వేషధారణ చేసుకోవడం, వాళ్ళలా మాట్లాడ్డం జరుగుతుంది.

ప్రతి సామాజిక "నేను" లాగానే, దురాక్రమణకు గురైన వ్యక్తి సామాజిక "నేను" కూడా సాంఘిక నిర్మాణాల సామాజిక–సాంస్కృతిక సంబంధాల్లో రూపొందుతుంది. అంచేత దురాక్రమణకు గురైన సంస్కృతిలోని ద్వంద్వత్వాన్ని ప్రతిఫలింపచేస్తుంది. ఈ ద్వంద్వం (దీన్ని గురించి లోగడ వివరించుకున్నాం) దురాక్రమణకు గురై, పెత్తనానికి ఒదిగిపోయిన వ్యక్తులు, వాళ్ళ మనుగడలోని ఒక స్థితిలో, దాదాపు పీడకుడి "నువ్వు" అనేదానికి ఎలా "అతుక్కు"పోతారో తెలియచేస్తుంది. పీడితుడి "నేను", పీడకుడి "నువ్వు"కు దాదాపు అంటకపరచుకుపోవడం విచ్ఛిన్నం కావాలి. అతన్నుంచి వెనక్కి ముడుచుకుపోవాలి. అప్పుడే అతన్ని మరింత నిష్పాక్షికంగా చూడగలుగుతాడు. ఆ దశలోనే వ్యక్తి పీడకుడితో వైరుధ్యంతో వున్నట్టు విమర్శనాత్మకంగా గుర్తిస్తాడు. ఆ పరిస్థితిలోనే తనని పీడించే నిర్మాణం ఎలా వుందోదాని అమానవీకరణ యదార్థ పరిస్థితిని "పరిశీ"లిస్తాడు. ప్రపంచాన్ని గురించిన అవగాహనలో ఈ గుణాత్మకమైన మార్పు ఆలోచనాయుత కార్యాచరణనుంచే వస్తుంది.

సాంస్కృతిక దురాక్రమణ అనేది ఒకపక్క పెత్తందారీతనానికి పనిముట్టు; మరోపక్క, పెత్తందారీతనపు ఫలితం. ఆ రకంగా పెత్తందారీ లక్షణాలుగల సాంస్కృతిక కార్యాచరణ (ఇతర సంభాషణ వ్యతిరేక కార్యకలాపాల రూపాలలాగానే) పథకం ప్రకారం నడిపిస్తుంది. మరో రకంగా చెప్పాలంటే అది పీడక యదార్థపరిస్థితి నుంచీ ఉత్పన్నమవుతుంది.

ఉదాహరణకు బిగిసిపోయిన పీడక సామాజిక నిర్మాణం వుంది. ఇది అనివార్యంగా పిల్లల పెంపకం మీదా, విద్య మీదా ఆ నిర్మాణంలోపల నుంచే ప్రభావం కలిగిస్తుంది. ఈ వ్యవస్థలు ఆ నిర్మాణ శైలిలోనే తమ కార్యాచరణను రూపొందించుకుంటాయి, ఆ నిర్మాణం తాలూకు కట్టుకథల్ని, కల్పనల్ని కిందికి రవాణా చేస్తాయి. ఇళ్ళు, బళ్ళు (నర్సరీల నుంచి విశ్వవిద్యాలయాలదాకా) ఏదో నిరాకార నిరంజన నిర్గుణ సన్నివేశాల్లా ఏమాత్రం వుండవు. దేశకాల పరిమితులకు లోబడే వుంటాయి. ఆధిపత్య నిర్మాణాల గీతల్లోనే అవి పని చేస్తాయి. ఎక్కువగా వాటి ఏజెన్సీలుగా వుంటాయి. భవిష్యత్తు దురాక్రమణదారుల్ని మూస పోస్తాయి.

ఇంట్లో తల్లిదండ్రులకీ పిల్లలకీ మధ్య వున్న సంబంధాలు చూద్దాం: ఈ సంబంధాలు మామూలుగా చుట్టూతా వున్న సాంఘిక నిర్మాణంలో కనిపించే వస్తుగత సాంస్కృతిక పరిస్థితుల్నే ప్రతిఫలింపచేస్తూ వుంటాయి. ఇంట్లోకి చొచ్చుకువచ్చే పరిస్థితులు దాష్టీకంతో, బిగిసిసోయి పెత్తందారీ తనంతో వుంటే– ఆ ఇల్లు పీడన పరిస్థితిని హెచ్చు చేస్తోందన్నమాట![30] తల్లిదండ్రులకీ పిల్లలకీ మధ్య ఇలా శాసించే సంబంధాలు తీవ్రం అయితే, పిల్లలు శైశవంలోనే పైతృక దాష్టీకాన్ని అంతరంగంలో పెట్టుకుంటారు.

ఎరిక్ ఫ్రామ్ (తనకు మామూలుగా వుండే స్పష్టతతో) మృత్యనురాగాన్ని, జీవానురాగాన్ని వివరిస్తూ, ఇందులో ఒకోటి ఏయే పరిస్థితుల్లో ఉత్పన్నం అవుతుందో విశ్లేషిస్తాడు. యింట్లోనా (తల్లిదండ్రుల పిల్లల సంబంధాలు, దాష్టీకం, అంటీ ముట్టనితనం వున్న పరిస్థితుల్లో ఎలా వుంటాయి, ప్రేమానురాగాలు, స్వేచ్ఛాయుత వాతావరణం వున్న పరిస్థితుల్లో ఎలా వుంటాయి) లేదా సాంఘిక సాంస్కృతిక సందర్భంలోనా అని విశ్లేషించాడు. ప్రేమ లుప్తమై, కర్కశత్వం చెలరేగే వాతావరణంలో పెరిగిన పిల్లలు, శక్తియుక్తులు ఉడిగిపోయిన పిల్లలు, యవ్వనంలో పట్టుగా తిరుగుబాటు పథం మీద నడవలేరు. వాళ్ళు ఒట్టి ఉదాసీన పరిస్థితికైనా పోతారు, లేదా, యదార్థ పరిస్థితి నుంచి దూరమైనా అవుతారు. అధికార దర్పాలు, అవి రూపొందించిన కల్పనలు వాళ్ళని పరాయీకరణం చెందిస్తాయి. లేదా వాళ్ళు విధ్వంసకర చర్యల్లో పడవచ్చు.

ఇంట్లో వున్న ఈ వాతావరణమే బళ్ళోనూ కొనసాగుతుంది. అక్కడ కూడా (ఇంట్లో మాదిరే)తమకి ఏ తృప్తి అన్నా కలగాలంటే పైనుంచి ఒరవడిపెట్టిన నీతివాక్యాలు పాటించాలని త్వరలోనే గ్రహిస్తారు. 'ఆలోచించకు' అనేది వీటిల్లో వుండే ఒక సూత్రం.

బడి యిలా బిగించేసిన పైతృక అధికార కర్కశ సంబంధ నిర్మాణం అంతరంగంలో చొరబడుతుంది. అప్పుడా పసివాళ్ళు (ఈ సంబంధాలు గొట్టంపెట్టి నోట్లోపోసిన స్వేచ్ఛాభీతి) వాళ్ళకి తప్పుదారిలో నేర్పిన విద్యను బట్టి ఆ కర్కశధోరణుల్ని వృత్తిపరంగా అమలు చేయడంలో ఆరితేరతారు. ఈ పరిణామం, వాళ్ళ వర్గస్థాయిని బట్టి, ఎందుకు ఎంతమంది వృత్తి నిపుణులు సంభాషణ వ్యతిరేక కార్యాచరణకు దిగుతున్నారా అన్న విషయాన్ని వివరిస్తుంది.[31] వాళ్ళని ప్రజల సమక్షంలోకి తెచ్చే ప్రత్యేకత ఏదన్నా కానీయండి, ప్రజలకి తమ జ్ఞానాన్ని, నైపుణ్యాల్ని "అందించడం" తమ జీవిత కర్తవ్యం అని వాళ్ళ అచంచల విశ్వాసం. వాళ్ళు తమను ప్రజల 'ప్రోత్సాహకులు"గా భావించుకుంటారు. వాళ్ళ కార్యాచరణ ప్రణాళికల్లో (ఏ గట్టి పీడక కార్యాచరణ సిద్ధాంతకారుడైనా అలాంటివాటిని రూపొందించవచ్చు) వాళ్ళ లక్ష్యాలే వుంటాయి, వాళ్ళ

నమ్మకాలే వుంటాయి. వాళ్ళ వ్యాపకాలే వుంటాయి. వాళ్ళకి ప్రజలు చెప్పేవి చెవుల పడవు. కాని "అల్పిష్టి అభివృద్ధిని సృష్టించే సోమరితనాన్ని వదిలించుకొమ్మని బోధ చేస్తూ వుంటారు. ప్రజల దృష్టిలో వుండే "ప్రపంచ దృక్పథం" గౌరవించవలసిన అంశమంటే ఈ వృత్తినిపుణులకు అసంబద్ధంగా కనిపిస్తుంది. "ప్రపంచం దృక్పథం" వున్నవాళ్ళం తామేనని వాళ్ళ భావన. విద్యావిధానంలో కార్యక్రమ వస్తువును వ్యవస్థీకరించేటప్పుడు ప్రజల్ని సంప్రదించాల్సిన అవసరం వుందన్నదీ వీళ్ళ దృష్టిలో ఇంతే అసంబద్ధం. ప్రజల అజ్ఞానం లోతులు ఎంతటివీ అంటే, వాళ్ళు తాము చెప్పేది కళ్ళకద్దుకుని నెత్తిమీద పెట్టుకోవడం తప్ప మరెందుకూ పనికిరారు అన్నది వీళ్ళ అభిప్రాయం.

అయితే, లోబడి లొంగిపోయినవాళ్ళు తమ జీవితానుభవంలో, ఏదో ఒక దశలో, ఆ దురాక్రమణను ఏదో రకంగా తిరస్కరించే స్థితి వస్తుంది. (ఆ దురాక్రమణకు వాళ్ళు అంతకుముందు తల వూపారు). అప్పుడే వృత్తినిపుణులు, తమ వైఫల్యాన్ని కప్పుకునేందుకు మరోలా వాదిస్తారు. ఈ లొంగిపోయినవాళ్ళు "అల్పిష్టి" మనుషులు. వాళ్ళు "కృతఘ్నులు", "కొత్తదారులు లేనివాళ్ళు" "రుణగ్రస్తులు" లేదా "సంకరసరుకు" అని అంటారు.

మరికొంతమంది సద్భావనాశీలురైన వృత్తినిపుణులున్నారు. (వాళ్ళు దురాక్రమణను ఒక భావజాలంగా కాక, తమ పెంపకం వ్యక్తీకరణగానే వాడతారు) తమ విద్యాపర వైఫల్యాలు, సాదాసీదా జనుల జన్మతః సంక్రమించిన న్యూనతగా కాక, తమ దురాక్రమణ చర్య ఫలితమైన హింసవల్లనే వచ్చిందని చూస్తారు. ఈ విషయం తెలిసినవాళ్ళు కష్టభూయిష్టమైన ప్రత్యామ్నాయాన్ని ఆవిష్కరించుకుంటారు: దురాక్రమణను త్యజించవలసిన అవసరం వుంది; కాని పెత్తందారీ ధోరణులు ఎంతలా వాళ్ళల్లో చొచ్చుకుపోయి వున్నాయీ అంటే, ఈ త్యజింపు వాళ్ళ గుర్తింపులకే ముప్పు కలిగిస్తుంది. దురాక్రమణను త్యజించడం అంటే అణగదొక్కేవాళ్ళుగా, అణచివేతకు గురైనవాళ్ళుగా తమ ద్వంద్వ హోదాకి స్వస్తి పలకడమే. అంటే, వాళ్ళకి పుష్టినిచ్చిన అన్ని కల్పనలనీ త్యజించడం, మూర్తిమంతమైన సంభాషణాత్మక కార్యాచరణను ప్రారంభించడం. ఈ కారణంగా ఇది "పైనో" లేదా "లోపలో" (పరాయివాళ్ళల్లాగా) కాకుండా పోవడం వాళ్ళతో (సహచరుల్లాగా) వుండడం అవుతుంది. అంచేత స్వేచ్ఛాభీతి వీళ్ళని పట్టుకుంటుంది. ఈ వంకరటింకర క్రమంలో, వాళ్ళు అనేక దాటవేతలతో తమ భయాల్ని హేతుబద్ధం చేసుకోచూస్తారు.

తమ కార్యాచరణల దురాక్రమణ స్వభావాన్ని ఇంకా గమనించని వృత్తినిపుణులలో స్వేచ్ఛాభీతి మరింత ఎక్కువ, తాము చేసే పని అమానవీకరణం అని

వాళ్ళకి చెపుతారు. నిర్దిష్ట సన్నివేశాల్లో సంకేత చిహ్నాలని వివరించుకునేటప్పుడు శిక్షణా భాగస్వాములు, సమన్వయకర్తను చిరాగ్గా ఎక్కువసార్లు అడుగుతూ వుంటారు, "ఇంతకీ మమ్మల్ని ఎటు లాక్కుపోతున్నారు?" అని. సమన్వయ కర్త వాళ్ళని ఎటూ "తీసుకు" పోవడంలేదు. నిర్దిష్ట సన్నివేశంలో ఒక సమస్యగా దాన్ని ఎదుర్కొన్నప్పుడు భాగస్వాములే గుర్తించ నారంభించేరన్నమాట! ఆ విశ్లేషణ ఇంక ఏమాత్రం ముందుకు వెళ్ళినా తమకి అందించిన కల్పనాగాథల్ని తప్పించుకోనైనా తప్పించుకోవాలి. లేదా, ధృవపరచుకోవాలి అని. తమని పట్టుకున్న కల్పితగాథల్ని తప్పించుకోవడం అంటే ఆ క్షణంలో ఆత్మహింసా చర్య అవుతుంది. మరో పక్క వాటిని ధ్రువపరచుకోవడం అంటే, తమని తాము వెల్లడి చేసుకోవడం అవుతుంది. ఇక బయటపడేందుకు వున్న మార్గమల్లా (ఆత్మ సమర్థనకు వాటంగా వుంటుంది ఇది) సమన్వయ కర్త మీదకు, తాము మామూలుగా పాటించే పద్ధతుల్ని మళ్ళించడం: నడిపించడం, జయించడం, దురాక్రమణ చేయడం.[32]

నిర్దిష్ట పీడక సన్నివేశంలోనూ, దయా దాతృత్వాలవల్ల మెతకబారిన సందర్భంలోనూ పడ్డ మనుషుల్లోనూ ఇదే తిరోగమనం తక్కువ స్థాయిలోనే అయినా కనిపిస్తుంది. పూర్ణబృందాలు[33] అనేవి న్యూయార్క్ నగరంలో విద్యా కార్యక్రమాలు కొనసాగించాయి. సమన్వయకర్త రాబర్ట్ ఫాక్స్. ఆ బృందంలో వున్న ఒక ఉపాధ్యాయుడు ఈ సంఘటన గురించి చెప్పారు. న్యూయార్క్ నగరంలో మురికి బస్తీలో(ghetto) వీధి చివర వున్న చెత్తకుప్పని సూచించే సన్నివేశాన్ని సంకేతం చేసి ఓ బృందానికి చూపిస్తూ వున్నారు – చిత్రంగా ఆ బృందం సమావేశం అవుతూ వున్నది అదే వీధిలోనే ఆ బృందంలో వున్న ఒకతను వెంటనే ఏమన్నాడంటే "ఆఫ్రికాలోనో, లాటిన్ అమెరికాలోనో వున్న వీధి నాకు అగుపిస్తోంది" అని. "న్యూయార్క్‌లో ఎందుకు కాకూడదు?" అన్న ప్రశ్న టీచర్ వేశాడు. "ఎందుకంటే, మనం వున్నది అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో, అలాంటిది ఇక్కడ జరడానికి వీల్లేదు." ఇతనూ, ఇతని సహచరులూ వాళ్ళకి అంత కష్టం కలిగిస్తూ వుండే యదార్థం నుంచి వెనక్కి మళ్ళుతున్నారని చెప్పడానికి అనుమానమే అక్కర్లేదు, అసలా యదార్థం అంత కంపరం కలిగించేదని ఒప్పుకోవడం కూడా లేదు. ఏదో విజయాలు సాధించామనీ, వ్యక్తిగత విజయాలు మూట కట్టుకుంటామనీ చాటుకునే సంస్కృతిలో చిక్కుకుపోయి పరాయీకరణ చెందిన వ్యక్తులకు ఆ పరిస్థితిని వున్నదున్నట్టుగా ఒప్పుకోవడం కూడా తన విజయావకాశాలకి అడ్డకట్ట పడినట్టే ననిపింపచేస్తుంది.

ఇప్పుడు చెప్పుకున్న ఈ ఉదాహరణలో, వృత్తినిపుణుల విషయంలో కల్పనల సంస్కృతిని నిర్ణయించే శక్తి వుంటుందని తెలుస్తుంది. మనుషుల్లో ఆ కల్పనలు తరువాత

అంతర్గతం అవుతాయి అన్నది స్పష్టం. ఈ రెండు సందర్భాల్లోనూ కూడా, ఆధిపత్య వర్గ సంస్కృతి, నిర్ణయాలు తీసుకునే మనుషుల నిశ్చయార్థకతను అడ్డగిస్తుంది. న్యూయార్క్ నగరపు మురికివాడల్లో చర్చిల్లో పాల్గొంటున్న వాళ్ళుగాని, వృత్తినిపుణులుగాని ఒక చారిత్రక క్రమ క్రియాశీల కార్యకర్తలుగా తమకిగా తాము మాట్లాడటమూ లేదు, ఆచరించడమూ లేదు. వీళ్ళల్లో ఎవళ్ళూ పెత్తందారీ సిద్ధాంతవేత్తలుగాని, భావజాల నిర్మాతలుగాని కారు. అందుకు విరుద్ధంగా వాళ్ళు దాని ఫలితాలు, మళ్ళీ అటు పెత్తందారీ తనానికి కారణాలూ అవుతున్నారు. విప్లవం అధికారంలోకి వచ్చాక ఎదుర్కోవాల్సిన తీవ్ర సమస్యల్లో ఇదొకటి. ఈ దశలో కావాల్సింది రాజకీయ వివేచన, నిర్ణాయకత, నాయకత్వ సాహసం. ఆ నాయకులు ఇందుగ్గాను అహేతుక పాక్షిక స్థానాల్లో పడిపోకుండా వుండేందుకు తగినంత యుక్తాయుక్త విచక్షణ జ్ఞానంతో వుండాలి.

ఏ వృత్తి నైపుణ్యానికి చెందిన స్త్రీ, పురుషులైనా, విశ్వవిద్యాలయ పట్టభద్రులైనా కాకపోయినా, "పైనుంచి నిర్ణీతం"[34] అయిన వ్యక్తులు. పెత్తందారీ సంస్కృతి వాళ్ళని అలా నిర్ణయించింది. ద్వంద్వ జీవులుగా చేసింది. (వాళ్ళు కింది తరగతుల నుంచి వచ్చినట్టయితే, ఈ దుర్విద్య ఇదేగా వుండేది, ఇంకా అధ్వానం కాకపోయినా). అయితే, ఈ వృత్తి నిపుణులు, నవ సమాజ నిర్మాణానికి అవసరం. వాళ్ళల్లో చాలా మంది – "స్వేచ్ఛ అంటే భయపడినా, మానవీకరణ కార్యాచరణలో నిమగ్నం కాకపోయినా – నిజానికి మరే ఇతరమైనదానికన్నా పక్కదారిలోపడినవాళ్ళు, విప్లవం వాళ్ళని తిరిగి రాబట్టుకోగలగాలి, రప్పించుకుతీరాలి.

ఇలా వెనక్కి రప్పించుకోవడానికి విప్లవనాయకులు, లోగడ సంభాషణాత్మక సాంస్కృతిక కార్యాచరణగా వున్నదాన్నుంచి ముందుకు సాగుతూ, "సాంస్కృతిక విప్లవాని"కి శ్రీకారం చుట్టాలి. ఈ దశలో విప్లవాధికారం, మానవాళిని నాస్తీకరించ చూసేవాళ్ళ అవరోధాన్ని దాటి, కొత్త, సాహసోపేతమైన స్థానాన్ని పొందాలి. సమాజ పునర్‌నిర్మాణానికి భాగస్వాములు కాదలచుకున్న వాళ్ళందరికీ స్పష్టంగా స్వాగతం పలకాలి. ఈ అర్థంలో "సాంస్కృతిక విప్లవం" సంభాషణాత్మక సాంస్కృతిక చర్యకు అవసరం అయిన కొనసాగింపు. దీన్ని విప్లవం అధికారంలోకి రాకముందే జరిపించాలి.

"సాంస్కృతిక విప్లవం"లో పునర్ నిర్మించాల్సింది యావత్ సమాజాన్నీ. అన్ని మానవ కార్యకలాపాల్ని కలుపుకొన్న సమాజం యావత్తూ దీని పునర్నిర్మాణ లక్ష్యంగా వుంటుంది. సమాజాన్ని యాంత్రికంగా పునర్నిర్మించలేం. విప్లవం ద్వారా పునస్సృష్టి అయిన సంస్కృతి పునర్నిర్మాణానికి మౌలిక పరికరంగా వుండాలి. సాంస్కృతిక విప్లవం

అనేది, "కాన్షైంటిజచావో" కోసం విప్లవ పరిపాలన వినియోగించే అత్యధిక యత్నం అని చెప్పాలి – అందరికీ ఇది అందాలి, వాళ్ళ వాళ్ళ సొంత మార్గాలు ఏమైనా గానీ.

ఫలితంగా 'కాన్షైంటిజచావో' కోసం ఈ ప్రయత్నం, దాన్ని కాంక్షించే నిపుణుల్ని సాంకేతికంగానో, శాస్త్రీయంగానో శిక్షణ ఇచ్చి తయారు చేసుకోవడంతో తృప్తిపడకూడదు. పాత సమాజం నుంచి గుణాత్మకంగా విలక్షణంగా వుంటుంది. నూతన సమాజం,[35] అది పాక్షికంగా కాదు, అనేక విధాలుగా వుంటుందని చెప్పాలి. సాంకేతిక పరిజ్ఞానానికి పాత సమాజం నిర్దేశించిన గమ్యాలనే విప్లవ సమాజమూ పెట్టుకోలేదు. ఆ రకంగా యీ రెండు సమాజాల్లోనూ ప్రజలకు ఇచ్చే శిక్షణ కూడా భిన్నంగా వుండాలి. సాంకేతిక, శాస్త్ర పరిజ్ఞాన శిక్షణలు మానవత్వ పూరిత విద్యకు శత్రువులు కావు. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం విప్లవ సమాజంలో శాశ్వత విమోచనకీ, మానవీకరణకీ సేవ చేస్తూ వున్నంతకాలం ఏ శత్రుత్వంతోనూ వుండవు.

ఈ దృష్ట్యా, ఏ వృత్తి కోసమైనా వ్యక్తులకు శిక్షణ నిచ్చేటప్పుడు(అందరు వ్యక్తులూ దేశ కాల మాన పరిస్థితుల్లోనే వుంటారు గనక) ఈ అవగాహన అవసరం అవుతుంది: (అ) విప్లవకర పరివర్తన చెందే ఉపనిర్మాణంలో సజీవంగా[36] గత "అవశేషాలు" వున్న ఉపరి నిర్మాణంగా సంస్కృతి (ఆ) ఆ వృత్తే తనకిగా సంస్కృతీ పరివర్తన పరికరం. సాంస్కృతిక విప్లవం నూతన సమాజ నిర్మాణానికి సృజనాత్మక ఆచరణలో "కాన్షైంటిజచావో"ని గాఢతరం చేస్తూ వుంటే, పాత కల్పనాగాథల అవశేషాలు నూతన సమాజంలో ఎందుకు వున్నదీ ప్రజలు గ్రహించ నారంభిస్తారు. అప్పుడు వాళ్ళు ఈ భూతాల నుంచి విముక్తులవగలుగుతారు. ఈ భూతాలు నూతన సమాజ భవన నిర్మాణాన్ని అడ్డగిస్తూనే వున్నాయి. ప్రతి విప్లవానికీ పెద్ద గుదిబండలుగానే ఎప్పుడూ వున్నాయి, పెను సమస్యలుగానే వున్నాయి. సాంస్కృతిక అవశేషాల ద్వారా పీడక సమాజ దురాక్రమణను సాగిస్తూనే వుంటుంది – ఈసారి ఈ దాడి విప్లవ సమాజం మీదనే వుంటుంది.

ఈ దురాక్రమణ మరీ దారుణం. ఎందుకంటే పెత్తందారీ కులీనులుగా గుర్తించినవాళ్ళు కాదు దాన్ని జరిపించేవాళ్ళు, విప్లవంలో పాలు పంచుకున్నవాళ్ళే! పీడకుణ్ణి తమలో "గూడు" కట్టించుకుని విప్లవం తీసుకోవాల్సిన మరిన్ని చర్యల్ని పీడకులంతగానూ అడ్డగించడం జరుగుతుంది. ద్వంద్వ స్వభావం వున్న వాళ్ళు (ఆ అవశేషాలనే) అధికారాన్ని అంగీకరిస్తారు. నిరంకుశ అధికార పెత్తనాన్ని ఆమోదిస్తారు. అది వాళ్ళని తీవ్రంగా అణగదొక్కుతుంది. ఈ తీవ్ర అధికార అణచివేత ఆల్థూసర్ చెప్పినట్టు "పాత శక్తులు

తిరిగి పుంజుకోవడం"[37] అన్నమాట. నూతన సమాజంలో ప్రత్యేక పరిస్థితులు అనుమతించిన ప్రతిసారీ ఇలా జరుగుతుంది.

ఈ కారణాలన్నింటినిబట్టీ నేను విప్లవ క్రమాన్ని సంభాషణాత్మక సాంస్కృతిక కార్యాచరణగా వ్యాఖ్యానిస్తున్నాను, ఇది "సాంస్కృతిక విప్లవం"లో కొనసాగుతుంది, అధికారం దక్కేక కూడా రెండు దశల్లోనూ "కాన్షైంటిజచావో" కోసం మనో వాక్కాయ కర్మలా కృషి జరగాలి – దీని ద్వారానే ప్రజలు, అసలైన కార్యాచరణతో వస్తువుల స్థాయిని వదలుకుని చారిత్రక కర్తలుగా అవుతారు – అది అవసరం.

ఇక చివరిగా, సాంస్కృతిక విప్లవంవల్ల నాయకులకీ, ప్రజలకీ మధ్య శాశ్వత సంభాషణ అలవాటు అవుతుంది. ప్రజలు అధికారంలో పాలుపంచుకోవడం దృఢం అవుతుంది. ఈ రకంగా ప్రజలూ నాయకులూ విమర్శనాత్మక కార్యకలాపాన్ని కొనసాగిస్తారు. అప్పుడు విప్లవం తనను అధికార పెత్తనం ధోరణుల నుంచి తేలిగ్గా రక్షించుకుంటుంది (ఈ అధికార పెత్తన ధోరణుల నుంచి నూతన అణచివేత రూపాలు వస్తాయి). అలాగే "దురాక్రమణ" నుంచీ రక్షించుకుంటుంది (ఇది ఎప్పుడూ ఒకలాగే వుంటుంది). దురాక్రమణదారుడు – బూర్జువావర్గం వున్నప్పుడుగాని, విప్లవ సమాజంలోగాని – ఓ వ్యవసాయ శాస్త్రవేత్త కావచ్చు, సాంఘిక శాస్త్రవేత్త కావచ్చు, ఆర్థిక శాస్త్రవేత్త కావచ్చు, ప్రజారోగ్య ఇంజనీర్ కావచ్చు, ఓ పురోహితుడు కావచ్చు, పూజారి కావచ్చు, బోధకుడు కావచ్చు, సాంఘిక కార్యకర్త కావచ్చు – లేదా విప్లవకారుడూ అవచ్చు.

సాంస్కృతిక దురాక్రమణ లోబరుచుకునే లక్ష్యాలకి దోహదం చేస్తుంది. పీడనను సాకుతుంది. దీనికి ఎప్పుడూ యదార్థ పరిస్థితి గురించిన ప్రాంతీయ సంకుచిత దృక్పథమే వుంటుంది. ప్రపంచం గురించి స్థిరభావన వుంటుంది. ఒక ప్రపంచ దృక్పథాన్ని మరో దాని మీద రుద్దడం వుంటుంది. దురాక్రమణదారుడు "అధికుడు", దురాక్రమణకు గురైనవాడు "అల్పిష్టి". అలాగే మొదటివాళ్ళ విలువల్ని రెండవవాళ్ళ మీద రుద్దడం ఒకటి. లొంగదీసుకున్నవాళ్ళు తమ కబ్జానుంచి జారిపోతారేమోనన్న భయంతో వీళ్ళుంటారు.

దురాక్రమణకు గురైనవాళ్ళకి సంబంధించి కార్యాచరణ నిర్ణయాలు వాళ్ళ చేతిలో వుండవు, దురాక్రమణదార్ల చేతిలోనే వుంటాయి, ఇదీ సాంస్కృతిక దురాక్రమణలో ప్రధానాంశం. ఎవరు నిర్ణయించాలి అన్న విషయం నిర్ణయించే వారి చేతులలో లేనపుడు

దురాక్రమణకు గురైనవాళ్ళకి నిర్ణయాధికార భ్రమ మాత్రమే వుంటుంది. అందుకనే ద్వంద్వపూరిత, "ప్రతిబింబిత", దురాక్రమిత సమాజంలో సాంఘిక ఆర్థిక అభివృద్ధి వుండదు. అభివృద్ధి సాగడానికి అవసరం అయినవి : అ) అన్వేషకుడి చేతిలో నిర్ణయాధికారం వుండేటట్టు అన్వేషణ, సృజనాత్మక ఉద్యమం వుండడం. ఆ) ఈ ఉద్యమం ఆయా స్థల పరిమితమై వుండడమే కాదు, చైతన్యవంతుడైన అన్వేషకుడి జీవితకాలంలోనే జరగాలి.

ఆ రకంగా అభివృద్ధి యావత్తూ పరివర్తనే అయినా, పరివర్తన యావత్తూ అభివృద్ధి కాదు. మాటవరసకు విత్తనం వుంది. అన్నీ అనుకూలిస్తే అది మొలకెత్తుతుంది. మారాకు వేస్తుంది. ఇది పరివర్తన. దీన్ని అభివృద్ధి అనలేం. ఇదే మాదిరిగా జంతువులో సంభవించే పరివర్తన అభివృద్ధి అవదు. విత్తనాల పరివర్తనా, జంతువుల పరివర్తనా వాటి వాటి జాతుల్లో నిర్ధారణ అయిపోయి వున్నాయి. వాటికి సంబంధం లేకుండా ఆయా సమయాల్లో అవి జరిగిపోతాయి. కాని, కాలం అనేది మానవులకు సంబంధించింది.

అసంపూర్ణ జీవుల్లో స్త్రీ, పురుషులు మాత్రమే అభివృద్ధి చెందవలసినవాళ్ళు. చరిత్రతో స్వీయజీవితంతో, "స్వంత అస్తిత్వ" విశేషంతో వున్నవాళ్ళు. వాళ్ళ పరివర్తన (అభివృద్ధి) వాళ్ళ జీవిత కాలంలో జరుగుతుంది.ఎన్నడూ బాహిరం కాదు. మనుషులు నిర్దిష్ట పీడక పరిస్థితుల్లో బాధపడుతూ, పరాయీకరణ చెంది వుంటారు, "ఇతరుల కోసం జీవులు"గా అవుతారు, "తన కోసం తను" అన్న భ్రమతో వుంటారు. వాళ్ళ మీద ఆధారపడతారు. ప్రామాణికంగా అభివృద్ధి చెందలేరు. వాళ్ళ చేతిలో నిర్ణయాధికారం వుండదు. అది పీడకుడి చేతిలో వుంటుంది. దాంతో వాళ్ళు పీడకులు గీసిన గీతలకు బద్ధులై వుంటారు. తాము చిక్కుకున్న వైరుధ్యాల్ని అధిగమించినపుడు మాత్రమే పీడితులు అభివృద్ధి చెందనారంభిస్తారు", తమ కోసం తాము" అవుతారు.

సమాజాన్ని ఒక అస్తిత్వంగా భావిస్తే గనక, "దానికి అది" అనే సమాజం మాత్రమే అభివృద్ధి చెందగలదు. ద్వంద్వంగా, పరావర్తితంగా దురాక్రమితంగా, నగర సమాజం మీద ఆధారితంగా వున్న సమాజాలు అభివృద్ధి చెందవు. ఎందుకంటే అవి పరాయీకరణ పాలయ్యాయి. వాటికి రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక నిర్ణయాధికారం లేదు, అది వాటి బయట కేంద్రీకృతం అయివుంది. దురాక్రమణ జరిపిన సమాజం చేతిలో వుంది. ఇక అంతిమ విశ్లేషణలో, దురాక్రమణదారుడే తనకి లోబడినవాళ్ళ రాత నిర్ణయిస్తాడు: వాళ్ళ పరివర్తన వాళ్ళ అభివృద్ధి కాదు – ఒట్టి పరివర్తన మాత్రమే అది నగర సమాజ ప్రయోజనాలకు అనుకూలిస్తుంది.

ఆధునికీకరణనీ, అభివృద్ధినీ ఒక గాటనే కట్టి గందరగోళపరచకూడదు, ఇది ముఖ్యం. ఆధునికీకరణ "ఉపగ్రహ సమాజం"లోని కొన్ని బృందాలపై ప్రభావం కలిగించినా, అది అన్నివేళలా ప్రేరేపితమే. అసలుకి లబ్ధి పొందేది నగర సమాజమే. అభివృద్ధి లేకుండా ఒట్టినే ఆధునికం అయిన సమాజం ఏదో కొద్దోగొప్పో నిర్ణయాధికారం పొందిన – బయట దేశం మీదనే ఆధారపడి కొనసాగుతుంది. ఇదే ఖర్మ ఏ పరాధీన సమాజానికి అయినా వర్తిస్తుంది, అది పరాధీనంగా వున్నంత కాలం.

ఒక సమాజం అభివృద్ధి చెందుతోందా లేదా అనేదాన్ని నిర్ణయించేందుకు "తలసరి సగటు ఆదాయం" (గణాంకాల్లో చెప్పినపుడు ఇవి పక్కదోవ పట్టిస్తాయి) స్థూల జాతీయ ఆదాయంలాంటి సూచీలని దాటి వెళ్ళగలగాలి. మౌలిక ప్రాథమిక కొలమానం ఏమిటంటే– ఆ సమాజం దానికిగా అది వుందా లేదా అనేదే. అది కానప్పుడు ఇతర కొలమానం ఆధునీకరణను సూచిస్తుంది కాని, అభివృద్ధిని కాదు.

ద్వంద్వ సమాజాల్లో ప్రధాన వైరుధ్యం వాటికీ, నగర సమాజానికీ మధ్యవున్న అధీన సంబంధం. ఇంతవరకూ "సాయం" ద్వారా జరిగిన పరివర్తన, అది నగర సమాజాలకే లబ్ధి చేకూర్చిపెట్టింది కదా, ఈ వైరుధ్యాన్ని అధిగమించడం అంటూ జరిగితే అప్పుడది అభివృద్ధి అవుతుంది, "తనకిగా అస్తిత్వంలో" వున్నదానికి లబ్ధి కలిగిస్తుంది.

ఈ సమాజాలు కేవలం సంస్కరణల ద్వారా పరిష్కారాల కోసం ప్రయత్నించాయి (కొన్ని సంస్కరణలు, కులీన బృందాల్లోని మరింత అభివృద్ధి నిరోధకులకు భయం కలిగించవచ్చు, బెదురు పుట్టించవచ్చు కూడా). పై కారణాల రీత్యా అవి ఆంతరంగిక, బాహ్య వైరుధ్యాల్ని పరిష్కరించుకోలేవు. ఈ సంస్కరణాత్మక పరిష్కారాల్ని ఆ చారిత్రక క్రమ అవసరాల దృష్ట్యా సర్వదా నగర సమాజాలు జరిపిస్తాయి. తమ పట్టు సడలకుండా వుంచుకునేందుకు ఇదో కొత్త మార్గం. ఇది నగర సమాజం "సంస్కరణలు జరిపించి చూద్దాం, ప్రజలు విప్లవం జరిపించేలోపున" అంటున్నట్టు వుంది. ఈ లక్ష్యసాధన కోసం, నగర సమాజానికి లొంగదీసుకోవడం, టక్కరివిద్యలు, అధీన దళాల మీద ఆర్థిక సాంస్కృతిక (కొన్ని సందర్భాల్లో సైనిక) దాడి జరిపించడం తప్ప గత్యంతరం లేదు. ఈ దాడిలో పెత్తందారీ సమాజంలోని కులీనవర్గ నాయకులు చాలా మేరకు నగర సమాజ నాయకుల బ్రోకర్లుగా వారి తరఫున పని చేస్తారు.

సంభాషణ వ్యతిరేక కార్యాచరణ సిద్ధాంతానికి సంబంధించిన ఈ ప్రయోగాత్మక విశ్లేషణ ముగించేముందు, మరోసారి ధృవపరచదలచుకున్నాను. విప్లవ నాయకులు

పీడకులు వాడే సంభాషణ వ్యతిరేక పద్ధతుల్ని వాడకూడదు. అందుకు విరుద్ధంగా విప్లవనాయకులు సంభాషణ పంథానూ, వ్యక్తీకరణ పంథానూ అనుసరించాలి.

సంభాషణాత్మక కార్యాచరణను విశ్లేషించే ముందు, విప్లవ నాయక బృందం రూపొందే క్రమాన్ని, విప్లవ కార్యక్రమంలోని కొన్ని చారిత్రక, సాంఘిక పరిణామాల్ని క్లుప్తంగా తడమడం అవసరం. సాధారణంగా ఈ నాయకత్వ బృందంలోని స్త్రీ, పురుషులు ఏదో రకంగా పెత్తందారీ సాంఘిక అంతస్తుకు చెందినవాళ్ళే అయివుంటారు. వాళ్ళ జీవితానుభవంలో, కొన్ని చారిత్రక పరిస్థితుల్లో, ఆ నాయకులు తాము ఏ వర్గంవాళ్ళో ఆ వర్గాన్ని త్యజించి వచ్చారు. పీడితుల పక్షాన కలిసారు. నిజమైన సంఘీభావ చర్య అది. (అలా అని ఆశిద్దాం). ఈ కలవడం యధార్ధ పరిస్థితి గురించిన శాస్త్రీయ పరిశీలనబట్టి వచ్చిందో లేదో చెప్పలేం కాని (ప్రామాణికం అయినప్పుడు) నిజమైన ప్రేమ నిబద్ధతగల చర్య[38] అనే చెప్పొచ్చు. పీడితుల పక్షాన చేరడం అంటే వాళ్ళ దగ్గరకు వెళ్ళడం, వాళ్ళతో మనసు విప్పి మాట్లాడ్డం. పైకి వస్తూవున్న నాయకులలో ప్రజలు తమని చూసుకోవాలి. నాయకులూ ప్రజలలో తమను చూసుకోవాలి.

అలా పైకి వచ్చిన నాయకులు పీడితుల ద్వారా వాళ్ళకి అందిన కులీన వైరుధ్యాల్ని ప్రతిఫలింపచేయాలి. పీడితులు అప్పటికి ఇంకా పీడిత స్థితిని గ్రహించకపోవచ్చు, లేదా, పీడకులతో తమ ప్రతిస్పర్ధి సంబంధాన్ని విమర్శకంగా గుర్తించి వుండకపోవచ్చు.[39] వీళ్ళింకా ఇదివరకటి పరిభాషలో పీడకుడికి "అతుక్కు"పోయివుండచ్చు. అటుపక్క, కొన్ని వస్తుగత చారిత్రక పరిస్థితుల కారణంగా వాళ్ళు తమ పీడన పరిస్థితికి సంబంధించి ఒక సాపేక్ష సుస్పష్ట అవగాహన కలిగివుండచ్చు.

మొదటి సందర్భంలో ప్రజల, పీడకుని కలయిక – లేదా, పాక్షిక కలయికవల్ల ప్రజలు (ఫానన్ అన్న విషయాన్ని పునరుల్లేఖిస్తే) తమకి బాహిరంగా వుంచుకోవడం వాళ్ళకి అసాధ్యం. రెండవ సందర్భంలో వాళ్ళు పీడకుణ్ణి ఫలానా అని నిర్దేశించగలరు, ఆ రకంగా అతనితో తమకు వున్న ప్రతికక్షి సంబంధాన్ని సవిమర్శకంగా గుర్తించగలరు.

మొదటి సందర్భంలో పీడకుడు ప్రజలలో "గూడు" కట్టుకుని వున్నాడు, ఫలితంగా వచ్చిన సంశయాత్మకత వాళ్ళని స్వేచ్ఛాభీరువుల్ని చేస్తుంది. వాళ్లు (పీడకుడి ప్రేరణతో) యాంత్రిక వివరణలకు దిగుతారు లేదా, దైవం గురించి కుహనా అభిప్రాయం ఏర్పరచుకుంటారు. తమ అణగారిన పరిస్థితికి బాధ్యత విధికృతంగా బదలాయించుకుంటారు.[40] తమ మీద తమకే నమ్మకం లేనివాళ్ళు ఈ ప్రజలు,

అణగారిపోయినవాళ్ళు ఈ ప్రజలు, నిరాశ గూడుకట్టుకున్నవాళ్ళు ఈ ప్రజలు. అలాంటివాళ్ళు తమ విమోచన కోసం యత్నించడం దాదాపు అసంభవం– విమోచన అంటే తిరుగుబాటు చర్య, అంటే, దేవుని సంకల్పాన్ని ఉల్లంఘించడం, అది అవిధేయత, తలరాతతో లేనిపోని తగాదాలు తెచ్చుకోవడం. (అందుచేతనే పీడకులు వాళ్ళకి ఎక్కించిపెట్టిన పుక్కిటి పురాణాల్ని సమస్యలుగా ముందు పెట్టడం అవసరం అని పదేపదే నొక్కి చెప్పాల్సివస్తోంది.) రెండో సందర్భంలో ప్రజలు పీడన గురించి ఓ మాదిరి అవగాహన కలిగించుకుంటారు. దాంతో పీడకుణ్ణి తమకి బయట గుర్తించగలుగుతారు. తాము చిక్కుకున్న వైరుధ్యం నుంచి బయటపడడానికి పోరాటం చేస్తారు. ఈ క్షణంలో వాళ్ళు "వర్గ అవసరానికీ", "వర్గచైతన్యానికీ" మధ్య దూరాన్ని అధిగమిస్తారు.

మొదటి సందర్భంలో విప్లవనాయకులు, దురదృష్టవశాత్తూ, అనుద్దేశితంగానే ప్రజల వైరుధ్యం అవుతారు. రెండవ సందర్భంలో పైకి వచ్చే నాయకులు ప్రజల నుంచి సానుభూతిపూర్వక తోడ్పాటును, దాదాపు తక్షణ తోడ్పాటు పొందుతారు. విప్లవ కార్యక్రమ సమయంలో అది పెరుగుతుంది. నాయకులు ప్రజల దగ్గరకు తక్షణ సంభాషణ ద్వారా చేరతారు. ప్రజలకీ విప్లవ నాయకులకీ మధ్య తక్షణ బంధం ఏర్పడుతుంది. వాళ్ళు ఉభయుల నిబద్ధత దాదాపు ఉన్నఫలాన పెనవేసుకుంటుంది. సాహచర్యంతో, వాళ్ళు పెత్తందారీ కులీనుల సమఘాయా వైరుధ్యంతో వున్నట్టు గుర్తిస్తారు. ఇక అక్కడి నుంచీ ప్రజలకీ నాయకులకీ మధ్య స్థాపితమైన సంభాషణ అభ్యాసం దాదాపు అచంచలంగా వుంటుంది. ఈ సంభాషణ అధికారం అందేదాకా కొనసాగుతుంది. తాము అధికారం అందుకున్నామని ప్రజలు తెలుసుకుంటారు.

ఈ భాగస్వామ్యంవల్ల పోరాటస్ఫూర్తి, సాహసం, పేమాస్పదత, విప్లవ నాయకులకు అవసరమైన గుండె నిబ్బరం ఏమాత్రం సడలవు. ఫెడెల్ కాస్ట్రో, ఆయన సహచరులూ (చాలా మంది అప్పట్లో వాళ్ళని "బాధ్యతా రహిత దుస్సాహసికులు" అన్నారు) చాలా ప్రసిద్ధ సంభాషణాత్మక బృందంగా ప్రజలతో మమేకం అయ్యారు. పాపం, ఆ ప్రజలు బాటిస్టా నిరంకుశ పాశవికతను భరించారు. ఈ కలయిక నల్లేరు మీద నడకకాదు. నాయకుల సాహసం అవసరం అయింది. ప్రజల ప్రేమలో వాళ్ళ కోసం తాము అర్పితులు అయ్యే ధైర్యం కావాలి. ఒక ఎదురుదెబ్బ తగిలినప్పుడు మళ్ళీ కూడదీసుకోవడం కోసం ఎంత గుండెనిబ్బరం కావాలి, ఎంతలా భవిష్యత్ మీద ఆశ వుండాలి, అంతిమ విజయం తమదే అన్న ప్రగాఢ విశ్వాసం వుండాలి (ప్రజలతో కలిసి బంధించుకున్న) ఆ విజయం నాయకులది మాత్రమేకాదు, ప్రజలదీ, నాయకులదీ – లేదా ప్రజలది, నాయకులతో సహా.

క్యూబన్ ప్రజల అనుసంధానతను ఫైడల్ క్రమేపీ క్రమబద్ధం చేశాడు. వాళ్ళు చారిత్రక అనుభవంవల్ల పీడకునితో వున్న సంధానతను అప్పటికే ఛేదించుకోవడం మొదలుపెట్టారు. పీడకుని నుంచి "వెనక్కి మరలడం"తో ప్రజలు అతని నుంచి విడివడి చూడగలిగారు. తాము అతనికి వైరుధ్యం అనీ చూడగలిగారు. అంచేత ఫైడల్ ఎన్నడూ ప్రజలతో వైరుధ్యంలో పడలేదు. (అడపాదడపా వదిలిపెట్టి వెళ్ళిపోవడంలో దగా చేయడాలు వున్నా, అవి వుంటాయని వూహించినవే. గువెరా "రిలెటో డిలా గుయెర్రా రివల్యూషి మొనరా"లో నమోదు చేశాడు. అనుసంధానత ప్రజల గురించి ఇందులో చెప్పాడు).

ఆ రకంగా కొన్ని చారిత్రక పరిస్థితుల వల్ల, ప్రజల వైపు విప్లవ నాయకుల గమనం సమానంగానైనా వుండచ్చు – ఇక్కడ పీడకునితో వైరుధ్యంలో నాయకులూ, ప్రజలూ ఏకాండిగా వుంటారు – లేదా త్రికోణంగా వుండొచ్చు. ఇక్కడ విప్లవ నాయకులు త్రిభుజం శిఖరంలో వుంటారు. పీడకులకీ పీడితులకీ కూడా వైరుధ్యంతో మనం ఇంతకుముందే చూసినట్టు ఈ తర్వాతి పరిస్థితి నాయకుల నెత్తిమీద రుద్దుకు వచ్చినటువంటిది. అప్పటికి ప్రజలు ఇంకా పీడక యధార్థ పరిస్థితి గురించిన విమర్శక గ్రహింపు పొందలేదన్నమాట!

ఏమైనా, తాను ప్రజలకు వైరుధ్యంగా వుంటామని విప్లవ నాయకత్వం ఎన్నడూ భావించదు. నిజానికి ఇలాంటిది చాలా బాధాకరం, ఎదురయ్యే ప్రతిఘటన రీత్యా రక్షణా యంత్రాంగంగా ఉపకరించవచ్చు. పీడితుల అనుసరణ నుంచి ఆవిర్భవించిన నాయకత్వం తాము కలిసివున్నవాళ్ళతో వైరుధ్యంతో వున్నట్టు గుర్తించడం అంత తేలిక కాదు. విప్లవ నాయకత్వ ప్రవర్తనలోని కొన్ని రూపాల్ని విశ్లేషించేటప్పుడు ఈ అనిష్టతను గుర్తించడం అవసరం. నాయకులు అనుకోని విధంగానే ప్రజలకు వైరుధ్యం కావచ్చు (ప్రతి స్పర్ధి కాకపోయినా).

విప్లవాన్ని జరిపించడానికి విప్లవనాయకులకు నిస్సందేహంగా ప్రజల అనుసరణీయత వుండాలి. ప్రజలతో వైరుధ్యంతో వున్న నాయకులు ఈ అనుసరణీయత వాంఛిస్తే, కొంత అనుమానం, ఎడం ఎదురైనప్పుడు, అదేదో ప్రజల్లో సహజంగా వున్న లోపాన్ని సూచిస్తున్నట్టు వాళ్ళు భావిస్తారు. ప్రజల చైతన్యంలో ఓ ఫలానా చారిత్రక క్షణాన్ని వాళ్ళ అంతర్గత లోపంగా ఎత్తి చూపిస్తూ వుంటారు. విప్లవం సాధించడానికి ప్రజల అనుసరణీయత నాయకులకు అవసరం కాబట్టి (అదే సమయంలో అపనమ్మకం వున్నవాళ్ళపట్ల అపనమ్మకంతోనూ) వాళ్ళు పెత్తందారీ కులీన బృందాలు పీడనకు వాడుకున్న అవే విధానాల్ని వాడుకుంటారు. ప్రజల్లో వాళ్ళకి నమ్మకం లేదు, దాన్ని

సమర్థించుకునేందుకీ, అధికారం హస్తగతం కాకుండా ప్రజలతో సంభాషణ సాగించడం అసంభవం అంటారు. ఆ రకంగా సంభాషణ వ్యతిరేక కార్యాచరణ సిద్ధాంతానికి పీట వేస్తారు. ఇక అక్కడి నుంచీ సరిగ్గా పెత్తందారీ కులీనుల్లాగానే - ప్రజల్ని లోబరుచుకునేందుకు ప్రయత్నిస్తారు. ప్రవచన చేసేవాళ్ళు అవుతారు. టక్కుటమార విద్యలు ప్రయోగిస్తారు, సాంస్కృతిక దురాక్రమణ సాగిస్తారు. పీడక రాస్తాలైన ఈ దారుల్లో సాగుతూ వుంటే వాళ్ళు విప్లవాన్ని సాధించలేరు. ఒకవేళ సాధించినా అది ప్రామాణికమైన విప్లవం అవదు.

విప్లవ నాయకత్వం (ఏ పరిస్థితుల్లోనైనాగానీ, అయితే ముఖ్యంగా ఇప్పుడు వర్ణించుకున్న పరిస్థితుల్లో) కార్యాచరణలో వున్నప్పుడు కూడా ప్రజలు ఎందుకు అనుమానంగా వుంటున్నట్టు అని దృష్టిపెట్టి పరిశీలించాలి. వాళ్ళు ప్రజలతో అసలైన సంభాషణా మార్గాలు అన్వేషించాలి. ప్రజలు విమర్శనాత్మకంగా తమని పీడిస్తూ వున్న యదార్థ పరిస్థితి అవగాహన చేసుకునేందుకు వాళ్ళకి సాయపడాలి.

ఆధిపత్యం చెలాయించే చైతన్యం ద్వైదీకరణం చెంది వుంటుంది. సంశయాత్మకంగా వుంటుంది. ఆసాంతం భయంతో వుంటుంది. అనుమానంతో వుంటుంది.[41] బొలీవియాలో పోరాటంలో గువెరా, రైతులు పాల్గొకపోవడం గురించి తన డైరీలో రాసుకున్నాడు.

రైతు సమీకరణ లేదు ఏదో సమాచార విధులకు తప్ప. ఇది ఆందోళన కలిగిస్తోంది. వాళ్ళు చురుకైనవాళ్ళూ కాదు, సమర్థవంతులూ కాదు, వాళ్ళని తటస్థీకరించవచ్చు, మనమంటే భయం పోగొట్టుకుంటున్నా, మనం వాళ్ళ ఆదరణని చూరగొంటూవున్నా ప్రజల పూర్తి భాగస్వామ్యం లేదు. ఇది చాలా నిదానంగా ఓపిగ్గా చేయవలసిన పని.[42] రైతుల భయాందోళనలకీ, అసమర్థతకి కారణం వాళ్ళ చైతన్యంలో పీడకుడి రూపం ఒదిగివుండడమే.

పీడితుల నడత, ప్రతిస్పందనలవల్ల పీడకుడు సాంస్కృతిక దురాక్రమణ సాగిస్తాడు. అయితే ఇవి విప్లవకారుడిలో భిన్న కార్యాచరణ సిద్ధాంతాన్ని ఉద్భూతం చేయాలి. పెత్తందారీ కులీనులకీ, విప్లవకారులకీ మధ్య తేడా వాళ్ళ గమ్యాలు మాత్రమేకాదు, ఆ ఆచరణ సరళి కూడానూ. వాళ్ళు ఒకే పద్ధతిలో ఆచరిస్తే గమ్యాలూ సమానంగానే తయారవుతాయి. మానవ-ప్రపంచ సంబంధాల్ని ఒక సమస్యగా ప్రజల ముందు పెట్టడం పెత్తందారీ కులీనులకు ఎంత స్వవచో వ్యాఘాతంగా వుంటుందో, అలా పెట్టకపోవడం విప్లవకారునికీ  అంటే స్వవచో వ్యాఘాతంగా వుంటుంది.

సంభాషణాత్మక సాంస్కృతిక కార్యాచరణని విశ్లేషించి దానిలో వున్న అంశాలని గ్రహించే ప్రయత్నం చేద్దాం.

## సహకారం

సంభాషణ వ్యతిరేక కార్యాచరణలో, లోబరుచుకోవడం (దాని ప్రాథమిక లక్షణంగా) వుంటుంది. లోబరుచుకునే కర్త వుంటాడు. మరొకణ్ణి జయిస్తాడు. అప్పుడు ఆమెనిగాని అతన్నిగాని ఒక "వస్తువు"గా మారుస్తాడు. ఇక సంభాషణాత్మక కార్యాచరణ సిద్ధాంతంలో కర్తలు ప్రపంచాన్ని మార్చడంకోసం సహకారంతో వుంటారు. సంభాషణ వ్యతిరేక, పెత్తందారీ "నేను" లొంగదీసుకున్న ఆధిపత్యంలో అణిచిపెట్టిన నిన్ను ఒట్టి "అది"[43]గా మారుస్తుంది. సంభాషణాత్మక "నేను" గ్రహించగలదు, సరిగ్గా "నువ్వు" (నేను–కానిది) తన మనుగడతో వుండాలని పిలుపు ఇస్తుంది. అతనికి తెలుసు– తన మనుగడకు పిలుపు ఇచ్చే నువ్వు మళ్ళీ అటువైపు ఒక నేను అవుతుంది, ఇందులో తన నేనుతో దాని నువ్వు వుంటుంది. ఆ రకంగా యీ నేను, ఆ నువ్వు కలిసి, ఒక గతితార్కిక సంబంధంలో రెండు "నువ్వు" రెండు "నేను" అవుతాయి.

సంభాషణాత్మక కార్యాచరణ సిద్ధాంతంలో ఒక కర్త వుండడు. లోబరుచుకోవడం పుణ్యమా అని పెత్తనం చెలాయిస్తూ వుండే కర్త, అణగదొక్కిన కర్మ వుండవు. ఇందుకు బదులుగా కర్తలు వుంటారు. వాళ్ళు కలిసి ప్రపంచాన్ని మార్చడం కోసం పేర్కొనడానికి కలుస్తారు. ఇదివరకే చెప్పిన చారిత్రక కారణాలవల్ల ఒక నిర్దిష్ట చారిత్రక క్షణంలో పీడితులు కర్తలుగా తమ అంతఃప్రేరణను పరిపూర్తి చేసుకోలేరు, తమ పీడననే ఒక సమస్యగా ప్రతిపాదించుకోలేరు (ఈ పనికి ఎప్పుడూ కార్యక్రమం వుండాలి). అలా చేస్తేనే వాళ్ళ కర్తవ్య పరిపూర్తి జరుగుతుంది.

అలా అని చెప్పి సంభాషణాత్మక కర్తవ్యంలో విప్లవ నాయకత్వానికి పాత్ర లేదని కాదు. దీని అర్థం ఏమిటంటే, నాయకులు – వాళ్ళ ప్రాముఖ్యపూరిత, మౌలిక, తప్పనిసరి పాత్ర వున్నా – ప్రజల్ని స్వాయత్తం చేసుకోరు, గుడ్డిగా ప్రజల్ని వాళ్ళ విముక్తి వైపు నడిపించరు. అలాంటి విముక్తి నాయకులు ప్రజలకు ఇచ్చే కానుక అవుతుందంతే. వాళ్ళ మధ్య సంభాషణాత్మక బంధం తెగిపోతుంది. ప్రజలు విమోచనకు సహకర్తలుగా కాకుండా, ఈ చర్యకు లక్ష్యంగా మారిపోతారు.

సహకారం సంభాషణాత్మక కార్యాచరణ విశిష్ట లక్షణం. ఇది కర్తల మధ్యే సాధ్యమౌతుంది. (వీళ్ళకి పనితీరు భిన్న రకాలుగా వుండొచ్చు, ఆ రకంగా బాధ్యతలోనూ).

దీన్ని ఒకళ్ళతో ఒకళ్ళు వ్యక్తం చేసుకోవడం ద్వారానే సాధించగలరు. సంభాషణ వ్యక్తీకరణకు ముఖ్యం, ఏ సహకారంలోనైనా ఇది వుండి తీరాలి. సంభాషణాత్మక కార్యాచరణ సిద్ధాంతంలో విప్లవ లక్ష్యం కోసం ప్రజల్ని లోబరుచుకోవడం వుండదు, వాళ్ళ అనుసంధానత పొందాలంటే సంభాషణ దీన్ని రుద్దదు, ఏ మాయమర్మాలూ వుండవు. మచ్చిక చేసుకోవడాలు వుండవు. "నినాదప్రాయం" చేయడం వుండదు. అలా అని సంభాషణాత్మక కార్యాచరణ సిద్ధాంతం ఎటూ తీసుకు వెళ్ళదని కాదు. అదే రకంగా సంభాషణాత్మక మానవుడు తనకేం కావాలో స్పష్టంగా తెలుసుకోలేదనీ కాదు, తను ఏ లక్ష్యం కోసం నిబద్ధమైందీ తెలియకుండానూ వుండదు.

పీడితులపట్ల విప్లవ నాయకుల నిబద్ధత స్వేచ్ఛ కోసం నిబద్ధత అవుతుంది. ఆ నిబద్ధత కారణంగా, నాయకులు పీడితుల్ని లోబరుచుకునే ప్రయత్నం చేయరు, కాని విమోచన కోసం వాళ్ళ అనుసరణీయతను పొందాలి. లోబరుచుకున్న అనుసరణీయత అసలైన అనుసరణీయత కాదు. అది ఓడిపోయినవాళ్ళు విజేతకు అంటకాగడం. విజేతలే ఓడిపోయిన వాళ్ళకు శాసకులు. ప్రామాణికమైన అనుసరణీయత ఇష్టాల స్వేచ్ఛాయుత మమేకత. యధార్థ పరిస్థితి మాధ్యమంగా ప్రజల మధ్య సంభాషణ లేకుండా ఇది సంభవించదు.

సహకారం సంభాషణ కర్తల్ని తమకు మాధ్యమంగా వున్న యధార్థ పరిస్థితి మీద దృష్టి పెట్టేటట్టు చేస్తుంది – ఒక సమస్యగా ప్రతిపాదించి – వాళ్ళకి సవాల్ కలిగిస్తుంది. – దానికి జవాబే యధార్థ పరిస్థితిని మార్చాలన్న సంభాషణ కర్తల కార్యాచరణ. యధార్థ పరిస్థితిని ఒక సమస్యగా ప్రతిపాదించడం అంటే– నినాదప్రాయం చేయడం కాదని మరోసారి నొక్కి చెబుతున్నాను. సమస్యాత్మక యధార్థ పరిస్థితిని విమర్శనాత్మకంగా విశ్లేషించడం.

పెత్తందారీ కులీనులు కట్టుకథలు కల్పిస్తారు. ఇందుకు విరుద్ధంగా ప్రపంచం మీద కప్పుకున్న ముసుగు తొలగించడం సంభాషణాత్మక సిద్ధాంతానికి అవసరం. అయితే, ఎవళ్ళూ మరొకళ్ళ కోసం ఇలా ముసుగు తొలగించలేరు. ఇతరుల కోసం ఒక కర్త ఈ తెర తీసే పనికి శ్రీకారం చుట్టవచ్చు, కాని వాళ్ళు కూడా ఈ కార్యక్రమంలో కర్తలు అవ్వాలి. ప్రజలు ఒకళ్ళకొకళ్ళు కలిసి సన్నిహితం కావడం, తమ కోసం ప్రపంచాన్ని ఆవిష్కరించుకోవడంలో వుంటుంది. ప్రామాణికమైన కార్యాచరణలో వుంటుంది.

ప్రజలు తమని తాము విశ్వసించడం, విప్లవ నాయకుల్ని ప్రజలు విశ్వసించడంవల్ల అనుసరణీయత సమన్వయమవుతుంది. ప్రజలు విప్లవ

నాయకుల కార్యదీక్షనీ, ప్రామాణికతనీ గ్రహించ డంతో మమేకమయింది. ప్రజలు నాయకుల్ని నమ్మితే అది ప్రజలపట్ల నాయకుల విశ్వాసంలో ప్రతిఫలిస్తుంది.

అయితే, ఈ విశ్వాసం అమాయకంగా వుండకూడదు. నాయకులకు ప్రజల శక్తిసామర్థ్యాల మీద విశ్వాసం వుండాలి. నాయకులు ప్రజల్ని ఒట్టి వస్తువులుగా చూడకూడదు. విమోచనాన్వేషణలో ప్రజలు పాల్గొనగలరన్న నమ్మకం నాయకులకు వుండాలి. కాని, పీడిత ప్రజల సంశయాత్మకత మీద ఓ కన్నేసి వుంచాలి. వాళ్ళల్లో "గూడు" కట్టుకున్న పీడకుడ్ని ఓ కంట కనిపెట్టి వుంచాలి. ఆ రకంగా విప్లవవాది సర్వదా అపనమ్మకంతో వుండాలి అని గువేరా[44] అంటున్నప్పుడు ఆయన సంభాషణాత్మక కార్యాచరణ అనే మౌలిక షరతును ఉపేక్షిస్తున్నట్టు కాదు. ఆయన యధార్థవాదిగా వుంటున్నాడంతే!

సంభాషణలో మూలం అయింది నమ్మకమే అయినా, సంభాషణకు అదే కారణం కాదు. ఇది ఒక భేటీ నుంచి పుట్టుకొస్తుంది. జనం ఈ భేటీలో ప్రపంచాన్ని ఖండిస్తారు. పరివర్తనలో భాగం అది. కాని, పీడితుడిలో దాగివున్న పీడకుడు బలంగా వున్నంతకాలం, స్వేచ్ఛ అంటే వాళ్ళకు మామూలుగా వుండే భీతివల్ల వాళ్ళు విప్లవనాయకుల్ని దుమ్మెత్తిపోస్తారు. గువేరా ఎపిసోడ్స్‌లో ఈ ముప్పుల్ని ఎత్తి చూపించడం వుంది; వదిలిపెట్టి వెళ్ళిపోవడాలే కాదు, అసలు లక్ష్యానికి ద్రోహం తలపెట్టడాలూ వుంటాయి. బృందంలో కలిసి వుండడం, క్రమశిక్షణ కాపాడ్డం కోసం ద్రోహుల్ని దండించాల్సిన అవసరం వుంది, అని గుర్తిస్తూనే గువేరా యీ పత్రంలో వాళ్ళు ఎందుకు పలాయనం చిత్తగించేదీ ఆ కారణాల్ని గుర్తించేడు. వదిలిపెట్టి వెళ్ళిపోయేవాడి సందిగ్ధత వాటిలో ఒకటి.

గువేరా పత్రంలో ఒక భాగం ఆయన (గెరిల్లాగానే కాకుండా వైద్యుడుగా) సియెర్రా మేస్ట్రాలో ఒక రైతు బృందంతో గడిపిన సంఘటనను ప్రస్తావిస్తుంది. సహకారం గురించి మన చర్చకు అది ఉపకరిస్తుంది. చాలా ప్రస్ఫుటంగా వుంది.

ప్రజలతో నిత్యం సంబంధాలు వుండేవి, వాళ్ళ సమస్యలు తెలిసేవి. దీంతో ప్రజల జీవితాల్ని ఆమూలాగ్రం మార్చాలన్న అవసరం గురించి మాకు దృఢంగా నమ్మకం కలిగింది. వ్యవసాయ సంస్కరణ భావం తేటతెల్లం అయింది. ప్రజలతో సంభాషణ అనేది ఒట్టి సిద్ధాంతం మాత్రమే కాదు. మాలో అంతర్భాగం అయింది.

"గెరిల్లాలు, రైతులు సుసంఘటితంగా కలిశారు. ఈ దీర్ఘక్రమంలో ఎక్కడ సరిగ్గా జరిగిందో చెప్పలేనుకాని, ఆ భావనలు యధార్థం అయ్యాయి. మేం రైతాంగంలో

భాగం అయ్యాం. నా మట్టుకు నాకు సియెర్రాలోని రోగులతో సంబంధాలు ఉన్న ఫలానా ఏర్పడినవే. ఒక విధంగా అదొక మధురమైన నిర్ణయం. అది కవిగా మరింత ప్రశాంతమైన శక్తి అయింది. పూర్తి విభిన్న విలువ సంతరించుకుంది. ఆ పేదలు, బాధితులు, విశ్వాస పాత్రులైన ఆ  సియర్రా వాసులు మా విప్లవ భావజాలానికి ఎంత మహత్తర దోహం చేసిందీ వూహించనైనా వూహించలేరు."[45]

గమనించండి, ప్రజలతో సంభాషణ అనేది మధురమైన నిర్ణయం ప్రశాంత శక్తిగా, పూర్తి విభిన్న విలువకలదిగా ఎలా పరివర్తన చెందిందో గువేరా నొక్కి చెపుతున్నాడు. ప్రజలతో సంభాషణలోనే గువేరా విప్లవకార్యాచరణకు రూపం వచ్చింది. ఈ సంభాషణాత్మక వ్యక్తీకరణే సహకారం అయింది. గువేరా (సాహసోపేత కార్యాన్వేషణలో ఫైడల్‌తో, ఇతర కామ్రేడ్స్‌తో నిరాశాపూరితుడై సియెర్రా మేస్ట్రా అధిరోహించలేదు) ప్రజలతో సంభాషణ, తనలో అంతరంగంగా కలిసి పోయింది, ఇక ఒట్టి సిద్ధాంతంగా వుండడం పోయింది అని చెపుతున్నాడు, గమనించండి. ఆ సమయం నుంచి రైతులు, గెరిల్లాల విప్లవ భావజాలాల్ని "రూపొందించేవాళ్ళు" అయ్యారు.

గువేరా తనకు, తన నేస్తాలకు కలిగిన అనుభవాలు సునిశితమైన శైలిలో వివరిస్తున్నాడు. "పేద, విశ్వాసపాత్ర" రైతులతో సంబంధాన్ని దాదాపు సువార్తక్రైస్తవ భాషలో వర్ణిస్తూ వున్నాడు. ఇది ఈ మనిషి గాఢమైన అనురాగానుభూతుల్ని, సంభాషణీయతను వెల్లడిస్తుంది. మరో ప్రేమాస్పదుడైన మనిషి కృషి గురించి బలమైన యోగ్యతాపత్రం ఇస్తున్నాడు. కామిల్లో టోరెస్ "గెరిల్లా పురోహితుడు."

సిసలైన సహకారానికి సంభాషణ ముఖ్యం. అది లేనట్లయితే క్యూబా ప్రజలు సియెర్రా మేస్ట్రా విప్లవపూరిత కార్యకలాపాలకు ఒట్టి వస్తువులుగా ఉండిపోయేవారు. ఆ రకంగా అనుసరణీయత అసాధ్యం అయివుండేది. మహా అయితే "కలయిక" వుండేది, కాని అది పెత్తందారీ తనలో భాగంగా వుండేది, విప్లవంలో కాదు.

సంభాషణాత్మక సిద్ధాంతంలో, ప్రజలతో సంభాషణను విప్లవ కార్యాచరణలోని ఏ దశలోనూ వదులుకోలేదు. సంభాషణవల్ల సహకారం వస్తుంది. దానివల్ల ప్రజలూ నాయకులూ మహాకవులతారు, గువేరా చెప్పినట్టు, విప్లవ కార్యాచరణ నిజంగా మానవత్వపూరితమైందైతేనే, పటువైన, ప్రేమపూర్వక సంభాషణాత్మక, సవినయపూరితమైందైతేనే ఈ సమ్మేళనం వుంటుంది, విమోచనకు నడిపిస్తుంది.

విప్లవం ప్రేమిస్తుంది. జీవితాన్ని సృష్టిస్తుంది. జీవితాన్ని సృష్టించేందుకు కొందరు మనుషులు జీవితాన్ని కుంచింపచేయనీయకుండా అడ్డగించాల్సి వస్తుంది. ప్రకృతికి చావుపుట్టుక సహజ క్రమంలో వుంటాయి. ఇదొక చక్రం, అయితే, అస్వాభావికమైన జీవన్మృతి, పూర్ణత్వం లేని బతుకు.[46]

బ్రెజిలియన్లు ఎంత "జీవచ్ఛావాలు"గా వున్నారో (లాటిన్ అమెరికాలో ఇది సర్వ సాధారణం) లెక్కలు డొక్కలు చెప్పడం అనవసరం. మానవ అస్తిత్వాల ఛాయలు వాళ్ళు. దిక్కులేనివాళ్ళు. "అదృశ్యయుద్ధం"[47] అనంతంగా వుంది, అందులో వాళ్ళ అవశేషాలు క్షయ, శిశు అతిసారంవంటి వాటికి కబళం అవుతున్నాయి.... ఇక పేదరికం సంప్రాప్తింపచేసే సవాలక్ష రోగాలు పట్టి పీడిస్తున్నాయి. (వీటిల్లో చాలామటుకు – పీడకుల భాషలో "ఉష్ణమండల వ్యాధులు".)

పైన ప్రస్తావించుకున్న దారుణ సన్నివేశాలకు ఎలాంటి ప్రతిస్పందనలు వుంటాయో ఫాదర్ చెను ఈ వ్యాఖ్యాల్లో తెలియచేస్తున్నారు.

కౌన్సిల్‌కి హాజరయ్యే పురోహితుల్లోనూ, విజ్ఞులైన మామూలు మనుషుల్లోనూ చాలా మందిలో భయం వుంది. ఈ లోకంలో కష్టాలూ, అవసరాలూ ఇంతేనని వూరికే సమాధాన పడిపోవడం జరుగుతుంది. పేదరికం స్పష్టంగా కనిపిస్తోంది. ఆ లక్షణాలు కనిపిస్తున్నాయి. వీటిని ఉపశమింపచేసుకుందుకు ఆవేశంగా తిట్లూ శాపనార్థాలూ పెట్టుకుంటారు. అన్యాయం జరుగుతుంది. దీనికి కారణాలు ఏమిటో అన్వేషించరు, విశ్లేషించరు. ఈ అన్యాయాన్ని, పేదరికాన్ని పెంచి పోషించే పాలనను ఖండించాలి అంటే భయం.[48]

## విమోచన కోసం ఐక్యత

సంభాషణ వ్యతిరేక కార్యాచరణ సిద్ధాంతంలో పెత్తందార్లు వాళ్ళ అవసరార్థం పీడితుల్ని చీల్చి వుంచుతారు. అప్పుడు పీడక స్థితిని అలా వుంచడం సులభం అవుతుంది. సంభాషణ సిద్ధాంతంలో నాయకులు విమోచన కోసం తపించేందుకు పీడితుల్లో ఐక్యతకు సర్వశక్తులూ ఒడ్డాలి – పీడితులతో నాయకుల ఐక్యతతో నిర్మిస్తారు.

సంభాషణాత్మక కార్యాచరణలోని ఈ భాగం (మిగిలిన వాటికిలాగానే) కార్యాచరణ లేకుండా సాధ్యంకాదనేది ఒక విధంగా కఠోర వాస్తవం. పెత్తందారీ కులీనులకు పీడన కార్యాచరణ సులభం (కనీసం కష్టంకాదు). కాని, విమోచనా కార్యాచరణను

నిర్వహించడం విప్లవ నాయకులకు తేలికైన పనిగాదు. పెత్తందారీ కులీనులు అధికార పరికరాలను వాడుకుంటారు. విప్లవకారులకి వాళ్ళ మీదకే ఎక్కుపెట్టిన అధికారం వుంటుంది. మొదటి బృందంవాళ్ళు ఇష్టం వచ్చినట్టు వ్యవస్థీకృతం అవుతారు, మధ్యమధ్యలో చిన్నాచితకా చీలికలూ వైఫల్యాలూ వున్నా- వాళ్ళ పీట కిందికి నీరు వస్తోందీ అనగానే గబగబా కలిసిపోతారు. విప్లవ బృందం ప్రజలు లేకుండా వుండలేదు. అసలు ఈ నియమమే నిర్మాణం చేయడంలో దానికి మొదటి అవరోధంగా వుంటుంది.

విప్లవ నాయకులు నిర్మాణం చేసుకునేందుకు పెత్తందారీ కులీనులు ఒప్పుకోవడం జరుగుతుందా? అది అసంబద్ధం. పెత్తందారీ కులీనులకు ఆంతరంగిక ఐక్యత వుంటుంది. అది బలపడుతూ, తన అధికారాన్ని వ్యవస్థీకరించుకుంటుంది. ప్రజలు చీలిపోయి వుండడం వాళ్ళకి అవసరం. విప్లవ నాయకుల ఐక్యత ప్రజలలో ఐక్యత మీదా వాళ్ళతో తమ ఐక్యత మీదా ఆధారపడి వుంటుంది. కులీనుల ఐక్యత ప్రజలపట్ల వాళ్ళకి వున్న వైమనస్యం నుంచి పుట్టుకు వచ్చింది. విప్లవ నాయకత్వ ఐక్యత ప్రజల (సంఘటిత)తో సంభాషణ ద్వారా పెరుగుతుంది. పీడన నిర్దిష్ట పరిస్థితి పీడితుడి "నేను" ద్వైధీ కరణం చెందుతుంది. పీడితుడు ఆ రకంగా సంశయాత్ముడవుతాడు, అనుభూతిపరంగా అస్థిరంగా వుంటాడు, స్వేచ్ఛ అంటే భయకంపితుడవుతాడు కనుక ఈ స్థితి పెత్తందారు చీలికపనికి వీలు కల్పిస్తుంది. విమోచనకు తప్పనిసరి అయిన ఏకీకరణ చర్యని అడ్డగిస్తుంది.

అదీగాక, పెత్తందారీతనమే వస్తుగతంగా విభజితం. అది పీడితుడి "నేను", సర్వశక్తివంతమైన, సర్వ వ్యాపిత యథార్థ పరిస్థితికి అతికించి పడేస్తుంది. అప్పుడు ఈ అధికారాన్ని వివరించడానికి నిగూఢ శక్తుల్ని ప్రదర్శించడం ద్వారా పరాయీకరణ చేస్తుంది. పీడిత కులీన భరితమైన "నేను"లో కొంత భాగం, అది అతుక్కుపోయిన యథార్థంలో వుంటుంది. కొంతభాగం స్వంతానికి బయట యథార్థ పరిస్థితికి బాధ్యత వహించేట్లు చెప్పే నిగూఢ శక్తుల్లో వుంటుంది. ఈ యదార్థం గురించి చేయగలిగింది ఏమీలేదు. వ్యక్తి ఒకే విధమైన గతానికీ, వర్తమానానికీ మధ్య చీలి వుంటాడు, ఇక భవిష్యత్తు నిరాశాపూరితం. ఆమెగాని, అతనుగాని రూపొందుతున్నామన్న గ్రహింపు లేకుండా వుంటారు. అంచేత ఇతరులతో కలిసి ఐక్యత నిర్మించలేరు. కాని ఈ "అతుక్కుపోవడం" నుంచి బయటపడి, తాము ఉద్భూత మవుతూ వున్న యదార్థాన్ని వస్తుగతం చేసుకున్నప్పుడు ఆ వ్యక్తి ఒక కర్తగా (ఒక నేనుగా) ఏకం అయి, వస్తువును (యదార్థాన్ని) ఎదుర్కొంటాడు. ఈ క్షణంలో, చీలిన వ్యక్తిత్వ కుహనా ఏకతను తప్పించుకుని వ్యక్తి అవుతాడు.

పీడితుణ్ణి చీల్చి వుంచేందుకు పీడక భావజాలం తప్పనిసరి. ఇందుకు భిన్నంగా, వాళ్ళు ఐక్యం కావడానికి సాంస్కృతిక కార్యాచరణ అవసరం. దాని ద్వారా వాళ్ళు యధార్థ పరిస్థితితో తమ అనుసంధానం ఎందుకు, ఎలా జరిగిందీ తెలుసుకుంటారు – దీనికి ఆ భావజాలం అభావం కావాలి. అంచేత పీడితుల్ని ఏకం చేసే ప్రయత్నంలో ఒట్టి భావజాల "నినాదీకరణం" మాత్రమే చాలదు. దీనివల్ల కర్తకీ, వస్తుగత యధార్థ పరిస్థితికీ మధ్య వుండాల్సిన ప్రామాణిక సంబంధం వక్రీకృతం అవుతుంది. అంతేకాక– పూర్ణ, అవిచ్ఛిన్న వ్యక్తిగత్వంలోని గ్రహింపులనీ క్రియాశీల పార్శ్వాలనీ విభజిస్తుంది.

సంభాషణాత్మక – విమోచనా కార్యాచరణ లక్ష్యం, పీడితుణ్ణి ఒక పుక్కిటిపురాణ యధార్థ పరిస్థితి నుంచి "నిర్వాసితుణ్ణి" చేసి, మరో యధార్థానికి కట్టిపడేయడం కాదు. అందుకు విరుద్ధం సంభాషణాత్మక కార్యాచరణ పీడితుడు తన అనుసంధానత ద్వారా, అన్యాయపూరిత యదార్థాన్ని పరివర్తన జరిపించాలన్న అవగాహన సాధ్యమయ్యేట్టు చేయడం.

పీడితుల మధ్య ఐక్యత రావాలీ అంటే వాళ్ళ మధ్య సంఘీభావం వుండాలి. వాళ్ళ కచ్చితమైన హోదా ఏమైనా గానీయండి. ఆ ఐక్యతకు వర్గ చైతన్యం అవసరం, అందులో రెండోమాట లేదు. ఏమైనా లాటిన్ అమెరికా రైతాంగపు విలక్షణత యధార్థ పరిస్థితుల్లో వాళ్ళు మునిగిపోవడం సూచిస్తోంది. అంటే– పీడిత వర్గం అన్న చైతన్యం, పీడిత వ్యక్తుల చైతన్యాన్ని సాధించుకోవడం ద్వారా, ముందే రావాలి (కనీసం తోడుగా రావాలి).[49]

ఓ యూరోపియన్ రైతుకు తనో వ్యక్తి అని ఒక సమస్యగా ప్రతిపాదిస్తే వాళ్ళకది వింతగా కనిపించవచ్చు. ఇదే విషయం లాటిన్ అమెరికా రైతులకి వింతగా కనిపించదు. వాళ్ళలోకం సాధారణంగా పెద్ద జమీందారీ హద్దుల దగ్గరే ఆగిపోతుంది. వాళ్ళ హావభావాలు జంతువులనీ చెట్లనీ అనుకరిస్తాయి. వాళ్ళు తమని వాటితో సమంగా భావించుకుంటారు.

ఈ రకంగా ప్రకృతికీ, పీడకునికీ బంధితులైన మనుషులు, అస్తిత్వం పొందకుండా నిరోధించబడిన వ్యక్తులమని విచక్షణగా చూసుకోవాలి. తమని తాము గుర్తుంచుకోవడం అంటే మొదటగా తాము పెడ్రో అనీ, ఆంటోనీయో అనీ, జోసెఫా అనీ తెలుసుకోవడం అన్నమాట. ఈ ఆవిష్కరణ బిరుదుల అర్థాన్ని గురించిన భిన్నగ్రహింపు అన్నమాట. 'లోకం' 'మనుషులు', సంస్కృతి, చెట్టు, పని, జంతువు వంటి మాటలు వాటి అసలు

ప్రాముఖ్యాన్ని తిరిగి పొందుతాయి. రైతులు యధార్థ పరిస్థితిని (ఇది వరకు నిగూఢ రహస్యం) పరివర్తనా శీలురుగా భావించుకుంటారు. తమ సృజనాత్మక శ్రమ ద్వారా అలా మార్పిస్తారు. వాళ్ళు – వ్యక్తులుగా తామింక "వస్తువులు"గా కొనసాగరు. తమ గురించిన చైతన్యం నుంచి, అంటే పీడిత వ్యక్తుల చైతన్యం నుంచి ఒక పీడిత వర్గం అనే చైత్యం పొందుతారు.

ఈ మౌలిక పార్శ్వాలతో తలపడకుండా 'నినాదాల' మీదే ఆధారపడి, కార్యశీలపద్ధతుల మీదనే ఆధారపడి రైతుల్ని ఏకం చేసేందుకు చూశామనుకోండి. దానివల్ల వ్యక్తులు ఒకళ్ళకొకళ్ళు అభిముఖం కావడమూ వాళ్ళ చర్యలకు యాంత్రిక లక్షణమూ వస్తాయంతే. పీడితుల ఐక్యత మానవ స్థాయిలో జరుగుతుంది, వస్తువుల స్థాయిలో కాదు. ఉప, ఉపరితల నిర్మాణాల మధ్య గతి తార్కికతను అవగాహన చేసుకోవడం ద్వారా మాత్రమే అది ఒక యధార్థ పరిస్థితిలో సంభవిస్తుంది.

పీడితులు ఏకం కావాలి. ఇందుగ్గాను వాళ్ళు మొదట మాయమర్మాల కల్పిత గాథల పేగుబంధాన్ని తెంచుకోవాలి. ఇవే వాళ్ళని పీడన ప్రపంచానికి బంధిస్తున్నాయి. అనుల్లంఘనీయమైన ఐక్యతను సాధించడానికి, విప్లవపూరిత కార్యక్రమం మొదటి నుంచీ సాంస్కృతిక చర్యగా వుండాలి. పీడితుల ఏకతను సాధించడానికి వినియోగపడే పద్ధతులు పీడితుల చారిత్రక, అస్తిత్వ అనుభవం సాంఘిక నిర్మాణంలో ఎలా వుందో దాన్నిబట్టి వుంటాయి.

రైతులు ఒక "బంధిత" యధార్థ పరిస్థితిలో వుంటారు. ఏకముఖ, పీడక నిర్ణయ కేంద్రం మాత్రమే దానికి వుంటుంది. పట్టణ పీడితులు ఒక విస్తృత నేపథ్యంలో వుంటారు. ఇందులో పీడన శాసక కేంద్రం బహుళంగా, సంక్లిష్టంగా వుంటుంది. రైతులు ఒక పెత్తందారు చేతికింద వుంటారు. ఆ పెత్తందారు పీడక వ్యవస్థకు రూపుకట్టిన ప్రతినిధి పట్టణ ప్రాంతాల్లో పీడితులు "పీడక వ్యక్తిత్వరాహిత్యానికి" లోబడి వుంటారు. ఈ రెండు సందర్భాలలో పీడక శక్తి ఒక మేరకు 'అగోచరం'గా వుంటుంది. గ్రామీణ ప్రాంతాల్లో పీడకులకు దగ్గర వుండడంవల్ల, పట్టణాల్లో చెదరివుండటంవల్ల.

ఇలాంటి భిన్న పరిస్థితుల్లో కూడా ఏమైనా సాంస్కృతిక కార్యకలాప రూపాలు ఒకే లక్ష్యంతో వుంటాయి, పీడితులకు వాస్తవ పరిస్థితి ఎలా వుందో వివరించి చెప్పడం, అది వాళ్ళని పీడకులతో బంధించి వుంచుతోంది. ఆ బంధనం గోచరంగా వున్నా, అగోరంగా వున్నాగానీ, ఒట్టి వూక  దంపుడు ఉపన్యాసాలు, అర్థంపర్థంలేని ఆడంబర

వాగ్ధాటి లేకుండా వుండే కార్యాచరణ రూపాలు ఒక పక్క యాంత్రికత లేని కార్యకలాపాలు మరో పక్క వుంటేనే ఆధిపత్య కులీనవర్గాల విభజన చర్యల్ని ప్రతిఘటించవచ్చు, పీడితుల ఐక్యత దిశగా సాగవచ్చు.

## నిర్మాణం

సంభాషణ వ్యతిరేక కార్యాచరణ సిద్ధాంతంలో టక్కుటమార విద్యలు లోబరచే పెత్తందారీ తనానికీ తప్పనిసరిగా విధాయకంగా వుంటాయి. సంభాషణాత్మక కార్యాచరణ సిద్ధాంతంలో ప్రజలను సంఘటితపరచడం అవసరం. ఈ నిర్మాణం టక్కుటమార విద్యలకు విరుద్ధంగా వుంటుంది. నేరుగా ఐక్యతతో కలిసివుంటుంది. ఆ ఏకతకు సహజ అభివృద్ధిగా కూడా వుంటుంది. ఆ రకంగా ఐక్యత కోసం నాయకుల అన్వేషణ ప్రజల్ని సంఘటితపరచడం కూడా విమోచనకు జరిపే పోరాటం సమష్టిది అన్న అంశమే ఇందుకు సాక్షి. భాగస్వామ్య యత్నంలోని సహకారం నుంచి ఆవిర్భవించిన స్థిరమైన, వినయశీల సాహసోపేత సాక్ష్యం – ఈ యత్నం స్త్రీ, పురుషుల విమోచన సంభాషణ వ్యతిరేక నియంత్రణను తప్పించుకుంటుంది. సాక్ష్యం రూపం మారచ్చు, ఆయా సమాజాల చారిత్రక పరిస్థితుల మీద ఆధారపడి సాక్ష్యం విప్లవపూరిత కార్యాచరణకు విధాయకంగా వుండవలసిన అంశం.

ఆ సాక్ష్యం ఏమిటి, ఎలా అనేది నిర్ణయించడానికి, ప్రస్తుత చారిత్రక నేపథ్యం గురించిన సవిమర్శక జ్ఞానం మరింతగా అవసరం, ప్రపంచం గురించి ప్రజలు అనుకుంటున్న దేమిటో తెలియడం అవసరం. సమాజంలో మౌలిక వైరుధ్యం ఏమిటో తెలియం అవసరం. ఆ వైరుధ్యంలో ప్రధాన పార్శ్వం ఏమిటో తెలియడం అవసరం. సాక్ష్యానికి ఈ పార్శ్వాలు చారిత్రకం సంభాషణాత్మకం. ఆ రకంగా గతి తార్కికం కాబట్టి, సాక్ష్యం వాటిని బయటి నుంచి తన పరిస్థితి విశ్లేషించుకోకుండా దిగుమతి చేసిపెట్టుకోలేదు. అలా చేయడం అంటే సాపేక్షంగా వున్నదాన్ని అఖండం కాల్పనికం చేయడమే అవుతుంది. అప్పుడు పరాయీకరణ తప్పదు. సంభాషణాత్మక కార్యాచరణ సిద్ధాంతంలో సాక్ష్యం, విప్లవ సాంస్కృతిక, బోధనాత్మక స్వభావానికి వ్యక్తీకరణగా వుంటుంది.

చారిత్రకంగా మార్పు చెందని సాక్ష్యమౌలిక అంశాలలో వుండి తీరేవి. మాటలకీ చేతలకీ మధ్య పొంతన; అస్తిత్వం అనేదాన్ని ఒక శాశ్వత కర్తవ్యంగా ఎదుర్కొనే సాహసం, మరింత కార్యాచరణ కోసం సాక్ష్యాన్ని, దాన్ని అందుకునేవాళ్ళనీ తీవ్రతరం చేయడం

(పాక్షికత్వం కాదు) ప్రేమించే స్థైర్యం (అలా అని అన్యాయపూరిత ప్రపంచంతో సర్దుకుపోవడం ఎంతమాత్రంకాదు, అందుకు బదులుగా మానవాళి విమోచనకు అనుకూలమైన పరివర్తన ఇందులో వుంటుంది) ప్రజల్లో విశ్వాసం. వాళ్ళకే ఈ సాక్ష్యం జరిగేది – ప్రజలకి సాక్షీభూతంగా వున్నా, పెత్తందారీ కులీనులతో వున్న గతి తార్కిక సంబంధం దృష్ట్యా, వాళ్ళనీ ప్రభావితం చేస్తుంది (వాళ్ళు తమ యధోచిత రీతిలో దానికి ప్రతిస్పందిస్తారు).

సకల (ప్రామాణిక (అంటే విమర్శనాత్మక) సాక్ష్యంలోనూ గండాల్ని ఎదిరించే గుండె నిబ్బరం వుండాలి. ఇదుగో, ఈ క్షణంలోనే ప్రజల ఆదరణ సంపాదించేస్తున్నాం అని చెప్పుకునీ సర్వదా నెగ్గుకు రాలేకపోయినా, ఓ ఫలానా క్షణంలో కొన్ని పరిస్థితుల్లో ఫలితాన్ని ఇవ్వలేకపోయినా, రేపు దాన్నుంచి ఫలితాలు రావనీ చెప్పలేం. సాక్ష్యం అనేది నైరూప్య హావభావ విశేషం కాదుగనక. అది అచలంగాదు. అదొక చలనశీల అంశం. సాంఘిక నేపథ్యంలో భాగం అవుతుంది. అందులోనే అది సంభవించింది. అది ఆ నేపథ్యం మీద ప్రభావం చూపించకుండా వుండలేదు.[50]

సంభాషణ వ్యతిరేక కార్యాచరణలో టక్కుటమార విద్యలు ప్రజల్ని అచేతనుల్ని చేయవచ్చు. వాళ్ళ మీద పెత్తనానికి అనుకూలత కలిగించవచ్చు, సంభాషణాత్మక కార్యాచరణలో ఈ టక్కుటమార విద్యల స్థానంలో ప్రామాణిక నిర్మాణం వస్తుంది. సంభాషణ వ్యతిరేక కార్యాచరణలో లోబరుచుకోవడమే లక్ష్యం, టక్కుటమార విద్యలు దానికే వూడిగం చేస్తాయి. సంభాషణాత్మక కార్యాచరణలో, నిర్మాణ లక్ష్యాలకు సాహసోపేతమైన, ప్రేమాస్పద సాక్ష్యాలు దోహదపడతాయి.

పెత్తందారీ కులీనులకు నిర్మాణం అంటే తమని నిర్మాణం చేసుకోవడమే. విప్లవకర నాయకులకు నిర్మాణం అంటే ప్రజలతో కలిసి తమని నిర్మాణం చేసుకోవడం. మొదటి సందర్భంలో, పెత్తందారీ కులీనులు అంతకంతకు తమ అధికారాన్ని నిర్మించుకుంటారు. అలా అయితేనే సమర్థవంతంగా పెత్తనం చేయగలుగుతారు, వ్యక్తిత్వ రహితం చేస్తారు. రెండవ సందర్భంలో నిర్మాణం అనేది,స్వేచ్ఛాసాధన అంశీభూతంగా వుంటే, దాని స్వభావానికి అనుగుణంగా వుంటుంది, అదే లక్ష్యంతో వుంటుంది. అదేరకంగా, ఏ నిర్మాణ వ్యవస్థకైనా అవసరం అయిన క్రమశిక్షణనీ, నియమాలతో అణచిపెట్టడాన్నీ ఒకే గాటన కట్టకూడదు. నాయకత్వం, క్రమశిక్షణ, దీక్ష, లక్ష్యశుద్ధి లేనట్లయితే – కర్తవ్య పరిపూర్తి, జవాబుదారీతనం లేనట్లయితే – ఏ వ్యవస్థా

బతికిబట్టకట్టలేదన్నమాట నిజమే, అలా లేనట్లయితే విప్లవపూరిత ఆచరణ పలచబడిపోతుంది. అంతమాత్రాన ప్రజల్ని వస్తువులుగా చూడ్డం ఎంతమాత్రం సమర్థనీయం కాదు. ఇప్పటికే జనం పీడకుల చేతిలో వ్యక్తిత్వ హీనులై వున్నారు – వాళ్ళ "కాన్షైంటిజచావో" దిశలో విప్లవ నాయకులు పని చేయకుండా వాళ్ళని బుట్టలో పెట్టుకుందామని చూస్తేగనక విప్లవ లక్ష్యమే (అంటే, విమోచన) రద్దయిపోతుంది.

ప్రజల్ని సంఘటితపరచడమనేది ఒక క్రమం. తమ మాట[51]ని చెప్పుకోలేకుండా నోరు నొక్కబడిన విప్లవ నాయకులు కూడా, నేర్చుకునే అనుభవానికి, ప్రపంచాన్ని గురించి ఎలా పేర్కోవాలీ అన్నదాన్ని అప్పుడే తెలుసుకుంటారు. ఇదే అసలైన జ్ఞానసాధనానుభవం. అందుకనే సంభాషణాత్మకం అంచేత తమ మాట ఒకటిగా నాయకులు లేరు. వాళ్ళు దాన్ని ప్రజలతో కలిసి పలుకుతారు. సంభాషణాత్మకంగా ఆచరించలేని నాయకులు తమ నిర్ణయాల్ని రుద్దే నాయకులు, ప్రజల్ని వ్యవస్థీకరించలేరు – వాళ్ళని బుట్టలో పెట్టి మసి పూసి మారేడు కాయ చేస్తారు. వాళ్ళు విమోచన చేయలేరు, తాము విమోచన పొందరు, వాళ్ళు పీడిస్తారు.

ప్రజల్ని వ్యవస్థీకృతం చేసే నాయకులకు చిత్తం వచ్చినట్లు తమ మాటను ప్రజల మీద రుద్దే హక్కు వుండదు అన్న మాట నిజమే. అయితే, అంత మాత్రాన్నే వాళ్ళు ఉదారపూరిత వైఖరితో వుండాలని కాదు. అలా అయితే కళ్ళెం సడలిన గుర్రాల్లా తయారవుతారు ప్రజలు, వాళ్ళు పీడనకు అలవాటు పడి వున్నారు కదా! కార్యాచరణకు సంబంధించిన సంభాషణాత్మక సిద్ధాంతం అధికార పెత్తందారీ తనాన్ని వ్యతిరేకిస్తుంది, విశృంఖలతనీ వ్యతిరేకిస్తుంది. ఆ రకంగా అధికారాన్ని, స్వాతంత్ర్యాన్ని ధృవీకరిస్తుంది. అధికారం లేకుండా స్వేచ్ఛలేదు, స్వేచ్ఛ లేకుండా అధికారం లేదు. సకల స్వాతంత్రంలోనూ కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో (భిన్న అస్తిత్వ స్థాయిల్లో) అది అధికారయుతం అయ్యే అవకాశం వుండకపోలేదు. స్వాతంత్ర్యాన్ని, అధికారాన్ని విభాగించి వేర్పాటు చేయలేం. ఒకటి మరోదాని సంబంధంతో కలిసి వున్నట్టే పరిగణించాలి.[52]

ప్రామాణిక అధికారం దానికిగా అది అధికార బదలాయింపుతో రాదు. ఒప్పగింత ద్వారానో లేదా సానుభూతిపూర్వక అనుసంధానత ద్వారానో మాత్రమే వస్తుంది. అధికారాన్ని ఒక బృందం నుంచి మరో బృందానికి వూరికే బదలాయిస్తే, లేదా అధిక సంఖ్యాకుల మీద రుద్దినట్టయితే, అది అధికార పెత్తనంగా దిగజారిపోతుంది. "స్వాతంత్ర్యం నుంచి వచ్చిన అధికారం" అయినప్పుడే అధికారం, స్వాతంత్ర్యం పేచీ లేకుండా వుంటాయి.

ఒకటి బలిసీ రెండవది కృశించిపోతుంది. స్వేచ్ఛ లేకుండా అధికారం వుండనట్టే. అలాగే అధికారం లేకుండా స్వేఛ్ఛా వుండనట్టే, స్వాతంత్ర్యాన్ని హరిస్తే తప్ప నిరంకుశత్వం మనలేదు, అధికారాన్ని తిరస్కరిస్తే విశృంఖలత్వం వుండలేదు.

సంభాషణాత్మక కార్యాచరణ సిద్ధాంతంలో నిర్మాణానికి అధికారం కావాలి, అంచేత అది అధికార పెత్తనం కాలేదు. దానికి స్వాతంత్ర్యం కావాలి. అంచేత విశృంఖలం కాలేదు. నిర్మాణం అనేది చాలా హెచ్చుస్థాయి బోధనాత్మక క్రమం. ఇందులో నాయకులు, ప్రజలు కలిసే నిజమైన అధికారాన్ని, స్వాతంత్ర్యాన్ని అనుభవిస్తారు. వాళ్ళకి మాధ్యమంగా వున్న యధార్థ పరిస్థితిని మార్చడం ద్వారా వాళ్ళు సమాజంలో స్వాతంత్రం స్థాపించాలని చూస్తారు.

## సాంస్కృతిక సంయోజన

సాంస్కృతి కార్యాచరణ అనేది ఎప్పుడూ కూడా క్రమ పద్ధతిలో, ఉద్దేశ ప్రకారం జరిగే కార్యాచరణ రూపమే. ఇది సాంఘిక నిర్మాణం మీద పనిచేస్తుంది. ఆ వ్యవస్థను అలానే నిలబెట్టి వుంచడంగాని, లేదా  మార్చడంగాని దాని లక్ష్యాలుగా వుంటాయి. క్రమబద్ధమైన ఉద్దేశిత కార్యాచరణ రూపంగా సకల సాంస్కృతిక కార్యాచరణకీ దాని సిద్ధాంతం దానికి వుంది. అదే దాని లక్ష్యాల్ని నిర్ణయిస్తుంది. ఆ రకంగా దాని పద్ధతుల్ని నిర్వచిస్తుంది. సాంస్కృతిక కార్యక్రమం (తెలిసో, తెలియకుండానో) పెత్తందారీతనానికైనా తోడ్పడుతుంది, లేదా స్త్రీ, పురుషుల విమోచనకైనా దోహదపడుతుంది. పరస్పర విరుద్ధమైన ఈ రెండు సామాజిక కార్యాచరణలు సామాజిక నిర్మాణం మీద పని చేసినపుడు శాశ్వతత్వం, మార్పు అనే గతితార్కిక సంబంధాల్ని సృష్టిస్తాయి.

సామాజిక నిర్మాణం అస్తిత్వం కావడం కోసం, వుండి తీరాలి. మరోలా చెప్పాలంటే వుండడం, బెసోనియన్ చెప్పిన అర్థంలో, సామాజిక నిర్మాణం కాలపరిమితిని వ్యక్తం చేస్తుంది.[53]

"శాశ్వతత్వం – మార్పు" గతితార్కిక సంబంధం అదృశ్యం కావడం సంభాషణాత్మక సాంస్కృతిక కార్యాచరణ గమ్యంకాదు (ఇదొక అసాధ్య లక్ష్యం. ఏమంటే, గతితార్కికత అదృశ్యం అయితే సామాజిక నిర్మాణం, ఆ రకంగా మనుషులూ అదృశ్యం కావడం అన్నమాట). అయితే, దాని లక్ష్యం సామాజిక నిర్మాణంలో వున్న స్పర్థించే వైరుధ్యాలని అధిగమించడం, ఆ రకంగా మానవాళి విమోచన సాధించడం.

ఇక అటు పక్క, సంభాషణ వ్యతిరేక సాంస్కృతిక కార్యాచరణ, అలాంటి వైరుధ్యాల్ని పురాణ కల్పితం చేయచూస్తుంది. ఆ రకంగా యదార్థ పరిస్థితి తీవ్ర మౌలిక పరివర్తనను తప్పించాలని (లేదా, సాధ్యమైన మేరకు అడ్డగించాలని) ఆశిస్తుంది. సంభాషణ వ్యతిరేక కార్యాచరణ, ఈ సామాజిక నిర్మాణంలోనే, తనకి అనుకూలంగా వుండే స్థితిని అలా నిలబెట్టి వుంచాలని లక్షిస్తుంది. ఇది వెల్లడిగానూ వుండచ్చు. గుంభనగానూ వుండచ్చు. ఇది తగినంత మౌలికంగా, దాని శత్రుపూరిత వైరుధ్యాలను అధిగమించేటంతగా, వ్యవస్థ పరివర్తనను ఎన్నడూ అంగీకరించదు. పీడితుల మీద తమ నిర్ణయాధికారానికి ముల్లు కూడా గుచ్చుకోనంత మేరకు సంస్కరణల్ని అంగీకరించవచ్చు. అంచేత, యీ కార్యాచరణ వ్యూహంలో ప్రజల్ని లోబరుచుకోవడం వుంటుంది. వాళ్ళని విభజించడం వుంటుంది, వాళ్ళ మీద టక్కుటమార విద్యల్ని ప్రదర్శించడం వుంటుంది. సాంస్కృతిక దండయాత్ర వుంటుంది. ఇది మౌలికంగా, అవసరార్థ ప్రేరేపిత చర్య. సంభాషణాత్మక ఆచరణలో ఏరకమైన ప్రేరేపిత చర్యా వుండదు. ఈ ప్రేరేపిత లక్షణాన్ని అధిగమించలేని సంభాషణ వ్యతిరేక సాంస్కృతిక కార్యాచరణ పెత్తనం చెలాయించడం అనే దాని లక్ష్యం కారణంగా తన అసమర్థతను అధిగమించలేదు. సంభాషణాత్మక సాంస్కృతిక ఆచరణశక్తి విమోచన అనే దాని లక్ష్యం కారణంగా శక్తి పొందుతుంది.

సాంస్కృతిక దురాక్రమణలో పాత్రధారులు తమ విలువల నుంచీ, భావజాలం నుంచీ వాళ్ళ విషయపర వస్తువును తీసుకుంటారు. వాళ్ళ ఆరంభబిందువు వాళ్ళ లోకమే. దాన్నుంచి వాళ్ళు తాము దాడి చేయబోయే వాళ్ళ లోకంలోకి ప్రవేశిస్తారు. సాంస్కృతిక సంయోజనలో "మరోలోకం" నుంచి వచ్చిన పాత్రధారులు, ప్రజల ప్రపంచానికి దురాక్రమణదారుల్లా రారు. వాళ్ళు ఓ బోధించడానికో లేదా బదలాయించడానికో లేదా దేన్నయినా ప్రసాదించడానికో రారు. ప్రజలతో కలిసి నేర్చుకునేందుకు, ప్రజల ప్రపంచం గురించి తెలుసుకునేందుకు వస్తారు.

సాంస్కృతిక దురాక్రమణలా. (ఇక్కడ పాత్రధారులు స్వయంగా. దురాక్రమణ చేస్తున్న సంస్కృతి దగ్గరకు వెళ్ళనక్కరలేదు. సాంకేతిక పరిజ్ఞాన పరికరాల ద్వారానే ఈ కార్యాచరణ కొనసాగుతుంది). పాత్రధారులు ప్రజల మీద వచ్చిపడతారు. పాపం, ఆ ప్రజలది ప్రేక్షకపాత్ర, వాళ్ళు వస్తువులు అంతే, సాంస్కృతిక సంయోజనలో పాత్రధారులు ప్రజలతో కలిసిపోతారు. వాళ్ళిద్దరూ ఆ కార్యాచరణకు సహరచయితలు, ఉభయులూ కలిసే కార్యక్రమం నిర్వహిస్తారు.

సాంస్కృతిక దురాక్రమణలో నటపాత్రధారుల కార్యాచరణకు ప్రేక్షకులూ, కాపాడుకోవలసిన యధార్థ పరిస్థితీ కూడా వస్తువుల్లాంటివి. సాంస్కృతిక సంయోజనలో ప్రేక్షకులు వుండరు. నటుల కార్యాచరణ వస్తువు, మనుషుల విమోచనకుగాను పరివర్తన జరిపించాల్సిన యధార్థ పరిస్థితే.

సాంస్కృతిక సంయోజన ఆ రకంగా సంస్కృతినే ఎదుర్కోవాల్సిన కార్యాచరణ పద్ధతి, ఆ సంస్కృతిలో రూపొందిన ఆ నిర్మాణాల్నే కాపాడేదిగా వున్న సంస్కృతి. సాంస్కృతిక కార్యాచరణ, చారిత్రక కార్యాచరణగా, పెత్తందారీ పరాయీకృత, పరాయీకరణ కావించే సంస్కృతిని అధిగమించే పరికరం. ఈ అర్థంలో ప్రతి ప్రామాణిక విప్లవమూ, ఒక సాంస్కృతిక విప్లవమే.

మూడవ అధ్యాయంలో చర్చించిన ప్రజల ఉత్పాదక విషయాంశాలు, లేదా అర్థవంతమైన విషయాంశాలు ఏమిటో పరిశీలించడమే సాంస్కృతిక సంయోజనగా కార్యాచరణ క్రమానికి ఆరంభ బిందువు అవుతుంది. నిజానికి ఈ క్రమాన్ని రెండు విడి అంచెలుగా విభజించడం సాధ్యం కాదు; మొదటిది, వస్తుపర విషయాంశ శోధన, ఆ తర్వాత సాంస్కృతిక సంయోజనగా కార్యాచరణ. అలాంటి ద్వైధీభావం ఒక ఆరంభ దశను సూచిస్తుంది. ఇక్కడ ప్రజలు జడ వస్తువులుగా అధ్యయనం కిందికి వస్తారు. వాళ్ళ గురించిన విశ్లేషణ వస్తుంది. శోధకులు వాళ్ళ గురించి శోధిస్తారు – ఈ క్రమం అంతా సంభాషణ వ్యతిరేక కార్యాచరణకు నప్పేదేనని చెప్పచ్చు. ఇలాంటి విభజనచేసేట్లయితే దురాక్రమణగా కార్యాచరణను అనుసరించి సంయోజనగా కార్యాచరణ వస్తుంది అని చెప్పే అమాయక సూత్రీకరణకు దారితీస్తుంది.

సంభాషణాత్మక సిద్ధాంతంలో ఈ విభజన సంభవించదు. విషయపర శోధనకు కర్తలు వృత్తిపర శోధకులు మాత్రమే కాదు, ఎవళ్ళ విషయపర విశ్వం గురించిన అన్వేషణ సాగుతోందో ఆ స్త్రీలు, పురుషులు కూడా దానిలా భాగస్వాములు. శోధన – సాంస్కృతిక సంయోజనగా మొదటి క్షణం – ఒక సృజనాత్మక వాతావరణాన్ని కలిగిస్తుంది. అది కార్యాచరణ తరవాతి దశల్లో అభివృద్ధి చెందుతుంది. అలాంటి వాతావరణం సాంస్కృతిక దురాక్రమణలో వుండదు. సాంస్కృతిక దురాక్రమణ పరాయీకరణవల్ల దాడికి గురైన వాళ్ళ సృజనాత్మక ఉత్సాహాన్ని చంపేస్తుంది. వాళ్ళని నిరాశా నిస్పృహలకు గురి చేస్తుంది. ఏ పని చేయాలన్నా భయం, ప్రయోగాలు చేయాలంటే భయం. ఇవి లేకపోతే అసలైన సృజనాత్మకత ఎలా వస్తుంది?

దాడికి గురైన వాళ్ళు, వాళ్ళ స్థాయి ఏదైనా కానీ, దురాక్రమణదారుడు పెట్టిన చట్రం దాటి ఆవలకు వెళ్ళలేరు. సాంస్కృతిక సంయోజనలో దురాక్రమణదారులే వుండరు కదా! అంచేత నెత్తి మీద తెచ్చిపెట్టి దించిన నమూనాలూ వుండవు. వాటి బదులు సవిమర్శకంగా యధార్థ పరిస్థితిని విశ్లేషించేవాళ్ళు వుంటారు. (ఈ విశ్లేషణను కార్యాచరణ నుంచి ఎప్పుడూ వేరు చేయరు) కర్తలుగా చారిత్రక క్రమంలో పాల్గొంటారు.

ముందే సిద్ధం చేసిపెట్టుకున్న ప్రణాళికలు వుండవిక్కడ, అందుకు బదులుగా నాయకులు, ప్రజలు, ఉభయులూ కలిసి పరస్పరం నూతన జ్ఞానంలో, నూతన కార్యాచరణలో పునర్జన్మిస్తారు. పరాయీకరణ చెందిన సంస్కృతీ జ్ఞానం పరివర్తనా కార్యాచరణకు నడిపిస్తుంది. దానివల్ల పరాయీకరణ నుంచి విముక్తం చేసే సంస్కృతి వస్తుంది. ప్రజల అనుభవ జ్ఞానంతో నాయకుల నాగరిక జ్ఞానం ఎంతో పునర్నిర్మితమవతుంది, ప్రజల జ్ఞానం నాయకుల నాగరిక జ్ఞానంవల్ల మరింత నాణ్యత సంతరించుకుంటుంది.

సాంస్కృతిక సంయోజనలో – ఒక్క సాంస్కృతిక సంయోజనలో మాత్రమే నాయకుల ప్రపంచ దృక్పథానికీ, ప్రజల ప్రపంచ దృక్పథానికీ మధ్య వున్న వైరుధ్యం పరిష్కారం అవుతుంది. ఉభయుల దృక్పథమూ సంపద్వంతమవుతుంది. ఈ రెండు దృక్పథాలకీ మధ్య వున్న తేడాని సాంస్కృతిక సంయోజనం కాదనదు. అది తిరస్కరించేదల్లా –ఒకటి మరోదాని మీద దురాక్రమణ చేయడం. కాని ఒకటి మరొకదానికి అందించే తిరుగులేని తోడ్పాటును ధృవపరుస్తుంది.

విప్లవనాయకులు ప్రజలు లేకుండా తమని వ్యవస్థీకరించుకోవడం తప్పించుకోవాలి. కొన్ని చారిత్రక పరిస్థితుల వల్ల ప్రజలకు ఏ వైరుధ్యాలు యాదృచ్ఛికంగా సంభవించినా వాటిని పరిష్కరించాలి. అయితే, నెత్తిమీద రుద్దిన సంబంధాల సాంస్కృతిక దురాక్రమణవల్ల అవి కొండంతలవుతాయి.

ప్రజలకు ప్రపంచ దృక్పథం వుంటుంది అన్న పరమసత్యం గమనంలోకి తీసుకోకుండా విప్లవ నాయకులు ఏన్నో పొరబాట్లు తప్పుడు అంచనాలు వేస్తారు. ప్రజల ప్రపంచ దృక్పథంలో వెల్లడిగానో, గర్భితంగానో వాళ్ళ వ్యధలు, సంశయాలు, ఆశలు, నాయకుల్ని వాళ్ళు చూసే తీరులు, తమని గురించి తాము చేసే వూహాలు, పీడకుల

గురించి వాళ్ళకి వున్న అభిప్రాయాలు, వాళ్ళ మతపర విశ్వాసాలు (దాదాపు ప్రతిస్పర్థిభావాల సమ్మేళన), వాళ్ళ కర్మ సిద్ధాంతం, వాళ్ళ తిరుగుబాటు స్వభావాలు వంటి వన్నీ వుంటాయి. ఇందులో దేన్ని విడిగా చూడలేము. వాటి పరస్పర సమ్మేళనమే ఒక సమగ్ర రూపమౌతుంది. పీడకుడికీ ఇవన్నీ తెలుసుకోవాలన్న ఆసక్తి వుంటుంది ఎందుకూ అంటే, తన పెత్తందారీ తనాన్ని అలా నిలబెట్టి వుంచుకునేందుకు, లేదా పెత్తనం సంపాదించేందుకు తనుచేసే దురాక్రమణకు అదేమైనా సాయపడుతుందా అని చూస్తుంటాడు.. మరి విప్లవ నాయకులకు వాళ్ళ కార్యాచరణకు వాటి గురించి సమగ్ర అవగాహన తప్పనిసరి. వాళ్ళ సాంస్కృతిక సంయోజన అనేది (సరిగ్గా అది సంయోజన కావడంవల్ల) ప్రజల ప్రపంచ దృక్పథంలో వెల్లడైన ఆశలకీ ఆకాంక్షలకీ మాత్రమే విప్లవకార్యాచరణలో పరిమితమై ఆ లక్ష్యాలు అంతటితోనే వుండాలని అర్థం కాదు. ఇదే జరిగినట్టయితే గనక (ఆ దృక్పథాన్ని మన్నిస్తున్నామన్న ముసుగులో) విప్లవ నాయకులు జడంగా ఆ దృక్పథానికి కట్టుబడిపోతారు. ప్రజల ప్రపంచ దృక్పథం మీద నాయకుల దాడిని గాని, లేదా ప్రజల ప్రపంచ దృక్పథానికి నాయకులు అనుసరణతో వుండడంగాని అనుమతించవీల్లేనివి.

సూటిగా చెప్పాలీ అంటే : ఓ ఫలానా చారిత్రక సన్నివేశంలో ప్రజల మౌలిక ఆకాంక్షలు జీతాల పెంపుదలను దాటిపోవనుకోండి, నాయకులు ఇలాంటప్పుడు రెండు తప్పులు చెయ్యొచ్చు. వాళ్ళు తమ ఆచరణను ఈ ఒక్క కోరికను ప్రేరేపించడానికే పరిమితం చేయచ్చు.[54] లేదా జనంలో వున్న ఈ కాంక్షను తోసిపారేసి, మరో సుదూరమైనదాన్ని తెచ్చిపెట్టవచ్చు. అసలది ఇంకా ప్రజల దృష్టి పథంలోకే వచ్చి వుండదు. మొదటి సందర్భంలో విప్లవనాయకులు ప్రజల కోరికలకు అనురూపంగా మారడం వుంటుంది. రెండో సందర్భంలో ప్రజల ఆకాంక్షల్ని బేఖాతరు చేసి, సాంస్కృతిక దురాక్రమణకు ఒడిగట్టడం వుంటుంది.

దీనికి పరిష్కారం సంయోజనలో వుంది; హెచ్చు జీతాల కోసం ప్రజల కోరికతో నాయకులు సారూప్యం చెందాలి. అటు పక్క ఆ కోరికనే ఒక సమస్యగా పెట్టి, దాని అర్థం వాళ్ళ ముందు పెట్టాలి. ఇలా చేయడంవల్ల నాయకులు ఒక నిజమైన నిర్దిష్టమైన చారిత్రక సన్నివేశాన్ని ఒక సమస్యగా పెడుతున్నారన్నమాట! ఈ సన్నివేశంలో హెచ్చుజీతం డిమాండు ఒక పార్శ్వం మాత్రమే. అప్పుడు ఓ విషయం స్పష్టమవుతుంది, జీతాల

డిమాండ్లే ఒక కచ్చితమైన పరిష్కారం కాలేవు అని. ఈ పరిష్కారంలోని సారాంశాన్ని తృతీయ ప్రపంచ బిషప్‌ల ప్రకటనలో చూడొచ్చు. ఈ ప్రకటనను ఇదివరకే ఉల్లేఖించుకున్నాం. "కార్మికులు ఏదో రకంగా తమ శ్రమకు తాము యజమానులు కాకపోతే, సకల నిర్మాణాత్మక సంస్కరణలు వట్టిపోతాయి.... వాళ్ళు శ్రమపై ఆధిపత్యం సంపాదించుకుని (తీరాలి) తమ శ్రమను అమ్ముకునేవాళ్ళు మాత్రమే కాకూడదు. ఏమంటే, ఏరకంగానైనాగానీ కొనడం, అమ్మడం ఒకరకమైన బానిసత్వమే అవుతుంది."

"ఎవళ్ళ శ్రమకు వాళ్ళే యజమానులు", శ్రమ "మానవ వ్యక్తిత్వంలో భాగం", "మనుషుల్ని అమ్మనూ కూడదు, కొననూ కూడదు'" అనేవాటిని తెలుసుకోవడం, ఈ సత్యాల గురించిన సవిమర్శక చైతన్యం సాధించడం, అంటే మోసపూరిత తీపి గుళికల పరిష్కారాలని దాటి వెళ్ళగలగాలి. యధార్థ పరిస్థితిని ప్రామాణికంగా పరివర్తన చేయించడంలో నిమగ్నం అవ్వాలి. ఆ వాస్తవాన్ని మానవీకరణం చేయడం ద్వారా; స్త్రీలనీ, పురుషుల్ని మానవీకరణ చేయడం ద్వారా ఇలా జరిపించాలి.

కార్యాచరణకు సంబంధించిన సంభాషణ వ్యతిరేక సిద్ధాంతంలో, సాంస్కృతిక దురాక్రమణవల్ల టక్కుటమార విద్యల లక్ష్యాలు నెరవేరతాయి. అది మళ్ళీ లోబరుచుకోవడం అనేదానికి వూడిగం చేస్తుంది. ఇక ఆ లోబరుచుకోవడం పెత్తందారీతనం లక్ష్యాల్ని నెరవేరుస్తుంది. సాంస్కృతిక సంయోజన నిర్మాణలక్ష్యాల్ని చూస్తుంది, నిర్మాణం విమోచనా లక్ష్యాల్ని చూస్తుంది.

ఈ కృషి ఒక విస్పష్ట సత్యాన్ని ముందు పెడుతుంది. పీడకుడికి పీడించేందుకు పీడక సిద్ధాంతం కావాలి. అదే రకంగా స్వేచ్ఛాయుతులు కావడానికి పీడితులకీ ఒక సిద్ధాంతం కావాలి.

పీడకులు ప్రజలు లేకుండానే తమ సిద్ధాంతాన్ని విపులీకరించుకుంటారు. ఎందుకంటే, పీడకులు ప్రజలకు వ్యతిరేకం. అలాగని ప్రజలూ శనిదేవత రథచక్రపుటిరుసులలో పడి నలిగిపోతూ వున్నంత కాలం, పీడకుడి మూర్తిని లోపల నింపుకున్నంత కాలం – తమ విమోచనా సిద్ధాంతాన్ని రూపొందించుకోలేరు. ప్రజలు విప్లవ నాయకులతో భేటీలో మాత్రమే – వాళ్ళ సంభాషణలో, వాళ్ళ ఆచరణాత్మక కార్యాచరణలో – ఈ సిద్ధాంతం నిర్మితమవుతుంది.

# వివరణలు

1. వ్లదిమీర్ లెనిన్ *"What is to be done?", Essenitial works of Lenin, Henry ahristman ed. (New York, 1966) p.69.*

2. ఈ ప్రమాదంవల్ల విప్లవ నాయకులు పీడకుల పద్ధతుల్ని అనుకరించడం మానుకోవాలి. పీడకులు పీడితుల్లోకి "ప్రవేశిస్తారు", పీడితులూ వాళ్ళని తమలో అట్టిపెట్టుకుంటారు. విప్లవవాదులు, పీడితులతో కలిసిన కార్యాచరణలో, వాళ్ళల్లో "ఆవాసం" వుండాలని చూడరు. అందుకు విరుద్ధంగా (పీడితులతో కలిసి) పీడకుల్ని "విసిరేసే" ప్రయత్నం చేసినపుడు పీడితులతో కలిసి వుండేందుకు అలా చేస్తారు – వాళ్ళల్లో జీవించాలని కాదు.

3. పీడితులు ఎప్పుడు దోపిడీ పాలనలో బాధితులుగానే వుంటారు. విప్లవ పోరాటానికి కసి తీర్చుకోనే పార్శ్వాన్ని అంటగడతారు. దీన్ని అర్థం చేసుకోవచ్చు. అయినా, ఈ దిశలో పడిపోయి విప్లవం తన శక్తిని హారతి కర్పూరంలా కరిగించుకోకూడదు.

4. గువేరా చనిపోయిన వార్తని క్యూబా ప్రజలకు ధృవపరుస్తూ ఫైడల్ కాస్ట్రో అన్నాడు: "సందేహం నుంచి కొంత లాభం పొందినా, అబద్ధాలు, సత్యభీతి దుర్భము కుమ్మక్కు అవడం, అబద్ధాలతో కుమ్మక్కవడం విప్లవానికి ఆయుధాలు ఎప్పటికీ కావు" *Gramma*లో ఉల్లేఖన, అక్టోబరు 17, 1967 వక్కాణింపు చేర్చింది.

5. మరోసారి చెపుతున్నా, ఈ సంభాషణాత్మక భేటీ ప్రతికక్షుల మధ్య జరగదు.

6. "పెత్తందారీ వర్గాలు స్థిరంగా వున్న సంధికాలాలు వుంటాయి. అడపాదడపా బెదిరించే బలవంతుడైన ప్రతికక్షి అతను. లెనిన్ కూడా అధికార పీఠం మీద వున్నాడు. అలాంటి ప్రతికక్షిని ఎదిరించి కార్మికుల ఉద్యమం తనని తాను రక్షించుకోవాల్సిన కాలం అది. అలాంటి సమయంలో సోషలిస్టు సాహిత్యం సహజంగానే పుట్టుకొస్తుంది. ఇది వాస్తవ పరిస్థితి "పాదార్థిక" అంశాన్ని నొక్కి చెపుతుంది. ఏ అవరోధాల్ని అధిగమించాలో చెపుతుంది. మానవుల అరకొర చైతన్యం గురించీ, కార్యాచరణ గురించీ నొక్కి చెపుతుంది." గోల్డ్‌మన్, అదే గ్రంథం పే. 80–81.

7. ఫెర్నాండొ గార్జియా, హాండురస్. లాటిన్ అమెరికన్ల కోసం ఉద్దేశించిన అంశంలో (శాంతియాగో, 1967)


8. నైబూర్, పై గ్రంథం, పే. 117–118.

9. కొన్ని సందర్భాల్లో ఆ "మాట"ను పలకను కూడా పలకరు. ఎవళ్ళేదేనానన్నిది (అలా అని విప్లవ బృందం వాళ్ళే కానక్కర్లేదు), తమలో "వున్న" పీడకుణ్ణి బెదిరించేదైతే, యిక విధ్వంసక స్థానం పొందడానికి చాలు.

ఒకసారి ఓ విద్యార్థి నాకు చెప్పాడు: ఒక లాటిన్ అమెరికన్ రైతు బృందం వుందట. వాళ్ళ ముందు ఒక మొండి పురోహితుడు ఇద్దరు "కమ్యూనిస్టుల"ని నిందించిపోశేట్టు. "కాథలిక్ విశ్వాసం" అని పిలిచేదాన్ని వాళ్ళు తగలేస్తున్నారట. ఆ రాత్రే ప్రతి రైతూ కట్టగట్టుకుని పాపం, ఆ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల్ని సజీవదహనం చేసేయ్యబోయేరట. ఆ ఉపాధ్యాయులు స్థానికంగా వున్న పిల్లలకి విద్య చెపుతున్నారు. ఆ పురోహితుడికి ఆ ఉపాధ్యాయుల ఇంట్లో అట్ట మీద గడ్డపాయన బొమ్మ వున్న పుస్తకం కనిపించిందేమో....

10. సంభాషణకూ, విప్లవ కార్యాచరణకూ మధ్య ద్వైధీ విభజన లేదని మరోసారి నొక్కి చెపుతున్నా. సంభాషణకు ఒక దశ, విప్లవానికి మరొక దశ అనేవి లేవు. అందుకు భిన్నంగా, సంభాషణే విప్లవకర కార్యాచరణకు సారాంశం అయింది. ఈ కార్యాచరణ సిద్ధాంతంలో, ఆచరించే వాళ్ళు వస్తువు (వాళ్ళని మాధ్యమంగా వుండే యదార్థం మీద) పరస్పర విషయపరంగా, తమ కార్యాచరణను లగ్నం చేస్తారు. మనుషుల్ని మానవీకరించడంతో (ఆ యదార్థాన్ని పరివర్తన చేయడం ద్వారా సాధించి) లక్ష్యాన్ని సాధిస్తారు.

పీడక కార్యాచరణ సిద్ధాంతం సారభూతంగా సంభాషణ వ్యతిరేకంగా వుంటుంది, ఈ పై పథకం. ఇందులో కట్టి కొట్టి అన్నట్టు తేలికవుతుంది. ఇక్కడ ఆచరించే వాళ్ళకే అదే సమయంలో వాళ్ళ కార్యాచరణ వస్తువులు వుంటాయి. యదార్థం, పీడితులు, పీడనను నిలబెట్టి వుంచాలి (పీడక యదార్థ స్థితిని నిలబెట్టి వుంచడం ద్వారా). అదీ వాళ్ళ లక్ష్యం.



11. మావోజె డాంగ్, అదే గ్రంథం.

12. గాజొ పెట్రోవిచ్ "మనిషి-స్వేచ్ఛ", "సోషలిస్టు హ్యూమానిజం"లో. దీనికి సంపాదకుడు ఎరిక్ ఫ్రామ్ (న్యూయార్క్, 1965) పే.274-276. "Marx in The Mid-Twentieth Century" (న్యూయార్క్, 1967) ఇదే రచయిత గ్రంథం.

13. ప్రజా విప్లవం అధికారంలోకి ఒకసారంటూవస్తే, పాత పీడక అధికారాన్ని తిరిగి ప్రతిష్ఠించబోయే ఏ ప్రయత్నాన్నేనా అణగదొక్కే నైతిక బాధ్యత నూతన అధికారానికి వుంది. అలా అని విప్లవం దాని సంభాషణాత్మక స్వభావాన్ని వ్యాఘాతం చేసుకుంటోందని కాదు. పాత పీడకులకీ, పీడితులకీ మధ్య సంభాషణ, ప్రతిస్పర్థించే వర్గాలుగా, విప్లవానికి ముందు వీలు పడదు. అంచేత ఆ తర్వాత కొనసాగడమూ అసంభవమే.

14. "అదీగాక, ఆర్థికంగా అభివృద్ధి చెందిన దేశాలు పేద దేశాలకు సాయం అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. వాళ్ళు ఇప్పుడున్న రాజకీయ పరిస్థితిని తమ లాభం కోసం తిప్పుకునేందుకు చూస్తున్నారు. పేద దేశాల్ని తమ గుప్పిట్లో వుంచుకోవాలని చూస్తున్నారు.

అలాంటి పనులంటూ చేస్తే, అది వలస వాదానికి మరో రూపం అవుతుంది. దానికి పేరులో ఏ ముసుగైనా తగిలించండి. కాలం చెల్లిన పాత ఆధిపత్యాన్నే అది ప్రతిఫలిస్తుంది. ఈ పద్ధతిని చాలా దేశాలు ఇప్పుడు త్యజించాయి. అంతర్జాతీయ సంబంధాల్ని ఆ రకంగా అడ్డగిస్తేగనక, సర్వమానవాళి క్రమరీతి పురోగతికీ ముప్పు వాటిల్లుతుంది. పోప్ జాన్-23 "క్రిస్టియానిటీ అండ్ సోషల్ ప్రోగ్రెస్" Eneyatical Letter నుంచి, Mater ed Magistra, వ్యాసాలు 171, 172.

15. వలసదారుడు వలస చేసినవాళ్ళ గురించి నిర్మించే చిత్రం గురించి మెమ్మి సూచిస్తాడు: వలసకు గురైన మనిషి సోమరిపోతు అన్న నింద వలసవాది మోపుతాడు. వలసకు గురైనవాళ్ళ శరీర తత్వంలోనే సోమరితనం నిండిపోయిందని నిర్ణయించేస్తాడు. Memmi అదే గ్రంథం, పే.81.

16. నేను సాధనాల్ని మాధ్యమాల్ని విమర్శించడంలేదు, వాటిని వాడుకునే పద్ధతిని విమర్శిస్తున్నాను.

17. ఒక గతితార్కిక దృక్పథంలో, ఆ స్థానిక బృందాన్ని ఏకమొత్తంగా, మరొక ఏక మొత్తంలో భాగంగా అర్థం చేసుకున్నప్పుడు ఈ విమర్శ వర్తించదు. ఆ స్థానిక బృందం అభివృద్ధి అది ఎందులో భాగంగా వుంటుందో ఆ మొత్తం నేపథ్యంలో తప్ప వుండదు. ఇతర భాగాలతో పరస్పర చర్యలతో వున్నప్పుడుతప్ప సాగదు. అంటే, వైవిధ్యంలో ఏకత్వం, చీలిన శకలాల్ని పోగుచేసే నిర్మాణం

యదార్థ పరిస్థితిని మార్చాలి అన్న స్పష్టమైన స్పృహ వుండాలి. ఇదే మరి పీడకుల్ని భీతావహం చేస్తుంది. (అర్థమవుతూనే వుందిగా!)

18. బిషప్ ఫ్రానిక్ స్పిట్ ఈ అంశాన్ని గొంతెత్తి సూచిస్తున్నారు: "కార్మికులు ఏదో విధంగా తమ శ్రమకు యజమానులు కాలేకపోతే, అన్ని నిర్మాణాత్మక సంస్కరణ నిష్ఫలం. (ఇది నిజం). కార్మికులు ఒక ఆర్థిక వ్యవస్థలో హెచ్చు వేతనాలు పొందినా, ఈ పెరుగుదలతో తృప్తిపడరు. వాళ్ళు తమ శ్రమకు యజమానులు కావాలని, అమ్ముకునేవాళ్ళు కాదనీ, కోరుకుంటారు... ప్రస్తుతం కార్మికులు శ్రమ అనేది వ్యక్తిలో భాగం అని రానురాను గుర్తిస్తున్నారు. వ్యక్తిని కొనడం కుదరదు. అతను తనని అమ్ముకోనూ లేడు. శ్రమని అమ్మడం-కొనడం ఎలా జరిగినా అది బానిసత్వమే. మానవ సమాజం మనకంటే తక్కువ ప్రతిస్పందన వున్న వ్యవస్థలో ఇది జరుగుతోంది. అంటే మార్క్సిజం". *Obispos hablan en prol del Tercer Mundo. CI DOC Informa (Mexico, 1967. DOE 67/35.* పే. *1-11.*

19. సాంఘిక వర్గాలకీ, వాటి మధ్య పోరాటానికీ సంబంధించి (మార్క్సు దీన్నేదో కొత్తగా కనిపెట్టినట్టు నిందిస్తున్నారు) మార్క్స్. జె.వెడ్‌మేయర్ రాసిన లేఖ చూడండి. మార్చి *1, 1852* నాటి లేఖ. "ఆధునిక సమాజంలో వర్గాలు వున్నాయని వాటి మధ్య పోరాటం వుంటుందన్న ఆవిష్కరణ, నా గొప్పదనం కాదు. నాకంటే చాలా ముందే బూర్జువా చరిత్రకారులు ఈ వర్గపోరాట చారిత్రకాభివృద్ధిని వర్ణించేరు. బూర్జువా ఆర్థికవేత్తలు వర్గాల స్వభావ విశ్లేషణ చేశారు. నేను కొత్తగా చేసింది రుజువు చేయడం : *1)* వర్గాలు వుండడం ఉత్పత్తి అభివృద్ధిలో ఒక ప్రత్యేక చారిత్రక దశలో జరుగుతుంది. *2)* వర్గపోరాటం తప్పకుండా శ్రామిక వర్గ నియంతృత్వానికి నడిపిస్తుంది. *3)* వర్గాల రద్దుకీ, వర్గ రహిత సమాజం ఏర్పడ్డానికీ ఈ నియంతృత్వం ఒక పరివర్తన అవుతుందంతే...." కారల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఏంగెల్స్ *Selected Works (Newyork, 1968)* పే. *679.*

20. ఈ కారణంచే పీడకులు రైతుల్ని పట్టణ శ్రామికులకు దూరంగా వుంచడం తప్పనిసరి. ఈ రెండు బృందాల్ని విద్యార్థుల నుంచి వేర్పాటుగా వుంచినట్టే ఇదీనీ. ఈ విద్యార్థులు (సాంఘికంగా ఒక వర్గం కాకపోయినా) తిరుగుబాటు యోగ్యతతో వుంటారు. అలాంటి వాళ్ళు జనంలో చేరితే చాలా ప్రమాదకరం. అంచేత విద్యార్థులకి బాధ్యతలు తెలియవనీ, క్రమశిక్షణ లేదనీ దిగువ వర్గాల వాళ్ళని ఒప్పించడం అవసరం. వాళ్ళ యోగ్యత నిజం కాదు ఏమంటే- విద్యార్థులుగా వాళ్ళపని చదువుకోవడం. ఫ్యాక్టరీ కార్మికులూ, రైతులూ "జాతి అభివృద్ధికి" కష్టపడి పని చేస్తున్నట్టే.

21. తిరాడెంటెస్ బ్రెజిల్ స్వాతంత్ర్యాన్ని పోర్చుగల్ నుంచి సాధించాలని విఫల విప్లవం నడిపిన నాయకుడు, 1789లో. ఔరో ప్రెటో, మినాస్ గెరాయిస్ రాష్ట్రం. ఈ ఉద్యమాన్ని చారిత్రకంగా *Inconfidencia Mirana* అని పిలిచారు – ఇంగ్లీషు అనువాదకుడి వివరణ.

22. విస్కాండె డిబార్బసెనా, ఆ రాష్ట్ర రాజప్రముఖ్ – ఇదే అనువాదకుడి వివరణ.

23. ఒప్పందాలు ప్రజలకే ధర్మనిష్టం (అలాంటప్పుడు అవి ఒప్పందాలే కావు) క్రమంలో కార్యాచరణ లక్ష్యాలు లేదా అభివృద్ధి చేయవలసిన లక్ష్యాలు వాళ్ళ నిర్ణయానికి లోబడి వున్నపుడు.

24. కుయుక్తుల ద్వారా వచ్చిన "నిర్మాణం"లో ప్రజలు – వూరికే నడిపించే వస్తువులు – యుక్తిపరుల లక్ష్యాలకు అనుకూలంగా తయారవుతారు. అసలైన నిర్మాణంలో వ్యక్తుల నిర్మాణ క్రమంలో క్రియాశీలంగా వుంటారు. నిర్మాణ లక్ష్యాలు ఎవళ్ళనుంచో దిగిరావు. మొదటి సందర్భంలో నిర్మాణం అంటే "జనబాహుళ్యకరణం", రెండవ సందర్భంలో విమోచన. (బ్రెజిలియన్ రాజకీయ పరిభాషలో "జనబాహుళ్యకరణం" అంటే ప్రజల్ని బొమ్మల్లా ఆడించేటట్టు, ఆలోచనా సాలోచనాలేని సరుకుగా తయారు చేయడం అని – ఇంగ్లీషు అనువాదకుడి వివరణ).

25. ఫ్రాసిస్కో వెఫర్ట్ "పొలిటికా డి మాసెస్" *Politica de Revolucao Social no Brasil (Rio de Janeiro, 1967) p.187.*

26. గె టూలియో వర్గాస్ విప్లవానికి నాయకత్వం వహించి, వాషింగ్టన్ లూయీని 1930లో బ్రెజిల్ అధ్యక్ష పదవి నుంచి కూలదోసాడు. అతను 1945 దాకా నియంతగా వున్నాడు. 1950లో ఎన్నికైన అధ్యకునిగా అధికారంలోకి వచ్చాడు. 1954లో ప్రతిపక్షం కూలదోయబోయే సమయంలో అతను ఆత్మహత్య చేసుకున్నాడు. – ఇంగ్లీషు అనువాదకుని వివరణ.

27. వాస్కొడగామ స్టేడియంలో, 1950, మే 1న ఇచ్చిన ఉపన్యాసం. *Governo Traslations ta no Brasil* (రియో) పే. 322–324)

28. అదే ఉపన్యాసం. వక్కాణింపు చేర్చడం జరిగింది.

29. ఈ గమ్యాన్ని దృష్టిలో వుంచుకుని దురాక్రమణదారులు మరింతగా సామాజిక శాస్త్రాలనీ, సాంకేతిక విజ్ఞానాన్ని వాడుకుంటున్నారు. ఓ మేరకు భౌతిక శాస్త్రాలనీ వాడుకుంటున్నారు. తమ చర్యల్ని మెరుగుపరచుకుని నగిషీ చేసుకునేందుకు ఇలా చేస్తున్నారు. ఎవళ్ళని లొంగదీసుకున్నారో వాళ్ళ గతాన్ని, వర్తమానాన్ని తెలుసుకోవడం దురాక్రమణదార్లకి అవసరం. అలా వుంటే లొంగదీసుకున్నవాళ్ళ భవిష్యత్తుకి సంబంధించి ప్రత్యామ్నాయాలు ఏమిటో వాళ్ళు వివేచించుకోగలరు.

ఆ రకంగా ఆ భవిష్యత్తు పరిణామాన్ని తమ ప్రయోజనాల దారిలో నడిపించుకునే వీలు కలుగుతుంది.

30. పిల్లలు తల్లిదండ్రుల, ఉపాధ్యాయులా శాసకత్వాన్ని తమ స్వేచ్ఛకు భంగకరమైందిగా భావిస్తారు. ఈ కారణంగానే తమ వ్యక్తీకరణను కుంచించే చర్యల రూపాల్ని, వాళ్ళ వ్యక్తిత్వ స్థాపనను అడ్డగించే రూపాల్ని మరింతగా వ్యతిరేకిస్తూ వుంటారు. ఇది అనుకూల పరిణామం, అయితే, ఇదే మీ యాదృచ్ఛికంగా వచ్చి పడింది కాదు, నిజానికి చారిత్రక వాతావరణానికి ఇది సూచన. (మొదటి అధ్యాయంలో చెప్పుకున్నాం) మన యుగం మానవ శాస్త్రపరమైందని విశిష్టం చేసే సూచన. ఈ కారణంగా ఎవళ్ళూ (వాళ్ళ వ్యక్తిగత ప్రయోజనాలుంటే తప్ప) యువకుల తిరుగుబాటును తరాల మధ్య అంతరంగా అనుభవంగా వున్నవేనన్న దృష్టితో చూడదు. ఇక్కడ మరింత లోతైంది వుంది. యువజనం తమ తిరుగుబాట్ల ద్వారా అన్యాయపూరితమైన పెత్తందారీ సమాజ నమూనాని ఖండిస్తున్నారన్నమాట! ఈ తిరుగుబాటుకు దాని ప్రత్యేక పార్శ్వం వుంది. అయినా, యిది ఇటీవలిది. సమాజం స్వభావరీత్యా అధికారదర్పంతోనే కొనసాగుతుంది

31. కొంతమంది వ్యక్తులకు తమ విప్లవపూరిత నిబద్ధత వుంటుంది. కాని, వాళ్ళు సంభాషణ వ్యతిరేక ప్రవర్తనతో వుంటారు. ప్రజల్ని నమ్మరు. వాళ్ళతో సంభాషించాలంటే భయం. అలా ఎందుకు వుండదీ ఇది బహుశా విశదీకరిస్తుంది. తమకి తెలియకుండానే అలాంటి వ్యక్తుల మనసుల్లో పీడకుని ముద్ర మిగిలివుంటుంది. యజమాని లోపల "గూడు"కట్టుకోవడంవల్ల వాళ్ళకి స్వేచ్ఛ అంటే భయం.

32. *Extensao on Communicacao* అని *Introduction a la Accion Cuetural* లో నేను రాసింది చూడండి (శాంతి యాగో, 1969)

33. ఈ సంస్థల కార్యకలాపాల గురించి, మేరీ కోల్ *Summer in the City* (New York ,1968) చూడండి.

34. లూయీ ఆల్థూసర్, *Pour Marx* (పారిస్, 1967). ఇందులో ఆయన మొత్తం ఒక అధ్యాయాన్ని *'la di alectique de la sudefermination'* కు కేటాయించాడు.

35. అయితే, ఈ క్రమం హఠాత్తుగా సంభవించదు, యాంత్రిక ఆలోచనాశీలు అమాయకంగా అనుకున్నట్టు.

36. ఆల్థూస్సర్, అదే గ్రంథం.

37. ఈ విషయం గురించి ఆల్థూస్సర్ వ్యాఖ్య : *"Cette reactivation serair proprement in concexable clans cene alialectique de poraoue de surdetermination* ఆల్థూసర్, అదే గ్రంథం, పే. 116.

38. ఈ విషయం గురించి గువేరా భావనల్ని గత అధ్యాయంలో ప్రస్తావించుకున్నాం. కామిలో టోరైస్ గురించి జెర్మన్ గుజ్మన్ అన్నాడు... "సర్వం అర్పించాడు. అహర్నిశలూ ప్రజలపట్ల నిబద్ధతతోనే వున్నాడు– ఒక పూజారిగా, క్రిష్టియన్‌గా, విప్లవవాదిగా" జెర్మన్ గుజ్‌మన్ *Camilo - Elcura Guerilleri* (బొగొటా, 1967)

39. "వర్గ అవసరం" వేరు; "వర్గచైతన్యం" వేరు.

40. ఎంతో మేధాసంపత్తి, నైతిక దృఢత్వం వున్న చిలీ పురోహితుడు రిసైఫ్‌లో 1966లో నాతో చెప్పాడు: "పెర్నాంబుకన్ సహచరుడు. నేనూ కలిసి మురికి వాడల్లో నివసించే (*moreambos*) కొన్ని కుటుంబాల్ని చూడ్డానికి వెళ్ళాం. వాళ్ళు బతుకుతూ వున్న పరిస్థితుల్ని నోటితో చెప్పలేం. అసలు ఇంత దుర్భరంగా ఎలా బతుకుతున్నారు మీరు అని అడిగాను. ఇక ఆ జవాబు ఎప్పుడూ ఒకటే: "నేనేం చేయను? దేవుడి సంకల్పం ఇలా వుంటే, మొయ్యక తప్పుతుందా?" అని.

41. ఈ విషయం గురించి ఎరిక్ ఫ్రామ్ *"The Application of Humanist Psychoanalysis to Marxist Theory" Socialist Humanism* (న్యూయార్క్, 1966) చూడండి. అలాగే రుబెన్ ఆస్బుర్న్ *"Marxism and Psychoanolysi.s"*

42. చే గువేరా *The secret papers of a Revolutionary: The Diary of Che guvra (The Ramparts edition 1968.) p.105-106, 120*

43. మార్టిన్ బుచేర్ "నేను–నువ్వు" *I and Thou* చూడండి (న్యూయార్క్, 1958)

44. గువేరా గౌతమాలా యువకుడు ఎల్‌పటోజ్‌తో, ఈ యువకుడు తన దేశంలో గెరిల్లా యుద్ధంలో పాల్గొనేందుకు క్యూబా వదిలి వెళుతున్నాడు. "నమ్మకు: మొదట్లో, నీ నీడనే నువ్వు నమ్మకు, స్నేహపూరితంగా వుండే రైతుల్ని, ఇన్‌ఫార్మర్లని, మధ్యదళారీ మనుషుల్ని. ఒక మండలం విముక్తం అయ్యేదాకా ఎవళ్ళనీ, దేన్ని నమ్మొద్దు." గువేరా *Episodes of the Revolutionary War* (న్యూయార్క్, 1968) పే.102.

45. అదే గ్రంథం 56–57, వక్కాణింపు చేర్చడం జరిగింది.

46. మనిషి మృత్యువు నుంచి కాపాడుకుంటూ వుంటాడు, "దేవుని మరణం" అనుసరించి, ఈ నాటి చింతన. మైఖేల్ డఫ్‌రీన్ *Pour L'Homme* (పారిస్, 1968) చూడండి.

47. చాలా మంది (రైతులు) తమనీ తమ కుటుంబ సభ్యుల్నీ (క్షుద్బాధ) తప్పించుకోవడానికి బానిసలుగా అమ్ముకుంటున్నారు. ఒక బెలొహారిజంటో పత్రిక 50 వేల మంది బాధితుల్ని కనిపెట్టింది

(1500000 డాలర్లకు అమ్ముడుపోయి) దీన్ని రుజువు చేసేందుకు ఒక విలేకరి ఒకతన్ని, అతని భార్యనీ 30 డాలర్లకు కొన్నాడు. చాలా మంది నకనక లాడిపోతున్నారు అని ఒక బానిస చెప్పాడు. అందుకనే అమ్ముడుపోవడానికి బాధపడలేదు. ఒకసారి ఓ బానిస వ్యాపారిని సాలోపేలోలో అరెస్ట్ చేశారు. 1959లో ఆ ప్రాంత వ్యవసాయవేత్త వాళ్ళతో కాఫీ తోటల వాళ్ళతో, నిర్మాణ రంగంలో తన సరుకులు తీసుకునేవాళ్ళు వున్నట్టు చెప్పాడు. పడుచు అమ్మాయిల్ని తప్ప, వీళ్ళని వేశ్యావాటికలకు అమ్మారు. జాన్ గెరాస్సి *The Great Fear (New York, 1963).*

48. *M. D. Chenu Temolgnafe chrettans 1964 April, Christienos Marxis has despuas del council lo* (బ్యూనర్ అయిరిస్, 1965).

49. పీడిత మానవుణ్ణి అని తన స్థాయి గురించిన విమర్శనాత్మక చైతన్యం ఎవళ్ళన్నా సాధించాలీ అంటే తన యధార్థ పరిస్థితి పీడక యధార్థం అని గుర్తించాలి. సరిగ్గా ఈ కారణంగానే దీనికి *comprehension de lessence de la societe* అందుకోవడం అవసరం. ఇది ల్యూకాక్స్ దృష్టిలో *"unfacteur de puissance de font premier order, ponquoxciosr meme sans donfe larne purment et simplement devisive."* గియోర్గ్ ల్యూకాక్స్ *Historie et conscience de classe* (పారిస్, 1960) పే.93.

50. ఒక క్రమంగా చూసినపుడు, ప్రామాణిక సాక్ష్యంవల్ల తక్షణ ఫలితం లేకపోయినా, ఇక ఎన్నటికీ వైఫల్యం చెందినట్టేనని చెప్పలేం. టిరాండెంటెస్‌ని హతమార్చినవాళ్ళు, అతని భౌతిక శరీరాన్ని తునకలు చేయగలిగారు గాని అతని సాక్ష్యాన్ని చెరపలేకపోయారు.


51. డాక్టర్ ఆర్లాండ్ ఆగ్విరె ఒరిట్జ్, ఒక క్యూబా విశ్వవిద్యాలయంలోని మెడికల్ స్కూల్ డైరెక్టరు ఆయన ఓసారి నాతో అన్నారు, "విప్లవంలో మూడు" 'పి'లు వున్నాయి. పలవ్ర, పావో, ఎపొల్వొర (Palavara, Pors, e polvora.- మాట, ప్రజలు, తుపాకీ మందు). మందుగుండు పేలి వాస్తవ పరిస్థితి గురించిన ప్రజల అవగాహనను విశదపరుస్తుంది. కార్యాచరణ ద్వారా విమోచన అన్వేషణ సాగుతుంది." ఈ విప్లవ పూరిత వైద్యుడు ఈ వ్యాసంలో వాడిన అర్థంలో "మాట"ను వాడడం గమనార్హం: కార్యాచరణగా, ఆలోచనగా చింతనాయుత కార్యాచరణగా.

52. అసలు యధార్థ పరిస్థితి పీడకంగానో, విశృంఖలంగానో వున్నట్లయితే ఈ సంబంధం పోటీతో స్పర్థిస్తుంది.

53. ఒక నిర్మాణం సాంఘిక నిర్మాణంగా దేనివల్ల అవుతుంది (ఆ రకంగా చారిత్రక-సాంస్కృతికంగా)

అనేది శాశ్వతం బట్టీ కాదు, మార్పు బట్టీ కాదు వాటిని అపరిమేయ అర్థంలో తీసుకుంటే. ఆ రెండింటి మధ్య వున్న గతి తార్కిక సంబంధం బట్టే వుంటుంది. చివరి విశ్లేషణలో, సాంఘిక నిర్మాణం ఎలా మనగలిగేటట్టు వుంటుందీ అన్నది శాశ్వతత్వం నుంచీకాదు, మార్పు నుంచీ కాదు, ఇది శాశ్వతత్వం – మార్పు గతితార్కిక సంబంధమే.


54. రష్యన్ సోషల్ డెమోక్రాట్లు విప్లవ పోరాటానికి సాధనంగా శ్రామికవర్గం చేసే ఆర్థిక డిమాండ్లని నొక్కి చెప్పారు. దాన్ని లెనిన్ తీవ్రంగా ఖండించాడు. "ఆర్థిక సద్యోజనితత్వం" అది అన్నాడు. "ఏం చేయాలి?" *On politics and Revolution. Selected writings (New York, 1968).*










ఫాలో ఫ్రెయిరె రచించిన ఈ పుస్తకం కొన్ని దశాబ్దాలుగా ప్రపంచంలోని ప్రామాణిక రచనలలో ఒకటిగా వెలుగొందుతున్నది. కేవలం విద్యా బోధనకే గాక ప్రజల విముక్తి కోసం పోరాడే వాళ్ళ వైఖరి ఎలా వుండాలో అమోఘంగా వివరిస్తుంది. పీడక సమాజంలో పీడనకు గురవుతున్న వాళ్ళ మనస్తత్వాలలో వచ్చే మార్పును విశ్లేషిస్తుంది. పీడితులు తమ స్థితిని గుర్తించి మార్పు కోసం పోరాడే చైతన్యం సంతరించుకోవాలంటే వారితో సంభాషణ తప్ప మార్గం లేదని సంభాషణా సంస్కృతిని ప్రబోధిస్తుంది. వర్గ సమాజంలో ప్రగతి శీలులైన ప్రతివారి అనుభవాలను కళ్ళకు గట్టే అమూల్య గ్రంథమిది. తెలుగులో సంపూర్ణ అనువాదం రావడం ఇదే ప్రథమం.

ప్రజాశక్తి బుక్‌హౌస్